















భావయామి వేంకటేశం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-IV

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

సంపుటి-IV

మొదటి ప్రచురణ
జూన్ 2011

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.
Cell: 9393021360

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి IV

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అందరికీ నెక్కుడైన | 21 |
| 2. | అంజనా తనయుడైన | 57 |
| 3. | అన్ని మంత్రములు ఇందే | 01 |
| 4. | అరుదీ కపీంద్రుని | 187 |
| 5. | అలివేణిని పెండ్లాడవయ్య | 85 |
| 6. | అతడు లక్ష్మీపతి | 133 |
| 7. | అమరాంగన లిదే | 157 |
| 8. | అవధారు చిత్తగించు | 137 |
| 9. | అవధారు రఘుపతీ | 65 |
| 10. | అబ్బురంపు శిశువు | 113 |
| 11. | ఆదరో పాదరో | 25 |
| 12. | ఆరగింపవో | 143 |
| 13. | ఇందులకు జింతించ | 109 |
| 14. | ఇతర దేవతలకిది | 71 |
| 15. | ఇదిగాక సౌభాగ్య | 03 |
| 16. | ఉన్నతోన్నతుడు | 177 |
| 17. | ఎందు నీకు ప్రియమో | 165 |




భావయామి వేంకటేశం


| | | |
|---|---|---|
| 18. | ఎత్తరో ఆరతులు | 117 |
| 19. | ఎట్టునేరిచితివయ్యా | 191 |
| 20. | ఎదుటనున్నాడు వీడె | 155 |
| 21. | ఎదురేది ఇంక మాకు | 129 |
| 22. | ఏదుపాయము | 39 |
| 23. | ఏమి సేయవచ్చు | 127 |
| 24. | ఏమి నిద్దురించేవు | 183 |
| 25. | ఏడే జేనలు ఈ దేహము | 69 |
| 26. | ఏల రాడమ్మా ఇంతిరో | 77 |
| 27. | ఒక్కడే మోక్షకర్త | 05 |
| 28. | కాదనకు నామాట | 49 |
| 29. | కేశవ కృష్ణావతార | 37 |
| 30. | కొమ్మలాల అమ్మలాల | 159 |
| 31. | కొమ్మలు చూడరే | 53 |
| 32. | ఘనుడవు నీ మహిమ | 41 |
| 33. | గోవింద నంద నందన | 101 |
| 34. | చక్కని ఈ వెన్నుడు | 199 |
| 35. | చదివితి దొల్లి | 167 |
| 36. | చలిగాలి వేడేల | 59 |
| 37. | చలువకు వేడికి | 51 |
| 38. | చిత్తజు గురుడ నీకు | 203 |

| | | |
|---|---|---|
| 39. | చూడ పిన్నవాడు గాని | 27 |
| 40. | జడమతి రహం | 63 |
| 41. | జయ జయ నృసింహ | 29 |
| 42. | జయము మనది వనచరులాల | 185 |
| 43. | జయ జయ రామ | 147 |
| 44. | జోజో దీన జనావన | 195 |
| 45. | జోజోయని మీరు | 107 |
| 46. | తగుదువమ్మ | 07 |
| 47. | తెలియ చీకటికి | 19 |
| 48. | దీనుడనేను దేవుడవు నీవు | 161 |
| 49. | దేవదేవోత్తముని | 11 |
| 50. | దేవదేవుడెక్కెనదె | 67 |
| 51. | నగధర నందగోప | 35 |
| 52. | నందగోప నందనుడే | 73 |
| 53. | నరులాల మునులాల | 09 |
| 54. | నమో నమో దానవ వినాశక | 103 |
| 55. | నీవనగ నొకచోట | 47 |
| 56. | నీ నామమే మాకు నిధియు | 99 |
| 57. | నీవు దేవుడవు | 171 |
| 58. | నెలత సొబగులివి | 131 |
| 59. | నెలత మోహించెనదె | 13 |







| | | |
|---|---|---|
| 60. | నేడే సుక్కురారము | 45 |
| 61. | పదియు బదియుగాను | 83 |
| 62. | పరమ సుజ్ఞానులకు | 153 |
| 63. | పలుమరు పుట్ట | 17 |
| 64. | పిలువరే కృష్ణుని | 87 |
| 65. | పురుషులకు పురుషుడవు | 169 |
| 66. | పెద ఔబళపు కొండ | 135 |
| 67. | పేరంటాండు పాడరో | 125 |
| 68. | పొలియలుక నిద్దురలు | 79 |
| 69. | పోయగాలం బడవికి | 95 |
| 70. | పోపో నీ పొందు చాలు | 173 |
| 71. | బంగారు మేడల లోన | 93 |
| 72. | భక్త సులభుడును | 145 |
| 73. | భళి భళి రామ | 97 |
| 74. | మించి దేవాంగనలిట్టే | 193 |
| 75. | ముందే తొలగవలె | 175 |
| 76. | మూల మూలనమ్ముడు | 119 |
| 77. | రమణుడు పిలిచీని | 141 |
| 78. | రసికుడవౌదు | 123 |
| 79. | లలిత లావణ్య | 115 |
| 80. | వట్టి విచారములేల | 33 |

| | | |
|---|---|---|
| 81. | వాడెవో ప్రహ్లాదవరదుడు | 189 |
| 82. | వీడెవో అల విజయ | 31 |
| 83. | వీడేవీడే కూచున్నాడు | 91 |
| 84. | విష్ణుదేవు పాదములే | 121 |
| 85. | వెగ్గల మింతా వృథా వృథా | 75 |
| 86. | వెన్నలు సెలవిగారే | 105 |
| 87. | వెట్టివలపు చల్లకు విష్ణుమూర్తి | 23 |
| 88. | శ్రీపతి పురనాయక | 197 |
| 89. | శ్రీహరీ నిత్యశేషగిరీశ | 179 |
| 90. | శ్రీవేంకటేశుడు | 181 |
| 91. | శరణు శరణు నీకు సర్వేశ్వరా | 61 |
| 92. | శరణు శరణు దేవా సర్వ పోషక | 201 |
| 93. | సకలము జదివిన | 43 |
| 94. | సతతం శ్రీశం. | 111 |
| 95. | సర్వ సులభుడితడు | 55 |
| 96. | సమబుద్ధే అందరికి | 139 |
| 97. | సంతలే జొచ్చితిని గాని | 15 |
| 98. | సిగ్గరి పెండ్లికూతురు | 163 |
| 99. | సీతాశోక విఘాతక | 89 |
| 100. | సేవే భావే శ్రీబృందం | 151 |
| 101. | హీనాధికములింక | 149 |






# ప్రార్థన

కం॥ శ్రీ లక్ష్మీసతివల్లభ!
నీలీలల నెరుగ నాకు నిపుణత కలదా?
తెలికగ అన్నమయ్యకు
మాలావుగ మున్నుడులను భావాల్జెబుదున్

కం॥ శ్రీలలన నోరకంటను
భూలలనకు తెలియకుండ మురవైరి కనున్
మేలగు కీర్తన జెప్పును
ఆ లీలల కన్నమయ్య అలరించ హరిన్

కం॥ "ఉన్నాడెల్లెడ" యొకడనె
"ఉన్నాడోలేడొ" యనెను యొక గజము వనిన్
ఉన్నతుడు అన్నమయ్యనె
ఉన్నాడా విష్ణుమూర్తి యొదిగి తిరుమలన్

కం॥ శ్రీవల్లభునే నమ్మితి
భావామృతమిట్లు వ్రాయ ప్రార్థించితిగా
ఈ వూహ అన్నమయ్యది
నా వాక్కున పలుకువాడు నయముగ హరియే

ఆ.వె॥ అన్నమయ్య కృతుల నెన్నుచు మున్నుడిన్
భావములను విశదపరచినాను
'భావయామి' యనుచు శ్రీవేంకటేశ్వరా!
శరణుజొచ్చినాను పరమపురుష!



## ముందు మాట (సంపుటి-IV)

“మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి”....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే ‘ధనం’ అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి ‘ఆ’ అనే అక్షరం గమనించండి. ‘ఆ’ అంటే ‘అది’ అని అర్థం. ( ‘ఆ’ పుస్తకం ఇటివ్వు). ‘ఆ’ అంటే ‘ఏమిటి’? అని అర్థం (‘ఆ’ ఏమన్నావు ఇంకోసారి చెప్పు).‘ఆ’ అంటే ‘అవును’ అని అర్థం. (‘ఆ’ నేనూ సభలో వున్నాను). (‘ఆ’) అంటే ప్రశ్నార్థకం (‘ఆ’ అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. ‘వేదాంతం తెలుపుతాడు’-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) ‘నాకు తెలుసా’ అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

“ఎందరో మహానుభావులు అందరికీ వందనములు” ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









**4-1**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఈ సుప్రసిద్ధమైన కీర్తనలో తమకు చిన్ననాటినుంచే వేంకటేశ్వరుని మంత్రం పెన్నిధిగా మిగిలిందనీ, లోకంలోని మంత్రాలన్నీ ఆ మంత్రంలోనే 'ఆవహించి' వున్నాయని నమ్మకంగా చెబుతున్నారు. ఆదిలో నారదముని మొదలుకొని కృతయుగపు ప్రహ్లాదుడు, త్రేతాయుగపు విభీషణుడు, ద్వాపరయుగపు అర్జునుడు, పురాణకాలంలో ధ్రువుడు, శుకమహర్షి – అందరూ నమ్మినది ఇందిరావల్లభుడైన శ్రీహరినే. పరబ్రహ్మయైన ఆయనే రకరకాల మంత్రాలవల్ల ఆరాధించబడ్డ తిరుమలనాథుడు.

**ఉ॥ మంత్రములన్నియున్ నిలిచి మానవులార! తమావహించెనీ**
**మంత్రము, వెన్నతో కలిగె మాకది భాగ్యము అన్నమయ్యనెన్**
**మంత్రము వేంకటేశునిది మానక తానటు యెంచినానసెన్**
**మంత్రములన్యులేవి తము మన్నన నెంచిరి లెక్కజెప్పేరా.**

**రాగం : అమృతవర్షిణి**

అన్ని మంత్రములు ఇందే ఆవహించెను
వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

నారదుడు జపియించె నారాయణ మంత్రము
చేరి ప్రహ్లాదుడు నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము
వేరె నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపియించె
అంగవించె కృష్ణమంత్రము అర్జునుడు
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము ॥అని॥





ఇన్ని మంత్రములకెల్ల ఇందిరానాథుడే గురి
పన్నిన దిదియే పరబ్రహ్మ మంత్రము
నన్ను కావగలిగే పో నాకు గురుడియ్యగాను
వెన్నెల వంటిది శ్రీవేంకటేశు మంత్రము ॥అన్ని॥

**భావామృతం :**

ఓ మానవులారా! లోకాలన్నింటిలోను వున్న మంత్రములన్నింటికీ శ్రేష్ఠమైన మంత్రం ఇందులోనే ఆవహించియున్నది. ఇదే శ్రీవేంకటేశ్వరుని దివ్యమంత్రము. ఇది నాకు వెన్నతో కలిగింది (చిన్నప్పుడు అమ్మ వెన్న తినిపించిన వయస్సునుంచే అలవడింది). ఈ మంత్రాన్నే పలువురు, పూర్వం పలువిధాలుగా స్మరించారు.

అనాదిగా నారద మహాముని 'నారాయణ' అని పలుకుతూ, పూత పదంలాగ స్మరించారు. అదే ఆయనకు ఓం నమోనారాయణ – అనే నారాయణ మంత్రమయింది. కృతయుగంలో ప్రహ్లాదవరదుడైన నారసింహుని శరణని, ఆ నారసింహ మంత్రం పఠించి రసాతలంలో తన మనుమడు బలిచక్రవర్తితో స్థిరపడ్డాడు, ప్రహ్లాదుడు. త్రేతాయుగంలో శ్రీరామమంత్రం పఠించి, జానకీ వల్లభుడైన శ్రీరామచంద్రుని కరుణతో, స్వర్ణ లంకాధిపతి అయ్యాడు విభీషణుడు. ఆ విధంగా వారందరికీ ఆయా మంత్రాలు కలిగితే, నాకు మాత్రం ప్రత్యేకంగా శ్రీవేంకటేశ్వరుని మంత్రం దొరికింది.

పూర్వం చిన్ని బాలుడైన ధ్రువుడు "ఓం భగవతే వాసుదేవాయ" అనే మంత్రం పఠించి శ్రీహరి దయను సంపాదించి ధృవనక్షత్రమై జగద్విఖ్యాతుడైనాడు. ద్వాపరయుగంలో అర్జునుడు, అంగవించి (ఉత్సాహంతో) 'శ్రీకృష్ణా! యదుభూషణా!' అని శ్రీకృష్ణ మంత్రం పఠించిన విజయుడైనాడు. ఆ తరువాత శుకయోగీంద్రుడు విష్ణుమూర్తిని సేవించి సదా ఆయన గాథలు ఇతర భక్తులకు చెబుతూ తరించాడు. నేడు నాకు శ్రీవేంకటేశుని మంత్రము, వింగడమై(ప్రత్యేకంగా) దొరికింది.

పైన చెప్పిన ఇన్ని మంత్రాలకు లక్ష్యం లక్ష్మీకాంతుడైన శ్రీమన్నారాయణుడే. ఈ మంత్రమే పరబ్రహ్మ మంత్రంవలె, పన్నినది (నెలకొనినది). ఇకపో, నన్ను రక్షించుటకు మా గురుదేవులు నాకందించిన మంత్రమే "ఓం నమో వేంకటేశాయ" అనే అష్టాక్షరీ మంత్రం. అది వెన్నెల వలె చల్లనైనది. మీరూ శరణని నేటినుంచే మొదలు పెట్టండి. తరించండి.

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తనపైకి తేలికగా అర్థమవుతున్నట్లుండే నిగూఢ తత్త్వ చింతన ప్రతిపాదన చేసే కీర్తన. ఒక యోగి భగవంతునే ధ్యానిస్తూ, సాలోక్య, సాయుజ్య, సామీప్య సిద్ధిని పొంది చిట్ట చివరకు సారూప్య స్థితిని పొందుతాడని వేదాంత తత్త్వం చెబుతోంది. ఇక్కడ నాయిక కూడా స్వామిపై 'మోహాపేక్షలతో' ఆరంభమైన స్థితినుంచి నెమ్మదిగా మనస్సుని జయించి నిశ్చలతత్త్వం అలవరచుకొని మనో చింతనపోయి పరతత్త్వ భావం పెంపొందించుకొని 'త్వమేవాహం' స్థితిని పొంది తానే స్వామి, స్వామియే తను అను భావన పొందింది.

**చం॥ సిరిపతి నాత్మలో తలచి చిత్తమునందున నిల్పి కోరికల్**
**తరుణిజయించి, యోగివలె తాపము వీడుచు శాంత చిత్తయెన్**
**తిరుమలనాథు తత్త్వమును దేవియెరింగెను స్వామి సత్కృపన్**
**స్థిరమయి యుల్ల మా చెలియ ధీరత నొందెను అన్నమయ్యనెన్.**

**రాగం : కాంభోజి**

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బికనొకటి కలదె ॥ఇదిగాక॥

అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్షలన్నియు విడచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసన వోలె నుండె ॥ఇదిగాక॥

తరుణి హృదయము కృతార్థత పొంది విభు మీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసి జానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇదిగాక॥





శ్రీ వేంకటేశ్వరుని చింతించి పరతత్త్వ
భావంబు నిజముగా పట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ ॥ఇదిగాక॥

**భావామృతం :**

ఇది కాకుండా సౌభాగ్యము ఇంకోటుంటుందా? ఇది కాకుండా తపస్సు ఇంకా వేరే వుంటుందా? ఇదిగాక వైభవం అంటూ మరొకటుంటుందా? సాధ్యంకాదు. అదేమిటో చిత్తగించండి.

స్వామివారి 'నాయిక' జన్మసఫలమైన యోగీశ్వరునివలె అన్యములైన వ్యామోహములను, అపేక్షలను విడిచిబుచ్చినది. ఇటు పరికించి చూడగా ఈవిడ కోరికలు గొప్ప శాంతిని పొంది, నిరంతరం విజ్ఞాన వాసన (ఆత్మజ్ఞానానుభూతి యొక్క స్మృతి) వోలె నుండె (కలిగినదానివలె నుండెను). శరీరభావంపోయి నేను ఆత్మను అనే భావం కలుగగానే రాగద్వేషాలు నశించి శాంతి కలుగుతుంది. అదే ఆమెకు జరిగింది.

ఆ భామిని హృదయము పుత్తీర్ణత పొందినది. తన ప్రాణనాథుని యొక్క ఆలోచనే ఆమెకు పారవశ్యముతో కూడిన ఆనందమునీయసాగినది. ఆమె హృదయము ఆనందమునకు స్థానమై పోయినది. ఆ పద్మముఖి తన మనస్సుపై విజయం సాధించింది. ఆమె నిరుపమానమైన నిశ్చలభావముతో గొప్ప నిశ్చల స్థితిని పొందినది. ఆ స్థితిలో ఆమె మనసు నిండా స్వామియే. ఆయనకు అతి సమీపముగా నున్న భావము ఆమెకు నిశ్చలానంద మమేక భావన కలిగించసాగినది.

అట్టి నిరంతర చింతన వల్ల ఆమె ఆత్మ శ్రీవేంకటేశ్వరునే ధ్యానించుచూ నిజమైన పరతత్త్వ భావమునుపొందినది. సారూప్యసిద్ధిని పొందిన ఆమె తనే స్వామిగా, స్వామియే తనుగా భావించసాగినది. అదే మోక్షప్రాప్తి. 'త్వమేవాహం'- అంటే అదే. నీవేనేను,నేనే నీవు అనే భావం స్వామి యెడల కలిగితే అదే నిత్యానంద స్థితి. ఆమె దేవదేవుని కృపనార్జించి ఇప్పుడు తన అంతరంగంలో స్థిరచిత్తురాలై సాయుజ్యస్థితిని పొందినది.

**4-3**

## మున్నుడి

వేదముల సారార్ధమును అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో గీతావాక్యముగా వివరిస్తున్నారు. భగవంతుని శరణాగతి ఒక్కటే జీవితపరమార్ధము. మోక్షకర్త కూడా ఒక్కడే. నానాదేవతలని సంతోమపరచి,కామ్యకర్మలు (యజ్ఞంలాంటివి) చేయవలసిన అవసరం జ్ఞానికేమాత్రంలేదు. ఒక కొలనుంటే దాహంతీర్చుకొనే వాడు దాహం తీర్చుకొంటాడు, ఈతకొట్టేవాడు ఈతకొడతాడ. అలాగే జ్ఞాని వేదాల్లోసారం మాత్రమే గ్రహిస్తాడు కాని వేదాంగాలైన మీమాంసలాంటివి వాడికెందుకు? దీన్నేకదా! కృష్ణుడు అర్జునుడికి గీతలో చెప్పింది. ఆయనే మనవేంకన్న కదా!

**ఆ.వె॥ఒకడె మోక్షకర్త వొక్కటే శరణంబు**
**హరిని దిక్కనంచు అవనిజనులు**
**బ్రతికినారుతొల్లి, భగవానుగీత వా-**
**క్యమును జెప్పినారు అన్నమయ్య.**

**రాగం : దేవగాంధారి**

ఒక్కడే మోక్షకర్త – వొక్కటే శరణాగతి
దిక్కని హరిగొల్చిబ -దికిరి తొంటివారు ॥ఒక్కడే॥

నానాదేవతలున్నారు–నానాలోకాలున్నవి
నానావ్రతాలున్నవి–నడచేటివి
జ్ఞానికి గామ్యకర్మాలు–జరిపి పొందేదేమి
ఆనుకొన్న వేదోక్తా–లైనా నాయగాక

ఒక్కడు దప్పికి ద్రాపు–వొక్కడు కడవనించు
నొక్కడీదులాడు మదు–గొక్కటియందే
చక్క జ్ఞానియైన వాడు–సారార్ధము వేదమందు
తక్కక చేకొనుగాక–తలకెత్తుకొనునా ॥ఒక్కడే॥





ఇదిభగవద్గీతార్ధ–మిది యర్జునునితోను
ఎదుటనే వుపదేశ–మిచ్చెగృష్ణుడు
వెదకి వినరో శ్రీ– వేంకటేశు దాసులాల
బ్రతుకుద్రోవమనకు–పాటించి చేకొనరో ॥ఒక్కడే॥

**భావామృతం :**

తొంటివారు అంటే మన పూర్వీకులు శ్రీమన్నారాయణుడైన శ్రీహరియే దిక్కని ఆయన నారాధించి బ్రతికారు. వాళ్ళు నమ్మిన సత్యం ఇదే. మోక్షకర్త ఈ ప్రపంచంలో ఒక్క శ్రీహరియే. ఆయన్ని సేవించే పద్ధతి కూడా ఒక్కటే. అదే ఆయనను శరణువేడటం.

దేవతలు యెందరెందరో వున్నారు. ఈ విశ్వంలో లోకాలు కూడా ఎన్నెన్నో వున్నాయి. ఆయాలోకాలు పొందుటకు సాధనలు కూడా యెన్నెన్నోవున్నాయి. స్వర్గప్రాప్తి కోసం చేయాల్సిన కామ్యకర్మల వివరాలు వేదాల్లో చెప్పబడే వున్నాయి. అయినా జ్ఞానికి ఈ కామ్యకర్మలనాచరించి పొందవలసిన దేదీలేదు. పైగా ఆ స్వర్గవాసమన్నా శాశ్వతమనుకొందామంటే మనపుణ్యం తరిగిపోగానే మళ్ళీ భూలోకంలో జన్మించక తప్పదు. అందుకనే జ్ఞాని కామ్యకర్మల గురించి ఆరాటపడడు.

నీటిమడుగును చూసిన ప్రతివాడూ వెంటనే నీరుతాగడు. దాహపీడితుడు మాత్రమే త్రాగుతాడు. ఇంకొకడు కడవలో పట్టుకొని నీరు దాచుకొంటాడు. ఇంకొకడు ఆ మడుగులో స్నానం చేస్తాడు. అట్లే వేదాల్లో ఎన్నో విషయములు చెప్పబడివున్నవి గావున ఎవరికి ఏ విషయం మీద ఆసక్తియుంటే ఆ విషయం చదివి నేర్చుకొంటాడు. అయితే జ్ఞాని మాత్రం ఏది వేదసారార్ధమో అది మాత్రమే గ్రహించి తక్కినవి తలకెత్తుకొనడు. అసలు వాటి జోలికేపోడు.

భగవద్గీతలో చెప్పబడిన భావము ఇదే. శ్రీకృష్ణుడు అర్జునునికి తన సమక్షములో ఉపదేశించిన గీత ఇదే. శ్రీవేంకటేశ్వరుని దాసులారా! సావధానులై ఈ విషయాన్ని వినండి. ఉపయోగకరమైన జీవన మార్గం ఇది ఒక్కటే. దీనినే చేకొని పాటించి ధన్యులవండి.

## 4-4

## మున్నుడి

అలమేల్మంగమ్మ సొగసులును వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. అందచందాలలో ఆమె మన్మధుని తండ్రిగారైన స్వామికి అన్నివిధములా సరిజోడు అంటున్నారు. తనఅధరములలో అష్టామృతములు కలిగినదైనందు వల్ల ఆమే, తిరుమలేశునికి తగినది అని తెగవేసి చెబుతున్నారు. ఆ నాటి, కవుల పంథాలోనే అన్నమయ్య కూడా అమ్మవారి అంగాంగ వర్ణన కీర్తిస్తున్నారు. చదువరులలో పిన్న వయసు వారుంటారనే భావనతో భావ వివరణలో అమృతాన్నిలోపింపజేశాను. క్షంతవ్యుడను స్వామీ!

**కం॥ తగుదువు మదనుని తండ్రికి**
**మొగి యెనిమిది అమృతములు మోవి కలుగుటన్**
**తెగవేసి చెప్పెనన్నయ**
**మగడగు వేంకటవిభుండు మన్నించెననెన్.**

**రాగం : బృందావని**

తగుదువమ్మ నీ వందపు మరుతండ్రికి
మొగిదచ్చిన మృతము మొమి నుంది గాన ॥తగుదు॥

కోమలి నీ జవ్వనము కొలదివెట్టగ రాదు
ప్రేమమున మీద మీద పెరిగీ గాన
ఆమని నీ సింగార మంత యింత అనరాదు
వేమారు నీచూపు వెల్లి విరిసీ గాన ॥తగుదు॥

తొయ్యలి నీ వొరపులు తులదూచి చెప్పరాదు
నెయ్యపు నీ తురుమిదె నిక్కీ గాన
చయ్యన నీ సొబగు లిచ్చట నియమించరాదు
అయ్యన నీ పిరుదున కలవిలేదు గాన ॥తగుదు॥





వనిత నీ భావమింక వర్ణించి పలుకరాదు
కొన నీ పాదములు చిగురులు గాన
తనరు నీ భాగ్యము తలచ నలవి కాదు
ఘనుడగు శ్రీవేంకటేశు కలసితిగాన ॥తగుదు॥

## భావామృతం

తల్లీ! అలమేల్మంగా! నీవు అన్ని విధమూలా అందచందములలో, మదనజనకుడైన అందగాడు వేంకటరమణునికి, సరితూగ గలదానివే. నీకేమమ్మా! మొగి(మొత్తము) దచ్చిన (ఎనిమిది రకములైన) అమృతములు, నీ మోవినుండీగాన (నీ అధరములో నున్నవి కదా!)

కోమలమైన అలమేల్మంగమ్మా! నీయవ్వనమును కొలతపెట్టగలమా!! అంతకంతకు నీకు స్వామిపై ప్రేమ అధికమవుతూనేవున్నది కదా! అందుచేత నీ యవ్వనము కొలత మీరుచునేయున్నది. ఆమని (సమృద్ధియైన) నీ అలంకరణకు కూడ 'ఇంత' అని పరిమితిలేదు. నీ చూపు వేయిరేట్లు శోభతో వెల్లివిరియుచున్నది కదా!

తొయ్యలీ! (ఓ వనితా!) నీ వొరపులు (అందములు) తూచిచెప్పుటకసాధ్యమైన పని. ఏలనందువా, ఇంపైన నీ కొప్పు, ఇదే వున్నతమై నీకు గర్వము కలిగించునట్లున్నది. వర్ణింపనసాధ్యమైన నీ సొగసులకు, చయ్యన (శీఘ్రముగా) ఇక్కడ ఒక హద్దు పెట్టనసాధ్యమే. అబ్బురపడు నీ పృష్టమున కలవి లేదు తల్లీ!

ఓ వనితా! నీ స్వభావమును వర్ణించుటయు దుస్సాధ్యమైన యత్నమే. నీ పాదముల అంచులు చిగురుల వలె కోమలముగా నున్నవి. పుష్కలమైన నీ భాగ్యమును తలచుటకే సాధ్యము కాకున్నది. ఏలనందవా, సర్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వరుడు నిన్ను చేరగా నీవాయనను కూడితివి కదా! నీకు వైభవములలో సరితూగువారెవ్వరు? తల్లీ!

## 4-5

## మున్నుడి

ప్రపంచంలోని నరులను,మునులను, రకరకాల దేవతలను (యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుషోదులు) అన్నమాచార్యులవారు పిలుస్తున్నారు ఈ కీర్తనలో. ప్రత్యక్షంగా యెట్టనెదుట నరసింగరూపంతో, వున్నతమైన సింహాసనం మీద ఆదిలక్ష్మిని తొడపై నుంచుకొని, చేతులలో శంఖచక్రాలతో తేజోమూర్తివలెనున్న ప్రహ్లాద వరదుని వీక్షించమంటున్నారు. ఇక్కడ అహోబలంలో వున్న ఈ ఆదిమూర్తే అక్కడ ఏడుకొండల మీద వున్న కొదలేని మూర్తి అంటున్నారు. అంటే .....చదవండి మరి.

**తే॥ ఇతడు పరబ్రహ్మ ప్రత్యక్షమిచ్చెనెదుట**
**వీని ప్రహ్లాదవరదు భావించి చూడు-**
**దనుచు నరులను, మునులను, అఖిల సురుల**
**బిలిచె నన్నయ్య పాడుచు కొలువుడంచు.**

**రాగం : రామక్రియ**

నరులాలమునులాల నానా దేవతలాల
పరబ్రహ్మమీతడే ప్రత్యక్షమై వున్నాడు ॥నరులారా॥

భావించిచూడరో వీడె ప్రహ్లాద వరదుడు
సేవించరో తొడమీది శ్రీసతిని
వావిరి నుతించరో వర శంఖచక్రాలవె
కోవిదుడు గద్దె మీద కొలువై వున్నాడు ॥నరులారా॥

చెలగి మొక్కరో వీడె శ్రీనరసింహదేవుడు
తెలియరో ఈతని తేజోరూపము
అలరి పూజించరో అనంత హస్తము లవె
కొలది మీర విష్ణుడు కొలువై వున్నాడు ॥నరులారా॥





ఇదె శరణనరో హిరణ్య దైత్యహరుని
అదన జపించరో ఈ హరినామము
ఎదుట శ్రీవేంకటాద్రిని అహోబలమునందు
కొదలేక ఆదిమూరితి కొలువై వున్నాడు ॥నరులారా॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! మునులారా! వివిధ దేవగణములారా విచ్చేయండి. ఇదిగో ఈ నృసింహుడే పరబ్రహ్మ స్వరూపుడు. మన యెదుటనే ప్రత్యక్షమై యున్న ఈ మహానుభావుని చూచి తరించండి.

వీడే ప్రహ్లాదునికి అనేక వరములిచ్చిన దేవుడు. మీ భావనలో సుస్థిరంగా నిలిపి వీనిని తిలకించండి. తన ఎడమ తొడమీద ఆదిలక్ష్మిని కూర్చుండ బెట్టుకొనియున్న వీనిని సేవించండి. అదిగో వావిరి (చక్కగా) కనిపించుచున్న ఆ శంఖు చక్రాలను గమనించండి. ఉన్నతమైన సింహాసనంపై కూర్చునియున్న ఈ శ్రేష్ఠుని పరికించండి.

ఉద్యమించి, ఈ నరసింహ దేవునికి మొక్కండి ఈతని తేజో మయమైన దివ్యరూపాన్ని తెలిసికొనండి. ఈయనకి అనంత హస్తములు (లెక్కలేనన్ని చేతులు) వున్నవి. (హిరణ్యకశిపుడు తన రక్తం ఒక్కబొట్టు కూడా క్రింద పడని చావు కావాలని విచిత్రమైన వరాలను కోరాడు కాబట్టి అనంతమైన హస్తాలతో వచ్చిన రక్తాన్ని వచ్చినట్లే తుడిచి వేసి నోటితో పీల్చేశాడు. ఆ చేతులు మనబోటి సామాన్యులకు కనుపించవు.) అటువంటి అనంత విష్ణు రూపుని, కొలువైన ఈ స్వామిని సేవించండి.

ఆ విధంగా హిరణ్యాసురాంతకుని ఇప్పుడే శరణని వేడుకోండి. ఈ హరినామమును జపించండి. మన యెదుటనే అహోబల నృసింహుడుగానున్న ఈ దివ్యుడే ఏడు కొండల వేంకటేశ్వరుడు. ఆది దేవుడైన ఈ స్వామిని కొదలేక (కొఱతలేక అంటే ఏ మాత్రం తగ్గకుండా సేవించండి.

**4-6**

## మున్నుడి

గరుడవాహనంపై నెక్కి, ముత్యాల కుచ్చులు వూగిసలాడుచున్న రథంపై, మంగళవాయిద్యాల 'హోరు'లో దానవులు భయకంపితులయ్యేట్లు తిరువీథులగుండా తన దేవేరితో దేవదేవోత్తముడైన శ్రీవేంకటేశ్వరుని ఊరేగింపు సాగిపోతున్నది. అన్నమాచార్యులవారి కీర్తన అంత తేలిక కాదు. చదివితే మీకే అర్థమవుతుంది, ఏమీ అర్థం కావట్లేదని....

**సీ॥ దేవదేవోత్తముడౌ విష్ణు దేవుని**
**తేరు దేవతలెల్ల తీర్చి గొలుచు**
**తిరువీథులను బోవు తిరుతేరు జూడుడీ**
**తిరుపు గొన్నట్లాను తేరుకనుడు**
**ధిక్కరించు ధ్వనుల తిరుతేరు, దిక్కరి**
**కుంభాల దరగనీ గొప్పతేరు**
**తీరిచె గలకలు తిరుతేరు గాంచుడీ**
**గరుడవాహనుడేగు తేరుగనుడు**

**ఆ.వె॥ అన్నమయ్య పాటనవలీలగా మార్చి**
**సీసపద్య మొకటి చెప్పవచ్చు**
**వెనక జన్మఫలము వేంకటేశుని గొల్వ**
**ఇంతకన్న మంచి ఇరవుకలదె?**

**రాగం : బౌళి**

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువగా తిరుతేరు ॥దేవ॥

తిరువీథులేగీని తిరుతేరు
తిరుపు గొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజులను తిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు ॥దేవ॥





ధిక్కరించీ మోతల దిరుతేరు
ధిక్కరి కుంభా లదర దిరుతేరు
తిక్కు ముత్తేల కుచ్చుల తిరుతేరు
తెక్కుల ప్రతాపించీ తిరుతేరు ॥దేవ॥

తీరిచె గలకలెల్ల దిరుతేరు
దీర గరడవాహనపు దిరుతేరు
చేరి యలమేలు మంగతో శ్రీవేంకటేశ్వరుని
తీరున నెలకొన్నట్టి తిరుతేరు ॥దేవ॥

**భావామృతం :**

దేవదేవుడని పిలువబడెడి దేవతాశిఖామణులందరిలోన సర్వశ్రేష్టుడెవరో ఆయన దేవదేవోత్తముడు. ఆయనే శ్రీమన్నారాణుడైన శ్రీవేంకటేశ్వరుడు. అదిగో ఆ వస్తున్నదే ఆయన 'తిరుతేరు ' (శ్రీప్రదమైన రథము). దేవతలందరూ కొలుచుచుండగా సాగివస్తున్నదా 'తిరుతేరు'.

ఆ తిరుతేరు తిరుమలలోని తిరువీధుల గుండా సాగివచ్చుచున్నది. ఆ తిరుపు గొన్నట్లు ఆను' తేరు, (భగవంతుడు తిరుగుటకు నియమించబడినది). ఆ తేరు దానవులను తెరలించింది (తొలగించింది. అంటే, స్వామి ఆ రథంపై నుండే అనేక దానవులను నిర్మూలించాడని). నేడు తిరువీధులలో అన్ని దిక్కులలోనూ సాగుచున్నది స్వామి యొక్క తిరుతేరు, (దీన్ని చూస్తున్న మనదే భాగ్యం.)

ఈ తిరుతేరు సాగుచున్నప్పుడు తప్పెట్లు,బాకాలు, డోళ్ళు, మంగళ వాయిద్యములు చేయుచున్న ధ్వనుల యొక్క 'హోరు' ధిక్కరించుచున్నట్లు (యుద్ధములో తిరుగుబాటు చేయుచున్నట్లు) ఉన్నది. అది, స్వామి వెంట వచ్చుచున్న 'దిక్కరి కుంభాలు' (పెద్దపెద్ద కుండలు) అదురుచున్న తిరుతేరు (అదరిపడుచున్న తిరుతేరు). ఇది, తిక్కు ముత్తేల కుచ్చుల తిరుతేరు, (అంటే..... ఆకర్షణీయమైన ముత్యములు కుచ్చులుగా కట్టి, వ్రేలాడదీసిన తిరుతేరు). తెక్కుల (గర్వముగల) ప్రతాపము కనబరచుచున్న తిరుతేరు.

ఈ తిరుతేరు కలకలము తీరిచె (క్షోభను నివారించును). గరుత్మంతుడు వాహనముగా అలంకరించిన తిరుతేరు ఇది. శ్రీవేంకటేశ్వరుడు మరియు అలమేల్మంగ ఒకటిగా చేరి, శోభాయమానంగా (తేరుగా) నెలకొని ఊరేగుచున్న తిరుతేరు ఇదియే. చూచి మీ జన్మధన్యం చేసికొనండి.

**4-7**

## మున్నుడి

లలిత శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఆమెవద్దకు, వేంకటరమణుడు నడిరేయి అయినా రాలేదు. "వేచివేచి కనులు కాయలేకాచును, కరుణించి ఒకసారి కానదావో ప్రభు!" అని ఆమె పరితపిస్తోంది. సిగ వీడిపోయింది కన్నీటి పర్యంతమైన తల్లి అలమేల్మంగ ముత్యాల వంటి కన్నీరు కారుస్తున్నది. "పేటుగంధము" ఎండి పోయింది. మనస్సులోనే నీకు ఎన్నివిన్నపాలు చేస్తున్నదో చూశావా? నిన్ను ప్రేమించటమే ఆమె చేసిన నేరమా యేమిటయ్యా? ఎంత బండరాయి అయిందయ్యా! నీ గుండె....

**మ॥ వలపే నేరమ? విన్నపంబు వినవో మా వేంకటేశా! ప్రభో!**
**నెలతన్ ప్రేమము జూపి చేర్చుకొనవో నీ అక్కునన్ వేగమే**
**"బలిమిన్ గుండెల రాయి బెట్టితివయా! వాత్సల్యమే శూన్యమై"**
**పలికెన్ "మానుము'మేనపచ్చి' పనులన్," ప్రార్థించె అన్నయ్యయున్**

**రాగం : నిషాది**

నెలత మోహించినదే నేరమటయ్యా
పలు విన్నపాలకింక పనిలేదయ్యా ॥నెలత॥

చెక్కున జేర్చిన చేత సేమంతిరేకులు రాలె
చొక్కపు నీసతి దెస చూడవయ్యా
నిక్కి చూడ నంతలోనే నిలువున కొప్పువీడె
వెక్కసపు చలమేల విచ్చేయవయ్యా ॥నెలత॥

ముంచిన వూర్పుల వెంట ముత్యపు కన్నీరు జారె
నించుకంత తెమలవు యిదేమయ్యా
చంచలపు నడపుల సందడించె చెమటలు
అంచెల నీ మనసు రాయటవయ్యా ॥నెలత॥





పెట్టిన పయ్యదలోన బేటుగందములు రాలె
చిట్టకాల కింతి నింత సేసితివయ్యా
యిట్టె శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అట్టె మేనపచ్చి సేతురటయ్యా ॥నెలత॥

**భావామృతం :**

ఆ నెలత (యువతి) నిన్ను ప్రేమించింది. అదే నేరమై పోయిందటయ్యా! ఆమె నీకు యెన్నో వేడికోళ్ళు(వినతులు) చేసింది. వాటితో నీకు పనియే లేదా? ప్రభూ? ఏమిటయ్యా! ఇది.

పోనీ మా అలమేల్మంగ పరిస్థితిని ఒక్కసారి చూచి మాట్లాడవయ్యా! నీకోసం తన చెక్కిళ్ళపై చేతులు పెట్టుకొని, ఇంకా రాడేమిటని పాపం యెంతసేపు నిరీక్షించినదో కాని, తన చెక్కిళ్ళపై అద్దుకొన్న చేమంతిరేకులు అన్నీ రాలిపోయాయి. చొక్కపు నీసతిని (నిర్దోషియైన నీ భార్య) ఒక్కసారిచూడవయ్యా! ఎన్నోసార్లు నిక్కినిక్కి నీ కోసంయెదురు చూచుటవలన ఆవిడ కొప్పుముడి విడిపోయి జుట్టు చిందరవందర అయిపోయింది. నీకు వెక్కసపు చలవేల? (అధికమైన మచ్చరము, పట్టుదలయెందుకయ్యా? ఒక్కసారి ఆమె వద్దకు రావయ్యా!

ఉవ్వెత్తుగా వస్తున్న నిట్టూర్పులతో పాటు, ముత్యాలవంటి కన్నీటి బొట్లు జలజలారాలుతున్నాయి. నీ ఆర్తత్రాయపరాయణత్వం ఎప్పుడూ ఉండేదే కదా! తెమలేపనులా నీవి? త్వరత్వరగా నడుస్తుంటే ఆమె ఆరాటానికి ఒళ్ళంతా చెమటలతో తడిసి ముద్దయిపోయింది. అంచెల (ఈ వరుస చూస్తుంటే), నీ మనస్సు వాత్సల్యం కోల్పోయి బండరాయి అయిపోయిందా అనిపిస్తున్నది. ఇంత కఠినత్వం ఎలా వచ్చిందయ్యా?

ఎదపై ఆమె రాసుకున్న 'పేటు గందము' యెండిపోయిన గంధము పొడివలె రాలిపోయింది. నీ చిలిపి శృంగారానికి ఇంత చేసితివా? ఇప్పుడు హఠాత్తుగా వచ్చి ఇట్టే ఆమెను కూడినావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదేమయ్యా? అట్టె (హవ్వ!!!), ఇట్లా మేనపచ్చి సేతలు (దైహికమైన మొరటుపనులు) చేస్తారుటయ్యా? నీకు ఇది తగునా!! జగన్నాధా!

**4-8**

## మున్నుడి

అన్నమాచార్యులవారి వైరాగ్య కీర్తనను పరిశీలించండి. ఓ శ్రీహరీ! కాళ్ళరిగేట్లు సంతల చుట్టూ తిరిగి అలసిపోయాను గాని అనువైన 'సరకు' మాత్రం దొరకలేదు, అంటున్నారు. అంటే ... స్వామీ! అనేక జన్మలెత్తి అలసిపోయ్యానయ్యా! కాని విజ్ఞానం మాత్రం దొరకలేదు. స్త్రీవ్యామోహంతో అల్లాడిపోయాను కాని మోక్షమార్గంలో ఒక్కమెట్టు కూడా ఎక్కలేకపోయాను. ఓ శ్రీవేంకటేశ్వరా! 'కమ్మర నీ కృపచేత దనిసి, యే విధులను దట్టు వడనైతి'- అంటున్నారు. అంటే...చదవండి మరి...

**మత్తకోకిల: సంతలే తెగ జొచ్చితిన్ కన జాలనే సరుకున్ ప్రభూ!**
**ఇంతటన్ కరుణించవైతివి యేమిన్యాయము శ్రీహరీ!**
**కాంత చన్గవ కొండలెక్కితి కాని మోక్షపు మెట్టులన్**
**యెంతజేసియు యెక్కనైతిని యిట్లు అన్నయ కుందెరా.**

కుందెరా= దుఃఖించాడు

**రాగం : కాంబోది**

సంతలే చొచ్చితి గాని- సరుకు గాననైతి
యింతట శ్రీహరి నీవే- యిటు దయ జూడవే ॥సంతలే॥

కాంత చనుగొండలు-కడకు నెక్కితి గాని
యెంతైనా మోక్షపు మెట్టు- యెక్కలేనైతి
అంతట జవ్వనమనే-అడవి చొచ్చితిగాని
సంతత హరి భక్తనే -సంజీవి గాననైతి ॥సంతలే॥

తెగి సంసార జలధి -దిరుగులాడితి గాని
అగడై వైరాగ్య రత్న-మది దేనైతి
పొగరు జన్మాలరణ-భూములు చొచ్చితి గాని
పగటు గామాదుల - పగ సాధించనైతి ॥సంతలే॥





తనువనియెడి కల్ప-తరువు యెక్కితి గాని
కొన విజ్ఞానఫలము -గోయలేనైతి
ఘనుడ శ్రీవేంకటేశ-కమ్మర నీ కృపచేత
దనిసి యే విధులను - దట్టువడనైతి ॥సంతలే॥

**భావామృతం :**

శ్రీహరీ! నేను అనేక సంతలలో ప్రవేశించి తిరిగాను. కాని నాకు అవసరమైన సరకు మాత్రం సంపాదించ లేకపోయాను. (అనగా... విలువైన మానవ జన్మనైతే పొందాను కాని, దాన్ని తరింపచేసికొనుటకు కావలసిన 'పరతత్త్వ జ్ఞానమును మాత్రం సంపాదించలేకపోయాను). కావున ఈ నిరుపయోగ జన్మ తరింపజేసి నీవే నన్ను రక్షించాలి.

స్త్రీల స్తనములనెడి కొండల నాసాంతం అధిరోహించితిని. కాని మోక్షమును సాధించు మెట్లను మాత్రం ఎక్కలేకపోయాను. జీవితం నిరుపయోగమైపోయింది. ఆ తరువాత యౌవనము అనే అడవులలో పడి తిరిగాను. కాని నిరవధికమైన విష్ణుభక్తి అనే సంజీవని మూలిక (మరణం నుంచి తప్పించగలిగినది) మాత్రం పొందలేకపోయాను.

తెగి (తెగువతో) సంసారమను సంద్రములో దుమికి తిరుగాడాను. కాని వైరాగ్యమనే రత్నాన్ని మాత్రం ఆ సముద్రంలో యెక్కడా సంపాదించలేకపోయాను. మనస్సుని దిటవు చేసికోలేకపోయాను. అనేక జన్మలనే రణరంగాలలో గర్విష్ఠినై ఎన్నోమార్లు ప్రవేశించాను. కాని సగటు (ప్రకటింపబడిన) కామము మొదలైన వాటి పగ సాధించలేక పోయాను. వాటికి లొంగిపోయాను.

శరీరం అనే కల్పవృక్షమునైతే యెక్కగలిగాను కాని దాని చివరనున్న విజ్ఞానమనే పండును మాత్రం కోయలేకపోయాను. ఘనుడవైన శ్రీవేంకటేశ్వరా! కమ్మర (కమ్మర అంటే... మఱల) నీయందు భక్తితో కృతార్థుడనైతిని. ఇక నేను ఏ కర్మవలనను బాధ పడక ధన్యుడనయ్యాను.

## మున్నుడి 4-9

'ధ్వన్యలంకార ప్రక్రియను' ఈ అద్భుత కీర్తనలో అన్నమయ్య విస్తృతంగా వినియోగిస్తున్నారు. 'పుటుక్కున' ఆ కట్టె విరిగిందంటే విరిగినప్పుడు ఆ ధ్వని వచ్చిందని భావం. సహజత్వం కోసం కవులు ఈ అలంకారం భాషలో వాడుక చేస్తారు. అల్లరి కృష్ణయ్య రేపల్లెలో పాలు, వెన్న, పెరుగు, నెయ్యి దొంగిలించి తన మిత్ర బృందాన్ని మేపేవాడు. ఆతనికి అవి అందకుండా ఎత్తుగా కట్టిన వుట్లలో దాచుకొనేవారు గోపికలు. కృష్ణయ్య మీ పని ఇట్లా వుందా... అని ఆ వుట్లు పగులకొట్టే వాడు. పాలు, నేలపాలుచేసి పలు బాధలు పెట్టేవాడు. అదెట్లాగో తెలియాలంటే... 'చటుక్కున' ఇది చదవాల్సిందే... మరి.

**కం॥ తెంచెను 'వుట్ల'ను కృష్ణుడు**
**ముంచెను గోపికల నేడ్పు ముప్పెన లందున్**
**యెంచెను పదముల నన్నయ**
**అంచనలకు యిట్టి ధ్వనులు అందవు సుండీ!!!**

**రాగం : ముఖారి**

పలువురు వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను ॥పలుమరు॥

ఊళ్ళ వీధుల వుట్ల కృష్ణుడు
తాళ్ళు తెగిపడ తన్నగను
పెళ్ళు కఠిల్లు పెఠిల్లు చిఠిల్లని
పెళ్ళుగ మ్రోసె పెనురవము ॥పలుమరు॥

బంగరు బిందెల పాలు పెరుగులు
ముంగిట నెగయుచు మోదగను
కంగు కళింగు కఠింగు ఖణింగని
రంగుమీరు పెనురవములై ॥పలుమరు॥





నిగ్గుగ వేంకట నిలయు దుట్టి పా-
లగ్గలిక పగుల నడువగను
బగ్గు బగిల్లని పరమామృతములు
గుగ్గిలి పదనుగ కురియగను ॥పలుమరు॥

**భావామృతం :**

అనేకమార్లు గ్రామాలలో వుట్ల పండుగలు జరుగుతాయి. అప్పుడు వుట్లను ఆనాడు కృష్ణయ్య పగులకొట్టినట్లు, ఈనాడు పిల్లలు పగులకొడతారు. ఆ వుట్లలో వుంచిన పాలు పెరుగు చింది నేలపాలవుతాయి. ఎలా అవుతాయో తెలుసునా "చిలుకు చిలుక్క"ని చింది, నేలపాలవుతాయి.

ఆనాడు రేపల్లెలో కృష్ణయ్య చేసినట్లే నేడు అనేక గ్రామాలలో వీధులలో కృష్ణుడు (చిన్నారి కృష్ణయ్య వేషం ధరించిన పిల్లవాడు) తాళ్ళు తెగిపడునట్లు తంతాడు. అప్పుడు "పెళ్ళు, కఠిల్లు, పెఠిల్లు, చిఠిల్లు" మని ఒక్కసారిగా పెద్ద ధ్వనులతో మ్రోతలు వెలువడుతాయి.

ద్వాపరయుగంలో ఆనాటి స్థితిగతులను బట్టి ధనికులైన గోపికలు బంగారు బిందెలలో పాలు పెరుగు వుట్లలో దాచుకొనేవారు. కృష్ణయ్య వూరక నుంటాడా? వాళ్ళ యెదుటనే ఎగిరి, ఆ బిందెల్ని క్రిందపడేట్లు కొట్టేవాడు. అప్పుడు "కంగు, కళింగు, కఠింగు, ఖణింగు – అనే పెద్ద పెద్ద చప్పుళ్ళతో ఆ బిందెలు నేలపై బడి ఆ ప్రదేశం రమణీయంగా వుండేది.

మరి ఈనాడు, నిగ్గున (కాంతులు వెదజల్లుతూ) వేంకటగిరీశుడైన శ్రీవేంకటేశ్వరుడు మనం పాపాలు అనేవుట్లలో దాచుకొన్న దుష్కర్మలను పాలు, పెరుగు, నేతులను "అగ్గలిక పగుల నడుపగ" (మిక్కిలి వేగంగా పగులకొడితే) ఈనాడు కూడా 'భగ్గు, భగిల్లు' అనే ధ్వనులతో గుగ్గిలి పదనుగ (గుగ్గిళ్ళవానవలె) పరమామృతములు (పుణ్యకర్మలనే అమృతముల) వాన వ్యాపించినది.

**4-10**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఆ ఏడుకొండలవాడినే సూటిగా ప్రశ్నిస్తున్నారు. చీకట్లో దిక్కు తెలియక అవస్థలు పడుతున్న వాడికి దీపం చూపించాలి కాని గొప్ప వెలుగులో వున్న వాడికెందుకయ్యా? వరదలో కొట్టుకుపోయేవాడిని ఆ ముంపునుంచి రక్షించాలి కాని, ఒడ్డున హాయిగానున్న వాడిని కాపాడే పనేముంది? మేము కర్మబంధాలలో చిక్కుకుపోయి కట్లు తెంచుకోలేక తిప్పలు పడుతున్నాం. ధైర్యము పోయింది తెలిసీ తెలియక అనేక పాపాలు చేస్తున్నాం మమ్మల్ని నీవే కాపాడాలి. లేకపోతే నీవెందుకయ్యా? అనాధరక్షకా...

**చం॥ తెలియక చీకటిన్, తెరల, దీపము కావలె వానికందయై**
**వెలుగును జూప నన్యులకు వెల్గది యేలనొ వెల్గునున్నచో!!**
**తొలగని కర్మబంధముల దుఃఖితు బ్రోవుము వేంకటేశ్వరా!**
**అలయని ముక్తునేమిటికి ఆదుకొనన్ యనె నన్నమార్యుడున్**

**రాగం : నీలాంబరి**

తెలియ చీకటికి దీపమెత్తక పెద్ద-
వెలుగు లోపలికి వెలుగేల ॥తెలియ॥

అరయ నాపన్నునికి అభయమీ్మవలెగాని
ఇరవైన సుఖిని కావనేల
వరత(ద) పోయెడివాని వడితీయవలెగాని
దరివాని తివియంగ తానేల ॥తెలియ॥

ఘన కర్మారంభుని కట్టు విడవలె గాక
ఎనసిన ముక్తుని గావనేల
అనయము దుర్బలునికి అన్నమిడవలెగాక
తనిసిన వానికి తానేల ॥తెలియ॥





మితిలేని పాప కర్మికి తా వలెగాక
హితవెఱుగుపుణ్యునికి (తా) నేలా
ధృతిహీను కృపచూచి తిరువేంకటేశ్వరుడు
తతి కావకుండిన తానేల ॥తెలియ॥

**భావామృతం :**

ఏమీ కనుపించక చీకటిలో కొట్టుమిట్టాడుతుంటే వాడికి దీపం చూపించి వెలుగు నందించాలి. అంతే కాని గొప్ప వెలుగులో వున్నవాడికి దీపం యెందుకు? అనవసరం కదా!

ఆపదలో నున్నవానికి అభయమిచ్చి ఆదుకోవాలి. కాని సుఖంగా బ్రతుకుతున్న వాడికి అభయమెందుకు? గొప్పవేగంగల వరదలో కొట్టుకొనిపోతున్నవాడిని ఆ వరద ప్రవాహం నుంచి ఏదో వుపాయంతో రక్షించాలి కాని, ఒడ్డునే హాయిగా వున్నవాడిని రక్షించే పనేమున్నది? ఏమాత్రం లేదు.

గొప్ప కర్మబంధాలలో కట్టువడిపోయి ఆకట్లు తెంచుకోలేక ఇక్కట్లు పడుతున్నవాడికి నీ సహాయం కావాలి కాని, ముక్తుడై యోగివలెనున్నవానికి ఇంకా నీ సహాయంతో పనేమిటి? అనయము (ఎల్లవేళలా) బలహీనుడై అన్నమో రామచంద్రా! అని ఆరాటపడే వాడికి కడుపునిండా అన్నంపెట్టాలి కాని, తనిసిన వానికి (తృప్తిగానున్న వానికి) తానెందుకు (స్వామి సహాయం ఎందుకు?)

అంతులేని పాపాలు చేసి, తెలిసీ తెలియక అనునిత్యం పాపాలలోనే బ్రతుకుతూ, రాబోయే జన్మలకు సరిపడా పాపాలు మూటగట్టుకొంటున్న నాకు, తను (శ్రీవేంకటేశ్వరుడు) కావాలి. కానీ మంచిదారిలో వున్న పుణ్యాత్మునికి, తానెందుకు? కాబట్టి తిరువేంకటేశ్వరుడు ధృతిహీను (ధైర్యం కోల్పోయిన) మాబోటి వారిని, తతి (సరియైన సమయంలో) కావకుండిన (రక్షించకపోతే) తానేలా (ఇంకా ఆయనెందుకు?) (అన్నమయ్య ఎంత ఆవేదనతో ఈ కీర్తన నాలపించారో అర్థమవుతున్నది, అవునా?

# 4-11

## మున్నుడి

కలశాపురంలో వెలసిన హనుమంతునిపై అన్నమాచార్యులవారు అనేక అద్భుత కీర్తనలు చెప్పారు. ఇదీ అటువంటి వాటిలో యొకటి. సముద్రాన్ని లంఘించి జానకీదేవికి శ్రీరామ ముద్రికనిచ్చి, ఆమె తన గుర్తుగా నిచ్చిన శిరోమణిని తిరిగి తెచ్చి రామునికిచ్చిన 'అంకెకాడు'. కొంకక సంజీవని తెచ్చి, తెంకినే వేంకటేశ్వరుని మెప్పించినాడట అంకె కలశాపురి హనుమంతుడు. ఇట్లాంటి వేంకటరామయ్య గారి దూతను సేవించి ఆయన తరించటమే కాక నాబోటివాణ్ణి తరింపచేశారు. ఏనాటి పుణ్యమో.

**ఉ॥ అందరికెక్కుడైన కపి అంజనసూనుని మెచ్చు కీర్తనల్**
**పొందుగ అన్నమయ్య తను పూనిక జెప్పెను మిక్కుటంబుగా**
**అందుకొనెన్ ఫలంబనుచు ఆ రవి బింబము బాల్యచేష్టగా**
**అందుకు వేంకటేశ్వరుని అండను జేకొనె నంచు దెల్పెరా**

**రాగం : కానడ**

అందరికి నెక్కుడైన హనుమంతుడు
అందుకొనె సూర్యఫలమని హనుమంతుడు ॥అందరికి॥

బల్లిదుడై లంకచొచ్చి బలురాకాసుల గొట్టి
హల్లకల్లోలము జేసె హనుమంతుడు
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీత కిచ్చె
అల్లదె నిలుచున్నాడు హనుమంతుడు ॥అందరికి॥

దాకొని యాకె ముందర తన గురుతెరుగించి
ఆకారమటు చూపె హనుమంతుడు
చేకొని శిరోమణి చేతబట్టి జలనిధి
ఆకసాన దాటివచ్చె హనుమంతుడు ॥అందరికి॥





కొంకకిట్టె సంజీవి కొండ దెచ్చి రిపులకు
నంకకాడై నిలిచెను హనుమంతుడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాడు
అంకె కలశాపురపు హనుమంతుడు ॥అందరికి॥

**భావామృతం :**

అందరికంటె అధికుడైన ఈ హనుమంతుని, చూడండి. బాల్యచేష్టగా ఈయన సూర్యబింబాన్నే 'పండు' అని భ్రమించి పట్టుకొన్నాడు. ఈయన ప్రతాపం వివరిస్తాను వినండి.

ఈ హనుమంతుడు బల్లిదుడై (గొప్ప బలశాలియై) అనేకమంది రాక్షసులను సంహరించి లంకను అల్లకల్లోలముజేసినాడు. ఒల్లనే (ఒప్పుగా) శ్రీరాముని ముద్రికయైన వుంగరమును సీతాదేవి కందించి అల్లదిగో అక్కడ నిలుచున్నాడు. ఆ మహానుభావుని చూడండి.

ఆకె ముందర (ఆమె యెదుట) దాకొని (చేరుకొని) తన వివరముల నెరింగించి, నూరు యోజనముల ఎత్తుకు పెరిగిన తన విశ్వరూపం చూపించి తన శక్తి సామర్థ్యములను తెలుపకనే తెలిపిన హనుమంతుడు ఈయనే. ఆమె ఇచ్చిన శిరోమణిని తీసికొని ఆకాశమార్గాన సముద్రమును దాటివచ్చి శ్రీరామకార్యం జయప్రదంగా నెరవేర్చిన అగ్రగణ్యుడీ హనుమంతుడు.

ఈ హనుమంతుడు యేమాత్రము, కొంకక (వెనుదీయక) సంజీవిని పర్వతమును ఇట్టె తెచ్చి, సౌమిత్రిని రక్షించి శత్రువుల అంకెకాడై (వశపరచుకొని, లొంగదీసినవాడై) నిలిచాడు. తెంకినే (తన సామర్థ్యంతో) ఈయన శ్రీ వేంకటాద్రి మీది దేవుడైన శ్రీవేంకటేశ్వరుని మెప్పించినాడు. అంకె (అందుచేత) ఈ కలశాపురి హనుమంతుడు జగజ్జెట్టి.

**4-12**

## మున్నుడి

పెద తిరుమలయ్యరచనయైన ఈ కీర్తనలోఆద్యంతం 'వ' కారం (వ-అనే అక్షరం 'విరివిగా వాడ బడింది'). తండ్రి అన్నమయ్య వలె ఈయన కూడా ప్రతి కీర్తనలోను 'వేంకట' మకుటం వాడటమే కాక ఏదో ఒక 'నూతనత్వం' కళ్ళకు కట్టేట్లు చూపిస్తాడు. శ్రీ కృష్ణుని విష్ణువుగా గుర్తించిన గోపిక "ఓ విష్ణుమూర్తీ ఏదో బత్తెం (రోజు కూలీ) తీసికొనెవాడిలాగ కృత్రిమమైన ప్రేమ చూపించకు, మా వెట్ట (తాపము లేక ఆర్తి) తీరునట్లు మాట్లాడు, "అంటున్నారు. వెల లేని అంటే విలువలేని అని కాదు విలువ చెప్పలేని అని అర్థం.

**తే॥ వెట్టి వలపును చల్లకు విష్ణుమూర్తి!**
**వెట్ట దీర మాటాడుము వినతి జేసె**
**పెద్ద తిరుమలాచార్యుల మేటి రచన**
**వినుచు ముఱిసెనేమో కదా! విష్ణుమూర్తి.**

**రాగం: శ్రీ రాగం**

వెట్టివలపు చల్లకు విష్ణుమూరితి నాతో
వెట్ట దీర మాటాడు విష్ణుమూరితి ॥వెట్ట॥

వినయము సేసేవు విష్ణుమూరితి నీవు
వెనకటి వాడవెగా విష్ణుమూరితి
వినవయ్యామా మాటలు విష్ణుమూరితి మమ్ము
వెనుకొని పట్టకుమీ విష్ణుమూరితి ॥వెట్టి॥

వెరవుగల వాడవు విష్ణుమూరితి నేడు
వెరగైతి నిన్ను జూచి విష్ణుమూరితి
విరివాయె నీమాయాలు విష్ణుమూరితి నాకు
విరులిచ్చే వప్పటికి విష్ణుమూరితి ॥వెట్టి॥





వెలసె నీ సేతలెల్ల విష్ణుమూరితి మా
వెలుపల లోన నీవె విష్ణుమూరితి
వెలలేని శ్రీవేంకట విష్ణుమూరితి కూడి
విలసిల్లితివి నాతో విష్ణుమూర్తి ॥వెట్టి॥

**భావామృతం:**

(స్వయంగా శ్రీమహావిష్ణువు, శ్రీ కృష్ణమూర్తిగా అవతరించాడనీ, ప్రేమ, వలపు , విరహతాపం వంటి పైత్యగుణాలు స్వామికుండవని గుర్తించిన జ్ఞానియైన ఒక గోపిక శ్రీకృష్ణునితో పాటరూపంలో చెప్పినట్లు ఊహిస్తున్నారు పెదతిరుమలయ్య). ఓ విష్ణుమూర్తీ! వెట్టివలపు (బత్తెము తీసుకొనేవాడు చేసే పని వలె కృత్రిమమైన ప్రేమ) చూపించకయ్యా! నీవు నాతో నా వెట్ట (తాపము) తీరునట్లు మాట్లాడు. నాకదే చాలును.

ఓ విష్ణుమూర్తీ! ఇంత వినయము చూపిస్తున్నావు. కానీ నీవు వెనకటి వాడివే, (ఆ నాడు మేం స్నానం చేస్తుంటే మా చీరెలెత్తికెళ్ళిపోయావు) కదా! కొంచెం మా మాటలుకూడా వినవయ్యా! అట్లా మమ్మల్ని వెనుకొని (వెనకనుంచి) పట్టుకోవద్దు. ఎందుకంటె అలా ఆయన పట్టుకుంటే లొంగిపోని గోపిక ఎవతెవుంటుంది?

ఓ విష్ణుమూర్తీ! నీవు వెరవుగలవాడవు (ఉపాయం తెలిసినవాడవు, నన్ను మాయ చేయగలవు). అందుచేత నిన్ను జూచి వెరగైతిని (భయపడుచుంటిని). ఇంత ప్రేమగా నాకు 'విరులిచ్చేవు అప్పటికి' (పూలు వున్నట్లుండి అందిస్తున్నావు.) అబ్బో!! నీ మాయలు విరివాయె (చాల ఎక్కువవుతున్నాయి). విష్ణుమూర్తీ! నీవు లీలామానుషరూపుడవని నాకు తెలుసు.

స్వామీ! నీ సేతలెల్ల వెలసె. (నీ లీలలు అన్నీ ప్రకటితమైనవి). నీవు వెలుపల ఇలా శ్రీకృష్ణునిగా వున్నా, మా లోపల కూడా అంతర్యామిగా నీవే వున్నావు. ఓ శ్రీవేంకట విష్ణుమూర్తీ. నీవు వెలలేని వాడవు. (వెలయెంతో చెప్పనసాధ్యమైన వాడవు). అంతటి మహానుభావుడవైనప్పటికీ నేడు నీవు నాతో విలసిల్లితివి. అదంతా నా అదృష్టం ప్రభూ!

4-13

## మున్నుడి

అద్భుతమైన పెండ్లి పాటను ఆవిష్కరిస్తున్న అన్నమాచార్యులవారిని వినండి. అప్సరసలను తాంబులం స్వీకరించి నృత్యగానాలతో శ్రీవేంకటేశ్వరుని కళ్యాణం కనువిందు చేయమంటున్నారు. గంధాక్షతలు స్వీకరించి గరుడధ్వజమెగురుట జూచి, దేవదుందుభుల మ్రోతలు విని, అంకురార్పణ మహోత్సవము తిలకించి ధన్యులవ మంటున్నారు. ముడుపులు చెల్లించుకోమంటున్నారు. ఇంతకీ మనబోటి అల్పులు కూడా ఆయనకి చదివించగలిగినదేమిటి? చదవండి....మరి

**ఆ.వె॥ ఆడిపాడు డిపుడు అప్సర గణములు**
**విభవమాయె నేడు వీడెమిదియె**
**పెండ్లిపాటజెప్పె వివరించి అన్నయ్య**
**తరలిరండు చూడ తనివిదీర.**

**రాగం : రామక్రియ**

ఆడరో పాడరో అప్సరోగణము
వీడెము లిందరో విభవము నేడు ॥ఆడరో॥

కమలారమణుని కళ్యాణమునకు
తమినదె గమడధ్వజమోసగె
తెమలుచు మ్రోసెను దివ్యదుందుభులు
గమనించరో దివిగలదేవతలు ॥ఆడరో॥

వెలయగ లక్ష్మీవిభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలగి గైకొనరో శ్రీవైష్ణవులు ॥ఆడరో॥





బడి శ్రీవేంకటపతికి శ్రీసతికి
అదరిన తలబాలందెనదె
నడచీ పరుషలు నానాముఖముల
ముడుపులు చదువరో ముయిగానరులు ॥ఆదరో॥

**భావామృతం :**

ఓ అప్సరసలు మొదలైన గణములారా! నేడు శ్రీవేంకటేశ్వరుని కళ్యాణము జరుగుచున్నది. మీరంతా ఆడండి, పాడండి. ఇదే మీకు ఆహ్వాన తాంబూలం ఇస్తున్నాము. నేడు స్వామి కళ్యాణ వైభవము. మీరంతా ఆహ్వానితులే.

నేడు రమారమణుని కళ్యాణము. అందుకే అత్యుత్సాహముగా గరుడధ్వజము విజృంభించి ఎగురుచున్నది. దేవదుందుభులు చలించి పోవునట్లు మ్రోగుచున్నవి. స్వర్గముననున్న దేవతలారా! సమయమయిందని గమనించండి.

ఈ లక్ష్మికాంతుని పరిణయ మహోత్సవము బలమైన అంకురార్పణము జరుగుచున్నది. అదిగో కనులారా గాంచుడు. గుంపుగా అందరికీ గంధాక్షతలనిచ్చుచున్నారు. ఓ శ్రీవైష్ణవులారా! అతిశయముగా మీరు వాటిని స్వీకరించండి.

సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరునికి మరియు శ్రీదేవికీ తలంబ్రాల సందడి జరుగుచున్నది నడచీ పురుషలు (నడచివచ్చుచున్న బాటసారుల సమూహములు) అనేక విధములైన కానుకలు, ముడుపులు చదివించుచున్నారు కొందరు ముయిగా (తామిచ్చుచున్న దేదో కానరాని విధముగా...అంటే ...ఆత్మార్పణము గావించుచున్నారు), నరులు సేవించుచున్నారు.

**4-14**

## మున్నుడి

నేటి కర్నూలు జిల్లా కోవెలకుంట్ల - అన్నమయ్యకాలంలో సుప్రసిద్ధమైన కోయిలకుంట్ల. ఇక్కడ రుక్మిణీ సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు పాండురంగ విఠలునిగా అవతరించాడు. అక్కడ వుండి విశిష్టాద్వైత మతాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన అన్నమాచార్యులవారు ఈ అద్భుతమైన కీర్తనతో ఆ విఠలుడే తన శ్రీవేంకటేశ్వరుడనే భావనతో ఈ కీర్తన చెప్పారు. వేడుకకాడని ఆ స్వామిని కీర్తించారు. ఆయన లీలలన్నీ మన కళ్లముందుకు తెచ్చి మధుర శృంగార భక్తికి అద్దం పడుతున్నారు.

**ఉ॥ "చూడగ పిన్నవాడు మరి జూటు దనంబులు యెక్కుడైన వా-**
**డేదను చూచినా కలదు ఈ విఠలున్ కొనియాడరో, యిదే"**
**వాడిగ అన్నమయ్య హరి భామల వేడుకకాడనెన్ భళా!!**
**కూడిన వేంకటేశ్వరుని కొల్చెను "రంగని" రూపుతాననెన్.**

**రాగం : ఆనంద భైరవి**

చూడ పిన్నవాడు గాని జూటుదనాల నెక్కుడు
యేడ చూచినా తాను యీ విట్ఠలుండే ॥చూడ॥

గోవులలో విహరించే గోవిందుడు పెక్కు
వావుల గోపికలకు వల్లభుడు
చేవమీరి ముద్దుల శ్రీకృష్ణుడు
యేవల్ల జూచినాను యీ విట్ఠలుడే ॥చూడ॥

రాసక్రీడలలోని రాజీవాక్షుడు
ఆస పదారువేల పెండ్లాడినవాడు
బాసతో రుక్మిణీ సత్యభామా సమేతుడు
యీ సుద్దుల వెలసీనీ విట్ఠలుడే ॥చూడ॥





వింత మధురాంగనల వేడుక కాడు
చెంత కొలని సతుల సిగ్గులవాడు
కాంత లక్ష్మీపతి శ్రీవేంకటేశ్వరుడు
యింతటా వినోదించీనీ విట్ఠలుడే ॥చూడ॥

### భావామృతం

ఈ చిన్నారి విఠలుని చూశారా. చూడటానికి చిన్న పిల్లవానివలెనున్నాడు కాని ఇతడు చాలా జిత్తులమారి. మరి ఈయన సర్వాంతర్యామియైన శ్రీమన్నారాయణుడే కాబట్టి 'యేడ చూచినా తానే'. ఎందెందు వెదకి జూచిన అందందే కలదు.

భక్తి, శరణాగతులతో వెతకండి. గోవులమందలలో గోవిందుడై విహరిస్తుంటాడు. ఉత్కృష్టమైన గోపికలకు (నిజానికి వారంతా దేవతా స్త్రీలే, కదా!) వల్లభుడు, (మనస్ఫూర్తిగా వరించిన మగడు). (కాళియ మర్దన జేసిన) ఈ ముద్దుల కృష్ణయ్య చేవమీరి (మిక్కిలి ధైర్యశాలియై) యున్నాడు. ఏవిధంగా చూచిన ఈయనే విఠల దేవుడు.

ఈయన గోపాంగనలతో రాసక్రీడయందు పరవశించిన రాజీవాక్షుడు (పద్మనేత్రుడైన శ్రీహరి). నరకాసురుని చెఱలో మగ్గుతున్న పదియారువేలమంది రాచకన్నెలను రక్షించి వారి ఆస (కోరిక) తీర్చుటకు పెండ్లాడిన పురుషోత్తముడు. విఠలదేవునిగా వెలసినప్పుడు రుక్మిణీ సత్యభామ (శ్రీదేవి, భూదేవి అవతారములే కావున) ఇద్దరినీ కూడియుంటానని, అట్లే వెలసి అనేక సుద్దులకు (కథలకు) కథానాయకుడైనాడు.

కుబ్జవంటి వింతరూపంగల మధురానగర వనితలకు ఈ స్వామి గొప్ప వేడుక కాడు (ప్రియుడు). ఇదిగో ఇక్కడ ఈ కొలనులో గోప స్త్రీల సిగ్గులు దోచిన చిలిపివాడు. ఈయనే లక్ష్మీసతీ వల్లభుడు. కలియుగ వైకుంఠమైన తిరుమల నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు. ఈయనే కోవిలకుంట్లలో విహరించుచున్న విఠలదేవుడు. ఈ స్వామిని సేవించి తరించండి.

**4-15**

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అనేక అద్భుత కీర్తనలలో ఇది బహుజనరంజకమైనది. సంస్కృత కీర్తనలో ప్రహ్లాదవరదుడైన వీరనరసింహునికి జయము పలుకుతున్నారు. సంస్కృతంలో తాళ్ళపాక కవులు చెప్పిన సన్నుతి కీర్తనలు ఆలపించటానికి అతి శ్రావ్యంగా వుంటాయి. అర్థం వివరించమని అడిగితే ఇబ్బంది కలిగే మాట వాస్తవమని నేను స్వానుభవంతో నేర్చిన సత్యం. అందుకే... ఈ భావయామి వేంకటేశమ్‌లో ఆ లోటు సరిచేసికొనే ప్రయత్నం చేస్తున్నాను. అంతా స్వామి దయ.

**ఆ.వె॥జయ జయ నరసింహ సర్వేశ! ప్రహ్లాద**
**వరద! వీర! నీవు భయహరుడవు**
**అన్నమయ్య పలికె నద్భుత గీర్వాణ**
**కీర్తనంబు యెంచి గిరి నిలయుని**

**రాగం : మోహన**

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద ॥జయ జయ॥

మిహిర శశినయన మృగనరవేష
బహిరంగ స్థల పరిపూర్ణ
అహినాయక సింహాసన రాజిత
బహుళ గుణగణ ప్రహ్లాద నరసింహ ॥జయ జయ॥

చటుల పరాక్రమ సమఘన విరహిత
నిటలనేత్ర మౌని ప్రణుత
కుటిల దైత్యతతి కుక్షి విదారణ
పటు వజ్రనఖ ప్రహ్లాదవరద ॥జయ జయ॥





శ్రీవనితా సంశ్రిత వామాంక
భావజ కోటి ప్రతిమాన
శ్రీవేంకటగిరి శిఖర నివాస
పావనచరిత ప్రహ్లాదవరద ॥జయ జయ॥

## భావామృతం

సర్వేశ్వరుడవైన ఓ నరసింహా! ఓ ప్రహ్లాదవరదా! నీకు సర్వదా జయమగుగాక! వీరాగ్రేసరుడవు భయ నిర్మూలకుడవుయైన నీకు అన్నివేళలా జయమగుగాక!

ఓ ప్రహ్లాద వరదా! నీవు మిహిర (సూర్యుడు) శశి (చంద్రుడు) నయనుడవు. (కన్నులుగా కలవాడవు). బహిరంగ స్థలమైన గిరి శిఖరములలో పరిపూర్ణుడవై వెలసినవాడవు. అహి నాయక సింహాసనుడవు. (పన్నగ నాయకుడైన ఆదిశేషుని సింహాసనము వలె అలంకరించినవాడవు. రౌద్ర, వీర, శాంత, శృంగారములవంటి అనేక గుణగణములచే విరాజిల్లువాడవు. అటువంటి ఓ నరసింహా! నీకు సర్వదా జయమగు గాక!

ఓ ప్రహ్లాదవరదా! నీవు చటుల పరాక్రముడవు (శత్రువులు భీతిచే చలించిపోవునట్లు చేయగల పరాక్రమశాలివి). సమఘన విరహితుడవు. (గొప్పదనములో సాటియైన వారు లేనివాడవు). నిటల నేత్రుడవు (మూడవ కన్ను ఫాలభాగమున కలవాడవు). మునులచే సన్నుతించబడువాడవు. దుర్మార్గులైన రాక్షస సమూహముల కుక్షి విదారణుడవు (కడుపులు చీల్చి సంహరించిన వాడవు). బలమైన వజ్రములవంటి నఖములు (గోళ్ళు) కలవాడవు. అట్టి నీకు జయమగుగాక.

ఓ ప్రహ్లాదవరదా! నీవు శ్రీలక్ష్మిని నీ వామాంకము (ఎడమ తొడపై) కూర్చొనబెట్టుకొనిన వాడవు కోటి మన్మధులకు ప్రతిమానుడవు (సమానమైన రూపసివి). శ్రీవేంకటగిరి నివాసుడవైన శ్రీవేంకటేశ్వరుని అవతారుడవు. పరమ పావనమైన చరిత్ర కలవాడవు. అట్టినీకు సర్వదా జయమగు గాక!

## 4-16

## మున్నుడి

నేటి కడప జిల్లా వావిలిపాడులో వెలసియున్న వీర విజయ రఘురామునిపై ఆనాడు అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. పోడిమి కొలువై వున్నాడట. తాను కూడా ఒక భక్తురాలై తనతోటి మరొక భక్తురాలికి శ్రీరామచంద్రుని గుణగణాలను వర్ణిస్తూ, ఈయనకు మొక్కవే చెలియా! నీదెస చూపులు నించీనే... ఓవరికొలువున వున్నాడే చెలియా! అని పాడుతున్నారు. పోడిమి కొలువై వున్నాడట. అంటే యేమిటో వివరంగా తెలియటం లేదు కదా! శ్రీ వేంకటగిరి సీతాపతిగారి గురించి చదవండి... మరి...

**తే॥ అల విజయరాఘవుడు వీని నరయుడిచట**
**పోడిమి కొలువై తను చెలీ! పొరలినాడు**
**వేంకటగిరి సీతాపతి వీడె సుమ్మీ!!!**
**అనెను వావిలిపాటిలో అన్నమయ్య.**

**రాగం : బృందావని**

వీడెవో అల విజయరాఘవుడు
పోడిమి కొలువున పొదలీ చెలియా ॥వీడెవో॥

రాముడు లోకాభిరాముడు గుణ-
ధాముడ సురులకు దమనుడు
తామర కన్నుల దశరథ తనయుడు
మోమున నవ్వీ మొక్కవె చెలియా ॥వీడెవో॥

కోదండధరుడు గురుకిరీట పతి
పోదిగ సురముని పూజితుడు
ఆదిమ పురుషుడు అంబుదవర్ణుడు
నీదెస చూపులు నించీ చెలియా ॥వీడెవో॥





రావణాంతకుడు రాజశేఖరుడు
శ్రీవేంకటగిరి సీతాపతి
వావిలిపాటిలో వరమూర్తి తానై
వోవరి గొలువున నున్నాడే చెలియా ॥వీడెవో॥

**భావామృతం**

ఓ చెలియా! ఆనాటి విజయ రాఘవుడు వీడేనే. వీడు, పోడిమి (ఒప్పుగా) కొలువై పొదలీనే (వున్నాడే).

ఈ రాముడు లోకాభిరాముడు. (లోకములన్నింటిలోను మనోజ్ఞమూర్తి). సకల సద్గుణములకు నిలయుడు. ఇతడు (ధాముడసురులకు=ధాముడు+అసురుకు) దమనుడు (దహించువాడు). పద్మదళ నేత్రుడైన వీడు దశరథ తనయుడు. ఓ చెలియా! నవ్వీమోమున వున్న వీనికి మొక్కవే... నీ జన్మధన్యమవుతుంది.

ఈ కోదండరాముడు కోదండ మను ధనువును ధరించి, గొప్ప కిరీటముచే అలంకరింపబడి యున్నాడు. ఈ కోవెల పోదిగ (స్థానమై) సురులచేత మునులచేత పూజింపబడుచున్నాడు. ఈయనే ఆది పురుషుడైన శ్రీమన్నారాయణుడు. ఈయన అంబుజ వర్ణుడు (నీటితో నిండియున్న నల్లని మేఘము యొక్క రంగుతో శోభిల్లువాడు). ఓ చెలియా! నీదెస చూపులు నించీ (నీవైపు చూచుచున్నాడు). ఈ రామచంద్రునికి నమస్కరించుము.

రావణాసురుని అంతమొందించిన ఈయన రాజశేఖరుడు (చక్రవర్తి). ఈయన శ్రీవేంకటగిరి సీతాపతి. (శ్రీవేంకటాద్రిపై వెలసిన వేంకటరామయ్య అని పిలువదగిన శ్రీవేంకటేశ్వరుడు. ఆ స్వామియే తానై ఈ వావిలిపాటిలో వరములిచ్చేమూర్తిగా, వోవరి గొలువున వున్నాడు (అంతర్యామిగా మన అంతరంగాలలో కొలువై సుస్థిరంగా ఉన్నాడు. ఓ చెలియా! ఈ అంతర్యామిని సేవించి తరించుము.

## 4-17

## మున్నుడి

తన తాతగారు అన్నమాచార్యులవలె చిన తిరుమలయ్య శ్రీవేంకటేశ్వరునిపై అనేక అద్భుత కీర్తనలు చెప్పి స్వామి కృపావారాహిలో వోలలాడారు. నెట్టన శ్రీహరిని జేరుటెట్లో నేర్వవలెను గాని వట్టి విచారము వగపు యెందుకు వ్యర్థము కదా! కాలము, కర్మము కలిసి రావాలనీ, పాపము, పగ పనికిరావని; కులము, గుణము ఔన్నత్యం తెస్తాయని అంటారు కానీ, ధ్రువుడు, అజామీళుడు, ప్రహ్లాదుడు, ఘంటాకర్ణుడు, వాల్మీకి, అహల్యవంటి వారి గురించి పెద్దలు చెప్పిన కథలు శ్రీహరిని తెలుసుకుంటే చాలని చెపుతున్నాయి కదా!

**కం॥ వట్టి విచారము వగపులు**
**పట్టవు, చిన తిరుమలయ్య పలికెను వినుడీ**
**నెట్టన శ్రీహరి జేరగ**
**గట్టిగ నేర్వంగ వలయు, ఘనులగుదు రనెన్.**

**రాగం : ఝుంఝూటి**

వట్టి విచారములేల వగపులేల
నెట్టన శ్రీహరిజేర నేరవలె గాక ॥వట్టి॥

కాలమేమి సేసీని కర్మమేమి సేసీని
యేలిన శ్రీరమణుడె యెదనుండగా
ఆలించిన ధ్రువునుని అజామిళునిని
కాలమేమి సేసెనయ్య కర్మమేమి సేసెను ॥వట్టి॥

పాపమేమి సేసీనీ పగయేమి సేసీని
కాపాడే దేవుడే దగ్గరనుండగా
యేపున ఘంటాకర్ణుని యెలమి ప్రహ్లాదుని
పాపమేమి సేసెనయ్యా పగయేమి సేసెను ॥వట్టి॥





కులమేమి సేసీని గుణమేమి సేసీని
నలువైన శ్రీవేంకటనాథుడుండగా
అలమి వాల్మీకికి అలనాడహల్యకు
కులమేమి సేసెనయ్యా గుణమేమి సేసెను ॥వట్టి॥

**భావామృతం :**

ఓ మానవులారా! వూరకనే మన సమయం వ్యర్థం చేసికొంటున్నాము. వట్టి (వ్యర్థమైన) విచారము (ఆలోచనలు), వగపులు (శోకములు) యేల? నెట్టన (తప్పకుండా) శ్రీహరిని జేరుటెట్లో నేర్వవలెను. అంతేకాని అనవసరమైన విషయాల గురించి ఆలోచన లెందుకు?

పాలించే శ్రీవేంకటరమణుడు హృదయంలో వుంటే కాలమేమి చేస్తుంది? కర్మమేమి చేస్తుంది? ధ్రువుని వేదన విని శ్రీహరి ఆ బాలుని వుద్ధరించి తారాపథంలో నిలిపాడు కదా! దుష్కర్మియైన అజామీళునికి వైకుంఠ వాసము నొసగినాడు కదా! వారికి కాలము కర్మము యేమి అడ్డమొచ్చాయి?

కాపాడే దేవుడు కమలనాభుడు దగ్గరవుండి ఆదుకొంటే మన పాపము మననేం చేస్తుంది, మన శత్రువుల పగ మననేమి చేస్తుంది? రాక్షసుడైన ఘంటాకర్ణుడు చేసిన పాపంవల్ల వాడికే అపకారం జరిగింది? హరిద్వేషియైన తనతండ్రి పగబట్టి హరిభక్తి మానమని చిత్రహింసలు పెడితే ప్రహ్లాదునికేమి నష్టం జరిగింది? జగద్విఖ్యాతి కలిగింది కదా!

కులీనుడనని కొందరు గొప్పలు చెప్పుకుంటారు. సద్గుణ భరితులమని, తమకు మోక్షము అనివార్యమని ఇంకా కొంతమంది భుజాలు చరుచుకొంటారు. ఎంత తెలివితక్కువవారు? నలువైన (సామర్థ్యముకల) శ్రీవేంకటేశ్వరునిపై భక్తి వుండాలి కాని, కులమెందుకు గుణమెందుకు? వాల్మీకి బోయవాడైనా ఆదికావ్యం రామాయణాన్ని రచించలేదా? అహల్య చిత్త చాపల్యంతో శాపగ్రస్థయై శ్రీరామపాద స్పర్శచే పునర్జీవితురాలు కాలేదా? మరి ఇంకా కులము గుణము అని ఈ వ్యర్థపుటాలోచనలెందుకు? భావయామి వేంకటేశమ్ అంటూ బ్రతికితే చాలదా?

## మున్నుడి 4-18

ఇది ఒక చక్కటి భజన. నారసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అసంఖ్యాక కీర్తనలలో ఇదొకటి. ఆచార్యులవారు స్వామిని 'నమక చమక హిత' అని కీర్తిస్తున్నారు. ఈవిధంగా హరిహరులకు భేదం లేదని పేర్కొంటున్నారు. నరసింహుడు నముచిసూధన వంద్యుడంటున్నారు. అంటే 'నముచి' అను రాక్షసుని చంపిన ఇంద్రునిచే కీర్తింపబడెడి ప్రభువని, అర్థం. మండెము నారసింహా అంటే... నవగుణి నారసింహ అంటే... కాస్త ఓపికపట్టి భావామృత వివరణ చదవాల్సిందే... మరి.

**ఆ.వె॥ నగధర! నరసింహ! నందగోపుని సుతా!**
**నగజ వరద! శరణు నారసింహ!**
**భజన వోలె పలికె భక్తితో అన్నయ్య**
**నారసింహు గొలిచె పరవశించి.**

**రాగం : యమునా కళ్యాణి**

నగధర నందగోప నరసింహా వో-
నగజవరద శ్రీ నారసింహ ॥నగధర॥

నరసింహ పరంజోతి నరసింహా వీర
నరసింహ లక్ష్మి నారసింహా
నరసఖ బహుముఖ నారసింహా వో-
నరకాంతక జేజే నారసింహా ॥నగధర॥

నమో నమో పుండరీక నారసింహా వో-
నమిత సురాసుర నారసింహా
నమక చమక హిత నారసింహా వో-
నముచి సూదన వంద్య నారసింహా ॥నగధర॥

నవరసాలంకార నారసింహా వో-
నవనీతచోర శ్రీ నారసింహా
నవగుణి వేంకటనారసింహా వో-
నవమూర్తి మండెము నారసింహా ॥నగధర॥





**భావామృతం :**

ఈ నారసింహుడు నందగోప నగధరుడు అనగా నందగోపుని బిడ్డడైన నగధరుడు, (గోవర్ధనధారి) అయిన శ్రీకృష్ణపరమాత్మయే అని భావము. నగజవరదుడు (పార్వతీదేవిచే కీర్తింపబడు శ్రీమన్నారాయణుడు) అట్టి దేవదేవా! శ్రీనారసింహా! నిన్ను భజించెదను.

ఓ పరంజ్యోతి స్వరూపుడవైన నరసింహా నీవు వీరాగ్రేసురడవైన నారసింహుడవు. లక్ష్మి నారసింహుడవు. (వామాంకమున శ్రీలక్ష్మిని ధరించిన నారసింహుడవు. నర సఖుడవు (అర్జునుని ఆప్తమిత్రుడవైన శ్రీకృష్ణ స్వరూపుడవు). బహుముఖ నరసింహుడవు (అనేక అవతారములను ధరించిన శ్రీహరివి). నీవు నరకాంతక జేజేవయిన నరసింహుడవు (అనగా నరకాసురుని చంపిన దైవమైన కృష్ణయ్యవు). అటువంటి దేవా! నిన్ను భజించెదను.

పుండరీక నారసింహా (తెల్లని దేహచ్ఛాయ గల నారసింహా నీకు వందనములు. సురాసుర నమిత (దేవతలచేత మరియు రాక్షసులచేత కూడ కీర్తింపబడిన దేవుడవైన స్వామీ!) వందనము. నమక చమక హిత (నమకము చమకములపై ప్రీతిగల (శివ స్వరూపుడవైన) నారసింహా నీకు వందనములు. 'నముచి' అను రాక్షసుని దునిమిన దేవేంద్రునిచే కీర్తింపబడు నరసింహా! నీకు ప్రణతులు.

నవరసములైన భక్తి, శృంగార, భీభత్సాది రసములచే శోభిల్లి, ప్రదర్శించు నరసింహా నమస్కారములు. నవనీత చోరుడు (వెన్నదొంగ) అయిన కృష్ణమూర్తి స్వరూపుడవైన నారసింహా వందనము. ఈ వేంకట నారసింహుడు నవగుణి. క్రోధమైన ద్వేషమైన ఈ స్వామికి క్షణికములే. ఎప్పటికప్పుడు నూతన గుణములు (ఆశ్రిత వాత్సల్యం వంటివి) ప్రదర్శించువాడు ఈ స్వామి. (శ్రీవేంకటేశ్వరుడే కదా!) ఓ నవమూర్తి మండెము నారసింహా! (క్రొత్త రూపం దాల్చిన నారసింహా!) నీవు మండెమున వెలసియుంటివి. నీకు అనేక వందనములు (మండెము నేటి కడప జిల్లాలోని ఒక వూరు).

**4-19**

## మున్నుడి

నేటి కడప జిల్లా 'వెలిగోడు'లో వెలిసిన చెన్నకేశవస్వామిని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. కేవలుడు అంటే పరమాత్ముడని అర్థం. దివ్య దేహంతో విరాజిల్లే ఆ దేవదేవుడు కేశి అనే రాక్షసుని తుదముట్టించి కేశవుడైనాడు. అన్నమయ్య వాడిన కొన్ని విశేషణాలు ఇతర కవుల వూహలకూ అందవు. శ్రీకృష్ణుని 'కేకివాహన వరద' (నెమలి వాహనుడైన సుబ్రహ్మణ్యుని వరములచే అనుగ్రహించువాడనటం ఆయనకే చెల్లింది). 'శరధి గంభీరశాయి' అంటే గంభీరమైన సముద్రముపై పవళించు వాడైన శ్రీమన్నారాయణుడని. ఇట్లాంటివి అనేకం వున్నాయి.

**ఉ॥ కేవలకృష్ణ రూపుడవు కేశవుడీవని సన్నుతించెరా**
**దేవగణాధిదేవ! తమ దేహము దివ్యము కేశవా! ప్రభూ!**
**ఈవు సురేంద్రవంద్యుడవు ఇంపగు వక్షము కుంకుమాంకమౌ**
**కోవిదుడన్నమయ్య ఇటు కొల్చె నుతించుచు చెన్నకేశవున్**

**రాగం : బేహాగ్**

కేవల కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా ॥కేవల॥

కిరణార్క కోటితేజ కేశవా
హరి లక్ష్మీనాయక యాది కేశవ
గిరిరాజ సుతనుత కేశవా నమో
శరధి గంభీర శాయి జయజయ కేశవా ॥కేవల॥

కేకి పింఛావతంస కేశవా
శ్రీకర గుణాభిరామ చెన్నకేశవా
కేకివాహనవరద కేశవ
పాకశాసనవంద్య భళిభళి కేశవ ॥కేవల॥





కింకర బ్రహ్మాది గణ కేశవ నా-
మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ
శంకాహరణ నమో జగదేక కేశవ ॥కేవల॥

### భావామృతం

కేవల రూపుడవైన శ్రీకృష్ణావతారా! కేశవా! దేవదేవా! నీవు లోకములన్నింటికీ ప్రభువు. దివ్యమైన దేహముతో అలరారు మహానుభావుడవు.

ఓ కేశవా! నీవు కోటి సూర్య తేజుడవు. లక్ష్మీ వల్లభుడైన శ్రీధరుడవు. ఆదిమూర్తివైన ఆదికేశవుడవు. హిమగిరి పుత్రికయైన పార్వతీదేవిచే నిత్యమూ సన్నుతింపబడు వాడవు. గంభీరమైన క్షీరసాగరమున శయనించు శేషతల్పశాయియైన శ్రీమన్నారాయణుడవు. అట్టి కేశవా నీకు జయము జయము ప్రభూ!

నెమలి పింఛమును సిగలో దాల్చి అలంకరించుకొను ఓ కేశవా! నీవు శ్రీకర గుణాభిరాముడవైన (శుభకరములైన గుణములుగల మనోజ్ఞమూర్తివైన) చెన్నకేశవుడవు. నెమలి వాహనుడైన సుబ్రహ్మణ్యుని వరములచే అనుగ్రహించిన వాడవు. (షణ్ముఖుడు దేవసేనను పరిణయమాడి దేవగణాదులకు సర్వసైన్యాధిపతి పదవి నలంకరించి నప్పుడు విష్ణుమూర్తి ఆయనకు ఎన్నియో వరములనిచ్చి ఆశీర్వదించాడు). పాకశాసనుడైన (పాకాసురిని శాశించిన) దేవేంద్రునిచే కీర్తింపబడు కేశవుడు. భళిభళీ!! నీవు దేవదేవుడవు చెన్నకేశవా!

బ్రహ్మాది దేవతలు భృత్యులుగా గల కేశవుడను నామముచే శోభిల్లు ప్రభూ! నీవు వేంకటాద్రిపై వెలసిన కేశవుడవు. కుంకుమ అంటినందున ఎఱ్ఱగా ప్రకాశించుచున్న వక్షముగల కేశవుడవు. వెలిగోడులో వెలసిన చెన్నకేశవస్వామివి నీవే. నీవు తిరుమలనాథుడవేనా? అనే శంకను హరించు జగదేకపతివైన చెన్నకేశవుడవు నీవే మా శ్రీవేంకటేశ్వరుడవు.

## మున్నుడి 4-20

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ శరణాగతి మీరూ పాడి తరించండి. అచ్యుతుడు, గుణాతీతుడు, విశ్వరూపుడు, అచింత్యుడు, పూర్ణకాముడు, అగోచరుడు – అయిన ఈ శ్రీవేంకటేశ్వరుని మనం సాధించగలమా!! మన వలన అయ్యే పనియేనా? అసాధ్యం. మరి ఏదుపాయము? శరణాగతి... నాకు ఇంకేమీవద్దు నీవే కావాలి... నీవే దిక్కు... అనటమే... అదీ త్రికరణ శుద్ధిగా...

**సీ॥ ఏదుపాయము నిన్ను యేరీతి చేరేది?**
**ఆద్యంతములు లేని అచ్యుతుడవు**
**వెలయనీ గుణములు వినుతించెదమనంటె**
**తెలియ నీవే గుణాతీతుడవట**
**పొదిగి చేతుల నిన్ను పూజించెదమనంటె**
**కదిసి నీవే విశ్వకాయుడవట**
**కన్నులచే నిన్ను కనుగొనెదమనంటె**
**సన్నిధి నీవగోచరుడవంట**

**తే॥ ఇన్నిటను వేంకటేశ్వరా! ఈవె కలవు**
**వన్నెల శరణమనియెడి వాక్యమొకటి**
**నిన్ను కొలవంగ జాలనె అన్నమయ్య**
**పద్యమందున నిముడు యీ పాట వినుడు**

**రాగం : ముఖారి**

ఏదు పాయము నిన్ను చేరుటకు
ఆది అంత్యములేని అచ్యుతమూరితివి ॥ఏదు పాయము॥

వెలయ నీ గుణములు వినుతించేనంటే
తెలియ నీవు గుణాతీతుడవు
చెలరేగి నిను మతి చింతించేనంటే
వలసి నీవచింత్య మహిముడవు ॥ఏదు పాయము॥





పొదిగి చేతుల నిన్ను పూజించేనంటే
కదిసి నీవు విశ్వకాయుడవు
అదన నేమైన సమర్పించేనంటే
సదరమై అవాప్త సకల కాముడవు ॥ఏదు పాయము॥

కన్నుల చేత నిన్ను కనుగొనేనంటే
సన్నిధి దొరక నగోచరుడవు
ఇన్నిటాను శ్రీవేంకటేశ నీవు కలవని
వన్నెల శరణనే వాక్యమే చాలు ॥ఏదు పాయము॥

**భావామృతం**

ఓ దేవదేవా! నిన్ను చేరుకొనుట యెట్లు? నిన్ను తెలుసుకొనుట యెట్లు? నిన్ను పొందుట యెట్లు? ఏదుపాయము (ఉపాయం యేది?) నీవేమో అచ్యుతుడవు, అనాదివి, అనంతుడవు. అంటే ఆదిమధ్యాంత రహితుడవు కదా!

వెలయ (ప్రసిద్ధికెక్కిన) నీ గుణములను చక్కగా కీర్తించెదను అనుకొంటే నాకో సందేహం వచ్చింది. నీవు గుణాతీతుడవు కదా! నిర్గుణుడవు కదా! విజృంభించి నిన్ను మనస్సులో చింతించెదములే అనుకొంటే, నీవు ఆలోచనలకే అందని అచింత్యుడవు. నీ మహిమలనూహించుటయే సాధ్యము కాదాయెను. మరి యేది దారి?

స్వామీ! నిన్ను చేతులలో వుంచుకొని పూజిద్దామా అంటే, కదిసి (సమీపించిన) నీవు విశ్వరూపుడవు. దివ్య చక్షువులను పొందిన అర్జునుడే నిన్ను చూడలేక బెంబేలెత్తిపోయాడు. నావల్ల అయ్యే పనియేనా? పోనీ ఇదే సమయం నీకేదన్నా సమర్పించి నీ అనుగ్రహం సంపాదిద్దామా అంటే... నీవు సదరమై (కోఱికయేలేని) అవాప్త సకలకాముడవు (అన్నీ పొందిన పూర్ణకాముడవు). ఇక నేను నీకు ఇయ్యగలిగినదేమిటి తండ్రీ!

అన్నిటికంటే తేలికయైన పని కళ్ళెదుట యేదన్నా వుంటే చూడటం. నీ విషయంలో మాకు అదీ అసాధ్యమే. నీ సామీప్యం సాధ్యమవుతుందా? నీవు యెవరికీ కనిపించని అగోచరుడవు. నిన్నెట్లా చూడగలము? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఇన్నిటా (వీటన్నిటియందునూ) కలవు. అట్టి, వన్నెల (ప్రసిద్ధుడవైన) నీకు శరణు అనే మాటయే చాలును. దయా సాగరుడవైన నీవు మమ్ము కరుణించి నీ శరణము నిస్తావు. అనండి మరి...

శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే...

**4-21**

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తన నర్థం చేసుకోవటం అంత తేలికకాదు "ఘనుడవైన నీ మహిమ కనుగొన్న వారెవరయ్యా? మినుకుల కొంతకొంత మెచ్చుట ఇంతేకాని" అంటున్నారు. మినుకుల అంటే వేదములలో, అక్కడక్కడా నిన్ను కీర్తించటం తప్ప నీ మహిమ ఎవరికి తెలుసయ్యా అని అంటున్నారు. ఎన్నెన్నో అసాధ్యమైన పనులు చేయవచ్చుగానీ, నీవునన్ను కరుణించి నా దగ్గర వున్నంతకాలం నీకు నాకూ భేదం కనుక్కోవటం ఎవరివల్లాకాదు. నీవే నేను, నేనే నీవు అంటున్నారు. ఆలోచిస్తే గూఢంగా దశావతారములు ప్రస్తుతి కనబడుతుంది.

**చం॥ ఘనుడవు నీదు లీలలను కానగజాలిన వారలెవ్వరో!!**
**మినుకుల కొంతకొంత నిను మెచ్చగ వీలగునింతియే ప్రభూ!**
**మనవిగ నన్నమయ్య హరిమాయ నెరుంగుట వీలు కాదనెన్**
**వినుడు దశావతారముల వెన్నుని ప్రస్తుతి జేసె చూడరో.**

**రాగం : మోహన**

ఘనుడవు నీ మహిమ గన్నవారెవ్వరు
మినుకుల కొంతకొంత మెచ్చుటింతేకాని ॥ఘనుడవు॥

జలధి నీరు సొచ్చి సారెసారె నీదవచ్చు
ములుగుచు గొండైన మోవవచ్చు
యిల యెల్ల నెత్తవచ్చు నేరూపైన గావచ్చు
బలిమి నీ చిత్తమే పట్టరాదు గాని ॥ఘనుడవు॥

ఆకసమింతంతని యంటి కొలవగ వచ్చు
చేకొని ఘోరతపము సేయవచ్చు
రాకాసులజంపవచ్చు రామలగలయవచ్చు
ఆకడ నీ గుట్టు తెలియగరాదు ॥ఘనుడవు॥





పట్టరాని వ్రతములు పట్టించి సేయించవచ్చు
గట్టిరాయైన కడు గరచవచ్చు
ఇట్టె శ్రీవేంకటేశ యిటునన్ను గూడితివి
దిట్ట నీనాలోన భేదించరాదు గాని ॥ఘనుడవు॥

**భావామృతం :**

ఓ మహానుభావా! నీవు ఘనుడవు. నీ మహిమను లెక్కించగల వారెవ్వరు? ఏదో కొంతకొంత మెచ్చుకొంటూ నిన్ను కీర్తించటమేకాని, నిజానికి నీ మహిమ ఎంతో ఎవరు చెప్పగలరు?

సముద్రంలో దూరి ఈద వచ్చు. మాటిమాటికీ మునిగి తేల వచ్చు (మత్స్యావతారం). పెద్దకొండనైన మోయ వచ్చును (కూర్మావతారం). భూమండలాన్నైనా యెత్త వచ్చును (వరాహావతారం). ఏదో సిద్ధి పొంది యే రూపం కావాలంటే ఆ రూపం ధరించవచ్చును (నరసింహం). కాని మనస్సులో నిన్ను పట్టి యుంచటం మాత్రం జరిగే పనికాదు.

ఆకాశమును పట్టుకొని ఇంత లేక అంత అని కొలవవచ్చును (వామనావతారం). పూనుకొని ఘోరమైన తపము నాచరించవచ్చును (పరశురాముడు). దుర్మార్గులైన రాక్షసులను చంపివేయవచ్చును (రామావతారం). రామల గలయవచ్చు (భోగాసక్తి కల వనితలను కూడ వచ్చును (అంటే శ్రీకృష్ణుడు). కాని ఆద్యంతం నీ తత్త్వం తెలిసి కొనుట మాత్రం జరిగే పనికాదు.

ఈ భూలోకంలో ఎవ్వరూ చేయని గొప్ప గొప్ప వ్రతములను పట్టుదలతో ఆచరింపజేయవచ్చును (బుద్ధావతారం). కఠినమైన శిలను కూడ కరగించవచ్చును, పాషాణ హృదయాన్నైనా సద్వర్తునులై కరిగించవచ్చును, (కల్కి అవతారము). ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఈ విధముగా అతి తేలికగా కూడితివి. ఇక నీకు నాకు భేదమే లేదు. నేను ఆత్మసాక్షాత్కారమైన జీవాత్మ పరమాత్మలొక్కటే అని గ్రహించగలిగాను ప్రభూ!

## 4-22

## మున్నుడి

విశిష్టాద్వైత మతం స్వీకరించి శ్రీహరి తత్త్వాన్ని ప్రచారం చేసిన అన్నమాచార్యుల వారు ఈ కీర్తనలో చక్కటి తత్త్వ రహస్యాన్ని వారి గురువు చెప్పినట్లు మనకు చెబుతున్నారు. అన్ని శాస్త్రములు చదివినా, యెంత నేర్చినా, మనకు తెలిసేది ఆనాడు శ్రీశుకుడు చెప్పినది. స్వానుభవంతో ధ్రువుడు నేర్చినది అయిన గొప్ప సత్యం ఒక్కటే. భవము (అనగా జీవి పుట్టుక) యేదైనా, నామ రూపములు వేరైనా శ్రీహరి దాస్యంచేత మాత్రమే ఆయన మాయను తెలియగలను. వేరే దారే లేదు.

**ఉ॥ అన్నియు శ్రద్ధతో చదివి ఆవల శాస్త్రములన్ని నేర్చియున్**
**ఎన్నగ శ్రీశుకుండు ధ్రువు డేర్పడ జెప్పిన సత్యమొక్కటే**
**ఉన్నతమైన మోక్షమది యొక్కటె యేమతమైన నేమిరా**
**అన్నయ కీర్తనంబు గొని అద్భుత తత్త్వము నేర్పె శ్రీహరీ!**

**రాగం : మలహరి**

సకలము జదివిన శాస్త్రములెఱిగిన
శుకధ్రువాదులిటు చూపినది ॥సకలము॥

భవభవములకును ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం బెప్పుడు నొకటే
కలిసిన నీమాయ గడచినది ॥సకలము॥

మతము మతమునకు మార్గము వేరే
అతి సంశయములు అవివేరే
గతి నీ శరణము గలిగిన దొకటే
యితవగు మోక్షం బిచ్చేది ॥సకలము॥





జాతిజాతియాచారము వేరే
ఆతల మోక్షం బది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవేంకటేశ్వర
చేత మా గురుడు చెప్పినది ॥సకలము॥

**భావామృతం :**

ఓ మానవులారా! చదవవలసినదంతా చదివినా, శాస్త్రములన్నియు నేర్చినా చివరికి నేర్చెడి సత్యమొక్కటే. అదే ఆ నాడు శ్రీ శుకమహర్షి బోధించారు. అదే తెలుసుకొని ధ్రువుడు శ్రీహరి కరుణబొంది ధ్రువతారయై ప్రసిద్ధిగాంచినాడు.

జీవుల పుట్టుకలన్నిటికీ (భవభవమునకు) ప్రకృతి వేరువేరుగా వుంటుంది. ఈ లోకంలో ఒక్కొక్క జీవికి ఒక్కొక్క పేరు, రూపం వుంటాయి. కాని అవి ఆ పరమాత్మ మాయ తెలిసికొనలేక బ్రతుకుతుంటాయి. చస్తుంటాయి. మళ్ళీ పుడుతుంటాయి. ఏదో ఒక జన్మలో ఆ దేవదేవుని దాస్యం స్వీకరించి, సేవానురక్తిని పొందితేగాని ఆయన మాయను గవయలేడు (దాటలేడు).

ప్రపంచంలో ఒక్కొక్క మతం ఒక్కొక్క మార్గం ద్వారా పరమాత్మను పొందవచ్చని చెప్పింది. మళ్ళీ ఆ మతాలలో కూడ వేర్వేరు సందేహాలు వున్నాయి. అయితే నీ శరణాగతి యొక్కటి మాత్రమే హితమును కలిగించు మోక్షప్రాప్తిని ఈయగలదు. ఎవరేమి చెప్పినా పరమాత్మ శరణు పొందనివాడు యెన్నటికీ మోక్షం సాధించలేడు.

ఈలోకంలో అనేక జాతులున్నాయి. వీటన్నిటికీ వేర్వేరు ఆచారాలున్నాయి. కాని వాటన్నిటికీ లక్ష్యమైన మోక్షం మాత్రం ఒక్కటే. అదే మరల పుట్టుకలేని ఆనందం పొందటం. శ్రీవనితావల్లభుడైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీదయ నొందిన మా గురుదేవులు చెప్పిన సత్యంకూడ ఇదే.

**4-23**

## మున్నుడి

అన్నమాచార్యులవారి కాలంలో శ్రీమంతులు పుణుగు అనే సుగంధ ద్రవ్యం ఒంటిపై మెత్తుకొని (సామాన్యులు సున్నిపిండి వాడేవారు) స్నానం చేసేవారు. ఆ సుగంధ ద్రవ్యం పునుగు పిల్లినుంచి లభిస్తుంది. తిరుమలనాథునికి ప్రతి శుక్రవారము అభిషేక స్నానపు సేవ జరుగుతుంది. పన్నీటితో స్నానంచేసి, కర్పూర ధూళి మెత్తుకొని తట్టు పుణుగు సువాసనలతో ఘుమఘుమలాడుతూ ఆ పురుషోత్తముడు తన దేవేరి అలమేల్మంగమ్మతో చక్కటి హరాల నలంకరించుకొని, పట్టువస్త్రాలు ధరించి, పలు విందులారగించి, బాగాలు తీసికొని (అంటే?) అందరినీ కరుణిస్తాడు.

**కం॥ నేడే 'సుక్కురవారము'**
**చేడెలు యీ 'పుణుగుకాపు' సేవల నిడరే**
**పోడిమి సేవల కొలువుడు**
**వాడిగనా అన్నమయ్య పాడెను వినుడీ.**

**రాగం : అభేరి**

నేడె సుక్కు రారము నెలతలాల
పోడిమి సేవసేయరే పుణుగుకాపు ॥నేడే॥

పన్నీటి కాలువలు పారీని జూడరే
అన్నిటా గొండవంటి శ్రీహరి మీదను
యెన్న నభిషేక మంత్రాలిదె చెప్పేరు వినరే
తిన్నని పుణుగుకాపు దేవునికి నేడు ॥నేడే॥

రాలీని కప్పుర రజమిదె చూడరే
నీలమేఘమువంటి యీ నీరజాక్షుపై
తాలిమితో జాలువారీ తట్టుపుణుగది గోరే
పోలింప బుణుగుకాపు పురుషోత్తమునికి ॥నేడే॥





అలమేలు మంగతోడి హారాలు సేవించరే
వెలయ ధరించెను శ్రీవేంకటేశుడు
పలువిందులారగించె బాగాలు యియ్యరే
చెలగీ పుణుగుకాపు శేషాద్రిపతికి

**భావామృతం :**

ఓ వనితలారా! నేడు శుక్రవారము. పోడిమి (ఒప్పుగా) మీరంతా స్వామికి పుణుగుకాపు సేవచేయండి. ధన్యులు అవండి.

ఇదిగో ఇటుచూడండి. పన్నీటితోస్వామి స్నానం చేస్తుంటే పన్నీరు కాలువలై పారుతున్నది. ఈ శ్రీహరి కొండవలె స్థిరంగా నున్నాడు. ఆయనపై పన్నీటి అభిషేకం జరుగుతుంటే స్థిరంగా నున్నాడు. వేదపండితులు మంత్రాలు శ్రావ్యంగా చదువుతున్నారు. మీరంతా వినండి. తిన్నని (మనోజ్ఞమైన) ఈ దేవునికి నేడు పుణుగుకాపు సేవ జరుగుతున్నది. చూచి తరించండి.

పద్మదళనేత్రుడైన ఈ నీలమేఘశ్యాముని ఒంటిపై కర్పూర ధూళి మెత్తుతున్నారు. స్వామి ఒంటిపై నుండి కొంత కర్పూర ధూళిరాలిపోతున్నది. ఈ చక్కటి దృశ్యం చూడండి. తట్టుపుణుగు అనే సుగంధద్రవ్యం తాలిమితో (ఇక్కడ సమృద్ధిగా) జాలువారుచున్నది. ఈ పురుషోత్తమునికి జరుగుచున్న పుణుగుకాపు సేవను తిలకించండి.

శ్రీవేంకటేశ్వరుడు తనదేవేరి అలమేల్మంగతోపాటు శోభాయమానంగా దివ్యహారాలు ధరించి వెలుగొందుచున్నాడు. ఓ చేడెలారా! (వనితలారా!) ఈ చక్కటి జంటను సేవించండి. ఇప్పుడు స్వామి తన దేవితో వివిధములైన విందుల నారగించినాడు. ఇప్పుడాయనకు బాగాలు (వక్క, తాంబూలము) యియ్యరే. ఈ శేషాచలాధిపునికి, చెలగి (విజృంభించి) పుణుగుకాపు సేవచేసి తరించండి.

## 4-24

### మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన వింటే నరుడే నారాయణుడనే సత్యం తేటతెల్లమవుతుంది. వివిధ రూపాలలో వివిధ దేవతలనారాధించే మనం, మనలోనే వున్న పరమాత్మను గుర్తించలేక స్వామి దర్శనానికి వైకుంఠ ద్వారంలో నిలిచి కూడా, తోటివారిని దూషిస్తూ, కోపతాపాలతో వేగిపోతూ, ధనవ్యయం గురించి ఆలోచిస్తూ అప్పటికప్పుడు అబద్ధాలు చెబుతూ, ఏదో ఒక్క అర నిముషంలో ఆ నల్లనయ్యను 'చూసేస్తున్నాము'. కానీ పరమాత్మని దర్శించటంలేదు. ఎందుకంటే... ఆయన మనలోనే వున్నాడు. శ్రీవేంకటేశ్వరునికే... ఆమాట చెబుతున్నారు.

**మత్తకోకిల:** **నీవనన్ యొకచోట నుండవు నీవు వుందువు యెల్లెడన్**
**నీవుయంచు కనుంగొనేదదె నీవు నిక్కము శ్రీహరీ!**
**ఈవిధిన్ వచియించెనన్నయయెంచి చూడరొసత్కవిన్**
**లావుగా నరులందుదేవుని లబ్ధినొందగ జెప్పెరా.**

**రాగం : కాపి**

నీవనగనొకచోట నిలిచివుండుట లేదు
నీవనుచు కనుగొన్న నిజమెల్ల నీవే ॥నీవనగ॥

తనయాత్మవలెనె భూతముల యాతుమలెల్ల-
ననయంబు గనుగొన్న యతడే నీవు
తనుగన్న తల్లిగా తగనితర కాంతలను
అనఘుడై మదిజూచు నతడే నీవు ॥నీవనగ॥

సతత సత్యవ్రతాచార సంపన్నుడై
అతిశయంబుగ మెలగు నతడే నీవు
ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు-
హతకాముకుడైన యతడే నీవు ॥నీవనగ॥





మోదమున సుఖదుఃఖములు నొక్క రీతిగా
నాదరింపుచునున్న యతడే నీవు
వేదోక్తమతివైన వేంకటాచలనాథ
ఆదియును నంత్యంబు నంతయును నీవే ॥నీవనగ॥

### భావామృతం :

ఓ సర్వాంతర్యామీ! పరమాత్మా!

'నీవు' అంటే ఈ గర్భగుడిలో నిలిచియున్న విగ్రహం కాదు. నీ తత్త్వం అర్థం చేసికొని నిజం తెలిసికొంటే, నీవు అని గ్రహించిన ప్రతిదీ నీవే. అంటే.. అన్నీ నీవే. నీవు కానిది ఏదీ లేదు.

సర్వభూతములలో (జీవరాశిలో) వున్న ఆత్మకు తనలోవున్న ఆత్మకు భేదంలేదని ఎల్లప్పుడు గ్రహించియున్న వాడే నీవు. పరస్త్రీలను తన మాతృమూర్తిగా భావించి, మనస్సులో కూడ వారిపై అదే గౌరవం చూపించగలిగిన పుణ్యాత్ముడే నీవు.

ఎల్లవేళలయందు సత్యవ్రతుడై (పరమాత్మ సత్య స్వరూపుడు కదా!) అదే ఆచారముగాను సంపదగాను, వుత్కృష్టతతో మెలగునటువంటి మానవుడే నీవు. ద్రవ్యము (ధనము) పుష్కలంగా వుండికూడ దానిని గడ్డిపరకవలె భావించి, హతకాముడు (నశించిన కోరికలు గల) వాడేనీవు. వాడే నిర్మోహి.

మనుష్యులకు సుఖాలవెంట దుఃఖాలు, దుఃఖాల వెంట సుఖాలు వస్తూనే వుంటాయి. సుఖాలకు పొంగిపోవటం, దుఃఖాలకు క్రుంగిపోవటం తగదు. వాటిని సమానముగా భావించాలి. అదికూడా సంతోషంతో సమానంగా స్వీకరించాలి. అట్లు చేయగలిగిన నరుడే నారాయణుడు. ఓ ప్రభూ! కనుక అతడే నీవు. వేదములచే నిర్వచించబడిన శ్రీవేంకటాచలాధిపా! సమస్తమునకు ఆరంభమూ నీవే, అంత్యమునూ నీవే. నీవుకానిదేదీ లేదు, లేదు, వుండబోదు.

4-25

## మున్నుడి

నేటి కడపకు అతి సమీపంగానున్న దేవుని గడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై అన్నమాచార్యులవారు చెప్పిన రమణీయమైన కీర్తన ఇది. తనన తాను ఆ స్వామి ప్రేయసిగా భావించి ఆచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో ప్రతిచరణము 'క' అనే అక్షరంతో మొదలై అర్థం తెలుసుకోవటానికి నిఘంటువులు తిరగవేయాల్సి వచ్చింది. నేను నీకు 'కలదాననే' ప్రభూ! అంటున్నారు. కలికి వేంకటాద్రి అంటే మనోజ్ఞమైన వేంకటాద్రి అని అర్థం.

**తే॥ కాదననకు నా మాటను కడపరాయ!**
**నీకు గాదె బోసెను కదా! నీవలపులు**
**కడప వేంకటరమణుని కరుణ కొఱకు**
**అన్నమార్యుడు నుతియించె నద్భుతముగ**

**రాగం : మోహన**

కాదనకు నామాట కడపరాయా - నీకు
గాదెబోసె వలపులు కడపరాయ ॥కాదనకు॥

కప్పురమియ్యగరాదా కడపరాయా-నీకు
గప్పితి నాపయ్యెదెల్ల గడపరాయ
కప్పుమివే కుచములు కడపరాయా- వో
కప్పుమొలులుమేని చాయ కడపరాయ ॥కాదనకు॥

కందువకు రారాదా కడపరాయా-ముందే
గందమిచ్చినవాడవు కడపరాయ
కందము నీమాటలిక గడపరాయా-వో
కందర్ప గురుడ మొక్కే గడపరాయ ॥కాదనకు॥





కలసితివిటునన్ను గడపరాయా-నా
కలనేడు నిజమాయె కడురాయ
కలదాననే నీకు గడపరాయా-వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయ ॥కాదనకు॥

**భావామృతం :**

ఓ కడపరాయా! (దేవుని గడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరా!) నామాట కాదనక మన్నించి నన్ను చరితార్థురాలను చేయుము ప్రభూ! నీవలపులు (వాత్సల్యములు అని భావన) గాదెబోసెను. (కుప్పగా కుమ్మరించితిని). ధన్యురాలను తండ్రీ!

ఓ కడపరాయా! నాకు కర్పూర తాంబూలము నీయరాదా ప్రభూ! నీపై నాపయ్యెదను కప్పియుంచితిని. నా స్తనముల నాక్రమించి కప్పివేయుము. కప్పు మొయిలు మేని చాయ (నల్లని నెమలి వంటి శరీర కాంతిగల) కడపరాయా! నేను నీదానను.

ఓ కడపరాయా! నీవు నాతో కందువకు (ఏకాంత సేవకు) రాకూడదా ప్రభూ! ఎందుకంటే నీవు ఇంతకుమునుపే నాకు గంధము (చందనము) నిచ్చావు. (నీకు గుర్తుందో లేదో?) స్వామీ! నీ మాటలు ఇక కందము వంటివి (మబ్బు వంటివి). మేఘాలకు నిలకడ వుంటుందా? నా పిచ్చిగాని నేను నీమాటలు నమ్మడమేమిటి? ఓ కడపరాయా! నీవు కందర్పగురుడవు (మన్మధునికే తండ్రిగారివి) మనోజ్ఞమూర్తివి. నీకు భక్తితో మొక్కెదను ప్రభూ!

ఓ కడపరాయా! నీవు నేడు నన్నీవిధముగా కలిసితివి. నా కలలన్నీ నేడు నిజమైనాయి. ఓ ప్రభూ! నేను నీకు కలదాననే. (నీ స్వంతమై సర్వహక్కులు నీకర్పించిన దానను). ఓ కడపరాయా! నీవు కలికి వేంకటాద్రి (మనోజ్ఞమైన వేంకట నగముపై వెలసిన పురుషోత్తముడవు. నన్ను అనుగ్రహించుము ప్రభూ!

**4-26**

## మున్నుడి

జీవిత చరమాంకంలో అన్నమాచార్యులవారు వైరాగ్యమనస్కులై యెన్నో అద్భుతమైన కీర్తనలు చెప్పారు. కన్నీరు మున్నీరైతేగాని మనిషికి 'నేను' అనే అహంకారంపోదు. సమానంగా కష్ట సుఖాలు, శీతోష్ణాలవలె కలుగుతూనే వుంటాయి. వాటిని అనుభవించక తప్పదు. ఎంతయెక్కువ చదివితే అంత యెక్కువ సందేహాలు కలుగుతాయి. నాకెందుకు స్వామీ! ఈ యమాటెక్కు? నీవే నిక్కమైన వేల్పువు. నన్ను ఈ ఊొంపిలోంచి బయట పడవేయి తండ్రీ! నీ ఇష్టం...

**ఆ.వె॥ సరికి సరియగునిక చలువకు వేడికి**
**అరయకలదు మాకు హరి శరణము**
**వేంకటేశ! చదువ మిగులు సందేహాలు**
**అన్నమయ్య తెలిపె సన్నుతించి.**

**రాగం : మోహన**

చలువకు వేడికి సరికి సరి
కలదిక హరి నీ కరుణే మాకు ॥చలువకు॥

కాయము గలిగిన గలుగు దోడనే
పాయువు మదములు పైపైనే
రోయదు తను గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుగుట యెపుడో ॥చలువకు॥

కడుపు నిండితే ఘనమై నిండును
బడి బంచేంద్రియ పదిలములు
విడువ వాసలును వెలయు బంధములు
కడగిన మోక్షము గైకొనుటెపుడో ॥చలువకు॥





పెక్కులు చదివిన పెనగు దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా-
నిక్కపు వేల్పవు నీ చిత్తమికను ॥చలువకు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ప్రారబ్ధం వలన కలిగే కష్టసుఖాలు అనివార్యాలు. శీతోష్ణములు ప్రకృతికెట్లు సహజమో అవీ వచ్చిపోతూనే వుంటాయి. మరి దారి ఒక్కటే వున్నది. అదే నీ శరణాగతి. శ్రీహరీ! మాకు అదొక్కటే దారి.

ఒక్కసారి, జీవుడు ఈ కాయము (దేహం) లో ప్రవేశించగానే, అరిషడ్వర్గాలు వాడిని పట్టుకొంటాయి. అవి పాయవు (వదలవు). మదముతో పేట్రేగిపోతుంటాడు. విసుగు లేకుండా వివిధ రుచులకోసం (అనుభవాల కొరకు) వెదకుతూనే వుంటాడు. ఓ శ్రీహరీ! ఇక నిన్ను తెలియుటకెప్పుడు తీరిక దొరుకుతుంది? మా జీవితం ఈలోగా ముగిసేపోతుంది.

ఒక్కసారి కడుపునిండి ఆకలి తీరగానే నా పంచేంద్రియములు (కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు మరియు చర్మము) ఘనముగా నిండిపోయిన స్థైర్యం చేజిక్కించుకొంటాయి. ఇక ఎన్నో ఆశలు నన్ను పట్టుకొని విడువవు. వాటివల్ల రకరకాల సంబంధాలలో చిక్కుకొనిపోతాను. ఇక నేను కడగిన మోక్షము (సాధించవలసిన ముక్తిని) పొందుట యెప్పుడు జరుగుతుంది ప్రభూ!

మనుష్యుడు యెంత ఎక్కువ చదువుకొంటే అంత ఎక్కువ తెక్కులు (టెక్కు, లేక గర్వము) కలుగుతాయి. వాటితో పాటే అనేక సందేహాలూ కలుగుతాయి. మరి ఈ నిరుపయోగమైన చదువులెందుకు ప్రభూ! ఓ ఏడుకొండల వేంకటరమణా! నీవే మా దైవానివి. నిన్నే నేను నిజంగా నమ్ముకొన్నాను. నీ చిత్తము వచ్చినట్లు చేయుము తండ్రీ!

## మున్నుడి 4-27

అన్నమాచార్యులవారి కీర్తనలు యతిప్రాసలతో అత్యద్భుతమైన కవిత్వ ఝురులని ఇదివరలో చాలాసార్లు చెప్పాను. ఈ శ్రీకృష్ణలీలలు యెంత చక్కటి సీసపద్యమయినదో గమనించండి. ఇది దీక్షితులు గొప్పతనంకాదు. సంపెంగపూలు పెట్టిన బుట్ట ఘుమఘుమలాడదా? మల్లెలు కట్టిన దారం సువాసన వెదజల్లదా? ఇదీ... అంతే...

**సీ॥ కొమ్మలు! జూడరే గోవిందు డీతడు**
**కుమ్మరించెను ముద్దు గొలుపుచుండె**
**దిట్ట బాలురతోటి తిరుగాడి వీధుల**
**గొట్టెనుట్లు నితడు కొల్లగొట్టె**
**వలసిన పాలను వారలు వట్టుచు**
**కులుకుచు నవ్వీని కొండెగాడు**
**బారలు చాపుచు బట్టుగ నింతుల**
**కూర్మితో గూడెను కోర్కెపెంచి**

**ఆ.వె॥ గోర జెనకె నతడు గోవిందు డాతడే**
**ఏడుకొండలకును ఏలికయట**
**అన్నమయ్య కవిత అత్యద్భుతంబుగా**
**సీసపద్యమాయె శ్రీనివాస!**

**రాగం : మోహన**

కొమ్మలు చూడరే గోవిందుడు
కుమ్మరించీముద్దు గోవిందుడు ॥కొమ్మలు॥

దిట్టబాలులతో దిరిగీ వీధుల
గొట్టీనుట్లు గోవిందుడు
పట్టిన కోలలు పైపై జాపుచు
కుట్టీదూంట్లుగా గోవిందుడు ॥కొమ్మలు॥





నిలువుగాశతో నిడిగూతలతో
కొలకొలమని గోవిందుడు
వలసిన పాలు వారలు వట్టుచు
కులికి నవ్వీ గోవిందుడు ॥కొమ్మలు॥

బారలు చాపుచు బట్టుగ నింతుల
గూరిమిగూడీ గోవిందుడు
చేరి జవ్వనుల శ్రీవేంకటాద్రిపై
గోర జెనకీ గోవిందుడు ॥కొమ్మలు॥

**భావామృతం :**

ఓ వనితల్లారా! ఇదిగో ఈ గోవిందుని గమనించండి. ఈ గోవిందుడు ఎంత ముద్దులు కుమ్మరిస్తున్నాడో చూడండి. ఇతని అల్లరి యెంతని చెప్పగలను.

ఇతను రేపల్లెలో వీధులవెంట దిట్టబాలురతో (ధైర్యంగల పిల్లమూకతో) దిరుగులాడుతూ, ఎత్తుగా పాలు, నెయ్యి, పెరుగు దాచి వుంచిన వుట్లను పడగొడుతున్నాడు. ఈ గోవిందుని అల్లరి చూడండి. చేతులలో పట్టుకొన్న కోలలు (కఱ్ఱలు) మీది మీదికి లేపి కుండలు దూంట్లుగా (చిల్లులు పడనట్లు) కొట్టినాడీ అల్లరి గోవిందుడు.

ఎంతో కాశతో (శ్రమ కల్పించుచు), నిడిగూతలతో (దీర్ఘమైన కేకలతో) కొలకొలమను (రణగొణధ్వని చేయు) ఈ గోవిందుని చూడండి. మనకు, మన దూడలకు, మన పిల్లలకు కావలసిన పాలను, వారలు వట్టుచు అనగా నిష్కారణంగా నిరుపయోగంగా ఆపోశన పట్టుచున్నాడు. (కాని ఆ గొల్లభామలకి ఏం తెలుసు? పరమాత్మే అవపోశన పడుతున్నాడని). అదేమిటని గద్దిస్తే ఈ గోవిందుడు ఎట్లా కులుకుతూ నవ్వుతున్నాడో చూడండి.

సరేలే అని గోపికలంతా కలసి చేతులు బారచాచి పట్టుకొంటె ఈ గోవిందుడు వారిని వలపులతో రమించినాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడే ఆ యువతులను చేరి గోవిందుడై గోర జెనకీను (గోళ్ళతో గీట్లు పెట్టుచూ వారిని పరవశింపజేయుచున్నాడు). ఆహా! ఏనాటి సుకృతమో కదా!

## 4-28

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని తత్త్వాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. అన్నమయ్య కాలంనాటి నుడికారం నేటి తెలుగులో లేదు. ఆయన మనోగతం పూర్తిగా అర్థం చేసికొనుట పండితులకే అసాధ్యమని నా భావన. ఇక నాబోటి సామాన్యులకు అన్నమయ్య భావవివరణ యెంత 'కత్తిమీద సామో' వూహించండి. పొడిబడకుంటేనే పూర్ణభావమలరు - అంటే ఇదమిద్ధంగా తెలియటంలేదు. భావామృత వివరణ చదివిన వారికి నేను చెప్పిన వివరణ సమంజసమేమో!! అనిపించకమానదు.

**కం॥ సర్వసులభుడగు నీహరి**
**సర్వేశ్వరుడైన యతని శరణన వలెరా**
**గర్వము బాసిన గనబడు**
**నుర్వీధవు నన్నమయ్య ఒప్పుగ బొగడెన్.**

**రాగం : అభోగి**

సర్వసులభుడితడు సర్వేశ్వరుడు
గర్వము బాసితేను కానవచ్చునితని ॥సర్వ॥

చింతలెల్లానుడిగితే శ్రీపతి యందే వుండు
మంతనాన నుండితేను మరినాతడే
పంతపు వుబ్బుమానితే పరమాత్ముడు దోడౌను
వింతలు దలచకుంటే విశ్వరూపమే ॥సర్వ॥

వెడకర్మాలు దోసితే విష్ణుని సాన్నిధ్యమబ్బు
కడునాసలొల్లకుంటే కలడాతడు
వొడలోముకొనకుంటే వుపేంద్రుడు రక్షించు
పొడిబడకుంటేనే పూర్ణభావమలరు ॥సర్వ॥





ఇతరమెరుగకుంటే నిందిరానాథుడు మెచ్చు
సతిబారిబడకుంటే జంటౌ నాతడు
హితవులు గోరకుంటే నెదుట శ్రీపతి నిల్చు
జితేంద్రియ వ్రతమందే శ్రీవేంకటేశుడు ॥సర్వ॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఈ శ్రీహరి సర్వజీవులకు సులభముగా లభించు సర్వేశ్వరుడు. గర్వమును విడనాడి ఎవరు ఈయనను శరణు వేడితే వారికి ప్రత్యక్షమవుతాడు. ఈమాట సత్యం.

అన్ని విచారములు వుడిగిన(నశించిన) శ్రీపతియైన ఆ స్వామిలోనే ఆ భక్తుడుంటాడు. తెలివితేటలతో రహస్యపుటాలోచనలతో ఆయన్ని సాధించుదామనుకొంటే ఆస్వామికూడ పంతము వహిస్తాడు. విశ్వరూపుడయిన ఆయన చేయు వింతలకు అంతేమున్నది.

వెడకర్మాలు (తుచ్ఛమైన చేతలు) దోసితే (తొలగిపోతే) వానికి విష్ణుమూర్తియొక్క సన్నిధి లభిస్తుంది. అత్యధికమైన ఆశలనాదరించకుంటే ఆ దేవదేవుడు మనలనాదరిస్తాడు. ఒడలోముకొనకుంటే (తనదేహాన్ని రక్షించుకోవాలనే తపన లేకుంటే) ఆ ఉపేంద్రుడే (శ్రీహరి) రక్షిస్తాడు. పొడిబడకుంటేనే పూర్ణభావము కలుగుతుంది. (స్వార్థం లేకపోతేనే ఆ స్వామి పూర్ణానుగ్రహం కలుగుతుంది.

ప్రాపంచిక విషయముల నెఱుగని వానిని ఇందిరానాథుడైన నారాయణుడు మెచ్చుకుంటాడు. జంటగా స్త్రీ కావాలని, ఆమె బారిన బడని నిస్సంగునికి తనే జంటగా వెంటనుంటాడా శ్రీహరి. అపేక్షలేనివాని యెదుటనే శ్రీపతి నిలిచియుంటాడు. ఏడుకొండల యేలికయైన ఆ శ్రీవేంకటేశ్వరుడు ఇంద్రియములను జయించు వ్రత దీక్షగల వారికే దక్కుతాడు కాని, "మొక్కుబడి"గా ముడుపులు కట్టుకొనేవారికి కాదు. ఇది నిజం. మొక్కులతో ఐహిక కోర్కెలు తీరవచ్చుగాక!

**4-29**

## మున్నుడి

ఆకాశము తాకునంత ఎత్తుకెదిగిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. అంజనీసుతుడైన ఈ హనుమంతుడు మనోజ్ఞమైన మతంగ పర్వతంపై వెలసి దానవదమనుడై, స్వామికార్యసాధకుడై, సూర్యభగవానుని శిష్యుడై, శ్రీవేంకటేశ్వరుని కిష్టుడై ఈ భీకర ప్రతాపశాలి సీతాశోక వినాశకుడని దేవతలచే పొగడబడినాడు. ఈ మంజులమైన ఆంజనేయుని పద్మనయనుడైన తిరుమలేసుని జపిస్తున్నట్లు శ్రీరామజపముతో తన పెదవులు కదలించుచున్నట్లున్నాడు ఈ మారుతి.

**ఉ॥ అంజన సూనుడీ హనుమ అద్భుతరూపుని నిల్చి చూడరో**
**రంజితమౌ మతంగ గిరి రక్కసి మూకల జంపు వీరుడై**
**మంజుల మూర్తిగా వెలసె మారుతి గొల్వుడు అన్నమయ్యనెన్**
**కంజదళాయతాక్షు పనిగా యిట మ్రొక్కెడి బంటుతాననెన్.**

**రాగం : మిశ్రతిలంగ్**

అంజనాతనయుడైన హనుమంతుడు
రంజితపు మతంగ పర్వత హనుమంతుడు ॥అంజనా॥

రాకాసు నెల్లా గొట్టి రావణుని భంగపెట్టి
ఆకాశము మోచెనదే హనుమంతుడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పె
భీకర ప్రతాపపు పెద్ద హనుమంతుడు ॥అంజనా॥

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాడు హనుమంతుడు
స్వామి కార్యమునకే సరిబేరువడ్డవాడు
ప్రేమముతో బూజగొనీ బెద్ద హనుమంతుడు ॥అంజనా॥





ఉదయాస్త శైలముల కొక్క జంగగా జాచి
అదె సూర్యుతో జదివె హనుమంతుడు
యెదుట శ్రీవేంకటేశుకిష్టుడై రామజపాన
బెదవులు గదలించీ బెద్ద హనుమంతుడు ॥అంజనా॥

**భావామృతం :**

అంజనీదేవి సుపుత్రుడైన ఈ హనుమంతుడు మనోజ్ఞమైన మతంగ పర్వతముపై నెలకొనియున్నాడు. ఈ స్వామిని సేవించండి.

ఈ ఆంజనేయుడు రాక్షసులందరిని చంపి రావణుని భంగపరచాడు. ఆకాశమంత యెత్తుకెదిగి నింగిని మోసినాడు. శ్రీరామముద్రికను సీతాదేవి కొసగి ఆమె క్షేమ సమాచారము శ్రీరామచంద్రునికి చెప్పిన అరి భీకర ప్రతాపశాలి ఈ పెద్ద హనుమంతుడు. ఈ మహానుభావుని అనుగ్రహమును పొందండి.

అర్ధరాత్రి పూట వాయువేగమున పయనించి ఆకాశమార్గమున సంజీవని పర్వతమును దెచ్చి రాముని మెప్పించి నేడు ఈ విధముగా ఇక్కడ ఆముకొని (వ్యాపించి) యున్నాడీ పవనపుత్రుడు. స్వామి కార్యము సాధించవలెనంటే ఇటువంటివాడు మరొకడు లేడని పేరుపొందినవాడీ అనిలాత్మజుడు. వాత్సల్యముతో ఇక్కడ తన భక్తుల పూజలను స్వీకరించుచున్నాడు.

సూర్యభగవానుని వద్ద వేదముల నభ్యసించుటకు ఆయన శిష్యుడై అద్వితీయమైన పెద్ద ఆకారము దాల్చి, తూర్పుకొండపై నొకకాలు పడమటి కొండపై నొకకాలు చాచియుంచి సూర్యగమనమునకు అనుగుణముగా తన శిరసును కదలించుచు ఒక దినములో వేదములను నేర్చిన బుద్ధిమంతుడు. మన యెదుట నున్న ఈయనే, తిరుమలరాయుడైన శ్రీవేంకటేశ్వరునికి ప్రీతిపాత్రుడై శ్రీరామనామజపము చేయుచున్నట్లు పెదవులు కదలించుచున్నాడు. ఈ పెద్ద హనుమంతుని చూడండి, సేవించండి ఆపై తరించండి.

4-30

## మున్నుడి

అద్భుతమైన శృంగార విరహగీతాన్ని ఆలపిస్తున్నారు. అన్నమయ్య. నాయిక (అలమేల్మంగమ్మ) తన బాధను వర్ణిస్తూ ఇంకా స్వామి రాడేలనే అని తన సఖియతో వాపోతున్నది. చల్లటిగాలి వేడిగావుందట. రాసిన కర్పూరము చందనము చల్లదనాన్నీయటంలేదు సరికదా! మండిస్తున్నాయట. అసలీ బ్రహ్మయ్యనాతో ఈ 'రాయడికి' ఎందుకు ముడిపెట్టాడో? కాయజుడు తానేల కసరీనే? అని విచారిస్తోంది. చేకొనిదె మన్నించె శేషాద్రి వల్లభుడు అన్నారు అన్నమయ్య. శేషాద్రి వల్లభుడు, శ్రీవేంకటేశ్వరుడైతే మకుటం వుండేదేమో? అనిపించింది.

**ఆ.వె॥ చల్లగాలి వేడి చల్లీనె, కర్పూర**
**మలయజము తనేల మండజేసె?**
**విరహబాధ వేగె వేంకటేశుని రాణి**
**అన్నమయ్య పాడె హరి మురియగ.**

**రాగం : యమన్ కళ్యాణ్**

చలిగాలి వేడేల చల్లీనె కప్పురపు
మలయజము తానేల మండీనే ॥చలిగాలి॥

పాపంపు మనసేల పారీనే నలుగడల
చూపేల నలువంక జూచీనే
తాపంపు మేనేల తడవీనె పూవింటి–
తూపేల చిత్రంబు దూరీనే ॥చలిగాలి॥

వాయెత్తి చిలుకేల వదరీనె పలుమారు
కోయిలలు దామేల గొణగినే
రాయడికి నలులే (వే) ల రాసీనె మాతోను
కాయజుడు తానేల కసరీనే ॥చలిగాలి॥





ఏకాంతముననేల యెదురైతినే తనకు
లోకాధిపతికెల లోనైతినే
చేకొనిదె మన్నించె శేషాద్రివల్లభుడు
పైకొనిదె మమ్మేల పాలించెనే ॥చలిగాలి॥

**భావామృతం :**

ఓ చెలియా! చలిగాలి వేడిగా మారిపోయి తాపము కలిగించుచున్నది. కప్పురపు మలయజము (కర్పూరం మిళితమైన చల్లని చందనము) నా శరీరాన్ని తనెందుకు మండిస్తోంది?

పాపపు ఆలోచనలతో నలిగిపోతున్న మనస్సు నలుగడల అన్నివైపులకు, పోరీనే (పోతున్నది). నా చూపులు నాలుగు దిక్కులను గాలిస్తున్నాయి. విరహ తాపముతో రగిలిపోతున్న నాశరీరం ఎందుకు నన్ను బాధిస్తున్నది? పూవింటి తూపు (మన్మధుని వింటినుంచి విడువబడిన బాణము) యేల చిత్తంబు దూరీనే (నా మనస్సును వేధిస్తున్నది?) చెలియా నాకేల ఈ వేదన?

అనేకమార్లు ఈ చిలుక, వాయెత్తి (గొంతెత్తి) వదరీనే (వాగుతూనే వున్నది). కోయిలలు అదే పనిగా 'కూ' యని గొణుగుతూనే వున్నాయి. మాతో ఈ రాయడికి (రాజుకి... లేక... స్వామికి) ఆ నలువ (బ్రహ్మదేవుడు) ఎందుకు రాసిపెట్టాడే? కాయజుడు తానేల కసరీనే (మన్మధుడు నాపై ఎందుకు ఆగ్రహిస్తున్నాడే?) ఆ సర్వేశ్వరుడు నన్ను నిలువనీయుటలేదు కదే!

సఖీ! తనకు (శ్రీవేంకటేశ్వరునకు) నేను ఒంటరిగా యెందుకు యెదురయ్యానే? సరే, ఎదురైనదానను ఎందుకు లొంగిపోయానే? పోనీ నేను లొంగిపోయానే? పోనీ నేను లొంగిపోయినా, ఆ శేషాద్రినాధుడు నన్ను ఆదరించి యెందుకు స్వీకరించాడే? స్వీకరించి యెందుకు పరిపాలిస్తున్నాడే? ఆ సర్వేశ్వరుడు నన్ను నిలువనీయుట లేదు కదే!

## మున్నుడి

ఆనాడు విశ్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మకు అర్జునుడు శరణన్నట్లే, సర్వేశ్వరుడు ఆర్తత్రాణ పరాయణుడునైన శ్రీమూర్తిని శరణు అంటున్నారు అన్నమాచార్యులవారు. వేయి శిరసులు, అనంతమైన బాహువులు గల వేదరక్షకుని ముగురయ్యల మూలపుటయ్యగా కీర్తిస్తున్నారు. మునులకు ఓంకార స్వరూపుడైన సురరక్షకుని విశ్వనేత్రుని, సచ్చిదానంద వినోదుని, పంచవింశతి ఆత్మతత్త్వాన్ని దాసులపాలిటి కరుణానిధి అంటున్నారు. ఈ విశ్వరూపుడే వరములనిచ్చే శ్రీవేంకటేశ్వరుడట...

**మ॥ శరణంటిన్ హరి! నీకు నేను యిటు వోసర్వేశ్వరా! మ్రొక్కెదన్**
**శరణంబొక్కటె దిక్కునాకు, కరియున్ సాధించె నీసత్ కృపన్**
**వరదా! వేంకటనాయకా! శరణునీపాదంబు అన్నయ్యనెన్**
**మురవైరిన్ కొనియాడు కీర్తనము శ్రీమూర్తిన్ భజించెన్ అహో!**

**రాగం : రామక్రియ**

శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ
శరణాగతే దిక్కు సామజవరదా ॥శరణు॥

వేయి శిరసులతోడి విశ్వరూపమా
బాయట నీ పరంజ్యోతి పరబ్రహ్మమా
మ్రోయుచున్న వేదముల మోహనాంగమా
చేయిచేత అనంతపు శ్రీమూరితి ॥శరణు॥

ముగురు వేలుపులకు మూలకందమా
వొగి మునుల ఋషుల వోంకారమా
పగటు దేవతలకు ప్రాణబంధుడా
జగమెల్లా కన్నులైన సాకారమా ॥శరణు॥





వెలయు సచ్చిదానంద వినోదమా
అలరు పంచవింశతి యాత్మతత్త్వమా
కలిగిన దాసులకు కరుణానిధీ
చెలగి వరములిచ్చే శ్రీవేంకటేశుడా ॥శరణు॥

**భావామృతం :**

ఓ సర్వేశ్వరా! నీకు శరణు. శరణు తండ్రీ! ఆనాడు అడవిలో గజేంద్రుని రక్షించిన వరదా! నీ శరణాగతే దిక్కునాకు. నిన్నే శరణు వేడుచున్నాను.

ప్రభూ! నీవు వేయి శిరసులున్న (లెక్కలేనన్ని తలలున్న) విశ్వరూపుడివి. పరంజ్యోతి స్వరూపుడవైన పరబ్రహ్మవు. వేదోద్ధరణ చేసి, మ్రోయుచున్న (రవళించు) ఆ వేదములకు తలమానికమైన వాడవై నిలిచితివి. అనంతమైన చేతులచేత శోభిల్లుచున్న శ్రీమూర్తివి. అట్టి విశ్వమూర్తినే శరణు వేడెదను.

ఓ పరాత్పరా! నీవు ముగ్గురు వేల్పులకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు) మూలకందానివి, (తల్లివేరు వంటివాడవు). మునులకు ఋషులకు శ్రేష్ఠమైన ఓంకారానివి. పగటు దేవతలకు ప్రకాశించుచున్న సురులకు అనేకమార్లు ప్రాణములు నిలిపిన ప్రాణబంధుడవు. నిన్ను సాకారునిగా (ఒక ఆకారము కలవానిగా) భావించినచో విశ్వమే నేత్రముగాగల అనంతరూపుడివి.

దేవా! నిరాకారునిగా నిన్ను భావించినచో నీవు సచ్చిదానంద వినోదుడివి. పంచవింశతి (ఇరువదియైదు) ఆత్మ తత్త్వములతో అలరారు విశ్వాత్ముడవు. అటువంటి నీ విశ్వరూపము చూడలేక (ఆనాటి అర్జునుని వలె) నీకు దాసోహం అని శరణు జొచ్చినవారిని కృపజూచు కరుణానిధివి. అంతేకాదు, చెలగి (విజృంభించి) వరములిచ్చి నీ భక్తును అనుగ్రహించుచున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు కూడా నీవే.

**4-32**

## మున్నుడి

చక్కటి సంస్కృత కీర్తన నాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'జడము' అని పిలువదగిన ఈ సాంసారిక జగత్తు అతి రహస్యమైనది. దీనిలో నేను కర్మప్రేరితుడనై చరించుచున్న ప్రాణిని. ఓ పద్మదళాయతాక్షా! శ్రీహరీ! జడరూపమైన ప్రపంచానికి ఆశ్రయ భూతుడవైన సర్వేశ్వరా! నీకు వందనములు అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఆచార్యులవారు వాడిన 'సింధు రహితాయ' అనే విశేషణాలు అర్థం కావాలంటే భావామృతం చదవాల్సిందే మరి...

**కం॥ జడమతిరహస్యమగునట**
**కడు ప్రేరితుడై చరించు కర్మలచేతన్**
**అడగితి జడ జగమందున**
**పడిపెట్టెను అన్నమయ్య వందనము హరీ!**

**రాగం : మోహన**

జడమతి రహం కర్మజంతు "రేకోఽహం"
జడధి నిలయాయ నమో సారసాక్షాయ ॥జడమతి॥

పరమ పురుషాయ నిజభక్తజన సులభాయ
దురితదూరాయ సింధు రహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో ॥జడమతి॥

నగసముద్ధరణాయ నందగోపసుతాయ
జగదంతరాత్మాయ సగుణాయ
మృగనరాంగాయ నిర్మిత భవాండాయ ప-
న్నగరాజు శయనాయ నమో నమో నమో ॥జడమతి॥





దేవదేవేశాయ దివ్యచరితాయ బహు-
భావనాతీతాయ పరమాయ
శ్రీవేంకటేశాయ జితదైత్య నికరాయ
భూవల్లభాయ నమో పూర్ణకామాయ ॥జడమతి॥

**భావామృతం :**

సారసాక్షుడవైన (పద్మదళనేత్రుడవైన) ఓ శ్రీహరీ! జడమతి రహం (జడము అని పిలువబడే ఈ సాంసారిక జగత్తు అతి గోప్యమైనది) ఇందులో నేను కర్మప్రేరితుడనై చరించు ప్రాణిని. జడరూపమైన ప్రపంచానికి ఆశ్రయభూతుడవైన దేవా! నీకు వందనములు.

ఓ దేవా! నీవు పరమపురుషుడవు. నిజమైన నీ భక్తజనులకు సులభముగా స్వాధీనమగు వాడవు. వారి పాపములనన్నింటిని నిర్మూలింపగలిగినవాడవు. సింధురహితుడవు అనగా సముద్రమును నిర్మూలించెదనని (శోషించెదనని) ప్రతిన పూనినవాడవు (శ్రీరామావతారంలో). నరకాసురుని అంతమొందించిన శ్రీకృష్ణుడవు. శ్రీమన్నారాయణుడవు. ప్రభూ! నీవు 'ముర' అను దానవుని హరించినవాడవు. అటువంటి నీకు అనేక వందనములు.

ఓ దేవదేవా! నీవు నగ సముద్ధరణ చేసిన వాడవు (కూర్మమై మంథరగిరి నెత్తిన వాడవు). నందగోపుని బిడ్డవు. ఈ జగత్తునకు అంతరాత్మ రూపుడవు. సుగుణములన్నీ రూపుదాల్చినవాడవు. మృగనరాంగములు గలవాడవు. (నరసింహుడవు). భవము (ప్రపంచము) అండరూపంలో పొదిగినవాడవు. పన్నరాజైన ఆదిశేషునిపై పవ్వళించియుండువాడవు. అట్టి నీకు అనేక వందనములు.

ప్రభూ! దేవదేవులని పిలువదగ్గవారికి నీవు ఈశ్వరుడవు. దివ్యమైన చరిత్రగలవాడవు. అనేకమైన భావనలచేత కూడ వివరింప శక్యము కాని వాడవు. సర్వశ్రేష్ఠుడవు. స్వామీ! నీవు శ్రీవేంకటేశ్వరుడవు. దైత్యగణములను జయించినవాడవు. భూదేవీవల్లభుడవు. పూర్ణకాముడవు, (కోరికలన్నీ సిద్ధించినవాడవు). అట్టి పరమాత్మవైన నీకు అనేక నమస్కారములు.

**4-33**

## మున్నుడి

శ్రీరామచంద్రమూర్తి నిండు సభ దీర్చియున్నాడు. ఆ కొలువులో సముఖంబుననే (యెదురుగానే) అదే అందరినీ చిత్తగించుచున్న (యోచించుచున్న) ఆ సార్వభౌముని సభ ఎట్లా వున్నదో కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. విని (చదివి) తరించండి. అన్నమయ్య మాత్రమే భావించగల నారద, రంభాదులు కొలువులో వుండటం, కుశలవులు 'వినుదు వినుదు రామాయణ గాథా' అని పాడటం యెంత అబ్బురమో కదా! కౌసల్యా గర్భరత్నాకర అని ఆ వేంకటరామయ్యగారిని కీర్తిస్తున్నారు...

**ఆ.వె॥ రఘుపతి! అవధారు రక్షింపుమందరిన్**
**నిండు కొలువునందు నీదు జనుల**
**చిత్తగించు మొఱలు చెప్పెరా అన్నయ్య**
**కనుల రామసభను కట్టె సుండి!!**

**రాగం : లలిత**

అవధారు రఘుపతి యందరిని జిత్తగించు
యివల నిండె గొలు విదె నదె సముఖా ॥అవధారు॥

రామరాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమనారదుడు వాడీ బెక్కురంభాదులాడేరు
మోమెత్తి కపులెల్లా మొక్కెరదివో ॥అవధారు॥

ఘనవంశ కులజాత ఇక్ష్వాకు తిలకా
ఘనదశరథ సుత కౌశిక ప్రియ
మునులు దీవించేరు ముందుటా భరతుడదె
వెనక లక్ష్మణుడు సేవించీ వింజామర ॥అవధారు॥





కందువ గౌసల్యా గర్భ రత్నాకర
చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాసా
సందడి గుశలవులు చదివేరు వొకవంక
చెంది నీరాజసము చెప్పరాదు రామా ॥అవధారు॥

**భావామృతం :**

రఘుకులపతివైన ఓ శ్రీరామచంద్రా! అందరిని చిత్తగించి (మొఱలను విని, లేక, ఆలోచించి) అవధారు (సావధానుడవగుము). ఇవల (ఈ ప్రక్క) ఇదే కొలువు నిండె (నీ సభ అంతా నిండిపోయింది). అదే సముఖ (అదిగో యెదురుగా) దర్శనమిచ్చుచున్నది ప్రభూ!

ఓ రాఘవా! రామభద్రా! రామచంద్రా! రామా! శుభప్రదమైన అయోధ్యాధినాథా! ప్రేమాస్పదయైన జానకీ వల్లభా! అదిగో వాడే నారదమహాముని. వారే రంభాది దేవనర్తకీ మణులు యెందరో నర్తించుచున్నారు. మోమెత్తి కపులెల్లా మొక్కెరదివో. (అంటే... నరుల మధ్య మేము వానరులుగా వున్నామే, అని మొగమాట పడుతూ వానర శ్రేష్ఠులంతా వినయంగా మొక్కుచున్నారు. అదిగో అని అర్థం)

ప్రభూ! నీవు సూర్యవంశ సంజాతుడవు. ఇక్ష్వాకుల తిలకుడవు. ఘనుడైన దశరథనందనుడవు. విశ్వామిత్రుని ప్రియశిష్యుడవు. ఎంతమంది మునులు నిన్ను దీవిస్తున్నారో చూడవయ్యా! అదిగో ఆ ముందర నిలుచున్నవాడే నీకు ప్రియాతి ప్రియమైన తమ్ముడు భరతుడు. నీ వెనుక వింజామరతో వీచుచూ సేవించుచున్నవాడే లక్ష్మణుడు.

శ్రీరామా! నీవు ప్రసిద్ధుడవైన కౌసల్యా గర్భరత్నాకరుడవు. (రత్నాకరుడంటే... అనేక రత్నాలకు నిలయమైన సాగరుడవు). శ్రీవేంకటాద్రికి చెందిన శ్రీనివాసుడు కూడా నీవే ప్రభూ! అదిగో సందడి చేయుచూ శ్రీరామాయణ గాథను గానం చేయుచున్న నీ కవల పుత్రులు కుశలవులు యొకవంక యెంత అందంగా వున్నారో చూడు. ఇక నీ ఠీవి, నీ రాజసము, నీవైభవము వర్ణించుట నావల్ల అయ్యే పనియేనా? నిజానికి ఎవరివల్లాకాదు. ఆ రఘుపతిని శరణని భావించండి... మనో నేత్రంతో తిలకించండి.

**4-34**

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడు అనేక సందర్భాలలో అనేక రథములనెక్కి తన ఆశ్రితుల మనోరథం చెల్లించాడు. అదిగో ఆ కనబడుతున్న దేవ దేవుని రథం ఆ సందర్భాలను అన్నమాచార్యులవారికి గుర్తుచేసి ఈ అద్భుత కీర్తనకు మూలమయిందేమో అనిపిస్తోంది. మన పురాణాలమీద అన్నమయ్యకు ఎంత పట్టువున్నదో ఈ కీర్తన తెలుపుతున్నది. దురదృష్టమేమంటే... మనకి ఇతిహాసాలపై పట్టుపోయింది, తెలుగు వ్యాకరణంపై పట్టుపోయింది, తెలుగు భాషపై పట్టుపోయింది, భక్తిపై పట్టుపోయింది.... ఇక దిక్కెవరు? ఆ ఏడుకొండలవాడే...

**చం॥ కనుడదె దేవదేవుడటు గారవమొప్పగ నెక్కు తేరు మీ**
**మనముల కోర్కె తీరు కద! మా సరివారలు పుల్కరించగా**
**ఘనపు రథోత్సవం బటుల కన్నుల గట్టెను అన్నమార్యుడున్**
**వినుడిది క్లిష్ట కీర్తనము వేంకటనాథుడు మెచ్చుదీనినిన్**

**రాగం : అఠాణా**

దేవదేవుడెక్కెనదె దివ్యరథము
మావంటి వారికెల్ల మనోరథము ॥దేవ॥

జగతి బాలులకై జలధులు వేరజేసి
పగటున దోలెనదె పైడి రథము
మిగులగ గోపగించి మెరయు రావణుమీద
తెగియెక్కితోలేనదె దేవేంద్ర రథము ॥దేవ॥

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకు
బక్కన మరలిచె బుష్పక రథము
నిక్కి నరకాసురుపై నింగి మోవనెక్కితోరె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము ॥దేవ॥





బలిమి రుక్మిణి దెచ్చి పరుల గెలిచి యెక్కె
అలయేగు బెండ్లి కల్యాణరథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలు మంగగూడి
కల(లి)కాలమును నేగె ఘనమైన రథము ॥దేవ॥

**భావామృతం :**

అదిగో... దేవదేవుడెక్కిన ఆ దివ్యరథమును చూడండి. మావంటి వారికి (శరణాగతినొందిన భక్తులకు) యెల్లరకు అది మనోరథము (మనస్సులలోని కోర్కెలను తీర్చునదై యున్నది).

అనాది కాలంలో శ్రీమన్నారాయణుడు ఈ ప్రపంచాన్ని వేరుజేసి మహా సముద్రముల నెల్లలుగా వేర్పరచి, ఈ జగతిని పాలించమని అనేక పాలులకు (పరిపాలకులకు) ఒప్పజెప్పాడు. అప్పుడాయన ఒక దివ్య సువర్ణరథమెక్కి పగటున (దేదీప్యమానముగా) తోలినాడు. అదిగో ఆ సువర్ణ రథాన్ని (మీ మనోనేత్రంతో) దర్శించండి. అదిగో రామరావణ యుద్ధం జరుగుతోంది. మొదటిరోజు ఓడిపోయి నిర్వీర్యుడై ప్రాణదానం పొందిన రావణుడు మరునాడు దివ్యమైన రథమునెక్కి విపరీతమైన క్రోధంతో జ్వలిస్తూ వచ్చాడు. దేవేంద్రుడు మాతల్లి తోలుతున్న దివ్య రథాన్ని శ్రీరామచంద్రుని కోసం పంపించాడు. ఆయన విన్నపం మన్నించి ఆ దేవదేవుడు ఆ రథమెక్కి రావణ సంహారం చేశాడు. అదే... ఆ రథం.

దిక్కులు సాధించి (దుష్ట శిక్షణ చేసి త్రిలోక విజేతయై) శ్రీరాముడు సీతాదేవితో తిరిగి అతి త్వరగా అయోధ్య చేరుటకు పుష్పక విమానం యెక్కి కపిసేనతో, విభీషణాదులతో బయలుదేరాడు. అది రథమువలె అలంకరింపబడిన పుష్పక రథము. నిక్కిన (గర్వించిన) నరకాసురుని చంపుటకు సత్యభామతో, వైకుంఠమునుండి వచ్చిన విష్ణు రథాన్ని యెక్కాడు. శ్రీకృష్ణపరమాత్మ. దారుకుడుతోలే ఆ రథమును సత్యభామ తోలి శ్రీకృష్ణుని విజయానికి తోడ్పడింది. అదే.. వెక్కసపు రెక్కలతో (దుస్సాహమైన రెక్కలతో ఎగుర గలిగిన) ఆ రథం.

ఇక ఆ కళ్యాణ రథాన్ని చూడండి. బలవంతంగా రుక్మిణిని తెచ్చి శత్రువులను చిత్తుగా ఓడించి అతివేగంగా ద్వారకవైపు దూసుకుపోతున్న శ్రీకృష్ణమూర్తి పెండ్లి రథం అదే. దానిని ఈసారి రుక్మిణీదేవితోలింది. మరి ఈనాడు తిరుమలలో, కల(లి) కాలంలో అంటే కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడు తనదేవేరి అలమేలు మంగతో ఎలమి (సంతోషముతో) యేగుచున్న ఘనమైన రథమును తిలకించండి. తరించండి.

4-35

## మున్నుడి

వేదాంతమును అతి తేలిక భాషలో వివరిస్తున్నారు. అన్నమాచార్యులవారు. ఏడు జానెలు మాత్రం పొడవుండే ఈ మానవదేహం ఎంత విచిత్రమైనది! దీనికి తోడైన నా మనస్సు తృప్తితో నిండనే నిండదు. నాపాపము పండనే పండదు. నేనేం చేయగలను? నా వయస్సుని పట్టి యుంచలేను. నా కోపాగ్నిని ఆర్పలేకున్నాను. నా కాలాన్ని తెలిసికోలేను. మరి నాకేది దారి? నీ గాథలు వింటూ నిన్నే ధ్యానిస్తూ నా శేష జీవితాన్ని గడిపేస్తాను అంటున్నారు అన్నమయ్య.

**ఉ॥ జానెలు యేడు దేహమిది జాడనెరుంగను దీని నైజమున్**
**మ్రానులవంటి పాపములు పండవు, కోపము నార్పజాలరా**
**కానగ నాదు కాలమును కాదుర సాధ్యము అన్నమయ్యనెన్**
**సోనల బుట్టు సుద్దులివి సుందర శ్రీగిరి వేంకటేశ్వరా!**

**రాగం : పాడి**

ఏదే జేనలు యీ దేహంబును
యేడా నిక మరి యెరగము నేము ॥ఏడే॥

నిండును జలధులు నిముషమాత్రమున
నిండియు నిండదు నెఱి మనసు
పండును భువిగల పంటలన్నియును
పండదు నాలో బాపపు మనసు ॥ఏడే॥

పట్టవచ్చు నల పారేటి పామును
పట్టరాదు నాపాయము
అట్టే ఆరును అనలము నీటను
యెట్టైన నారదు యీకోపంబు ॥ఏడే॥





కానవచ్చు నదె ఘన పాతాళము
కానరాదు నాకాలము
శ్రీనగ విహార శ్రీవేంకటేశ్వర
సోనల బుట్టిన సుద్దులు నివిగో ॥ఏడే॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఈ మానవ దేహమున్నదే... దాని పొడవు ఏడు జానెలు మాత్రమే. నేము (మేము) మరి యేడా (యెక్కడా) ఇక యెరుగము (దీని తత్త్వమును తెలియుము).

ఈ దేహానికి ఒక మనస్సు జతగా వుంటుంది. మహాసాగరములైనా నిముషంలో నిండుతాయేమో కాని ఈ మనస్సు మాత్రం నిండికూడా నిండదు. (తృప్తి చెందదు). ఈ భూమిపైనున్న పంటలన్నీ పండుతాయేమో కాని నా మనసులోని పాపము మాత్రం పండనే పండదు.

చకచక పాకుతూ పారిపోతున్న పామును అవలీలగా పట్టవచ్చును. కాని నా పాయము (వయస్సు) ను మాత్రం పట్టలేము. ప్రతిదినము నా వయస్సు ఒకరోజు పెరుగుతోంది. (నా ఆయువు ఒకరోజు తరుగుతోంది). అనలము (అగ్ని) నీటితో ఇట్టే ఆరిపోతుంది. కాని నా కోపాగ్ని మాత్రం ఏ విధముగానూ ఆరనే ఆరుటలేదు.

చొరరాని ఘనమైన పాతాళ లోకమును జొచ్చి కానవచ్చునేమోకాని రాబోయే నాకాలమును మాత్రం కానలేకున్నాను. శ్రీనగము అని పిలువబడే తిరుమల కొండపై విహరించు శ్రీవేంకటేశ్వరా! సోనలబుట్టిన సుద్దులు నివిగో. (వర్షములవలె పుట్టిన నీ పురాణగాథలు ఇవిగో) ఎన్ని విన్నాను, ఎన్ని కన్నాను. ప్రభూ! నీ మహిమలు అనంతం.

**4-36**

## మున్నుడి

అద్భుతమైన ఈ కీర్తనలో శ్రీవేంకటేశ్వరుని సన్నుతిస్తున్నారు అన్నమాచార్యులవారు. సన్నుతి రూపంలో తిరుమలేశుని సేవించడం తరించటానికి అత్యంత సులభోపాయము. మనం కీర్తి ప్రతిష్ఠలున్నవారిని మా బంధువులని చెప్పుకొని సంతోషిస్తుంటాం, తృప్తిజెందుతుంటాం. వారు మనకు ఆపదలో సహాయం చేస్తారనే నిబ్బరంతో వుంటాం. సుఖంగా వుంటాము. కాని అది నిజమైన సుఖం కానేకాదు. మనం ఆ శ్రీపతివారము అనుకోవటమే నిజమైన సుఖం అంటున్నారు అన్నమయ్య.

**ఆ.వె॥ ఇతర దేవతలకు ఇదిగలదా హరీ!**
**మారు ఏది నీ ప్రభావమునకు**
**నిజ సుఖంబొకటియె నీవారమనుటయే**
**అన్నమయ్య పలుకునదియె నిజము.**

**రాగం : ఆరభి**

ఇతర దేవతల కిది గలదా
ప్రతివేరీ నీ ప్రభావమునకు ॥ఇతర॥

రతిరాజజనక రవిచంద్రనయన
అతిశయ శ్రీవత్సాంకుడవు
పతగేంద్ర గమన పద్మాసతీపతి
మతి నిను దలచిన మనోహరము ॥ఇతర॥

ఘన కిరీట ధర కనకాంబర పా-
వన క్షీరాంబుధి వాసుడవు
వనజ చక్రధర వసుధావల్లభ
నిను బేరుకొనిన నిర్మలము ॥ఇతర॥





దేవపితామహ త్రివిక్రమ హరి
జీవాంతరాత్మక చిన్మయుడా
శ్రీవేంకటేశ్వర శ్రీకర గుణనిధి
నీవార మనుటే నిజసుఖము ॥ఇతర॥

**భావామృతం :**

ఓ దేవదేవా! అన్యదేవతలకు ఇది (నీయొక్క ఘనత) కలదా? నీ ప్రభావమునకు ప్రతివేరీ (సమానమైన ఇంకొకరు, యెక్కడ వున్నారు?) లేనేలేరు ప్రభూ!

ఓ రతిరాజ జనకా! (మన్మధుని తండ్రీ!) సూర్యచంద్రులు కన్నులుగాగల దేవా! శ్రీవత్సము అను పుట్టుమచ్చతో శోభిల్లువాడా! పతగేంద్ర గమన (పక్షిరాజయిన గరుత్మంతునిపై) పోవువాడా! పద్మావతీ దేవి మనోవల్లభా! నిన్న ధ్యానించుటకన్న మనోహరమైన దింకొకటి లేనేలేదు.

ఘనమైన కాంతులు వెదజల్లు కిరీటమును ధరించు శ్రీనివాసా! బంగారు పీతాంబరమును కట్టి శోభిల్లు దేవా! పుణ్య నిలయమైన క్షీరసాగర వాసా! ఒకచేత పద్మమును వేరొకచేత సుదర్శన చక్రమును ధరించు శ్రీమన్నారాయణా భూదేవి వరించిన విష్ణుదేవా! నిన్ను పేరుకొనిన (కీర్తించిన) మా మనస్సే కాక మేము కూడ నిర్మలమై నీదయ పొందుటకు అర్హత సంపాదిస్తాం.

ప్రభూ! నీవు దేవపితామహుడవు (దేవతలను సృజించిన బ్రహ్మగారు వారి తండ్రి అయితే బ్రహ్మగారి తండ్రి వారికి పితామహుడే కదా!) త్రివిక్రముడని కీర్తింపబడిన వామనమూర్తివి, శ్రీహరివి, సర్వజీవులకు అంతరాత్ముడవై వారి ప్రాణప్రతిష్ఠ చేయువాడవు, చిదానంద స్వరూపుడవు. శ్రీవేంకటేశ్వరుడవు, మంగళ ప్రదమైన సద్గుణములు నిధివలె కలవాడవు. మాకు నిజమైన సుఖం ఏమిటంటే నీవారము అనే విశ్వాసంతో, నీవిచ్చిన ఈ జీవితాన్ని నీవు సంతోషించునట్లు నీవు పిలిచేదాక గడుపుటయే. మరొకటి లేదు.

## 4-37

## మున్నుడి

సంస్కృతాంధ్రములు రెండూ సరిగా రాని నాబోటి సామాన్యునికే అన్నమాచార్యులవారి కీర్తనలు ఇంత ఆనందం కలిగిస్తుంటే...పండితులు, భాషా కోవిదులు, పురాణ వాఙ్మయము తెలిసినవారు ఇంకెంత రసాస్వాదన చేసి వుంటారో కదా! అనిపించి.. ఆ అదృష్టం నాకు లేనందుకు విచారము... పోనీలే గుడ్డిలో మెల్ల అనే వూరట కలుగుతాయి. నా వివరణ సరిగా అన్నమయ్య మనోగతం కాకపోవచ్చును. శ్రీవేంకటేశ్వరా! భావయామి... కేవలం నేను భావిస్తున్నాను. అసలు నిజం నీకే తెలియాలి. అన్నమయ్యకీ వూహనిచ్చింది నీవేగా...

**ఆ.వె॥నాటి బాలుడితడు నందగోప సుతుండు**
**నందవ్రజములోన నయము మీర**
**పెరిగినాడు నేడు వేంకటరమణుడు**
**అన్నమయ్య భాష అంత సులువె?**

**రాగం : బౌళి**

నందగోప నందనుండే నాటి బాలుడు
ఇందు నేడే రేపల్లె నేచి పెరిగెను ॥నంద॥

పువ్వువంటి లేత మఱ్ఱియాకు పొత్తి బవళించ నేర్చె
యెవ్వడో కాని తొల్లియీ బాలుడు
మువ్వంక వేదములను ముద్దుమాటలాడ నేర్చె
యెవ్వరూ గొంత నేర్ప నేటికీ వీనికి ॥నంద॥

తప్పటడుగుడు లిడగనేర్చె ధరణియందు నాకసమున-
నెప్పుగా రసాతలమును నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీ జెంద్రునందు పగలు
గొప్ప సూర్యునందు నింక గొత్తనేర్పనేటికి ॥నంద॥





మంచి వెన్నబువ్వలిపుడు మలసియారగించ నేర్చె
నంచితముగ శ్రీవేంకటాద్రి మీదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కౌగిలించనేర్చె
దించరాని వురముమీద దివ్యకాంతను ॥నంద॥

**భావామృతం :**

ఓ భక్తులారా! ఈ బాలుడెవరనుకున్నారు? నేడు ఇతను నందగోప నందనుడే. ఇందు (ఇక్కడ) రేపల్లెలో (నందవ్రజమున) యేచి పెరిగెను (చక్కగా పెరుగుచున్నాడు) కాని వీడు "నాటి బాలుడు" పురాణ పురుషుడు.

తొల్లియెప్పుడో (సృష్టి ఆరంభంలో) వీడు పువ్వువంటి లేతమఱ్ఱి ఆకుపై పొత్తిళ్ళలో పడుకొన్నట్లు పవ్వళించి యున్నాడు. వీడు ముద్దు ముద్దుమాటలు పలుకగానే అవే మువ్వంక వేదములైనవి, (ఋక్, యజుర్, సామ వేదములు). అటువంటి వీనికి ఇంకా ఎవరో కొంత నేర్పవలెనా? యేటికి? (ఎందుకు?) వీడే వేదమూర్తి, వేద నిలయుడు.

ఇక కృతయుగం వచ్చేసింది. దుష్ట దానవులు తొల్లి త్రిలోకముల నాక్రమించి, దేవతలను స్వర్గం నుంచి వెళ్ళగొట్టారు. వీడు తప్పటగుడులు వేయటం నేర్చుకొని (వామనమూర్తియై) ఒంటి (ఒంటరిగా) భూమండలాన్ని ఒక అడుగుతోను, ఆకాశము (స్వర్గము మరియు ఊర్ధ్వలోకములు) ఇంకొక అడుగుతోను. రసాతలమును మూడవ అడుగుతోను ఆక్రమించి బలిచక్రవర్తి నుంచి దానం పుచ్చుకొని అతన్ని రసాతలంలో వుండమని నియమించాడు. ఆ దేవదేవుడు రెప్పలెత్తి చూడగా ఒక కన్ను పగలు కలిగించే గొప్ప సూర్యునిగాను, ఇంకొక కన్ను రేచీ (రాత్రి) వెలిగించు చంద్రునిగాను తోచినవి. అటువంటి వీనికి కొత్తగా తెలియవలసిన వేముంటాయి?

ఇదిగో, ఇప్పుడు వేంకటాద్రి మీద ఆ బాలుడే అంచితముగా (పూజనీయుడై) మంచి వెన్నబువ్వ, మలసి యారగించె (పూనుకొని నైవేద్యము స్వీకరించుచున్నాడు). ఆ తరువాత ఈ శృంగారరాయుడు యెంచి తన దేవేరులనెంచుకొని అప్పలప్పనుచు (లొట్టలు వేయుచు) వారిని యెనసి (పొంది) కౌగిలించుట నేర్చినాడు. తన వురము మీద (హృదయముపై) దించరాని దివ్యకాంతను (శ్రీదేవిని) నిలుపుకొనినాడు. వీడే శ్రీవేంకటేశ్వరుడు.

**4-38**

## మున్నుడి

చక్కటి హితబోధ చేస్తున్నారు అన్నమయ్య. 'వెగ్గలము' అంటే అధికము అని అర్థం. ఇంత వెగ్గలము చేయకు అంటే ఇంత ఎక్కువ తపన వద్దు అని. మనం అనుకొన్నది నెరవేరాలనే 'యావ'తో మానవుడు తగ్గివుండి, దీనుడై పరులముందు చేయి జాచి వేడుకొంటాడు. అటువంటి వాడు జీవితాంతం అడుక్కుతింటూనే వుంటాడు. అట్లా బ్రతకటంలో ఏం ఆనందముంది? అది వృధా. మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తే ఇదంతా ఆ తిరుపతయ్య మాయకాక మరేమిటి? మురారిని శరణని మోక్షం పొందండయ్యా! అంటున్నారు.

**ఉ॥ ఇంతటి వెగ్గలంబు మనకెందుకు? వ్యర్థము వ్యర్థమౌనురా**
**అంతములేని దైన్యమున అన్యుల ముంగిట చేయి జాచగా**
**సంతసమౌనె దేనికది? చక్కగ మోక్షము నిచ్చు విష్ణువే**
**వంతను అన్నమయ్య ఇక వద్దని వేంకటనాథు మ్రొక్కనెన్.**

**రాగం : నాగవరాళి**

వెగ్గలమింతా వృథా వృథా
తగ్గి పరులతో దైన్యము లేలా ॥వెగ్గల॥

పెంచగ బెంచగ పెరగీ నాసలు
తుంచగ దుంచగ దొలగు నవి
కంచము కూడును కట్టిన కోకయు
వంచన మేనికి వలసినదింతే ॥వెగ్గల॥

తడవగ దడవగ దగిలీ బంధము
విడువగ విడువగ వీడునవి(ది)
గుడిసెలోన నొక కుక్కి మంచమున
వొడలు సగమునను వుండెడిదింతే ॥వెగ్గల॥





మరవగ మరవగ మాయలే యింతా
మురహరుదలచితే మోక్షము
నిరతి శ్రీవేంకటనిలయుడే కాయపు
గరిమెల నిలచిన కాణాచింతే ॥వెగ్గల॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఇంతటి దైన్యంతో పరులను యాచిస్తూ, తగ్గి వారిముందు చేతులు, జాచుచూ బ్రతుకుట దేనికి? ఇంతటి 'వెగ్గలము' (అధికమైన యావ) వ్యర్థము వ్యర్థము. అవునా?

ఈ ఆశలు వున్నాయి చూశారా? ఇవి ఎన్నటికీ తగ్గవు. పెంచగా పెంచగా పెరుగుతూనే వుంటాయి. అయితే కిటుకేమిటంటే అవి తుంచగా తుంచగా లేకుండా తొలగిపోతాయి. కంచం నిండా కూడు, కట్టుకోడానికో గుడ్డ - కావలసినదింతే కదా? వంచనమేనికి (మోసము దేనికి), నీ వెంట తీసుకుపోయేదేముంది?

తడవగ, తడవగ (విచారించినకొద్దీ) నావాళ్ళనే బంధాలు తగులుకొనేవే కానీ తొలిగిపోయేవి కావు. అయితే విరక్తితో విడువగా, విడువగా విడిపోతాయి. నీవు ముసలివాడివై చావుకి ఎదురుచూస్తూ ఒక కుక్కి మంచంలో, వొడలు (శరీరం) సగమైపోయి బ్రతకాల్సి వస్తుంది. ఉండేదింతే (జరిగేది ఇంతే). మరి దేనికోసం ఈ తాపత్రయం?

మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తే ఇదంతా మాయలే అని తెలుస్తుంది. దీనినుంచి ఇక ముక్తి ఎప్పుడు? ఆ మురహరిని శరణంటే మోక్షము దక్కుతుంది. ఎందుకంటే... ఆయన ఎక్కడనో వేరొకచోట లేడు. శ్రీవేంకటేశ్వరుడై మనకాయపు గరిమల (శరీరధారియైన ఘనుడై, ఆత్మరూపుడై) నిలచిన కాణాచియై (చిరకాల వాస్తవ్యుడై), నిరతితో (మిక్కిలి ఆసక్తితో) వున్నాడు.

## మున్నుడి

అత్యద్భుతమైన కీర్తనరూపంలో అలమేల్మంగమ్మ తన చెలికత్తెతో 'ఆయన ఇంకా రాడేమిటో' అని వాపోతున్నది. వాడెటువంటి వాడో తన చెలియకు వివరిస్తోంది. అన్నమాచార్యులవారి ఈ కీర్తన వింటే ఆయనకు పురాణ వాఙ్మయం మీద యెంత "పట్టు" వున్నదో అర్థమవుతుంది. నా భావామృత వివరణలో సాధ్యమైనంత వివరణ, ఇచ్చాను కాని నేటి యువతరానికి ఈ వివరణ 'మార్జాలం' అంటే 'బిడాలము' అని వివరించినట్లే అవుతుందేమో... అని నా అనుమానం. నా ప్రయత్నం నేను చేశాను. ఆపై... ఆపైవాడిదయ.. అంతే.

**తే॥ ఏలరాడమ్మ ఇంతిరో! యేలనన్ను**
**వాడు నన్నేలువాడమ్మ! వల్లభుండు**
**అన్నమార్యుని కీర్తన అద్భుతంబు**
**పుణ్యగాధలు జ్ఞప్తిలో పొరలజేయు.**

**రాగం : భైరవి**

ఏలరాడమ్మ ఇంతిరో వా-
దేల రాడమ్మ నన్నేలినవాడు ॥ఏల॥

పచ్చని పులుగుల బండి మీదనుండు-
పచ్చవింటి పిన్నబాలుని తండ్రి
పచ్చని చాయల బాయని బంగారు-
పచ్చడము గట్టి(న) బాగైన వాడు ॥ఏల॥

తెల్లని పులుగుపై దిరుగ మరిగినట్టి
తెల్లని సతిపాలిదేవర తండ్రి
తెల్లని పరపుపై దేలి పొరలు వెట్టు-
తెల్లని కన్నుల తెలివైన వాడు ॥ఏల॥





కొండవింటి వాని గుత్త గొనినయట్టి-
కొండుక పాయపు గూతురు తండ్రి
కొండరాయుడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైన వాడు ॥ఏల॥

**భావామృతం :**

ఓ భామినీ! వాడు (నా హృదయేశ్వరుడైన శ్రీనివాసుడు) ఏల రాడమ్మా? (ఎందుకని వచ్చుటలేదు?) నన్నేలినవాడు (నాభర్త) ఏలరాడమ్మా? (నన్ను కైవసం చేసికొని పరిపాలించుటకు రాడేమి?)

వాడెవరనుకొన్నావు? "పచ్చని పులుగుల బండిమీద నుండు, పచ్చవింటి పిన్న బాలుని తండ్రి" - ఆకుపచ్చని చిలుకలు లాగుచున్న రథమునెక్కి పోవు చెఱకు వింటి చిన్నవాడైన మన్మధుని తండ్రి శ్రీమన్నారాయణుడు. "పచ్చని చాయలు బాయని బంగారు పచ్చడము గట్టిన బాగైనవాడు" - పసుపు, పచ్చని రంగుతో మెఱయుచున్న బంగారు వస్త్రము (పీతాంబరము) కట్టిన సర్వశ్రేష్ఠుడు.

"తెల్లని పులుగుపై దిరుగ మరిగినట్టి తెల్లని సతి పాలిదేవర తండ్రి" - తెల్లని రాజహంసపై తిరుగుటకు అలవాటు పడిన తెల్లని సరస్వతీ దేవి నాథుడైన చతుర్ముఖ బ్రహ్మ యొక్క తండ్రి (శ్రీహరి). "తెల్లని పరపుపై దేలి పొరలువెట్టు తెల్లని కన్నుల తెలివైనవాడు"- తెల్లని ఆదిశేషుడే పరపుగా తెల్లని పాలసముద్రంపై తేలి పొర్లుతుండే శేషశయనుడై తెల్లని కనులుగల తెలివైన శ్రీ విష్ణుమూర్తి. (తన తెలివితో ఆ స్వామి తెలివిగా వరాలు నలువచే పొంది, తొలగని చావుని వలదనుకొనే అతి తెలివి అసురుల ఉసురులు తీసే తెలివైనవాడు).

"కొండలవింటి వాని గుత్తగొనినయట్టి కొండొక పాయపు కూతురు తండ్రి" - మేరు పర్వతాన్ని ధనస్సుగా చేసికొని త్రిపురాసురులను సంహరించిన పరమేశ్వరుని తన భక్తితో వశం చేసికొనిన పర్వత రాజు హిమవంతుని పెద్దకూతురైన గంగాదేవి జన్మకు కారణమైన గంగా జనకుడు అయిన శ్రీహరి. నేడు ఈ కలియుగంలో ఈయనే కొండలరాయుడు (ఏడు కొండల వేంకన్న). కోనేటి తిమ్మయ్య అని పిలువబడే శ్రీవేంకటేశ్వరుడు అంతేకాదు ఈయన ఒకప్పుడు "కొండతలనెత్తిన గుఱుతైనవాడు" - గోవర్ధన పర్వతాన్ని మోసి తనవారిని రక్షించిన శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఈయనే.

4-40

## మున్నుడి

సుదీర్ఘమైన మేలుకొలుపు వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇదికూడా అర్థమవుతున్నట్లనిపించే అర్థంకాని కీర్తన. ఇటువంటి కీర్తనలు ఇదివరలో కొన్ని విన్నాం కాబట్టి మొత్తం కాకపోయినా దీని రసాస్వాదన మాత్రం తేలికగా చేయవచ్చును.

**సీ॥ ముదిత కన్గలువలు మొగిచెను, మదనుని**
**బాణాల కమలాలు బాగ విరిసె**
**అతివకున్ నిట్టూర్పు అగడు మారుతమాయె**
**వరుణుండు చెమటల వానదెచ్చె**
**తురుమున సుమములు తోచె పూవుల వాన**
**మారుండు పుల్కల బ్రహ్మఆయె**
**ఒడికముగ జెలిలో నుదయరాగంబాయె**
**ఆలయ రవళాయె ఆమె పలుకు**

**ఆ.వె॥ పడతి గూడినట్టి మా వేంకటేశ్వరా!**
**నిదుర మేలుకొనుము నిఖిలవంద్య**
**మేలుకొలుపు పాడె మేటి అన్నయ కవి**
**ఇంతకంటె భాగ్యమేమి కలదు?**

**రాగం : భూపాలము**

పొలయలుక నిద్దరలు భోగించ దొరకొంటి
అలరవడి మేల్కొనవె అఖిలేశ్వరా ॥పొలయలుక॥





తరుణిమైనపుడె పరితాప సూర్యుడు వొడిచె
వరుస చెలికన్ను గలువలు మొగిచెను
మరుని సాయకపు తామరలు వికసించె
కరుణతో మేల్కొనవె కమలేశ్వర ॥పొలయలుక॥

కాంత నిట్టూర్పులను గాలియును నగ్గియును
వంతచమటల వాన వరుణుండును
వింతలుగ నిన్ను సేవింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె పరమేశ్వర ॥పొలయలుక॥

మెలుత పెను దురుమనెడి మేఘమండలములో
నలుగడల జెలగె సుమనపు పంక్తులు
కులికి పూవులవాన గురియంగ నున్నదిదె
చలముడిగి మేల్కొనవె సర్వేశ్వర ॥పొలయలుక॥

కదిసి పులకల సృష్టి కడలేక పొడమించు
మదనుడను మానస కమలభవుడును
ముదిత కోపపు హరుడు మొనసి యున్నారిదే
నిదుర మేల్కొనవె జలనిధి శయనుడ ॥పొలయలుక॥

ఒడికముగ జెలిలోన నుదయరాగము వొడమె
వెడలెనదె పలుకు గోవిలరవములు
పడతి గూడితివి రవి పరవశంబికనైన
కడగి మేల్కొనవె వేంకటరమణుడ ॥పొలయలుక॥

భావామృతం :

ప్రభూ! ప్రణయ కలహము ప్రదర్శించుచు నిద్ర నటించుచున్నావు. భోగము ననుభవించుచుంటివి. ఇకచాలు. ఓ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! నిదుర మేల్కొనవయ్యా!

నీయెడబాటు క్షణమైన సహించలేని ఆ తరుణి (పద్మావతి) శరీరంలో పరితాప సూర్యుడు ఉదయించబోతున్నాడు. చెలియకన్నులు (నిద్రలేక) కలువలై ముకుళించు కొన్నవి. మన్మథుని బాణములై తామరపూలు వికసించినవి. ఓ కమలేశ్వరా! (లక్ష్మీవల్లభా! మమ్మల్ని కరుణించి మేల్కొనవయ్యా!

నీ కాంత యొక్క నిట్టూర్పులే వాయుదేవుడు, అగ్నిదేవుని వలెనను, ఏఱులై పారు చెమటల వానలు వరుణదేవుని వలెనను, నిన్ను సేవించుటకు వచ్చారా అనిపించుచున్నది. వారి సేవలు స్వీకరించటానికి వీలుగా పరమేశ్వరుడవైన నీవు మేల్కొనుము ప్రభూ!

ఓ సర్వేశ్వరా! ఆ భామ కొప్పు అనునట్టి మేఘమండలములో నలుదిక్కులా పూమాలల వరుసలు తురిమినది. ఆమె కులికినప్పుడు ఆ మేఘాలు పూలవాన కురిపించినవి. ఇక నీ బెట్టుసరి మాని మేల్కొనుము తండ్రీ!


కదిసి (సమీపించగానే) ఆమెకు అంతులేని పులకరింతలు ఆమెలో





పొడజూపినవి. మన్మధుడనే మానసిక బ్రహ్మ, ఆమె అలుక అనే హరుడు బ్రహ్మాది దేవతలవలె వేచి యున్నారు. ఓ క్షీరసాగరశయనా! నిదుర మేల్కొనుము తండ్రీ!

దేవా! ఒడికముగ (మనోజ్ఞముగా) ఆ చెలియలో ఉదయరాగములు (జ్ఞాన జ్యోతులై వెలిగినవి) ఆలయములోని రవములవలె, మాటలు వెలువడినవి. ఆమె 'త్వమేవాహం' స్థితికి జేరినది. అప్పుడు ఆమెపై నీ ప్రేమ ద్విగుణీకృతమై ఆమెను కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆ పారవశ్యం మఱచి ప్రయత్న పూర్వకంగా మేలుకొని మా మొఱలాలకించుము తండ్రీ!



**4-41**

## మున్నుడి

అన్నమాచార్యులవారి పాండిత్య ప్రదర్శన ఆయన చెప్పిన శ్రీహరి దశావతార కీర్తనలలో ప్రతిఫలిస్తుంటుంది. 21వ శతాబ్ది తెలుగువారికి ఈ కీర్తనలు నూటికి పదిమందికి మించి అర్థంకావని నా అభిప్రాయం. నాబోటి సామాన్యుడు ఇది వివరించాలంటే... ఆ శ్రీనివాసుని అనంతమైన కృప లేక సాధ్యమా? "కాంతలనే కూడెనట కడగడదొక్కెనట" అంటే ఏమిటి? కూడటం అంటే గణితంలో కూడిక అని అనుకొని ఎవర్ని తొక్కుతున్నారా!! అని ఆశ్చర్యపోతే.. ఏమాత్రం ఆశ్చర్యంలేదు. ఒకటికి రెండుసార్లు చదివితేగాని "పదియు బదియు గాను"... అంటే తెలియదు. ఏడుకొండలవాడి అభిషేక సమయంలో పాడిన కీర్తన ఇది.

**కం॥ పది అవతారంబుల హరి**
**ఉదయించెను చెడునుద్రుంచ ఒప్పుగ బ్రోవన్**
**తుదిలేని శిష్టగణముల**
**పదిలముగా అన్నమయ్య పాడెను వినుడీ.**

**రాగం : రామక్రియ**

పదియు బదియుగాను పరమాత్ముడితనికి
వెదకి చవులు దెచ్చి విందులిట్టె సేయరే ॥పదియు॥

పొలసుపై బారెనట బురుదమేనంటెనట
యిల మన్ను మోచెనట యీ దేవుడు
నెలవైన రాకాసి నెత్తుట దోగినాడట
కల పన్నీరెల్లబోసి కడుగరే దేహము ॥పదియు॥

బాపన జిడ్డంటెనట పట్టెనట మున్మురము
కైపగు నల్లని కోక గట్టినాడట
చాపలాన జెంచుదాని సంగడి దిరిగెనట
కోపుల గప్పురధూళి గుప్పరే యీతనికి ॥పదియు॥





కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతల దట్టుపుణుగు పూయరే నేడు
యింతట శ్రీవేంకటేశు నెద నలమేలుమంగ
గాంతుని మెడ గుచ్చి కట్టరే మొక్కుదుము ॥పదియు॥

**భావామృతం :**

ఓ భక్తులారా! పరమాత్ముడైన ఇతనికి పదియున్ (పది అవతారములునూ) పదియుగాను (చక్కగా నుండుగాక!) వాటిని వెదకి, చవులు దెచ్చి (కనుక్కొని రసస్ఫూర్తితో) విందులిట్టే సేయరే (నైవేద్యం పెట్టండి).

(ఈస్వామి ఒకనాడు) పొలసుపై బారెనట (పొలుసులుగల శరీరంతో పరిగెత్తాడట... అంటే మత్స్యాయవతారుడు). బురదమేనంటె నట (ఒళ్ళంతా బురద అంటిందట... అంటే కూర్మావతారంలో మందర పర్వతం క్రింద వున్నప్పుడు ఆ కొండపైన మట్టితో ఈ స్వామి ఒళ్ళంతా బురదయిందట. ఈ దేవుడు యిలమన్ను మోచెనట (భూ భారం మోశాడట... అంటే వరాహావతారం). రాకాసినెత్తుట దోగినాడట. (హిరణ్యకశిపుని రక్తంతో పొరాడినాడట... అంటే నరసింహావతారం). అందుకని నేడు ఈ స్వామికి 'కలపన్నీరెల్ల బోసి కడుగరే దేహము (ఉన్న పన్నీరంతా పోసి ఈయన దేహాన్ని కడగండి)

ఈయనకు బాపన జిడ్డంటెనట. అగ్నిహోత్రంలో నెయ్యివేసి వేసి ఒళ్ళంతా జిడ్డయిందట, బ్రాహ్మణుడు కదా! (వామనావతారం). పట్టెనట మున్మురము (సర్వశ్రేష్ఠుడయ్యాడట, అంటే.. రాజులందరినీ వధించి విజేత అయ్యాడు అంటే... పరశురామావతారం). నల్లని (నీలవర్ణ) వలువలు ధరించి బలరాముడయ్యాడట. (బలరామ అవతారం). చాపలాన చెంచుదాని సంగడి దిరిగేనంట (మనోవైకల్యంలో వుండగా, చెంచుజాతి వృద్ధురాలు శబరిని స్నేహభావంతో కరుణించి మెసలినాడట... అంటే శ్రీరామావతారం) అటువంటి ఈ స్వామికి కోపుల కర్పూరధూళి గుప్పరే! (అందముగా కర్పూరం పొడి మెత్తండి).

ఈయన కాంతలనే కూడెనట (త్రిపురాసురుల భార్యలను సంగమించినాడట... బుద్ధావతారము). కడగడదొక్కెనట (పాపములను త్రొక్కివేశాడట.... అంటే కల్కి అవతారుడు). అట్టి ఈ స్వామికి తట్టుపునుగు అనే సుగంధద్రవ్యం, పొందల పూయరే (ఆరంగారంగ పూయండి). నేడు ఈ శ్రీవేంకటేశ్వరునికి అలమేల్మంగను మెడకు అంటగట్టి మ్రొక్కండి. మీ జీవితం ధన్యం చేసికోండి.

## 4-42

## మున్నుడి

ఏడుకొండలవాడి కళ్యాణ సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన శృంగార సంకీర్తన ఇది. పద్మావతీదేవి చెలికత్తెలు స్వామిని ఆమెను పెండ్లియాడమని వేడుకొంటున్నారు. వారిలో ఆచార్యులవారూ ఒక చెలియవలె ఈ కీర్తన ఆలపిస్తున్నారు. నా వివరణే అన్నమయ్య భావన అని భావించటం, భావ్యం కాదు. అది నా భావన మాత్రమే. కాకుంటే మధురమైన భావన. భావయామి వేంకటేశమ్‌లో ఇంతకంటే భావించలేనందుకు ఆ భావజ గురుడు మన్నిస్తాడనే... నా భావన.

**చం॥ చెలులిటు విన్నపంబులను చేసిరి "వల్లభ!యాలకింపుమా**
**ఎలమి సరోజవాసినిని ఈ అలివేణిని బెండ్లియాడుమా**
**చెలువముతోడ", అన్నమయ శ్రీపతి కిత్తరియాలపించగా**
**జలజదళాక్షుడైన హరి సాగరకన్యను గూడె ప్రేమతో.**

**రాగం : శంకరాభరణం**

అలివేణిని బెండ్లాడవయ్యా
చెలుల విన్నపము చేకొనవయ్యా ॥అలివేణి॥

సొలపుల తొలితొలి చూచిన చూపులు
కొలది మీర నుంకువలాయ
చెలగి చేతులను సేసిన సన్నలు
తలపగ నలుగడ దలబాలాయ ॥అలివేణి॥

ననుపున సెలవుల నవ్విన నవ్వులు
గొనకొనగ బాలకూళ్ళాయ
అనువుగప్రియమున నాడిన మాటలు
మనసిజతంత్రపు మంత్రములాయ ॥అలివేణి॥





వేడుక కాగిట వినయపు సేతలు
కూడిన కూటపు గురులాయ
యీడనె శ్రీవేంకటేశ యేలితివి
తోడలమేల్మంగ దోమట్లాయ ॥అలివేణి॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! నీవు మా అలివేణిని (తుమ్మెదలవంటి నల్లని ముంగురులుకల సుందరి) పెండ్లియాడవయ్యా! ఆమె చెలులమైన మేము చేయు వినతులను వినుము స్వామీ!

నీవు అందగాడివని మా చెలియ నిన్ను పారవశ్యంతో చూస్తున్నది. ఆమె తొలిచూపులే నీకు ఆమె ఇచ్చే కొలది మీరిన ఉంకువలాయ (అంతులేని కన్యాశుల్కం అయింది ప్రభూ!). ఆమె మాకెవ్వరికీ అర్థం కాని ఏవేవో సన్నలు (సంజ్ఞలు) చెలగి (వేగంగా) చేతులతో స్వామివారికి చేస్తున్నది. అవే స్వామి శిరసుపై ఆమె పోయగా నలువైపులా చిమ్మిన తలంబ్రాలై అలరారుచున్నవి.

ప్రభూ! ఆమె ననుపున (అనురాగంతో) సెలవుల (పెదవుల చివరలనుండి) నవ్వినట్లు మనోహరంగా నవ్వుతున్నది. ఆ నవ్వులే, గొనకొనగ బాలకూళ్ళాయ (కళ్యాణంలో కాశీయాత్రకు పోయేటప్పుడు ధరించే పావుకోళ్ళయినవి). అనువుగ ప్రియమున నాడిన మాటలు (ఆమె మాకు తెలియకుండా, నీతో ప్రేమగా మాటలాడుచున్న మాటలు) మన్మధుని తంత్రములు నేర్పిన మంత్రములేమో అన్నట్లున్నాయి స్వామీ! ఇంకా వేరే పెండ్లి మంత్రములెందుకయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! వేడుకతో నీవామె నాలింగనము సేయగా ఆమె వినయముగా నీకు సహకరించి నిన్ను కూడినది. ఆ కూటపు సేతలే మీకు గురులాయ (గవయుటలైనవి ప్రభూ!). ఈడనే (ఈ తిరుమలయందే) నీవామెను యేలితివి. నీతోడే మా అలమేల్మంగకు దోమట్లాయ (అన్నము అయినది... అనగా జీవనాధారం అయినది). కనుక నీవామెను స్వీకరింపుము తండ్రీ!

## 4-43

## మున్నుడి

తనని తల్లి యశోదమ్మగా భావించుకొని ఈ కీర్తన చెబుతున్నారన్నమాచార్యులవారు. బిడ్డ యెంత ఆకలితో వున్నాడో, వేడి కూరలు చల్లబడి పోతున్నాయి అని వాపోతున్నారు. ఆదమఱచి ఏ మగువకౌగిట్లో నిదురిస్తున్నాడో అనటం అన్నమయ్యకే సాధ్యము. సాందీపుని దగ్గర విద్యలు నేరుస్తున్నాడేమో అని రేపల్లె ఇంతి సందేహించటం తర్కానికి అందకపోయినా, శ్రీవేంకటేశ్వరుడే చిన్నికృష్ణుడనే భావనే అన్ని తర్కాలకు తెరదించి వేంకట కృష్ణయ్యను సన్నుతించే కీర్తనగా వెలసింది.

**ఉ॥ ఇంతట కృష్ణమూర్తి నిటు యాకడ బిల్వరె యారగింపనై**
**యెంతటి పొద్దుబోయె తను యేకడనుండెనొ తల్లి కుందగా**
**ఇంతుల కాగిటన్ గలడొయేపుగ విద్యల నేర్చుచుండెనో**
**చెంతకురాడు, అన్నమయ చెప్పెను కీర్తన వెన్నదొంగపై.**

**రాగం : శుద్ధసారంగ్**

పిలువరే కృష్ణుని పేరుకొని యింతటాను
పొలసి యారగించే పొద్దాయనిపుడు ॥పిలువరే॥

వెన్నలారగించ బోయి వీధులలో దిరిగీనో
యెన్నరాని యమునలో యీదులాడీనో
సన్నల సాందీపనితో చదువగ బోయినాడో
చిన్నవా డాకలి గొనె చెలులాల యిపుడు ॥పిలువరే॥

మగువల కాగిళ్ళ మఱచి నిద్దిరించీనో
సొగిసి యావుల గాచే చోట నున్నాడో
యెగువనుట్లకెక్కి యింతులకు జిక్కినాడో
సగము వేడి కూరలు చల్లనాయ నిపుడు ॥పిలువరే॥





చెంది నెమలి చుంగుల సింగారించుకొనీనో
ఇందునే దేవరవలె ఇంటనున్నాడో
అందపు శ్రీవేంకటేశుడాడివచ్చె నిదెవీడై
విందుల మాపొత్తుకు రా వేళాయ నిపుడు ॥పిలువరే॥

**భావామృతం :**

ఓ చెలియలారా! మా చిన్నారి కృష్ణయ్యను ఇక్కడకు పేరుపెట్టి పిలవండమ్మా! ఇంతట (ఇప్పుడు) పొలసి (వచ్చి) తిండితినే వేళయిపోయింది. యెక్కడున్నాడో యేమో కాస్త కనుక్కోండమ్మా!

పోయి వెన్నతిందామని యే వీధులలో తిరుగుతున్నాడో? యమునానదిని యెంచి ఇంతలోతు వుంటుందని చెప్పటం కష్టం. ఒకవేళ అందులో ఈదులాడుతున్నాడేమో!! సన్నల సాందీపనితో (సాందీపని కనుసన్నలలో మెలగుతూ) చదువుకొనుటకు బోయినాడో యేమో!! వాడెంత చిన్నపిల్లవాడు!! ఆకలితో వున్నాడేమో!! ఓ చెలియలారా వాడిని వెదకండమా!

ఒకవేళ ఏ గోపికన్నా జోకొడుతుంటే ఆమె కౌగిట్లో ఆదమఱచి నిదురిస్తున్నాడేమో!! గోపాలకులు ఆవులను కాస్తుంటే తనుకూడా అక్కడే వుండిపోయాడేమో!! లేక వుట్లను పగులగొడుతూ యే గోపికకైనా చిక్కి బంధించబడ్డాడేమో!! వేడివేడి కూరలు సగం చల్లబడిపోయాయి ఇప్పుడు. కొంచెం మా కృష్ణయ్యను పిలువండమ్మా!

పొంది, చక్కటి నెమలి పింఛమును సింగారించుకొంటున్నాడోయేమో? ఇక్కడే దైవం వలె ఇంట్లోనే వున్నాడేమో!! నేడు కృష్ణయ్యే అందమైన శ్రీవేంకటేశ్వరుడై వచ్చినాడు. వీడే నాటి కృష్ణుడు. మాతోపాటు విందు ఆరగించటానికి ఇప్పుడు వేళయింది. వీనిని పిలవండమ్మా!

4-44

## మున్నుడి

సీతా శోక వినాశకుడైన హనుమంతరాయునిపై చక్కటి కీర్తన చెబుతున్నారన్నమయ్య. ఈ కీర్తనలు ఒకదానితో ఇంకొకటి పోలినట్లు వున్నప్పటికి దేని ప్రత్యేకత దానిదే. "రవిఫలగిళన ప్రతాప" అని హనుమని వేరెవరూ కీర్తించి యుండరు అని నాకనిపిస్తుంది. కుళక దానవులంటే కుళ్ళుబోతు రాక్షసులని అర్థం. 'కింకరూప' అంటే కోపము మొహంలో ప్రస్ఫుటించేవాడు అని అర్థం. ఈరోజువరకు ఇటువంటి మాటలు తెలుగులో వున్నాయని నాకూ తెలియదు... అదీ అన్నమయ్య భాషా పటిమ.

**తే॥ జానకీ శోకనాశక! సత్త్వధనిక!**
**మహిని పాతాళ లంకేశు మదవిదూర!**
**రామకార్యము నెరపిన లంకిణిహర!**
**హనుమ నీరీతి గీర్తించె అన్నమయ్య**

**రాగం : దేశాక్షి**

సీతాశోక విఘాతక వో-
పాతాళ లంకాపతి విభాళా ॥సీతా॥

హనుమంతరాయ అంజనీ తనయ వో-
వనధి లంఘన గాత్ర వాయుపుత్ర
యినకులాధిప నిజహిత జగన్నుత-
వనజోదర సేవక సత్త్వధనికా ॥సీతా॥

ప్రళయాంతక రూప బలదీప రవిఫల-
గిళన ప్రతాప సుగ్రీవప్రియా
కుళక దానవ సంకుల విదారణ
భళిభళి జగత్పతి బలుబంటా ॥సీతా॥





పంకజాసను దివ్యపదవైభవ వో-
లంకిణీ ప్రాణ విలంఘున
వేంకటేశ్వరు సేవా వీర మహాధీర
కింకరూయ సుఖీభవా ॥సీతా॥

**భావామృతం :**

ఓ సీతాశోక విఘాతకా (నివారకా)! పాతాళ లంకేశుడైన, మహిరావణుని నిర్జించిన మహానుభావా! ఆంజనేయా! నిన్నిదే కీర్తించెదను.

ఓ హనుమంతరాయా! అంజనీదేవి తనయా! వనధిలంఘన గాత్ర! (నూరు యోజనముల సముద్రమును దుమికి దాటుటకు అనువైనట్లు శరీరమును పెంచినవాడా!) వాయుదేవుని పుత్రా! సూర్యవంశ దీపకుడైన శ్రీరామునికి నిజమైన హితప్రదాతా! విశ్వమందందరిచే నుతించబడినవాడా! పద్మనాభుని సేవాతత్పరా! సత్త్వధనికా! (సత్త్వగుణము అను ధనము పుష్కలంగా వున్నవాడా!) నీకు వందనములు.

దేవా! నీవు ప్రళయాంతకుడైన శంకరుని అంశతో జన్మించినవాడవు. దీప్తించిన బలముకలవాడవు. ఓ రవిఫలగిళన ప్రతాపా! (సూర్యుని పండు అనుకొని తినబోయిన ప్రతాపశాలీ!) సుగ్రీవుని ప్రియ స్నేహితుడా! కుళకదానవ (కుళ్ళుబోతు రాక్షసులు... అంటే పైకి నవ్వుతూ వున్నా మనసులో దుఃఖించే అసురులు) సంకుల నిదారణ (సమూహములను చీల్చి వేసినవాడా!) జగన్నాథుడైన శ్రీరాముని బలిష్టుడైన బంటూ! భళిభళీ!

బ్రహ్మదేవుని యొక్క దివ్యపదవీ వైభవమును పొందబోవు మహానుభావా! లంకిణి ప్రాణములను ఒక్క గుద్దుతో త్యాగము చేయించినవాడా! శ్రీవేంకటేశ్వరుని సేవకులలో మహాధీరుడవైన వీరాగ్రేసరా! ఓ కింకరూపా! (కోపము మొహంలో తాండవించే ఉగ్రాంజనేయా!) సుఖీభవ (నీకు సర్వ సుఖములు ప్రాప్తించుగాక!

**4-45**

## మున్నుడి

అహోబల నరసింహునిపై అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు ఆశువుగా చెప్పారు. ఈ కీర్తనలో అన్నమయ్య ఆ నరసింహుని వివిధ విశిష్టతలుగల సింహముగా పేర్కొంటున్నారు. ఈ స్వామి దిట్టయైన వేదాలలోని 'తెరవేట' సింహము అని కీర్తిస్తున్నారు. అంటే ఏమిటో తెలుసుకోవాలంటే... భావామృతం చదవక తప్పదు. అంచెల మూడు మూర్తులకు ఆధారమైన మూర్తియట అహోబల నారసింహుడు.

**ఉ॥ వేడుకతోడ గద్దెపయి వీడటు కూర్చునియుండె జూడరో**
**వాడి ప్రతాపశాలియట మానవ సింగము అన్నమయ్యనెన్**
**కూడుచు తానహోబలపు గొప్ప నృసింగము వేంకటేశుడే**
**పాడెను మూడు మూర్తులకు వాడొకడే పెను మూలమంచనెన్.**

**రాగం: ధన్యాసి**

వీడె వీడె కూచున్నాడు వేడుకతో గద్దెమీద
వాడి ప్రతాపముతోడి వరదాన సింహము ॥వీడె॥

అరయ ప్రహ్లాదుని ఆపదోద్ధార సింహము
గిరిపై ఇందిరకును క్రీడాసింహము
నిరతి సురుల భయనివారణ సింహము
సరి హిరణ్యకశిపు సంహార సింహము ॥వీడె॥

ఇట్టె విశ్వమునకు ఏలికైన సింహము
గట్టిగ శరణాగతుల గాచే సింహము
దిట్టయై వేదాలలోని తెరవేట సింహము
నెట్టుకొనిన దురిత నివారణ సింహము ॥వీడె॥





అంచెల మూడుమూర్తుల కాధారమైన సింహము
పంచల మునుల భాగ్యఫల సింహము
పొంచి శ్రీవేంకటాద్రికి భూషణమైన సింహము
చెంచుల అహోబలపు శ్రీనారసింహము ॥వీడె॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! సంతోషంతో సింహాసనంపై కూర్చొనియున్న సింహము వీడే. వీడే వాడి ప్రతాపము (తీక్షణమైన పరాక్రమము) తో పెక్కు వరములను దానము చేయు సింగము. (ఈయన వివిధ గుణ భూషితుడై ఒక్కొక్కరి యెదుట ఒక్కొక్క గుణం ప్రదర్శించాడు)

చూడగా ప్రహ్లాదునికి ఈయన ఆపదోద్ధారక సింహము (తండ్రిపెట్టు ఆపదల నుంచి రక్షించిన నరసింహుడు). ఈ కొండమీద లక్ష్మీదేవికి ఇతడు క్రీడా సింహము (వలపు సయ్యాటలు ప్రదర్శించు సింహము). దేవతలకు భయమును ప్రీతితో నివారించిన సింహము. హిరణ్యకశిపుని సరి సంహారక సింహము (వాడి వరములన్నిటికీ సరిపోలు విధముగా సంహరించిన నరసింహము). ఈ స్వామిని కీర్తించండి.

ఈ నరసింహుడు ఇట్టే (తేలికగా అని భావము) విశ్వపాలకుడైనాడు. తనను శరణన్నవారిని గట్టిగ (సమర్ధవంతముగా) రక్షించు సింహమితడే. దిట్టయైనవాడని వేదములు కీర్తించిన ఈ దేవదేవుడు 'తెరవేట' సింహము. (తెరవేట లేక "ఏదువేట" అనునది వేటలోని ఒక విధానము. ఈయన అటువంటి వేటలో దిట్ట). ఈ స్వామి నెట్టకొని (పూనుకొని) పాపములను నివారించిన సింహము.

ఈ మహానుభావుడు అంచెల మూడుమూర్తులకు ఆధారమైన సింహము. (సృష్టియందు బ్రహ్మకు స్థితియందు విష్ణువునకు, లయమున ఈశ్వరునకు ఆధారభూతుడైన నరసింహుడు), మునులకు వారి భాగ్యఫలములను పంచి ఇచ్చు సింహము. ఈ స్వామియే పొంచి వేంకటాద్రికి అలంకారమైన సింహము. ఇచ్చట చెంచుల (అడవిలో) ఈయన అహోబల నారసింహుడై శరణాగత రక్షకుడై యున్నాడు.

**4-46**

## మున్నుడి

బంగారు మేడలో పవళించిన శ్రీవేంకటేశ్వరుని నిద్రలేపిన చెలియలు, ఆ పురుషోత్తమునికి సుగంధద్రవ్యాలతో నలుగుబెట్టి, పన్నీటితో స్నానం చేయించి, చక్కగా విసరి, కర్పూర ధూళిమెత్తి, కొప్పు దువ్వి, గొజ్జంగపూలు ముడిచి, అనేక సొమ్ములు బెట్టి, తాంబూలమిచ్చి, తులసి మాలలు వేసి, ఆరగింపులు చేసి ఎలా సేవిస్తున్నారో చెబుతున్నారు అన్నమాచార్యులవారు.

**సీ॥ బంగారు మేడలో పరమాత్ముడే వాడు**
**చెలులు సింగారాలు చేయరేల**
**తట్టు పుణుగు నూనె దట్టంబుగా నించి**
**కస్తూరి బాగుగా కలియబెట్టి**
**పన్నీట మజ్జనం బెన్నంగ సేయించి**
**వెట్టదీరగ వాన్కి వీవరేల?**
**కర్పూర గంధంబు కదు నిట్టె మెత్తరే**
**కొప్పులో ముడువరే 'గొజ్జగలను'**

**తే॥ మేన సొమ్ములు నించరే మిలమిలయన**
**తులసిదండలు వేయరే నిలువుగాను**
**ఆరగింపులు సేయరే, అన్నమయ్య**
**పాట వినిపించి వేంకటపతికినిపుడు**

**రాగం : మధ్యమావతి**

బంగారు మేడలలోన పరమాత్ముడు వాడే
సింగారాలు మీద మీద సేయరే చెలులు ॥బంగారు॥

తట్టుపుణుగుల నూనె తలనిండా నంటుకొని
గట్టిగా కస్తూరి అట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జన మాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగారు॥





కప్పురంపు గందవొడి కదునిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేను సొమ్ములెల్లా
దప్పిదీర విడమీరే తలకొని చెలులు ॥బంగారు॥

అలమేలుమంగను వురమందు నిట్టెనించుకొని
తులసి దండలు మోచె నిలువునను
చెలరేగి ఆరగించె శ్రీవేంకటేశ్వరుడు
కొలువున్నాడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగారు॥

**భావామృతం :**

ఓ చెలులారా! అతగాడు బంగారపు మేడలో నివసించు, పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు. వానికి ఒకదానిని మించిన దింకొకటియైన అలంకరణలు చేయండి.

ఆ స్వామి తలకి (శిరోజములకు) తట్టు పుణుగు నూనెను (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధపు నూనె) తలనిండా అంటి కస్తూరితో బాగుగా కలియబెట్టి, నలుగువలె బెట్టి స్వామికి ఆపై పన్నీటితో స్నానం చేయించండి. స్నానమైన తరువాత ఆయనకు వెట్టదీర (వేడిమి తగ్గిపోవునట్లు) మీరింతమంది చెలులు ఆయనకు వింజామరలతో విసరండి.

ఆ తరువాత ఎక్కువ కర్పూర ధూళితో ఆయనకు మెత్తి ఒళ్ళంతా సుగంధం వచ్చేట్లు చేయండి. ఆపైన ఆయన కొప్పును చక్కగా దువ్వి, 'గొజ్జెంగలు' (గొజ్జెగ పుష్పములు) ఆ కొప్పులో ముడిచి అలంకరించండి. అప్పుడా స్వామి పవిత్రమైన తన శరీరంపై సొమ్ములు (ఆభరణములు) తెప్పలుగా (ప్రోవుగా) ధరించి మిలమిల మెఱసి పోయాడు. ఓ చెలులారా! మీరింత హడావిడి చేస్తుంటే ఆయనకి దప్పికతో నోరెండిపోతుంది. అట్లాకాకుండా మీరు పూనుకొని కర్పూర తాంబూలమియ్యండి.

ఓ చెలులారా! తన హృదయంపై అలమేల్మంగను పెట్టుకొనిన ఆ శ్రీవేంకటేశ్వరుడు, గుబాళించు తులసి మాలలను తన మెడలో నిలువుగా ధరించాడు. ఆపై విజృంభించి తనకి నివేదించిన పదార్థములనారగించి కొలువు దీరియున్నాడు. మీకు ఆయనపైగల మోహమునంతా గుప్పించి "శ్రీవేంకటేశ చరణం శరణం ప్రపద్యే..." అని శరణాగతి నొందండి. తరించండి. మీపై దయతో ఆయన మీకిచ్చిన మానవజన్మను సార్థకం చేసికోండి.

## 4-47

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని చిత్తములో నిలుపుకొని, చిత్తమును మత్తెక్కించే ఆయన కొడుకు చిత్తజుని జోలికి పోకుండా భవసాగరమును తరించమని బోధిస్తున్నారు అన్నమాచార్యులవారు. అడవిలో యెంత చక్కటి వెన్నెల కాసినా, చూసి ఆనందించే వాడెవడుంటాడు? ఎంతో విలువైన కాలమును వ్యర్థం చేసికొని మాయలోబడి విచారించకండి. ఆ స్వామి శరణు పొంది పాపవిముక్తులై ఆయనను సేవించండి అని హితబోధను చేస్తున్నారు.

**మ॥ అడవిన్ గాసిన వెన్నెలట్లు తగునా అత్యంత నాణ్యంపుయీ**
**పుడమిన్ గాలము పాడుసేయ సరికాదో మానవా! మాయరా**
**కడువేదన్ బడకన్నమయ్య తను యీ గానంబు సేసెన్ భళా!!**
**విడువన్ జాలని వేంకటేశు గొలువన్ వీడున్ గదా పాపముల్.**

**రాగం : కన్నడు గౌళ**

పోయగాలంబడవికి - గాయువెన్నెల కరణిని
శ్రీయుతుదలచుడీ నరులు - మాయబడి చెడక ॥పోయ॥

చిత్తము చేకూరుచు కొని - చిత్తైకాగ్రతను
చిత్తజగురుని దలచుడీ- చిత్తజు జొరనీక ॥పోయ॥

బూరుగు మాకున జెందిన - కీరము చందమున
ఆరయ నిష్ఫలమగు మరి- యన్యుల జేరినను ॥పోయ॥

కూరిమి మా తిరువేంకటగిరి- గురు శ్రీపాదములు
చేరిన వారికి భవములు - చెందవెపుడు నటుగాన ॥పోయ॥





**భావామృతం :**

ఓ నరులారా! కాలమంతా నిరుపయోగంగా గడచిపోయింది. అడవిలో గాచిన వెన్నెల వలె వ్యర్థమైపోయింది. ఈ మాయలో తగులుకొని చెడిపోవద్దు. శ్రీయుతుడు (లక్ష్మీపతి) అయిన ఆ దేవదేవుని స్మరించండి.

మీ మనస్సును దిటవు పఱచుకొని, మనస్సున ఏకాగ్రత సాధించి, చిత్తజుడైన (మనస్సులోనే పుట్టుక గలిగిన) మన్మధునికి తండ్రిగారైన శ్రీమన్నారాయణుని ధ్యానించండి. చిత్తజుని మాత్రం మనస్సులోకి దూరనీయకండి. చెడిపోకండి.

బూరుగు చెట్టుపూలు చక్కటి రంగుతో ఆకర్షణీయంగా వుంటాయి. వాటికి సువాసన కూడా వుంటుందేమో అనే ఆశతో దానినాశ్రయిస్తే క్రమంగా పూవు, కాయగా, కాయ దూదిగా మారి, దూది గాలికి కొట్టుకుపోతుంది. కాబట్టి చిలుక యొకటి అందమైన బూరుగు పూవు తియ్యటి కాయ అవుతుందేమో అనే భ్రమతో వేచియుంటే దానికి మిగిలేది నిరాశ మాత్రమే. అట్లే శ్రీహరిని గాక ఇతరులను ఆశ్రయిస్తే మీ జీవితం నిష్ఫలమైపోతుంది.

భక్తి, ప్రేమ పెనవేసుకొనునట్లు శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదములను చేరి ఆశ్రయించినవారికి ఎన్నటికీ 'భవములు' (జన్మలవలన సంసార సాగరములోబడి తిరిగే దుస్థితి) చెందవు. అందుకని శ్రీవేంకటేశ్వరుడే దిక్కని ఆయన శరణు పొందండి.



## 4-48

## మున్నుడి

నేడు శ్రీరామనవమి భద్రాచల శ్రీరామచంద్రుని కళ్యాణం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చూచి భక్తులు ధన్యులవుతున్నారు. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు అనుక్షణం కోదండం ధరించే వుంటానని పంతము పట్టిన ఆ రాఘవుని నీ బలమునకెదురేదయ్యా? అని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. బ్రహ్మాదులు ఆయనను పరబ్రహ్మ అని కీర్తించారట. జవసత్త్వ సంపన్నుడట... ఆయనే వేసాల పొరలే వేంకటేశ్వరుడట, దాసులను రక్షించుటకు తలకొన్న రాముడట.

**తరలము :** **భళిభళీ! రఘురామ రాఘవ పంతమూనిన భూవరా!**
**జలజసంభవ సన్నుతా! సతి జానకీ ప్రియ వల్లభా!**
**ఇల జనించిన రాముడే మన ఇష్టుడౌ వేంకన్ననెన్**
**బలిమి నీకెదురేది లేదుర బాగుబాగనె అన్నయున్.**

**రాగం :**

భళిభళి రామ పంతపు రామ నీ-
బలిమి కెదురులేదు భయహరరామ ॥భళిభళి॥

విలువిద్యరామ వీర విక్రమరామ
తలకొన్న తాటకాంతకరామ రామా
కొలయై తరుణి తలగొందు గండరామ
చలమది సమరపు జయరామ రామ ॥భళి భళి॥

రవికులరామ రావణాంతక రామ
రవిసుత ముఖ కపిరాజ రామరామ
సవరగా కొండలచే జలనిధి కట్టిన రామ
జవసత్వ సంపన్న జానకి రామ ॥భళి భళి॥





కౌసల్య రామ కరుణానిధి రామ
భూసురవరద సంభూతల రామ
వేశాలపొరలే శ్రీవేంకటాద్రి రామ
దాసుల మమ్ము కావ తలకొన్న రామ ॥భళి భళి॥

**భావామృతం :**

ఓ శ్రీరామచంద్రా! దుష్టశిక్షణ చేసి శిష్టులను రక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేసి దీక్షాదక్షుడై కోదండ ధనువును ధరించియే యుంటానని పంతము పూనిన నీ దీక్ష భళి భళీ! ఏమని పొగడను!! ఆర్తుల భయము హరించు శ్రీరామా! నీ బలము సాటిలేనిది.

ప్రభూ! నీవు విలువిద్యా పారంగతుడవు. వీర విక్రమ రాముడవు. తాటక సంహారమునకు తలకొన్న (పూనుకొనిన) రామచంద్రుడవు. పాపియైన స్త్రీకి (శూర్పణఖకి) తలకొండు (భయమును కలిగించిన) గండ (శూరుడు) అయిన రామచంద్రుడవు. రణరంగంలో యుద్ధంకూడ ఏమాత్రం మత్సరము (చలము) లేకుండా చేయు సద్గుణశీలి అయిన జయరాముడవు.

ఓ దేవదేవా! నీవు సూర్యవంశ దీపకుడవైన శ్రీరాముడవు. రావణుని వధించిన శ్రీరామచంద్రుడవు. కపిరాజైన సుగ్రీవునికి సూర్యపుత్రుడగుటచే సూర్యవంశస్థుడైన రామునితో మైత్రి కలిగి ఆయన వదనమును శోభాయమానముగా చేసినది. (ఆయన అటువంటి శ్రీరాముడు). కొండలచే సవరగా (చదునుగా) జలనిధికి (సముద్రానికి) కట్టిన (బంధించిన) శ్రీరామచంద్రా! జవసత్త్వములు సమృద్ధిగా వున్న నీవు జానకీ వల్లభుడైన రాముడవు.

కౌసల్యానందనుడవైన శ్రీరామా! నీవు కరుణానిధివి. భూలోకవాసులను, దేవతలను రక్షించుటకు మానవ జన్మనెత్తిన రామచంద్రుడవు. వేశాల (వేషాల... అనగా అలంకరణలతో) పొరలే (ప్రవర్తించు) శ్రీవేంకటాద్రి రాముడవు. మావంటి దాసులను కాపాడుటకు సిద్ధమైన శ్రీరామచంద్రుడవు. నీవే మా తిరుమలనాథుడవు కూడ.

## 4-49

### మున్నుడి

శ్రీమన్నారాయణుని కేశవ నామాలను ఒక చక్కటి కీర్తనలో భజన మాదిరి చెప్పగలగటం, అదీ ఒకే క్రమంలో చెప్పగలగటం ఒక్క అన్నమాచార్యులవారికే సాధ్యమైన ప్రక్రియ అని నాకనిపిస్తుంది. ఈ కీర్తన పాడితే శ్రీహరి నామాలు పలికినట్లే. నాబోటి 'చదువు సంధ్య' లేని సామాన్యులకోసం అన్నమయ్య ఎంత శ్రమపడ్డారో చూడండి. 'నీనామమే ఆత్మ నిధానాంజనము' అన్నారు. అది ఆత్మ నిధ్యానాంజనమేమో...అనిపించింది. అన్నమయ్య కత్తికి రెండువైపులా పదునే... మరి.

**కం॥ మాకది నిధియు నిధానము**
**తాకుచు మా ఆత్మకది నిధానాంజనమౌ**
**శ్రీకరుని నామమొకటే**
**ఆకడ తను భజన వోలె అన్నయ తెలిపెన్.**

**రాగం : తిలంగ్**

నీనామమే మాకు నిధియు నిధానము
నీ నామమే ఆత్మ నిధానాంజనము ॥నీ నామమే॥

నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదనా
నమో త్రివిక్రమ నమో వామన ॥నీ నామమే॥

నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ
నమో ప్రద్యుమ్నతే నమో అనిరుద్ధ ॥నీ నామమే॥





నమో పురుషోత్తమా నమో అధోక్షజ
నమో నారసింహా నమోస్తు అచ్యుత
నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర
నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణ ॥నీ నామమే॥

### భావామృతం :

ఓ దేవదేవా! నీ నామ సంకీర్తనమే మాకు నిధి, అనగా ఐశ్వర్యము. అదియే నిధానము, అనగా భద్రంగా భూమిలో ఒక రహస్య ప్రదేశమున పాతరవలె దాచి వుంచిన ధనము. ఇహలోకంలో ఈ రెండు అత్యవసరమే. కాని నీ నామము ఇహలోకంలోనే కాక పరలోకంలో అవసరమైన ఆత్మనిధానాంజనమును (ఆత్మ జ్ఞానంబును) సమకూరుస్తుంది. [అంజనము అంటే ఎక్కడో వున్నవాటిని కనులకు చూపించే కాటుక వంటి లేపనము. నిధానాంజనము అంటే, నిధిని చూపించే అంజనము. ఆయన నామం ఆత్మనిధిని వెలికి తీసి చూపించే అంజనము అని అర్థం. "ఆత్మ నిధ్యానాంజనము" - అంటే ఆత్మ దర్శనము చేయించే అంజనము అని అర్థం. కాబట్టి ఈ నిధానాంజనము 'నిధ్యానాంజనము' అయి వుంటుందేమో అని నాకు అనిపించింది]

ఓ కేశవా! ఓ నారాయణా! ఓ మాధవా! ఓ గోవిందా! ఓ విష్ణు! ఓ మధుసూదనా! ఓ త్రివిక్రమా! ఓ వామనా! నీకు వందనములు ప్రభూ!

ఓ శ్రీధరా! ఓ హృషీకేశా! ఓ పద్మనాభా! ఓ దామోదరా! ఓ సంకర్షణా! ఓ వాసుదేవా! ఓ ప్రద్యుమ్నా! ఓ అనిరుద్ధా! నీకు అనేక నమస్కారములు తండ్రీ!

ఓ పురుషోత్తమా! ఓ అధోక్షజా! ఓ నరసింహా! ఓ అచ్యుతా! ఓ జనార్దనా! ఓ ఉపేంద్రా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఓ శ్రీకృష్ణా! నీకు మా నమోవాకములు. నీ నామమును మించిన మోక్షసాధనము మరియొకటి లేదు.

**4-50**

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి అడుగుజాడల ననుసరించిన పెద తిరుమలాచార్యులవారు కూడ వెంకటేశ్వర మకుటంతో అనేక కీర్తనలు రచించారు. ప్రతిదేవునీ ఆయన శ్రీవేంకటేశ్వరునిగానే భావించారు. ఈ కీర్తనలో గోపికలలో తానూ ఒకతెయై కృష్ణునితో మొరబెట్టుకొంటున్నారు. నీ భావమేమిటో మాకు తెలిసిపోయిందిలే గోపాలకృష్ణా! నీ పస నాకు తెలియదా? నీకు కూడా బమ్మెరపాటు వుంటుందా? (నీవు దేవదేవుడవు కదా!)

**కం॥ గోవింద నందసుత! నీ**
**భావము గోపాలకృష్ణ! మాకటు చిక్కెన్**
**శ్రీవేంకటేశు గొలుచుచు**
**ఈ విధి పెదతిరుమలయ్య ఇంపుగ పాడెన్**

**రాగం : మిశ్రమోహన**

గోవింద నందనందన గోపాలకృష్ణ నీ-
భావము మాకు చిక్కె గోపాలకృష్ణ ॥గోవింద॥

కొంగువట్టే వదేమోయి గోపాలకృష్ణా మా-
పంగెన కోపుదువా గోపాలకృష్ణ
గొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ
బంగారు కాశతోడి గోపాలకృష్ణ ॥గోవింద॥

కొమ్మల చీరె లంటిన గోపాలకృష్ణ
పమ్మి నిన్ను తిట్టము గోపాలకృష్ణ
కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ
బమ్మెర పోకిందుల గోపాలకృష్ణ ॥గోవింద॥





కొసరకు మంత నీవు గోపాలకృష్ణ నీ-
పస నే నెఱుగనా గోపాలకృష్ణ
పొసగ శ్రీవేంకటాద్రి పొందితి నిన్ను
పసి మెక్కె మొగము గోపాలకృష్ణా ॥గోవింద॥

**భావామృతం :**

నందగోపుని కుమారుడవైన గోవిందా! నీవు గోవులను పాలించే గోపాలకృష్ణుడవు. నీ ఆలోచనలేమిటో మాకు దొఱికిపోయినవి. (నీ జిత్తులు మేము గ్రహించితిమి. మేము వెర్రిగొల్ల కన్నెలం కావచ్చును. కాని నీకిటుకులన్నీ మేమెరుగుదుములేవయ్యా!)

ఓ గోపాలకృష్ణా! మా కొంగు పట్టేవు ఇదేమోయి? నీ పంగెన (జిత్తులు) మేము సహించలేమయ్యా! (పంగెన అంటే ఏనుగును బంధించే పెద్దగొయ్యి. పైన గడ్డి కప్పివుంచిన వ్యూహం) గొంగతనాల నవ్వేవు (కపట శత్రువువలె నవ్వుతున్నావు). ఇది నీకు తగునా కృష్ణా! బంగారు రంగు కాశ (చిన్న పంచె) కట్టినావు గోపాలకృష్ణా! (నీవు పీతాంబరుడవని అందుకే అన్నారు).

స్త్రీల చీరలెత్తుకొని పోయిన ఓ గోపాలకృష్ణా! మేము నిన్ను పమ్మితిట్టము లేవయ్యా! (అతిగా నిందించము). మేము నీతో ఇంత మంచితనం చూపిస్తే... నీవేమో మా సిగ్గులన్నీ కుమ్మరించేస్తున్నావు (బట్టబయలు చేస్తున్నావు). మమ్మల్ని బమ్మెరపోకునకు (భ్రమపాటునకు) ఇందుల (ఇక్కడ) గురిచేస్తున్నావు. గోపాలకృష్ణా! ఇది న్యాయమా?

ఓ గోపాలకృష్ణా! నీవు అంత కొసరకుము స్వామీ! (ఇంకాస్త... ఇంకాస్త... అని మా వలపులు దోచుకోవద్దు). నీ సామర్థ్యం మేమెరుగనిదా!! కృష్ణా! అటువంటి నిన్ను శ్రీవేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుని రూపంలో పొందినాము. అందుచేత మా మొగములు కాంతులతో వెలిగిపోతున్నాయి ప్రభూ!

**4-51**

## మున్నుడి

శ్రీహరిచేతి సుదర్శన చక్రాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. బాల్యంలో అట్టముక్కను 'విష్ణుచక్రం' లా కత్తిరించి చూపుడు వేలికి పెట్టుకొని ఆడుకోవటం నాకింకా గుర్తు. ఒకనాడు అన్నమయ్య వర్ణనకి వివరణ వ్రాస్తానని నేను కలగని కూడ వుండను. శ్రీహరి చక్రానికి ఇన్ని 'కోణాలు' ఉంటాయని ఎంతమందికి తెలుస్తుంది చెప్పండి... పండితులకి, పౌరాణికులకు మాత్రమే తెలిసిన ఈ సుదర్శన చక్ర వర్ణన ఈ కీర్తనద్వారా మనం తెలుసుకొన్నామంటే అది మన పూర్వజన్మ సుకృతమే కదా!

**ఆ.వె॥ అసుర ఘాతమైన హరిచేతి చక్రమా!**
**సమర విజయమైన చక్రిపనుప**
**ఇట్టి వర్ణనంబు నెరుగము యెన్నడు**
**అన్నమయ్య పొగిడె నద్భుతముగ.**

**రాగం : సాళంగనాట**

నమో నమో దానవ వినాశ చక్రమా
సమర విజయమైన సర్వేశు చక్రమా ॥నమో॥

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా
పట్టిన ఆయుధముల బలు చక్రమా
నెట్టన మూడుగన్నుల నిలిచిన చక్రమా
ఱట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా ॥నమో॥

ఆరయ నారు గోణాల నమరిన చక్రమా
ధారలు వేయిటి తోడి తగు చక్రమా
ఆరక మీదికి వెళ్ళే అగ్ని శిఖల చక్రమా
గారవాన నీ దాసుల గావవే చక్రమా ॥నమో॥





రవిచంద్ర కోటితేజ రాసియైన చక్రమా
దివిజ సేవితమైన దివ్యచక్రమా
తవిలి శ్రీవేంకటేశు దక్షిణ కర చక్రమా
యివల నీ దాసులము యేలుకోవే చక్రమా ॥నమో॥

**భావామృతం :**

ఓ సుదర్శన చక్రమా! దానవుల వినాశనమునకు రూపుదాల్చిన చక్రమా! సర్వేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునికి అనేక యుద్ధములలో విజయమును చేకూర్చిన చక్రమా! నమో నమః (నీకు వందనములు)

ఓ సుదర్శన చక్రమా! నీకు 'పదారు భుజాలు అమరినవి' (పదియారు వైపులున్నవి). శ్రీహరి పట్టిన ఆయుధములలోకెల్ల నీవే బలమైన దానివి. నెట్టన (అనివార్యమైన) త్రినేత్రమువంటి చక్రమా! ఱట్టుగా మన్నించవే మెఱయు చక్రమా! (ఱట్టు అంటే 'నింద' అని అర్థం. కాని ఇక్కడ బాహాటంగా ఆర్తులను మన్నించుమా సుదర్శనమా! అనే అర్థంలో అన్నమయ్య వాడారు) అని నా భావన.

పరిశీలించగా ఈ సుదర్శనానికి ఆరు కోణములున్నవి. దానికి వేయి పదునైన ధారలు (కోయుశక్తిగల అంచులు, కటింగ్ ఎడ్జెస్) వున్నవి. ఆర్పినా ఆరని అగ్ని కీలలు, విస్ఫులింగాలను వెదజల్లుతుంటే, అది మీది మీదికి వస్తుంటుంది. అట్టి సుదర్శన చక్రమా గారవాన (ప్రేమతో) నీ దాసులను రక్షింపుము.

ఓ సుదర్శన చక్రమా! నీవు కోటి సూర్యచంద్రుల దివ్య తేజస్సుకలదానవు. దేవతలచే సేవించబడు దివ్యమైనదానవు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని కుడిచేతిలో వెలుగొందు సుదర్శన చక్రమా! నీవు నీదాసులమైన మమ్ము పరిపాలించుకొనుము.

**4-52**

## మున్నుడి

ఈ కీర్తన పండరంగవిఠ్ఠలునిపై చెప్పారు అన్నమాచార్యులవారు. హంపీ విజయనగరంలోని విఠ్ఠలేశ్వరునిపైననే ఆయన చెప్పారు. కాని ఈ విఠ్ఠలుడే పండరిపురంలోని విఠ్ఠలునిగా అభేద దృష్టితో చెప్పారు. అన్నమయ్య తన సమకాలికుడైన పురంధరదాసుల వారి సహచర్యంతో విఠ్ఠలదేవునిపై కొన్ని కీర్తనలు చెప్పారు. శ్రీకృష్ణుని లీలలను బాల, ప్రౌఢ రాజలీల క్రింద విడగొట్టిన పెద్దలు మొదటి రెండు రకముల లీలలను విఠ్ఠలుని సేతలగా కీర్తించారు. ఆ స్వామియే తిరువేంకటాద్రిని ఉల్లమలర నిలిచాడంటారు అన్నమయ్య.

**ఉ॥ వెన్నలుగారెె నీ సెలవి విఠ్ఠలనాథ! మరింత 'నాలి' గా**
**నన్నిటుచూచి తుంటరితనంబుల నవ్వెదవేల న్యాయమా?**
**సన్నుతిజేసె విఠ్ఠలుని చక్కగ దూడలగాచి నాడనెన్**
**అన్నయ కీర్తనంబు విని ఆ తిరువేంకటనాథుడౌననున్.**

**రాగం: ముఖారి**

వెన్నలు సెలవి గారే విఠ్ఠలేశా
నన్ను జూచి నవ్వేవు నాలి విఠ్ఠలేశా ॥వెన్నలు॥

బాలులతో నాడియాడి బడలితివి రావయ్య
వేలేటికురుల ముద్దు విఠ్ఠలేశా
కాళింగు దొక్కితి వట కటకట వుద్దండాలు
వోలి జేయ దొరకొంటి వోవిఠ్ఠలేశా ॥వెన్నలు॥

దూడల వెంట దిరిగి దూళి మేన నంటె నిదే
వేడుక యెంతో నీకు విఠ్ఠలేశా
యేడకొండో వొకవేల నెత్తితివి నీవట
వోడక యింత సేతురా వో విఠ్ఠలేశా ॥వెన్నలు॥





గొల్లెతల నంటి యంటి గొల్లు మేన నిండె నిదే
వెల్లవిరాయ బనులు విఠ్ఠలేశా
యిల్లిదె పండరంగిని యిటు శ్రీవేంకటాద్రిని
వుల్ల మలర నిలిచితో లి విఠ్ఠలేశా ॥వెన్నలు॥

**భావామృతం :**

ఓ విఠ్ఠలేశ్వరా! నీ పెదవుల అంచుల (సెలవి) నుంచి వెన్నలు కారి, నీవు ఎవరికీ తెలియకుండా వెన్నతిన్నావని చెప్పకనే చెబుతున్నది. అయినా ఏమీ తెలియనట్లు 'నాలి'గా (టక్కరితనంతో) నన్ను జూచి నవ్వుతావు. నీవు ఘలేవాడివయ్యా!

ఓ విఠ్ఠలా! నీతోటి గోపబాలురతో ఏవేవో ఆటలు ఆడి యెంత అలసిపోయావో చూడు. నీ వేలేటి కురులు (ఉప్పెన వలె యెగసిపడే వెంట్రుకలు) ఎంత ముద్దొస్తున్నాయో చూడు. కాళింగుని ఆగడాలను నివారించుటకు, వాడియొక్క ప్రతాపము నణచుటకు పూనుకొంటివి విఠ్ఠలేశ్వరా!

ఓ విఠ్ఠలా! (బాలకృష్ణా) దూడలవెంట తిరిగి తిరిగి నీ ఒంటినిండా యెంత దుమ్ముకొట్టుకొనిపోయి వున్నదో గమనించావా? నీకు అదే గొప్ప వేడుకగా వున్నదేమో కాని (మీ అమ్మ యెంత కోపగించుతుందో) ఎలా వున్నావో చూడు. అదటువుంచి, యాడకొండో (యెక్కడి గోవర్ధన పర్వతమో) కాని దానిని ఒకవేలిమీద యెత్తినావు. ఏమాత్రమూ ఓడక (వెనుదీయక) ఇన్ని ఘనకార్యములను చేశావుకదయ్యా! విఠ్ఠలా! నీవు అసాధ్యుడవు.

స్వామీ! నీవు గొల్లభామలను అంటుకొని అంటుకొని తిరిగినందున వారి గొల్లకంపు నీకు కూడ అంటింది. నీవు చేసిన కొంటెపనులను ఆ కంపే వెల్లివిరాయె (బయటపెడుతున్నది). ఇదిగో ఇక్కడ పండరంగిలో వున్న నీవే, అక్కడ తిరుమలలో వున్న శ్రీవేంకటేశ్వరుడవు. నీవు మా హృదయములానందకందళితములగునట్లు మాయెదుట నిలిచియున్నావయ్యా! విఠ్ఠలేశ్వరా!

## మున్నుడి 4-53

బహుశా కృష్ణాష్టమినాడు అన్నమాచార్యులవారు ఈ కీర్తన చెప్పివుంటారు. "వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకొన్నా" డనే సామెతను ఈ కీర్తన కళ్ళకు కడుతుంది. ఆయన ఆ గాడిదకు 'కవణము' పెట్టాడట. శ్రీకృష్ణుడు గౌరవ దానవులను జంపాడట. కాయము దేవకికిచ్చాడట. వీయపు చుట్టాలెల్లవీడు వెట్టరో... అంటే? గంధాక్షతలు వాసుదేవుని కీయరో... అంటే? ఎన్ని సందేహాలొస్తున్నాయో చూశారా! ఈ వేంకటకృష్ణయ్య కీర్తనకు న్యాయం చేయాలనే... నా తపన.

**ఆ.వె॥ జోలపాడరేల జోజోయనుచు మీరు**
**సహజమౌ జయంతి సఫలమాయె**
**షోడశోపచారమిడరె వేంకట కృష్ణు**
**కనెను పాడి యిటుల అన్నమయ్య**

**రాగం : దేసాళం**

జోజోయని మీరు జోల పాడరో
సాజపు జయంతి నేడే సఫలమిందరికి ॥జోజో॥

అదె చంద్రోదయమాయ హరియవతారమందె
మొదలు జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణము జేయరో ॥జోజో॥

కాయము దేవకికిచ్చి గక్కున వాసుదేవుని-
కీయరో గంధాక్షతలిటు విడేలు
కాయకపు గాడిదెకు కవణము వెట్టిమరి
వీయపు చుట్టాలెల్ల వీడు వెట్టరో ॥జోజో॥

షోడశోపచారముల జొక్కించి శ్రీవేంకటేశు
బాడరో ధర్మము నిల్పె భారమణచె
వోడించె గౌరవదానవుల గంసాదుల జంపె
ఆడనే పాండవుల గాచెనని యర్ఘ్యమియ్యరో ॥జోజో॥





## భావామృతం

ఓ యువతుల్లారా! ఈరోజు 'సాజపు జయంతి'. (సహజముగా జరుపుకొను శ్రీకృష్ణ జయంతి) దీనిని సాఫల్యమగునట్లు జరుపుకొనండి. ఊయలలోని శిశువునకు జోజోయని జోలపాట పాడండి.

అదిగో చంద్రోదయమయింది చూడండి. శ్రీహరి అవతరించినాడు. మొట్టమొదట జాతకర్మలు (బొడ్డుకోయటం వంటివి) చేయండి. అదన (ఈ సమయమున) పుత్రోత్సవము అను 'ముచ్చట' జరుపండి. ఆపై పుణ్యాహము (పుణ్యాహవచనము అను పేరుగల ఆచారమున మూడుమార్లు పుణ్యాహము అని మంగళముల కొరకు చెప్పెదరు) చేయండి. కదిసి (సమీపించి) నామకరణ మహోత్సవము చేయండి.

ఓ నారీమణులారా! దేవకీదేవి ఇప్పుడే (గక్కున) ప్రసవించింది. ఆమెకు 'కాయము' (బాలెంతకు ఇచ్చే ఔషధము) ఈయండి. వాసుదేవునికి (వసుదేవునికి అని వుండాలి...) గంధాక్షతలు, విడేలు (తాంబూలము) ఈయండి. (దేవకి ప్రసవించగానే ఓండ్రబెట్టి తనను హెచ్చరించమని గార్ధభాసురుని కంసుడు నియమించాడట. ఇప్పుడా గాడిదను వసుదేవుడు కాళ్ళు పట్టుకొని ఓండ్రపెట్టవద్దని వేడుకొన్నాడట) గాడిద ఆయనను మన్నించి కాయకము (జీవనము) ఇచ్చిందట. అందుకు కృతజ్ఞతగా నేడు గాడిదకు 'కవణము' ఉలవలు మొదలైన పౌష్టికాహారము పెట్టండి. బంధువులంతా వచ్చారు. వీయపు చుట్టాలెల్ల వీడువెట్టరో (వియ్యాలవారు వచ్చి గుమిగూడండయ్యా!)

ఓ భామల్లారా! ఆ బాలకృష్ణుడే ఈ తిరుమలలోని వేంకటేశ్వరుడు. చొక్కించి (పరవశించి) ఆయనకు షోడశోపచారములు చేయండి. ఈయనే ఆనాటి శ్రీకృష్ణునిగా ధర్మసంస్థాపనము జేసి, భూభారమును, తగ్గించటానికి అవతరించి, కంసాది 'గౌరవదానవులను' (గొప్ప రాక్షసులను) ఓడించి చంపియున్నాడు. పాండవులను అక్కడే రక్షించాడు. ఆనాడు ధర్మజుడిచ్చినట్లు నేడు మీరూ ఈయనకు అర్ఘ్యమునియ్యండి.

4-54

## మున్నుడి

విరాగియైన అన్నమాచార్యులవారు అనేక అద్భుత వైరాగ్య కీర్తనలు చెప్పారు. అన్నిటికీ కారణం 'హరిమాయ' కదా! ఇంకా విచారించడం దేనికి? శ్రీవేంకటేశ్వరుని శరణని చేసిన పాపాలన్నీ పొగమంచులా రూపుమాపుకోరాదా? అంటున్నారు. టెంకాయలో నీరు వచ్చినట్లు, ఏనుగు తిన్న వెలగపండులో గుజ్జు పోయినట్లు మేళ్ళూ (మంచి) కీళ్ళూ (చెడు) వస్తూపోతూనే వుంటాయి. మనం చేసేది యేదైనా వుందంటే ఆ శ్రీహరిని 'శరణు మహాప్రభో!' అనడమే. ఆ తరువాతి కాలంలో వచ్చిన అనేక 'సుభాషితాలకు' అన్నమయ్యే మూలమనడానికి ఈ కీర్తన చాలదా?

**ఉ॥ ఇందుకు యేలరా వగపు ఈశ్వరు మాయలివెంచి చూడగా**
**యెందుకు మూలమౌ హరిని యెంచవు చింతనజేయవేలనో?**
**అందని నారికేళమున అద్భుతనీరములెట్లు వచ్చెరా**
**పొందుగ వేంకటేశ్వరుని మొక్కరొ దిక్కని అన్నమయ్యనెన్.**

**రాగం : మాళవి**

ఇందులకు జింతించనేల - యీశ్వరుని మాయలివి
యెందుకు మూలము హరి - యీతని జింతించరే ॥ఇందులకు॥

ఇల నారికడపుగా - య(యె) కు నీరు వచ్చినయట్టు
తలచి రాగలమేలు - తన్ను దానే వచ్చురే
లలి నేనుగు దిన్న వె - లగ పంటి బేసము
వలనే పోగలవెల్ల - వడి దానే పోవురే ॥ఇందులకు॥

నిండిన యుద్దములోన - నీడ వొడచూపినట్లు
దండియైన పుట్టుగులు - తన్నుదానే వచ్చురే
పండిన పండ్లు తొడమ - బాసి వూడినయట్లు
అండనే మరణములు - అందరికి సరిరే ॥ఇందులకు॥





పెనురాతిపై గడవ - పెట్టగా గుదురైనట్లు
తనుదానే చింతింప - దలపు నిలుచురే
ఘనుడు శ్రీవేంకటేశు - గని శరణన్న జాలు
వెనక పాపాలు మంచు - విచ్చినట్లు విచ్చురే ॥ఇందులకు॥

**భావామృతం :**

ఓ నరుడా! ఇందుకోసం చింతించుట దేనికి? అన్నిటికీ (చావు పుట్టుకలకు, శుభాశుభాలకు) కారణం ఆ ఈశ్వరుడే కదా? ఆయన మాయవలననే అన్నీ జరుగుతాయి. కనక ఆ శ్రీహరినే చింతించి శరణు పొందరాదా?

శ్రీహరి కరుణవలన మనకి జరుగవలసిన మంచి మన ప్రమేయం లేకనే జరుగుతుంటుంది. నారికడపుగాయ (టెంకాయ) లో తీయటి నీరు వచ్చినట్లు వస్తూనే వుంటుంది. శ్రీహరి కృపలేకపోతే ఏనుగు మింగిన వెలగపండులో 'గుజ్జు' మాయమైనట్లు వైభవం పోయి తనకు తానే మటుమాయమైపోతుంది.

నిండు అద్దములో నీడలు (ప్రతిబింబాలు) వాటంతట అవే అనేకం వస్తూ పోతూవుంటాయి. ఏదీ స్థిరంగా నిత్యముగావుండదు. అదేవిధముగా అంతులేని పుట్టుకలూ, మరణాలూ వాటికవే సంభవిస్తూనే వుంటాయి. ఆ శ్రీహరిని రమ్మని పిలిచినప్పుడు తొడిమ వూడి పండు తనంతతానే పడిపోయినట్లు ఈ శరీరమూ దానంతట అదే పడిపోతుంది. ఇవి అందరికీ సరిరే... (అందరికీ సమానమేరా...) భగవంతునిగా పూజలందుకొనే వానికైనా, పరమ నికృష్టునికైనా ఒకేలా జరుగుతాయి.

పెద్దరాతిపై ఒక నీటి కడవ పెట్టాలని ప్రయత్నం చేస్తే మొట్టమొదటి ప్రయత్నంలోనే సాధ్యం కాదు. కానీ ప్రయత్నం చేస్తుంటే దానంతటదే కుదురుగా నిలబడుతుంది. మనస్సు నిలకడ పొందాలంటే ఒక్కసారిగా జరిగే పనికాదు. సాధనవలననే పనులు సమకూరు జగతిని. స్థిరచిత్తం కూడా ప్రయత్నంవలననే అబ్బుతుంది. సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరుని శరణంటే చాలును మనం వెనక జన్మలలో చేసిన పాపాలు కూడా పొగమంచువలె విడిపోయి విచ్చుకొంటాయిరా...

**4-55**

## మున్నుడి

సంస్కృతంలో నా పాండిత్యం 'అమావాస్య చంద్రుడు'. నా మిత్రుల సహకారంతో దీని తాత్పర్యం ఒకచోట క్రోడీకరించి, భావామృతం ఎలా వ్రాయాలా అని ఆలోచించాను. ఆలోచించినకొద్దీ అన్నమాచార్యులవారు శ్రీహరి దశావతారములను గానం చేస్తున్నారేమో... అనిపించింది. నా వివరణే ఆచార్యులవారి మనోగతం అనే సాహసం చేయలేను, కాని సప్తవర్ణ భూషితమైన సూర్యకాంతి ఏ వర్ణమని చెప్పగలం. భావయామి వేంకటేశమ్‌లో ఆ స్వామిని యెలా అయినా భావించ వచ్చును. ఇలా... భావించి... చూడండి.

**ఆ.వె॥ తరచి తరచి చూడ హరి అవతారముల్**
**మెరిసె తళుకుమనుచు మేధయందు**
**ఏమి కీర్తనంబు!! అమరవాణియె భళా!**
**అన్నమయ్య సాటి అవని కలరె?**

**రాగం : బేగడ**

సతతం శ్రీశం
హితం పరాత్పర మీడే ॥సతతం॥

గదాధరం మేఘ గంభీర ని-
నదం పరమోన్నత శుభదం
మృదుతర గమనం మేదినీధరం
హృదయ నిలయ మహమీడే ॥సతతం॥

నందకధరం జనార్దనం గో-
విందం చారు ముకుందం
నందగోప వరనందన కందం
యిందు రవి నయన మీడే ॥సతతం॥





గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరి దేవ మతులం మ-
హిరమణం స్థిరమీడే ॥సతతం॥

**భావామృతం :**

సతతం (ఎల్లప్పుడు) శుభంకరుడును, హితం (శ్రేయస్సును ప్రసాదించువాడను) పరాత్పరం (శ్రేష్ఠులకెల్ల శ్రేష్ఠుడును), అయిన వానిని, ఈడే (ప్రార్థించుచున్నాను).

గదాధరం (కౌమోదకి అను గదను ధరించు వాడును) మేఘ గంభీర నినదం (మేఘ గర్జనవంటి కంఠ స్వరం కలిగినవాడును... నరసింహుడు), మిక్కిలి ఉన్నతమైన శుభప్రదములైన వాటిని నొసగినవాడును (వేదములనిచ్చిన మత్స్యావతారుడు), మృదుతర గమనం (మెల్లగా కదలు చలనము కలవాడును... కూర్మావతారం), మేదినీధరం (భూమిని తనముట్టెపై ధరించినవాడును (వరాహావతారం) సర్వజనుల హృదయ వాసియైన మహానుభావుని ప్రార్థించుచున్నాను.

నందకము అను ఖడ్గమును ధరించువాడును (కల్కిఅవతారం), జనార్దనం (జనులచేత వేడుకోబడినవాడు... శ్రీరాముడు), గోవిందం (గోవులను కాచినవాడును... బలరాముడు), చారు ముకుందం (అందమైన పద్మమును హస్తమున దాల్చిన వాడును), నందగోప వరనందనకందం (నందగోపునికి శ్రేష్ఠమైన ఆనందము నొసగు స్వరూపము కలవాడును... శ్రీకృష్ణావతారము), రవిచంద్రులు నయనములుగా భాసించినవాడును... (త్రివిక్రముడైన వామనుడు) అయిన సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను.

గరుత్మంతునిపై పయనించువాడును, ఉరగశయనం (ఆదిశేషునిపై నిద్రించువాడును), పరమపదేశం (పరమ్+అపదేశమ్=పరమును సాధించుటెట్లో తెలిసినవాడును... బుద్ధావతారము), ఇప్పుడు ఇవన్నీ ఒకేచోట వెలసిన తిరువేంకటాచలాధిపతియుయైన స్థిరమైన శ్రీవేంకటేశ్వరుని నేను ప్రార్థించుచున్నాను.

## 4-56

## మున్నుడి

'త్రువి' అనే పదము యే నిఘంటువులో వెదకినా దొరకదు. చిన్న పాపలు తమ రెండు పెదవులను ఒకేసారి కదిలిస్తూ 'గాలి'ని బయటకు వదిలితే 'త్రువ్' అనే ధ్వని వస్తుంది. పెద్దవాళ్ళు అలా చేస్తే పాప ఆ ధ్వనికి నవ్వుతుంది. వాళ్ళు పాపని నవ్వించటానికి అలా చేయగా పాపకూడా నేర్చుకొంటుంది. "త్రువ్వట బాబా తలపై"... అనే తెనాలి రామకృష్ణుని పద్యం ఒకటి విన్నాను నా చిన్నప్పుడు. చిన్నారి కృష్ణయ్యకు 'త్రువి' పాట పాడిన అన్నమాచార్యులవారు, అది చదువుతున్న మనం యెంత అదృష్టవంతులం!!!

**ఆ.వె.॥ అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు**
**వేంకటగిరిపైన వెలయు శిశువు**
**దొబ్బురోలు శిశువు త్రువి త్రువి త్రువియని**
**అన్నమయ్య పాడెనద్భుతముగ.**

**రాగం : మంగళకేశిక**

అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు
దొబ్బుడు రోలశిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

పుట్టు శంఖ చక్రముల బుట్టిన యా శిశువు
పుట్టుకతోల్లేమారు పుట్టువైన శిశువు
వొట్టుక పాలువెన్నలు నోలలాడు శిశువు
తొట్టెలలోని శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

నిండిన బండి దన్నిన చిన్ని శిశువు
అండవారి మదమెల్ల నణచిన శిశువు
కొండలంతేశసురుల గొట్టిన యాశిశువు
దుండగంపు శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥





వేగైన వేంకటగిరి వెలసిన శిశువు
కౌగిటి యిందిర దొలగని శిశువు
ఆగిపాల జలధిలో నందమైన పెనుబాము
తూగు మంచము శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

## భావామృతం

ఈ శిశువు చాల అబ్బురంపు శిశువు (ఆశ్చర్యకరమైన పాపాయి). వీడు ఆకుమీది శిశువు (ఆనాడు జగత్తంతా నీటితో నిండిపోయినప్పుడు మఱ్ఱి ఆకుమీద పవళించిన శిశువు). ఇతడు "దొబ్బుడు రోల శిశువు" (ఱోటిని తోసుకుంటూ పోయి మద్దిచెట్లు కూల్చిన శిశువు). త్రువి...త్రువి...త్రువి.

ఇతడు శంఖ చక్రాలతో జన్మించిన శిశువు. ఇతడు 'పుట్టుకతోల్లే మారుపుట్టువైన శిశువు' అనగా, పుట్టిననాడే మార్పిడి జెందిన శిశువు (యశోద కన్న ఆడ శిశువు స్థానంలో తను పెరిగిన శిశువు). ఇతడు పాలు వెన్నలు అధికముగా కలుగుటచే వాటిలో ఓలలాడిన శిశువు. రేపల్లెలో ప్రతి స్త్రీ తొట్టెలలో వేసి వూపి తరించిన శిశువు. త్రువి...త్రువి...త్రువి.

ఇతడు 'నిండిన బండి' ని (పూర్తిగా సిద్ధముగా వున్న శకటమును) ఒక్క తాపు తన్నిన చిన్ని శిశువు. (శకటాసురవధ చేశాడు కదా!) అండవారు (రాజులు) అనబడు మదాంధుల మదమును నిర్మూలించిన శిశువు. కొండలంతేశసురులగొట్టిన శిశువు, (పర్వతాలవంటి పూతన మొదలైన రాక్షసులను తుదముట్టించిన శిశువు). ఇతడు దుండగంపు శిశువు (దుష్టుడైన పిల్లవాడు... అన్నీ పాడుచేయు అల్లరివాడు) త్రువి...త్రువి...త్రువి.

ఇతడే వేంకటాద్రిమీద వెలసిన 'వేగైన' శిశువు. వేగముగా కనికరించు శిశువు. ఇతడు తన కౌగిట లక్ష్మీదేవిని యెల్లప్పుడు తొలగక స్థిరవాసము చేసికొనిన శిశువు. ఇతడు పాలసముద్రముపై విశ్రమించిన శిశువు. ఇతడు తూగుమంచముపై (వూగుతున్న వూయలే మంచముగా) పవళించు శిశువు. త్రువి...త్రువి...త్రువి.

4-57

## మున్నుడి

అన్నమాచార్యులవారి 'అలరులు కురియగ నాడెనదే' అనే జగద్విఖ్యాతమైన కీర్తనకు, ఈ కీర్తనకు ఎన్నో పోలికలున్నాయి. ఈ లలిత శృంగార కీర్తనలో అమ్మ అలమేల్మంగ సొగసులను వర్ణిస్తున్నారు, ఆచార్యులవారు. ఆమె ప్రదర్శించే చిరు సిగ్గు సిరిదొలకుతున్నదట. లలితమైన లావణ్యపు విలాసముతో ఆ నెలత (యువతి), శ్రీనివాసునికి తనను తానర్పించుకొని నేటితో ధన్యత పొందినది అంటున్నారు. ఎందుకంటే... ఆమె తిరువేంకటాచలాధిపుని మన్నన పొందిందట.

**తే॥ లలిత లావణ్య గరిమ విలాస మొప్ప**
**నెలత ధన్యత గాంచెను నేటితోడ**
**వేంకటేశుని మన్నన పేర్మినొందె**
**అరవిరై యొప్పె తెలిపెను అన్నమయ్య.**

**రాగం : లలిత**

లలిత లావణ్య విలాసము తోడ
నెలత ధన్యత గలిగె నేటి తోడ ॥లలిత॥

కుప్పలుగా మైన సలుకొన్న కస్తూరితోడ
తొప్పదోగేటి చెమటతోడ
అప్పుడటు శశిరేఖలైన చనుగవతోడ
దప్పిదేరేటి మోము తమ్మితోడ ॥లలిత॥

కులుకు గబరీభరము కుంతలంబులతోడ
తొలగదోయని ప్రేమతోడ
మొలక నవ్వులు దొలకు ముద్దు చూపులతోడ
పులకలు పొడవైన పొలుపుతోడ ॥లలిత॥





తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ
సరిలేని దివ్య వాసనల తోడ
పరికించరాని అరవిరి భావము తోడ
సిరి దొలకెడి చిన్ని సిగ్గుతోడ ॥లలిత॥

**భావామృతం**

లలితమైన (అందమైన) ఆమె లావణ్యము (ముఖకాంతి) యొక్క విలాసము (ప్రియుని సందర్శనముచే ఇనుమడించిన ముఖసౌందర్యము) తోడై ఆ నెలత (యువతి) నేటితో ధన్యత బొందినది.

ఆమె తన శరీరముపై కస్తూరిని కుప్పలుగా సలుకొన్నది (మెత్తుకున్నది). ఆమెకు కంగారుతో 'తొప్పదోగేటి చెమట' (తడిసి ముద్ద అయ్యేంత చెమట) పట్టినది. ఆమె కుచయుగళము అర్ధచంద్రుని రేఖలై మెఱయుచున్నవి. నోరు తడి ఆరిపోతున్నందున ఆమె తాంబాలమును సేవించినది. ఆ తాంబూలపు తెమ్మతో ఆమె ముఖసౌందర్యం ఇంకా ఎక్కువయింది.

స్వామిపై ప్రేమ భావములు వుప్పొంగి ఆమె కులికినది. అప్పుడామె కబరీ భారములోని (కొప్పులోని) కుంతలములు (కేశములు) రేగి ఆమె వాటిని మెల్లిగా సవరించుకొనుచున్నది. స్వామి ఆలోచనలతో ఆమె పెదవులపై చిరునవ్వు నాట్యమాడింది. ముద్దు చూపులతో దీర్ఘమైన పులకరింత వలన ఆమె అందం ద్విగుణీకృతమైంది.

ఆమెకు అంతలోనే తిరువేంకటాచలాధీశుని మన్నన కలిగింది. సాటిలేని దివ్యమైన పూర్వజన్మ స్మృతులు ఆమెకు కలిగినవి. తను శ్రీలక్ష్మినని, ఆమెకు అవగతమవగానే ఎన్నడూ కానరాని 'అరవిరి భావములు' (అప్పుడే మొగ్గ తొడుగుతున్న భావములు) ఆమెలో పొడచూపి, వైభవోపేతమైన లేత సిగ్గుల దొంతరయైనది ఆ శ్రీదేవి.

**4-58**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని రథోత్సవమును కన్నుల పండుగలా చూచి పులకించిన అన్నమాచార్యులవారు, చక్కటి కీర్తనను వినిపిస్తున్నారు. ఇందిరానాథుడు తేరుమీద వస్తున్నాడు, హారతులు, కానుకలు ఈయండి. సృష్టిలోని జీవకోట్లే కాక, ముక్తిపొంది నిత్యులైన దివ్యాత్మలు కూడ, మూవరుసలలో (మూడు వరుసలలో) కొలిచే తేరు ఇదే నంటున్నారు. వేదములు ఈ స్వామి రథమునకు లాగే త్రాళ్ళట. పంచభూతముల తేరు... అంటే జీవనాధారమైన పంచభూతములన్నీ కనరాని దేవతలై కొలిచే తేరు అని నేను భావించాను.

**ఉ॥ ఆరతులెత్తరో హరికి ఆవల కానుక లీయరో వెసన్**
**కూరిమి ఇందిరారమణు గొల్వరొ ఏగుచు వచ్చె వీధులన్**
**తేరున వేంకటేశ్వరుని తేకొని గాంచుడు అన్నమయ్యనెన్**
**మీరిన భక్తితో వినిచె మేలగు కీర్తన నాలకింపరో.**

**రాగం : బౌళి**

ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేగి వచ్చీని యిందిరానాథుడు ॥ఎత్తరో॥

గరుడ ధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదముల చేరుల తేరు
సురలు మునులు బట్టి సొంపుతోడ దియ్యగాను
యిరవుగ నేగివచ్చీ నిందిరా నాథుడు ॥ఎత్తరో॥

జీవకోట్లున్న తేరు శేషుడే రూపైన తేరు
వేవేల సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువగా
యీవల నేగి వచ్చీ నిందిరానాథుడు ॥ఎత్తరో॥





పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రి మీదటి తేరు
కొంచక యలమేల్మంగ గూడివచ్చేనదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుడు ॥ఎత్తరో॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఇత్తలన్ (ఇక్కడ) ఇందిరానాథుడైన శ్రీవేంకటేశ్వరుడు, యేగివచ్చె (ప్రయాణమై వస్తున్నాడు). ఈ మహానుభావునికి హారతులెత్తండి. విరివిగా కానుకల నర్పించి తరించండి.

ఈ తేరు గరుడధ్వజము యెత్తినటువంటి తేరు. ఇది బంగారముతో నిండిపోయిన తేరు. దీనికి వైభవోపేతముగా చతుర్వేదములు, నాలుగు చేరులై (కట్టిలాగునటువంటి త్రాళ్ళు) శోభిల్లినవి. దేవతలు, మునులు పట్టుకొని సొంపుగా తీయగా కీర్తిస్తూ తాము కూడ ఈ తేరు త్రాళ్ళు పట్టి లాగుతున్నారు. (మనబోటి అల్పులకు వారు కనిపించరు). ఈ విధంగా నెలకొని ఇందిరానాథుడు తెరుమీద వస్తున్నాడు.

ఆదిశేషుడు భరించి ధరించిన తిరుమలనాయకుడున్న ఈ తేరు వస్తుంటే, సృష్టిలోని జీవకోట్లే కాక ముక్తి పొందిన వారు, నిత్యులైన ఈ లోకంలో వుండి స్వామిని సేవించే దివ్యాత్మలు కూడ మూడు వరుసలలో నిలిచి వెంట వూరేగి వస్తున్నారు. ఈ ఏడుకొండలవాడిని ఇందిరానాథుని కొలిచి తరించండి.

పంచభూతములని పిలువబడే భూమి, గాలి, నీరు, కాంతి, శూన్యము దేవతా స్వరూపులై దివ్యశక్తులై ఈ స్వామిని సేవిస్తాయి. ఆయన వచ్చే ఈ బ్రహ్మాండమైన తేరుని లాగుతుంటాయి. ఉన్నతమైన శ్రీవేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగతో కూడి "కొంచకనేగివచ్చె", సంకోచము లేక వూరేగి వస్తున్నాడు. లెక్కించలేని మహిమలుగల ఈ దేవదేవుని, ఇందిరానాథుని సేవించండి... తరించండి.

## 4-59

## మున్నుడి

మారుమూల ప్రదేశాలకు పోయి (మధురానగరంలో) చల్ల అమ్ముకొంటున్నారు రేపల్లెలోని గొల్లభామలు. అన్నమాచార్యులవారు అవి యెటువంటి చల్లలో వర్ణిస్తున్నారు. కూచిపూడి వారి "మధురానగరిలో చల్లలమ్మబోదూ...' వంటి కీర్తనలకు, మూలములు ఇట్లాంటి అన్నమయ్య కీర్తనలేనేమో అని నాకు అనిపిస్తుంటుంది. ఈ కీర్తన మొదటి పాదంలో 'నమ్ముదు' ఆఖరి పాదములో 'నమ్మీ' ఒకటే అనుకొంటే... తొందరపడక జాగ్రత్తగా భావామృతం చదవాల్సి వుంటుంది. ఎంత చక్కని కీర్తనో కదా!

**ఆ.వె॥ మూలమూలపోయి ముద్దుగుమ్మలు చల్ల**
**అమ్ముచుందురనెను అన్నమయ్య**
**రేయి బగలు త్రాగరే యని పాడెను**
**చల్లగూర్చి ఎవడు అల్లె కవిత?**

**రాగం : పాడి**

మూలమూల నమ్ముదు చల్ల ఇది
రేలు బగలు గొనరే చల్ల ॥మూల॥

పిక్కటిల్లు చన్నుల గుబ్బెత వొకతి కదు
జక్కనిది చిలికిన చల్ల
అక్కున జెమట గార నమ్మీని యిది
యెక్కడ బుట్టదు గొనరే చల్ల ॥మూల॥

వడ చల్లు మేని జవ్వని వొకతి కదు
జడియుచు జిలికిన చల్ల
తడబడు కమ్మని తావులది మీ-
రెడయ కిపుదు గొనరే చల్ల ॥మూల॥





అంకుల కరముల వొయ్యారొకతి కదు
జంకెనల జిలికిన చల్ల
వేంకటగిరిపతి వేడుకది
యింకానమ్మీ గొనరే చల్ల ॥మూల॥

**భావామృతం :**

ఓ జనులారా! మధురానగరంలో మారుమూల ప్రదేశాలకు కూడ పోయి, రేపల్లె గొల్లభామలమైన మేము అమ్ముకొనే చల్ల ఇదిగో రాత్రి కాని, పగలు కాని దీనిని కొనుక్కొని త్రాగండి.

ఈ చల్లని చూశారా? పిక్కటిల్లు చన్నులు గల ఒక చక్కని చుక్క, దీనిని చిలికినది. గుండెలపై చెమట ధారాళంగా కారుతున్నా లెక్కసేయక తిరిగి తిరిగి అమ్మినటువంటి చల్ల ఇది. ఇటువంటి చల్ల ఎక్కడా పుట్టదు. ఇప్పుడు దొరికింది కాబట్టి ఈ చల్ల త్రాగండి.

ఒంట్లో వేడి అధికంగా వున్న ఒక గొల్లభామ, ఎంతో భయంతో (వడకుతూ) జాగ్రత్తగా చిలికిన చల్ల ఇది. ఈ చల్ల తావులు (పరిమళములు) కమ్మగా వుండి మీకు తడబాటు కలుగజేస్తాయి. కావున మీరంతా వదలకుండా ఇప్పుడే ఈ చల్ల త్రాగండి.

ఈ చల్లని చూశారా? ఒక ఒయ్యారి దీనిని అంకుల కరములతో (లేత మొగ్గల్లాంటి చేతులతో) జంకెనల (బెదరింపులకు లోనై) చిలికినది. అందుకని ఇదంటే ఏడుకొండల వేంకన్నరునకు భలే ఇష్టము. (ఆయనకి కావలసింది మన భయ భక్తులే కదా!) అందుకని ఆ స్వామిని ఇంకా యెక్కువగా 'నమ్మి' ఈ చల్లని సేవించండి. తరించండి.

**4-60**

## మున్నుడి

విశిష్టాద్వైత మతం స్వీకరించి అన్నమాచార్యులయిన అన్నమయ్య వైష్ణవ ప్రాశస్త్యంపై లెక్కకు మిక్కుటమైన కీర్తనలు చెప్పారు. ఈ కీర్తనలో విష్ణుపాదసేవా మహాత్మ్యమును వివరిస్తున్నారు ఆచార్యులవారు ఇహపరసాధనములైన ఆ శ్రీహరి పాదముల మహిమ మీరూ ఈ సంకీర్తనలో అవధరించండి. వేంకటరమణుడైన, అనంతుని పాదములే ఆయుష్యభౌష్యములట, అంటే... చదవండి మరి...

**చం॥ వదలము విష్ణుపాదములు మాకవి విద్య సుబుద్ధి నీయుగా**
**చెదరక వైష్ణవంబుగొని శ్రీపతి నమ్మితిమింక కర్మమా**
**వదలుము మమ్ములన్ హరికి భక్తుల మంచనె అన్నమార్యుదున్**
**ముదముగ బొందుచున్ శరణు మోక్షపు బాటను తొక్కెరా భళా!!**

**రాగం : వసంత**

విష్ణుదేవ పాదములే విద్యాబుద్ధీ మాకు
వైష్ణవుల మైతి మింక వదలవో కర్మమా ॥విష్ణు॥

గోవిందుని పాదములే కోరి యిహపరములు
శ్రీవిభుని పాదములే చేరు వేదశాస్త్రములు
దేవదేవుపాదములే దిక్కును దెసయు మాకు
భావములో నిలిపితి పాయరో పాపములు ॥విష్ణు॥

హరిపాదములే మాకు నన్నపాన భోగములు
పరమాత్మ పాదములే పాడీ పంటామాకు
మురహరి పాదములే ముందర వెనకా మాకు
శరణంటి మెండైనా చనరో దుఃఖములు ॥విష్ణు॥





అనంతుని పాదములే ఆయుష్య భౌష్యములు
దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు
యెనలేని శ్రీవేంకటేశుడితని పాదములే
మనసున గొలిచితి మానరో భవములు ॥విష్ణు॥

**భావామృతం :**

ఓ భక్తులారా! శ్రీమన్నారాయణుడైన విష్ణుమూర్తి పాదపద్మములే మాకు విద్యాబుద్ధులు. ఓ కర్మమా! మేమిప్పుడు విశిష్టాద్వైతమతం స్వీకరించి వైష్ణవులమయ్యాము. కావున నీవు మమ్మల్ని వదలిపెట్టుము.

గోవిందుని పాదములే మాకు ఇహపరసాధనములు. అన్యమైనవి కోరనేల? మేము శ్రీపతి పాదములు చేరుకొంటే చతుర్వేదములు పఠించినట్లే. మాకు దిక్కుదారి కూడ ఆ దేవదేవుని పాదములే.

మాకు అన్నపానములందించే భోగముకూడ శ్రీహరి పాదపద్మములే. మా ఇంట పాడీ పంటాకూడ పరమాత్మ యొక్క పాదపంకజములే. మా వెనక ముందు వేరే మంచి కోరువారులేరు. ఆ శ్రీహరి పాదములే మాకు మంచి నిచ్చేవి. మేము ఆ లక్ష్మీవల్లభుని ఆశ్రయించాము. ఆయన శరణు పొందాము. కనుక దుఃఖములారా! మీరెక్కడి కన్నా వెళ్లిపోండి.

అనంతుని పాదపంకజములే మాకు ఆయురారోగ్యముల నందించును. దానవ వైరియైన దామోదరుని పాదములే మా పాలిట ధనధాన్యములు మరియు ధర్మముకూడా. లెక్కింపరాని శ్రీవేంకటేశ్వరుని పాదపద్మములే నా మనస్సున ఆరాధించుచున్నాను. ఇక భవబంధముల బాధ మాకేల?

## మున్నుడి

బహుశా హంపీ విజయనగరంలోని విఠలేశ్వరునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అనేక కీర్తనలలో ఇది ఒకటి అయివుంటుంది. పండరంగినాథునివి రుచులైన మాటలు. తమని రూఢి కెక్కించిన రచనకాడలు. స్వామి నవ్వులు చిలకరిస్తున్నట్లు ఆ మూర్తి వున్నదేమో అనిపిస్తోంది. పులకలు పైరులవలె విస్తరించినట్లు ఒక్క అన్నమయ్య మాత్రమే భావించగలరు. 'బాపు' అంటే నేటికాలంలో 'అమ్మబాబోయ్' అనటం వంటిది.

**చం॥ రసికుడ పండరంగి విఠలా! యని పాడెను అన్నమయ్యనీ**
**పసలను చిక్కినామనెను భామినియై తను చెప్పె కీర్తనన్**
**ముసిముసి నవ్వుతో ముదిత ముంగిట చన్నులనంటి నాడనెన్**
**వెసగల రంగడే వెలసె వేంకటనాథుని రూపుతో యనెన్**

**రాగం : దేసాళం**

రసికుడవౌదు పండరంగినాథా నీ
పసల జిక్కితి మిదె పండరంగినాథా ॥రసికుడ॥

యివ్వల నవ్వల నేడు యిటు నీతో నవ్వి నవ్వి
రవ్వైతిమి గదో పండరంగినాథా
కువ్వ లాయ నీ చేతలు గురి యయితి మింతకు
పవ్వళించితిరి మేలు పండరంగినాథా ॥రసికుడ॥

రుచు లైన నీమాటలె రూఢి కెక్కించెను మమ్ము
రచనకాడ వో పండరంగినాథా
యిచట నీ రాకలకు నెదురు చూపించి మేలె
పచరించితివి బాపు పండరంగినాథా ॥రసికుడ॥





సారె దీసితివి కొప్పు చన్నులంటి చూపితివి
రారాదా యిక పండరంగినాథా
కూరిమి శ్రీవేంకటాద్రి గూడి చొక్కించితి మమ్ము
పైరు లాయ బులకలు పండరంగినాథా ॥రసికుడ॥

**భావామృతం :**

ఓ పాండురంగ విఠలా! నీవు చక్కటి 'రసికుడ'వయ్యా! మేమేమో నీ పసల (చాతుర్యమునకు) చిక్కినాము ప్రభూ!

ఓ పండరంగి నాథా! నీవు ఇట్లా నవ్వుతుంటే మేముకూడ నీతోబాటు నవ్వినవ్వి, రవ్వయితిమి (చులకనయిపోయాం). నీ చిలిపి చేష్టలు కువ్వలాయ (చాల యెక్కువైనాయి). నీవల్ల మేము ఇన్ని చిక్కుల్లో పడ్డాము. ఇకనైనా నీవు నీ దేవేరులు పవ్వళించారు. మాకదే మేలు.

ఓ విఠలా! రుచికరమైన నీమాటలు, రూఢి కెక్కించెను (మమ్ము నలుగురి నోళ్లల్లో నానేట్లు చేశాయి). నీవు యెంత రచనకాడవు!!). ఇక్కడ నీరాక కోసం మేం యెదురు తెన్నులు చూసేట్లు చేసి మమ్ము పచరించితివి (తినేసినంత పనిచేశావు) స్వామీ!

ఓ పండరంగినాథా! ఇంకా యేం చెప్పమంటావు. ప్రభూ! నీవు కొప్పును సారెదీసితివి. (నీ కొప్పును చుట్టవలె చుట్టుకొంటివి). మధ్యమధ్య మా స్తనములను యేదో ఒక నెపంతో తాకుచునే యుంటివి. ఇప్పుడెవరు కాదన్నారు? ఒక్కసారి మావద్దకు రారాదా? నీకు మాత్రం తీరిక యెక్కడిదయ్యా! శ్రీవేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుడువై మమ్మల్ని పరవశింపచేస్తూ నే వున్నావు కదా! ఓ పండరంగినాథా! నిన్ను తలచినంత మాత్రాన మా శరీరంపై పులకరింతలు 'పైరులాయ' (విరివిగా పండిన పైరువలె మొలకలెత్తాయి) ప్రభూ!

**4-62**

## మున్నుడి

అలమేల్మంగను వేంకటేశ్వరుడు పరిణయమాడుతున్నాడు. ఐదురోజుల పెళ్ళి. నిర్వాహకులు అన్నమాచార్యులవారు. తానే ఒక పేరంటాలై తోటి వారితో ఈ పెండ్లికొడుకు, పెండ్లికూతురు మాటిమాటికీ సంతోషపడుతూ ఆనందంలో తలమునకలైయున్నారు. మీరంతా పాడుతూ వారినింకా సంతోషపెట్టండి అంటున్నారు. ముహూర్తం దగ్గర పడుతుంటే తత్తరపాట్లు పడతారెందుకు అని హెచ్చరిస్తున్నారు. ఘన రతుల నలసిన వేళ గంధము, కస్తూరి ఇమ్మనటం ఆచార్యులవారి ప్రత్యేకత. వారికే స్వామివద్ద ఆ చనువు వున్నది.

**కం॥ పేరంటాండ్లను పిలిచెను**
**పేరిమితో నన్నమయ్య పెండిలి జూడన్**
**శ్రీరమణి వేంకటేశుని**
**చేరువయై పెండ్లియాడె సిరులొలుక ననెన్**

**రాగం : సాళంగనాట**

పేరంటాండ్లు పాడరే పెండ్లివేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ ॥పేరం॥

చిత్తజు తల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించే రిదె ముహూర్తపువేళ
హత్తి తలబాలు నారాయణుని బోయుమనరె
పొత్తుల నిద్దరికిని బువ్వపు వేళ ॥పేరం॥

పాలవెల్లి కూతురుకు పసపులు నలచరే
చాలించరే జోలి వీడు చదివే వేళ
పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగో దినము నేడు నాగవెల్లి వేళ ॥పేరం॥





అంది బో(బా)గాలియ్యరే అలమేలు మంగకును
కందువ శ్రీవేంకటేశు గలసేవేళ
గందము గస్తూరి నీరె ఘనరతి నలసిరి
కుందక యిద్దరు నిక గొలువుండేవేళ ॥పేరం॥

## భావామృతం

ఓ పేరంటాండ్లలారా! శ్రీవేంకటేశ్వరుడు తన ప్రియురాలు అలమేల్మంగను పరిణయమాడుతున్నాడు. మీరంతా చక్కటి పెండ్లిపాటను అందుకోండి. మాటిమాటికీ సంతోష పారవశ్యం చెందుతున్నారు వీరిద్దరూ. వీరి కోసం చక్కగా పాడండి.

మన్మథుని తల్లిగారైన ఈమెను త్వరగా సింగారించండి. ముహూర్తం వేళ దగ్గరపడుతున్నది. ఏ క్షణాన్నైనా 'త్వరగా పెండ్లికూతుర్ని తీసుకు రారండని' పురోహితులు కేకవేస్తారు. త్వరపడండి. నారాయణుడైన ఈ పెండ్లి కొడుకును హత్తి (కలసి) తలంబ్రాలు పోయమని చెప్పండి. వీరిద్దరినీ ఒక పొత్తులో కూచోబెట్టి భోజనం పెట్టండి. ఇది బువ్వపు వేళ (భోజనాల సమయము).

ఈ వధువు పాలవెల్లి (క్షీరాబ్ధి) కూతురు. ఈమెకు పసుపు అలది నలుగుపెట్టి చక్కగా మంగళస్నానం చేయించండి. ఇది వీడు (కట్నము) చదివే వేళ (చదివించేవేళ). మీరు జోలి (సరదా కబుర్లు) చాలించండి. ఈ దేవదేవునికోసం పాలుపడి (పూనుకొని) మెత్తలు పరవండి. ఇవేళ నాలుగవరోజు. నేడు నాగవెల్లి జరుగనున్నది. ఆయన పెండ్లి కొడుకు. సుఖాసీనుడు కావలెను కదా!

ఈ అలమేల్మంగకు భోగాలీయండి. (తాంబూలము మొదలైనవి) కందువ వేంకటేశ్వరుడు (సమర్థుడైన వేంకట రమణుడు) తన వధువును కలిసే సమయమాసన్నమైనది. ఘన రతులతో ఇద్దరూ అలిసిపోయారు. నేడు కస్తూరి గంధములను ఈయండి. కుందక (ఏ లోటు లేకుండా) ఇద్దరూ కొలువు దీరినవేళ ఇది. మన సుకృతం వల్ల వీరిని సేవించే భాగ్యం కలిగింది.

4-63

## మున్నుడి

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో శ్రీహరి దశావతారములను వుటంకిస్తున్నారు. కాని సాహితీ గంధం లేని సామాన్యులకి ఇవి ఒక పట్టాన అర్థంగాక ప్రహేళికవలెనే వుంటాయి. "యిడుమ పాటుకు జొచి యియ్యకున్నా లేదు" – అంటే... మనఃక్లేశమును కల్పించి (చీరెలు ఎత్తుకెళ్ళి) యియ్యకున్నా లేదు. అంటే... శ్రీకృష్ణావతార లీలను స్తుతిస్తున్నారా అన్నమయ్య. చేసికొన్నవారికి చేసికొన్నంత... కర్మమిచ్చినంతే, కాని సేసినంత "వట్టు" (తామెంత దుఃఖం ఇంకొకరికిస్తే... తమకు బోరాదు, అంటున్నారు.

**ఆ.వె॥హరి దశావతార పరిచయంబులు సేసె**
**అన్నమయ్య కవిత అద్భుతముర**
**తరచి తరచి చూడ తెరతొలగును మదిన్**
**వేంకటేశ! తొలగు శంకలన్ని.**

**రాగం : సామంతం**

ఏమిసేయవచ్చు గర్మమిచ్చినంతే కాని లేదు
తాము సేసినంత వట్టు తమకు బోరాదు ॥ఏమి॥

ఇట్టునట్టు మిట్టిపడ్డ యించు కంతా లేదు వీపు
బట్టగట్టు మోపు మోచి పాటుపడ్డాలేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొనినా లేదు
తెట్ట దెరువున నోరు దెరచినా లేదు ॥ఏమి॥

అడిగి పరుల బదుకాస పడ్డాలేదు భీతి
విడిచి నెత్తుట దోగి వీరుడైనా లేదు
అడవులెల్లా దిరిగి అలమటించిన లేదు
యిడుమ పాటుకు జొచ్చి యియ్యకున్నాలేదు ॥ఏమి॥





వచ్చి వచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చులు గుఱ్ఱము నెక్కి మెరసినా లేదు
యెచ్చరిక దిరువేంకటేశు గొలువక వుంటే
యిచ్చట నచ్చట సుఖమించుకంతా లేదు ॥ఏమి॥

**భావామృతం :**

మనం ఏమి చేయగలం చెప్పండి. కర్మమిచ్చినంతే కాని ఇంకొక తేలికయైన తరుణోపాయం లేదు కదా! తాము సేసినంత 'వట్టు' (దుఃఖము) తమకు బోరాదు. (తాము అనుభవించక తప్పదు కదా!)

ఇటూ అటూ 'మిట్టిపడ్డా' (త్రుళ్ళిపడినా) కొంచెమైన, 'లేదు' (లాభం లేదు), (అంటే... మత్స్యావతారాన్ని స్తుతిస్తున్నారు). వీపు బట్టగట్టు మోపుమోచి (వీపుమీద చారలు పడునట్లు బరువుమోసి) పాటుపడ్డా (కష్టపడినా... లేదు). అనగా (కూర్మావతారం వర్ణిస్తున్నారు). తట్టువడ (అటూ ఇటూ) లోకమెల్లా దవ్వుకొన్నా (లోకమంతా తవ్వి పారేసినా... లేదు). అంటే హిరణ్యాక్షుడికోసం లోకమంతా పాతాళం దాకా తవ్వి ఆది వరాహావతారం యెత్తినా లాభం లేదు. తెట్టతెరవున (బహిరంగంగా) నోరుతెరచినా (గర్జించినా) లేదు. (అంటే... నరసింహావతారం).

అడిగి పరుల బదుకాసపడ్డాలేదు. (బ్రతకుటకు దారికావలెనని పరాయివాడిని అర్థించినా...లేదు) (అంటే బలిని అర్థించిన వామనావతారం). విడిచి నెత్తుటి దోగి వీరుడైనా... లేదు (అంటే, తన ధర్మం విడిచి వీర పరశురాముడై నెత్తురులో పొర్లాడినా... లాభం లేదు) (అనగా పరశురామావతారం). అడవులెల్లా తిరిగి అలమటించినా (దుఃఖించినా లేదు) (రామావతారం). యిడుమ పాట్లకు జొచ్చి (మనఃక్లేశము కలిగించి) చీరలెత్తికెళ్ళి ఈయకున్నా లేదు (శ్రీకృష్ణావతారం).

తనంతట తాను వచ్చి వచ్చి స్త్రీలను మోహింపచేసినాలేదు. (త్రిపురాసురుల స్త్రీల వ్రత భంగం చేసిన బుద్ధుడు). మెప్పు పొందిన గుఱ్ఱము నెక్కినా లేదు (కల్కి అవతారము). ఇవన్నీ ఇట్లా వుంటే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుని నేటి కలియుగంలో అప్రమత్తులై సేవించకుండా వుంటే... యిచ్చట నచ్చట కూడ (ఇహపరములలో సుఖము అణుమాత్రమైన వుండదు.

**4-64**

## మున్నుడి

వీనుల విందైన భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామీ! నీ రెండు పాదములు మాకు సంపదలు, సౌఖ్యములు ఇస్తాయి. ఇక మాకు యెక్కడ చూచినా ఎదురే లేదు అంటున్నారు. ఆ శ్రీవేంకటేశ్వరుని పాదములే నిధియు నిధానము అంటున్నారు. అవే తల్లియు తండ్రియునంటున్నారు. అవే ఇహము పరము నొసగే సాధనలంటున్నారు. జీవులలో అంతరాత్మవలె సంచరించే ఆ సంకర్షణాఖ్యుడు కైవల్యనిలయుడని కీర్తిస్తున్నారు.

**తే॥ ఇంక నెదురు లేదుర మాకు యెందు జూడ**
**పదములివి రెండు సంపదల్ ముదము లీయు**
**భజన వోలె ఈ కీర్తన పాడెనయ్య**
**అన్నమార్యుడు శ్రీవేంకటాద్రినాథ!**

**రాగం : హిందోళం**

ఎదురేది యింక మాకు యెందు చూచినను నీ-
పదములివి రెండు సంపదలు సౌఖ్యములు ॥ఎదురేది॥

గోపికానాథ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మధా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీ పాదములే మాకు నిధి నిధానములు ॥ఎదురేది॥

పురుషోత్తమా హరీ భువన పరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుంద రక్షకా
ధరణి నీ పదములె తల్లియును దండ్రి ॥ఎదురేది॥





దేవకీనందనా దేవేంద్ర వందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీ పాదములె గతి ఇహము పరము ॥ఎదురేది॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తులమైన మాకు యెందు చూచినను, ఇంక యెదురు లేనే లేదు. నీ ఈ రెండు పాదములు మాకు సంపదలు. అవే సుఖదాయకములు ప్రభూ!

ఓ గోపికానాథా! గోవర్ధనధారీ! నీవు పుండరీకాక్షుడవు (పద్మలోచనుడవు). మన్మధునే తలదన్ను అందగాడివి. మా పాపములను హరించు సర్వేశ్వరుడవు. పరమపురుషుడవు. అచ్యుతుడవు (నాశరహితుడవు). నీ పాదములే మాకు ఐశ్వర్యము. మాకు అవే 'నిధానము' (పాతరలో దాచిన ధనము... అంటే నేటి కాలంలో లాకర్లలో దాచుకొన్న నోట్లకట్టలన్న మాట...)

ఓ శ్రీహరీ! పురుషోత్తమా! ఈ ప్రపంచాన్ని పాలించే దేవా! నీవు గజేంద్ర మోక్ష ప్రదాతవు, శ్రీ మహాలక్ష్మికి మగనివి, మురారివి. నీవు దేవతలందరికీ రక్షకుడవు. నీవు శ్రీకృష్ణుని అవతారంలో ముచుకుందుడనే రాజర్షిచే యవనరాజును భస్మం చేయించి, ఆ రాజర్షిని (ముచుకుందని) బ్రోచి రక్షించావు. అట్లు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయు నీ దివ్య పాదములే మాకు తల్లిదండ్రులవంటివి.

ఓ దేవకీనందనా! నీవు దేవేంద్రునిచే నిత్యము పూజింపబడువాడవు. నీవు మోక్షప్రదాతవు. నీవే సంకర్షణాఖ్యుడవు (బలరాముని రూపంలో పేరుపొందిన అవతారమూర్తివి). జీవులందరిలోను అంతరాత్మవలెనున్న తిరుమలనాయకుడవు. మమ్ము రక్షించుటకు నీ పాదములే దిక్కు. అవే మాకు ఇహము (ఈ భూలోకంలో సుఖము) పరము (మరణించాక పైలోకంలో ఆనందము) ఒసగునట్టి సాధనములు.

**4-65**

## మున్నుడి

అలమేల్మంగమ్మ సొబగులను (చక్కదనములను) వర్ణించి, ఓ ప్రభూ! అవన్నీ నీ సొమ్ములు... కనుక ఆమెతో 'కలసి మెలసి' (పెనవేసి) గైకొనవయ్యా అని ప్రార్థిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది సరస శృంగార కీర్తన కనుక సాధ్యమైనంత నర్మగర్భంగానే వివరించాను. నేటి తెలుగుకు ఆనాటి తెలుగుకు పడికట్టులో కొంత తేడా వున్నందువల్ల మనకు కష్టం అనిపించినా అతి సరళమైన భాష వాడారు అన్నమయ్య.

**కం॥ నెలత సొబగులివి దేవా!**
**అలయక గైకొనుము నీవు అన్నయ వేడెన్**
**కలసీ మెలసీ మీరలు**
**అలరిన కాన్కలన్ గొనుడు అని తను పాడెన్**

**రాగం : రంజని**

నెలత సొబగులివి నీ సొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా ॥నెలత॥

వేమరు నవ్వుల వెన్నెల గాసీ
రామ కడకు నిటు రావయ్యా
దోమటి పలుకుల దొరిగీ తేనెలు
ఆమని కాలము అవధరించవయ్యా ॥నెలత॥

వలపుల చెమటల వానలు గురిసీ
పొలవక యీకెను చూడవయ్యా
పెలుచు కుచంబుల పిందెలు వొడమెను
అలరిన కానుక లందుకోవయ్యా ॥నెలత॥





గములై మెయి మరు కళలు దొలకీ
తమితో కౌగిట తగులవయ్యా
జమళి శ్రీవేంకటేశ్వర సతిగూడితి
వమరె నీకు మేలవునయ్యా ॥నెలత॥

**భావామృతం :**

ఓ శ్రీ వేంకటేశ్వరా! నేను వర్ణించిన ఈ దేవి చక్కదనములన్నీ నీ సొమ్ము. ఆమెతో నీవు 'కలసి మెలసి' (పెనవేసికొని) మా అలమేల్మంగమ్మను స్వీకరించవయ్యా!

నీవు ఆమెకు కనపడగానే ఆమె నవ్వుల వెన్నెలలను వెదచల్లుతుంది. ప్రతిసారి అట్టి స్వాగతం చెప్పే ఈ 'రామ' (అందాల భరిణ) దగ్గరకు ఒక్కసారి రావయ్యా. (దోమటి అంటే అన్నము అని అర్థం. ఇక్కడ రుచిగల అని భావించాలి) రుచికరమైన ఆమె పలుకులలో తేనెలు జాలువారుతాయి. ఇదేమో 'ఆమని కాలము' (వసంత ఋతువు). ఆమెను అవధరింపుము (గైకొనుము) ప్రభూ!

నీపై కలిగిన కోర్కె ఆమెకు చెమటల వానవలె పరిణమించి, ఆమె తడిసి ముద్దయింది. ఇంక పొలవక (బెట్టుసరి చేయక) యీకెను (ఈమెను) స్వీకరించవయ్యా! శ్రీనివాసా! కఠినమైన కుచములు పిందెలవలె జూపట్టినవి. నీకోసం ప్రత్యేకించబడిన ఆ కాన్కలను స్వీకరించవయ్యా!

ప్రభూ! మెయి (ఆమె దేహమున) మరు కళలన్నీ గములై దొలకినవి (విస్తారముగ కన్పట్టినవి). కోర్కెదీర ఆమెను సందిట జేర్చుకొనవయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! జమళి (జంటవై) నీ సతిని కూడితివి. నీకు అన్నీ శుభ మంగళములే కలుగుతాయి. కనుక మాబోటి వారిని కూడా అనుగ్రహించుము తండ్రీ!

**4-66**

## మున్నుడి

"శ్రీ వేంకటేశ్వరుని సేవించక పరులను (అధికారులను) వేడుకొంటే ఏమవుతుంది? లక్ష్మీకాంతుని నమ్ముకోవాలి గాని యితర దేవతలను పూజిస్తే సుఖమేమిటి?ఏ పూజకైనా అర్హుడు శ్రీహరి యొక్కడే. ఆయన కొసగని పూజలు వరదలో కొట్టుకొని పోయిన చింతపండువలె వృధా అవుతుంది" అంటున్నారు అన్నమాచార్యులవారు.ఎంత యెత్తుమీంచి పడే వాడైనా నేలమీద పడక తప్పదు. అట్లాగే దేవదేవుడు ఏడుకొండలవానిని గాక, శరణని పరులను ప్రార్థించినా వాళ్ళవల్ల యేమవుతుంది?

**ఉ॥ ఆతడు లక్ష్మీవల్లభుడు అన్నియు నిచ్చునుగాక! నమ్మడీ**
**ప్రీతిగ వేడి అన్యులను వేసరినాఫలమేమి మానవా!**
**భూతలమొక్కటే నిలువ, వుండునె వేరొక చోటు నిల్వగా**
**ఈతల వేంకటేశ్వరుడు యేలిక అందరి కన్నమయ్యనెన్**

**రాగం : గుండక్రియ**

అతడు లక్ష్మీకాంతు-డన్నియు నొసగు గాక
యితరుల వేడుకొంటే - నేమిగలదు ॥అతడు॥

మోదముతో నొకమాని -మొదల బోసిన నీరు
పాదుకొని కొననెక్కి -ఫలించుగాక
ఆదిమూలమగు హరి-నాతుమ సేవించక
యే దైవముల గన్నా - నేమి సెలవు ॥అతడు॥

తల్లి భుజించిన వెల్లా - తగు గర్భము శిశువు
కెల్లగాగ బరిణామ - మిచ్చుగాక
ఉల్లము లోపలి హరి - కొసగని పూజలెల్లా
వెల్లి జింతపంటివలె - వృథా వృథా ॥అతడు॥





ఓలినెంత జారిపడ్డా - నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై - నిలుచు గాక
తాలిమి శ్రీవేంకటేశు - దలచక తలచినా
పాలించ నాతడే కాక - పరులకు వశమా ॥అతడు॥

**భావామృతం :**

ఆ శ్రీ వేంకటేశ్వరుడు లక్ష్మీపతి. అన్నియును ఇవ్వగల సమర్థుడాయన. ఇస్తే ఆయన ఇవ్వాలి కాని ఇతరులను (అధికారులను, దేవతలను) యాచిస్తే యేమవుతుంది?

ఒకచెట్టు పెరిగి వృద్ధి జెందాలంటే దాని మొదలులో (వ్రేళ్ళు తడిసేట్లు) నీరు పోయాలి. అప్పుడు స్థిరముగా ఆ నీరు చిటారు కొమ్మలకెగబ్రాకి పుష్పించి ఫలించటానికి దోహదపడుతుంది. శ్రీహరి ఆదిమూలము. ఆయన ఆత్మస్థితుడు. ఆయన నాత్మలో పూజించాలి. అట్లుగాక అన్యదేవతల నాశ్రయిస్తే...యేమి సెలవు? (యేమి ఉపయోగం)

గర్భిణియైన తల్లి తీసికొనిన ఆహారం గర్భస్థ శిశువుకు చేరి ఆ శిశువు పెరుగుటకు దోహదపడుతున్నది. హృదయ స్థితుడైన నారాయణుని పూజించని వ్యర్థమైన పూజలు "వెల్లి జింతపండు వలె వృథా వృథా", (వరదలో కొట్టుకుపోయిన చింతపండు వలె నిరుపయోగము. ఒకవేళ ఏదో కొంత దక్కించుకొన్నా.. తడిసిపోయిన చింతపండు యేమి నిలవవుంటుంది?)

ఓలి (ల) నెంతజారిపడ్డా (యేవేవో ఆటలు ఆడుతూ యెంత జారిపడినా) చివరికి నేలమీద చేరవలసిందే కదా! ఎందుకంటే నేలమాత్రమే ఆధారం. ఒక్క నమస్కారం పెడితే ఆయన ఆదుకొంటాడను కోరాదు. తాలిమితో (ఓర్పుతో) శ్రీవేంకటేశ్వరుని ధ్యానించాలి. అట్లుగాక పరులను ధ్యానిస్తే వాళ్ళవల్ల అవుతుందా? ఆయన పరిపాలించి రక్షించాలి కాని పరులకు వశమే... కాదు.

**4-67**

## మున్నుడి

పెద అహోబలం కొండపైన నృసింహుని కీర్తిస్తున్న అన్నమయ్యను వినండి. 'వదలక కొలిచితే వరము లిచ్చీని' అంటున్నారు. ఇది యెంత ఛందోబద్దమైన కీర్తనో నిరూపించవలసిన పనేమిటి? ఈ సీసపద్యం వినండి. అనంతమైన పాదాలు, కన్నులు, చేతులు, పదివేల శిరసులుగల స్వామిగా భావిస్తున్నారు. భావనకు పరిమితేమిటి?

**సీ : పెదయౌబళపు కొండ పెరిగీని కొల్వుడీ**
**వదలక మీకెల్ల వరములిచ్చు**
**పదివేల శిరసుల బలు నరసింహము**
**గుదిగొన్న చేతుల గురుతు కలది**
**ఘన శంకచక్రాల కైదువనున్నది**
**కనక దైత్యుని జంపె కడుపు చింపి**
**శ్రీలక్ష్మితొడమీద చేకొని నిల్పెను**
**ఘనులు సురలు గొల్వ గద్దెమీద**

**ఆ.వె॥వేంకటాద్రిపైన వెలసి భోగించెడి**
**దైవమితడుగాక యెవరు వారు?**
**భావమొంది కనుడు పరబ్రహ్మమీతడు**
**అన్నమయ్య పాడె నద్భుతముగ**

**రాగం : మోహన**

పెదయౌబళపు కొండ పెరిగీనిదే
వదలక కొలిచితే వరము లిచ్చీని ॥పెద॥

పదివేల శిరసుల బలు నరసింహము
గుదిగొన్న చేతుల గురుతైనది
ఎదుట పాదాలు కన్ను లెన్నైన కలిగినది
యిది బ్రహ్మాండపు గుహ నిరవైనది ॥పెద॥



భావయామి వేంకటేశం

ఘనశంఖ చక్రాదుల కైదువలతో నున్నది
మొనసి రాకాసి మొకముల గొట్టేది
కనకపు దైత్యుని కడుపు చించినది
తను నమ్మిన ప్రహ్లాదుడు దాపును దండైనది ॥పెద॥

శ్రీ వనిత తొడమీద చేకొని నిలిపినది
దేవతలు కొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందు చెలగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది ॥పెద॥

**భావామృతం :**

జనులారా! ఈ "పెద అహోబలం కొండ" మీద (నృసింహుడు) పెరిగీనిదె (వృద్ధి చెందినాడు). ఈయనను వదలక సేవిస్తే కోరిన వరములను అనుగ్రహిస్తాడు.

ఈయన పదివేల శిరసులున్న బలు నరసింహము (బలాఢ్యుడైన నరసింహుడు). ఈయన గుదిగొన్న (దట్టముగా విస్తరించిన) చేతులు కలవాడు. ఈ నృసింహమునకు ఎన్నియో పాదములు, మరెన్నెన్నో కన్నులు కలవు. ఇది బ్రహ్మాండమైన గుహస్థానమై వెలసినది. ఈ దేవదేవుని కీర్తించండి.

ఈ నరసింహము ఘనమైన శంఖ చక్రములు మొదలైన 'కైదువలతో' (ఆయుధములతో) నున్నది. ఈయన "మొనసి రాకాసి మొకముల గొట్టెను" (విజృంభించిన రాక్షస గణములను వధించాడు). కనకపు దైత్యుని (హిరణ్యకశిపుని) కడుపు చీల్చినాడు. తను (అంటే తనను అని భావించాలి) నమ్మిన ప్రహ్లాదుని దాపును దండైనది. (దగ్గరవాడై రక్షకుడయ్యాడు). ఈ మహానుభావుని సేవించండి.

ఈ నరసింహము శ్రీ లక్ష్మిని తనతొడమీద నిడుకొని దేవగణములన్నీ సన్నుతించుచుండగా, సింహాసనముపై ఠీవిగా కూర్చొని యున్నాడు. ఈయన వేరెవరో కాదు. శ్రీవేంకటాద్రిపై వర్ధిల్లుతూ భోగములనుభవించుచున్న శ్రీవేంకటేశ్వరుడే. మీరు సరిగా భావించ గలిగితే ఈయనే పరబ్రహ్మ స్వరూపుడు... (మోక్షం ఇవ్వగల సత్తా ఈయనకే ఉన్నది అని భావము).

## మున్నుడి 4-68

ఈ కీర్తన హనుమంతుని ఘనత కీర్తించునదైనప్పటికీ అన్నమాచార్యులవారు శ్రీరామచంద్రునితో, నీ హనుమ ఇంతగొప్పవాడయ్యా! అని శ్లాఘిస్తూ చెప్పినట్లు సాగుతుంది. భాగవతంలో పోతనగారు వామనుడు త్రివిక్రముడైనప్పుడు చెప్పిన వర్ణన స్ఫురింపచేస్తుంది "పూని చుక్కలెల్లా మొలపూసలు గాగపెరిగె" అన్న వాక్యం. శ్రీవేంకటేశ్వరుని "ఇనవంశ" అనటంతో శ్రీరామునికి, తిరుమలేశునికీ అభేద భావన సూచిస్తున్నది. కలశాపురములో వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారని వేరే చెప్పవలెనా?

**తరళము॥ అవధరించుము చిత్తగించుము అంజనీసుతు డీతడే**
**భువిని యీ కలశాపురంబున పూని కాచెను భక్తులన్**
**రవి కులాంభుధి సోమ!! హే రఘురామ! నీ వరభక్తుడే**
**ఇవల వేంకటనాథు గొల్వగ, యేలె నన్నయ తెల్పెరా.**

**రాగం: శంకరాభరణం**

అవధారు చిత్తగించు హనుమంతుడు వీడె
భువిలోన కలశాపుర హనుమంతుడు ॥అవధారు॥

రామనీ సేవకుడిదె రణరంగధీరుడు
ఆముకొన్న సత్వగల హనుమంతుడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామిత ఫలదుడు ఈ ఘన హనుమంతుడు ॥అవధారు॥

జానకీరమణ సప్త జలధులు లంఘించి
ఆనుక సంజీవి తెచ్చె హనుమంతుడు
పూని చుక్కలెల్లా మొలపూసలు గాగపెరిగి
భానుకోటి కాంతితో చొప్పడు హనుమంతుడు ॥అవధారు॥





ఇనవంశ శ్రీవేంకటేశ నీ కరుణతోడ
అనుపమ జయశాలి ఈ హనుమంతుడు
పని బూని ఇటమీది బ్రహ్మపట్టమునకు నీ
అనుమతింగాచు కున్నాడదె హనుమంతుడు ॥అవధారు॥

**భావామృతం :**

ఓ రామచంద్రా! అవధారు (ఆలకింపుము). చిత్తగించుము ప్రభూ! వీడే హనుమంతుడు. ఈ భూమిపై కలశాపురములో వెలసిన హనుమంతుడు (నీ భక్తులను నిర్వహించి కాపాడుచున్నాడు).

ఓ దాశరథీ! ఈ నీ సేవకుడు యుద్ధరంగమున ఉద్దండుడు. ఆము కొన్న (అలముకొన్న) సత్వ (సత్తా) గలవాడీ హనుమంతుడు. ధైర్యంతో ఒంటరిగా లంకలో రాక్షసుల గెల్చి నీ ముద్దుటుంగరము తెచ్చి సీతకిచ్చాడు. ఘనుడైన ఈ హనుమంతుడు కోరిన కోర్కెలు తీర్చు మహానుభావుడు.

ఓ జానకీరమణా! ఏడు సముద్రములను ఒక్క దుముకుతో దాటి ఈ హనుమంతుడు ఆపైన సంజీవి తీసికొని వచ్చాడు. మేరుపర్వత రూపుడైన ఆ హనుమంతునికి ఆకాశంలోని నక్షత్రాలు మొలత్రాటిలోని పూసలవలె మెరసినవి. అంత ఎత్తుపెరిగిన ఆ హనుమంతుడు కోటిసూర్య తేజుడై ప్రకాశించాడు.

సాగరము వంటి ఇన వంశమునకు నీవు చంద్రుడవు. రవి కులాగ్రణీ! ఓ శ్రీవేంకటేశ్వరా! నీ కరుణ వలన ఈ హనుమ సాటిలేని జయశాలియై పనులన్నీ నిర్వహించుచున్నాడు. ఇకపై రాబోవు మన్వంతరములో ఈయన బ్రహ్మగా సృష్టి బాధ్యతలను చేపట్టుటకు నీ అనుమతికై వేచియున్నట్లు నేడు మాకు ఈ హనుమంతుడు కనుపించుచున్నాడు.

## 4-69

### మున్నుడి

గీతా వాక్యసారాన్ని వినిపిస్తున్నారు అన్నమయ్య. అన్ని వేదముల సారము, సమబుద్ధే (ద్వంద్వములందు). అందరికీ అదే హితమైన బోధ. అయితే సమబుద్ధి అంత తేలికగా రాదు. శ్రీహరి కృపవున్న వాడికే అది అలవడుతుంది అంటున్నారు ఆచార్యులవారు. శ్రీహరి అందరికీ సమానంగా కర్మఫలములందించే సముడు. ఆయన 'మాయ'వలన కీటకాలు తమ జీవితమే సుఖం అనుకొంటే... జంతువులందరికీ ఆహార, భయ, నిద్రా, సుఖవాంచ లొక్కటే... ఎందుకంటే అన్నిటికీ అంతరాత్మ యెవరు? ఏడుకొండలవాడే... కదా!

**ఆ.వె॥సర్వ వేదములకు సారంబు సమబుద్ధి**
**యిందరికిని యనుచు హితవు జెప్పె**
**అందరికిని సముదు హరియనె అన్నయ్య**
**ముక్తి సాధనంబు మురవిరోధి.**

**రాగం : సామంతం**

సమబుద్ధే యందరికి - సర్వవేద సారము
సముడిందరికి హరి- సాధనమో యయ్యా ॥సమ॥

చీమకు తన జన్మము - చేరి సుఖమై తోచు
దోమకు తన జన్మము - దొడ్డ సుఖము
ఆమని యీగకు సుఖ - మా జన్మమై తోచు
ఏమిటా నెక్కువ సుఖ- మెవ్వరికేదయ్యా ॥సమ॥

జంతురాసులకు నెల్లా - జననములొక్కటే
అంతటాను మరణము - లవి యొక్కటే
చెంత నాహార నిద్రలు - స్త్రీసుఖాలొక్కటే
ఇంతటా నిందుకంటే - నెవ్వరేమి గట్టిరయ్యా ॥సమ॥





ఇందులోన నెవ్వరైనా - నేమి శ్రీవేంకటపతి
నందముగా దలచిన - దది సుఖము
ఎందు జూచినా నిత - డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి - స్వతంత్రమేదయ్యా ॥సమ॥

**భావామృతం :**

అన్ని వేదముల బోధనా సారం ఒక్కటే సుమా! అందరియందు సమబుద్ధి కగలిగి యుండవలెను. శ్రీహరి అందరి యెడల సముడు. ఎవరి కర్మఫలం వారికి నిష్పక్షపాతంగా సమానంగా అందిస్తుంటాడు. ఏ జీవియైనా ముక్తి సాధించాలంటే... శ్రీహరి కృప వుండవలసిందే. ఓరయ్యా... ఇది నిజం.

మనకి చీమ, దోమ, ఈగ, అల్ప ప్రాణులైన కీటకములే. కాని వేటికవే... తమ జీవితమే బాగుంది, అదే సుఖమైనది అనుకొంటాయి. మరి యెవరిది యెక్కువ సుఖమైన జీవితం? యెవ్వరికదే యెక్కువ సుఖము. ఓరయ్యా... ఇది నిజం. (ఇదే హరిమాయ).

భూమిపై పుట్టిన ప్రతి జంతువుకు పుట్టుక ఒకేలా వుంటుంది. (శారీరకంగా... కాదు, జీవి దృష్టితో చూస్తే...) అట్లే మరణం కూడా ఒకటే. వాటి జీవిత కాలంలో ఆహార, నిద్రా, భయ, మైథునాలు కూడా అన్ని ప్రాణులకూ సమానమే. ఓ ప్రభూ! ఇంతకంటే యెవ్వరు మాత్రం యెక్కువ మూటకట్టుకొని 'అక్కడికి' పోయారు? ఓరయ్యా... యెవ్వడూ కట్టుకొని పోలేదు... పోడు... పోడుగాక! పోడు...

ఈ సృష్టిలో యెవ్వరైనా... ఆ శ్రీవేంకటేశ్వరునికి సమానమే, ఎవ్వరైతే నేమి? ఆయనను స్మరించుటయే నిజమైన సుఖం. ఎందు జూచినా ఆయనే అంతరాత్ముని వలె ప్రకాశిస్తున్నాడు. చావు పుట్టుకలపై కానీ జీవనకాల పరిమితిపై కానీ జీవన యానంలో సుఖదుఃఖాలపై కానీ ఏమాత్రం స్వతంత్రం లేని ఈ జీవులలో యెవ్వడు అధికుడు ఎవ్వడు అధముడు? ఓరయ్యా... అంతర్యామియే... అధికుడు కదా?

4-70

## మున్నుడి

తన స్వామి తనను పిలిచాడు కావున వేగంగా పోయి ఆయనను కలవాలి రావే చెలియా! అని పిలుస్తున్నది నాయిక (అలమేల్మంగమ్మ). స్త్రీలకు, తమకమె వలెను గాక! (తన ప్రియునిపై మోహము వుండి తీరాలి) అంటూ హితబోధ చేస్తున్నది. శ్రీవేంకటేశ్వరుడంతటి వాడు నన్నేలుతుంటే "క్రియతో వేసర నేల కిమ్ముల దేవుళ్ళకు?" అంటున్నారు అన్నమాచార్యులవారు. 'కిమ్ముల దేవుళ్ళు' అంటే యే నిఘంటువులోను అర్థం కనబడలేదు. 'కిముడు' అంటే అల్పము అని అర్థం.'క్రియతో వేసరనేల' అంటే... ఈ విధంగా బాధపడుట దేనికి?

**కం॥ రమణుడు పిలిచెను రావే**
**తమకమె వలె గాక నీవు, తరుణలకనియన్**
**సమయమునకు తగు బోధను**
**విమలంబుగ అన్నమయ్య వెలదికి జేసెన్.**

**రాగం : నటహిందోళం**

రమణుడు పిలిచీని రావే చెలియా నీవు
తమకమె వలె గాక తరుణులకు ॥రమణుడు॥

తలపుకొలది మంచి తనమే వలె గాక
చలపాదితన మేల సరసులకు
వెలలేని మాటల వినయమే వలెగాక
సొలపు వెంగెము లేల సుగుణలకు ॥రమణుడు॥

కోటిసేయ వలపులు కుమ్మరించవలెగాక
నీటుతో గర్వము లేల నేర్పరులకు
మేటి సరసములాడి మెరయగ వలెగాక
జూటు దనము లేటికి సొంపు దొరలకును ॥రమణుడు॥





నయగారి తనమున నవ్వు నవ్వ వలెగాక
రయమున దాగనేల రసికులకు
నియతి నన్నేలినాడు నేడు శ్రీవేంకటేశుడు
క్రియతో వేసరనేల కిమ్ముల దేవుళ్ళకు ॥రమణుడు॥

**భావామృతం :**

ఓ చెలియా! రమణుడు (నాథుడు) నన్ను పిలిచినాడు. పోవుదము రావే. తరుణులకు (స్త్రీలకు) తమకమె వలెగాక! (తమ ప్రియునిపై మోహము వుండి తీరాలి).

స్త్రీకి భావనలలో కూడ మంచితనమే వుండాలి. సరసులకు (సరసత్వముగల స్త్రీలకు) చలపాదితనము యేల (మాత్సర్యము యెందుకు?) ఆమె మాట్లాడే మాటలలో చెప్పలేనంత వినయము తొణికిసలాడుతుండవలెను. సుగుణములే అలంకారములైన స్త్రీలకు, నొచ్చుకొనునట్లు చేయు వెంగెము (వ్యంగ్య సంభాషణ) నిషిద్ధము. ఇవి గుర్తుంచుకో.

కోటి సేయు (అతిశయించిన) వలపులను స్త్రీ తన భర్తపై, కుమ్మరించవలె గాక! (కురిపించాలి). నేర్పరులైన కాంతలకు "నీటుతో గర్వము" (మిడిసిపడే గర్వము) తగదు. వారు చక్కటి సరస సల్లాపములతో వ్యక్తపరచబడవలెను. కాని సొంపు దొరలకు (సుందరాంగులకు) జూటు దనములు (మోసము చేయు స్వభావము) యేటికి? (యెందులకు?)

ఓ చెలియా! స్త్రీలు, నయగారితనమున (మృదువుగా) నవ్వులు నవ్వవలెను. ప్రియుడు రసికుడైనప్పుడు, ఆయన యెదుటబడి ఎంతో ప్రీతిని కలిగించవలెను. కాని దాగికొని ఆయనను నిరుత్సాహపరచ రాదు. సరే... అదంతా అటుంచి, నేడు నా నాథుడైన శ్రీవేంకటేశ్వరుడు నిరతి (నా భాగ్యవశమున) నన్నేలినాడు. "క్రియతో వేసరనేల కిమ్ములదేవుళ్ళకు?" అంటే... అల్పులైన ఇతర దేవుళ్ళకు మొక్కి ఈ విధంగా బాధపడుట దేనికి? వాళ్ళందరికీ దేవదేవుడైన వాడే... నావాడు కదా!

## మున్నుడి 4-71

అన్నమాచార్యులవారి కీర్తనలలో దేని ప్రత్యేకత దానిదే. ఏడుకొండలవాడికి ఆరగింపచేసే 'ప్రసాదాలు' మనబోటి సామాన్యులు యెలాగో చూడలేరు. ఈ అన్నమయ్య కీర్తన విని స్వామికి ఆ రోజుల్లో ఏమేమి ఆరగింపులు చేసేవారో తెలుసుకోవచ్చును. మనం ఈనాడు 'కజ్జికాయలు' అనే తీపివంటకం ఆ రోజుల్లో 'కరజికాయలు' అనిపిలువబడేది. అనేక పురాతన వంటకాలు నేడు వాడుకలో లేక, పేరు మాత్రమే వాడుకలో వున్న వంటకాల పేర్లు వింటే ఆహా!! ఏమి రుచి!! అనిపిస్తుందేమో...

**తే॥ ఆరగింపవో మాయప్ప! అనుచు పాడె**
**అన్నమార్యుడు తెలుపుచు నద్భుతముగ**
**వేంకటేశునికిడిన నైవేద్యములను**
**వివరమిచ్చెను పఠియింపు డవధరించి**

**రాగం : ఖమాస్**

ఆరగింపవో మాయప్ప యివే
పేరిన నేతులు పెరుగులును ॥ఆరగింప॥
తేనెలు జున్నులు తెంకాయ పాలును
ఆనవాలు వెన్నట్లును
నూనె బూరెలును నురుగులు వడలును
పానకములు బహుఫలములును ॥ఆరగింప॥
పరమాన్నంబులు పంచదారలును
అరిసెలు గారెలు నవుగులును
కరజి కాయలును ఖండమండెగలు
పరిపరి విధముల భక్ష్యములు ॥ఆరగింప॥
కడ మధురంబగు కమ్మబూరణపు
కుడుములు నిడ్డెన కుడుములును
సుడిగొను నప్పాలు సుగినప్పాలును
పొరి బెల్లముతో బోరటుచును
కాయపు రుచులకు గనియగు మిరియపు
కాయలు నేలకి కాయలును
పోయరాని అంబాళపు కాయలు
నాయతమా చద్యన్నములు ॥ఆరగింప॥





ఒడికపు కూరలు బలుపు పప్పులును
వడియాలపు రాజాన్నములు
బడిబడి కనకపు పళ్ళెరములతో
కడు వేడుక వేంకట రమణా ॥ఆరగింప॥

**భావామృతం :**

ఓ వేంకట రమణా! మా అప్పా! (మా తండ్రీ!) యివే (ఈ క్రింద చెప్పినవన్నీ) ఆరగింపవో! పేరిననేతితో చేసినవి, పెరుగుతో చేసినవీ, యెన్ని వంటకాలున్నాయో చూడు స్వామీ!

ప్రభూ! ఇవిగో తేనెతో చేసినవి, జున్నుతో చేసినవి, కొబ్బరి పాలతో చేసినవి, ఆనవాలు (మరగబెట్టిన పాలు), వెన్నట్లు (వెన్నతో చేసిన దోసెలు), నూనెతో చేసిన బూరెలు, నురుగులు, వడలు, పాలకములు (పాలకాయలనే భక్ష్యం) మరియు రకరకములైన ఫలములు కూడ వున్నవి.

స్వామీ! నీ నివేదనకు యెన్నియో, పరమాన్నములు, పంచదార వంటకములు, అరిసెలు, నవుగులు, కరజికాయలు (కజ్జికాయలు), ఖండమండెగలు, మొదలైను అనేక భక్ష్యములున్నవి, ఆరగింపుము.

ప్రభూ! కమ్మని తీపి పూర్ణపు కుడుములు, ఇడ్డెన కుడుము (ఇడ్లీలు) లున్నవి, సుడిగొను అప్పాలు (జంతికలు), సుగినప్పాలు, బెల్లము దట్టించి చేసిన మధుర పదార్థములున్నవి.

ప్రభూ! కాయపు రుచులకు (ఘాటు, కలిగిన రుచుల) గనియగు (పుష్కలంగా ఉన్న) మిరపకాయలు, ఏలక్కాయలు, అంబాళపు కాయలు మొదలైనవి దట్టించిన చద్యన్నములు (పులిహోర మొదలైనవి) అనేకం వున్నాయి. ఆరగింపుము తండ్రీ!

ఓ దేవా! ఒడికపు కూరలు (యుక్తితో చేసిన మంచి కూరలు), బలుపు పప్పులు (పుష్టినిచ్చే పప్పులు), ఆ పప్పు ముద్దలతో కరకర నమిలి నంజుకోటానికి అనేక రకముల వడియాలు, పుష్కలంగా వున్న రాజభోజనం సిద్ధంగా వున్నది. ఇవన్నీ 'బడి బడి కనకపు పళ్ళెరము' (దిట్టంగా వున్న బంగారు పళ్ళాలతో) వడ్డించారు. ఓ వేంకట రమణా! మిక్కిలి వేడుకతో వీటన్నింటిని ఆరగించి మమ్ము ధన్యులను చేయుము తండ్రీ!

## 4-72

## మున్నుడి

భక్తిరసం జాలువారే చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. సులభంగా భక్తులనాదుకొనే శ్రీహరి 'పరతంత్రుడు' అంటున్నారు. అంటే... భక్తులకు లొంగి వుంటాడట. కాని ఏ ఒక్కరికీ స్వంతంగా కాడు. అలా అనుకొన్న 'సత్యభామ' లాంటివారు భంగపడ్డారు. ఆయన 'యుక్తి సాధ్యుడు'. న్యాయమున్నవైపున వుంటాడు. దుర్యోధనుని తృణీకరించి విదురుని ఆతిధ్యం స్వీకరించాడు. ఈ పురుషోత్తముడు పొడవుకే పొడవైనాడట. మాచేత 'బుడి బుడి' పూజలుగొనేవాడు అంటున్నారు. అంటే....

**ఆ.వె॥ భక్త సులభుడితడు పరతంత్రుడీ హరి**
**యుక్తి సాధ్యుడితడు యొకరి కవడు**
**పొడవు కితడు పొడవు పురుషోత్తముడు, అహో!**
**అన్నమయ్య పాట అతిశయించె.**

**రాగం : మలయమారుతం**

భక్త సులభుడును పరతంత్రుడు హరి
యుక్తి సాధ్యమిదె యొకరికీ గాడు ॥భక్త॥

నినుపగు లోకముల నిండిన విష్ణుడు
మనుజుడ నాలో మనికి యయ్యె
మునుకొని వేదముల ముడిగిన మంత్రము
కొననాలికలలో కుదురై నిలిచె ॥భక్త॥

యెలమి దేవతల నేలిన దేవుడు
నలు డ నధముని నను నేలే
బలుపుగ లక్ష్మీపతి యగు శ్రీహరి
యిల మాయింటను యిదివో నిలిచే ॥భక్త॥





పొడవుకు బొడవగు పురుషోత్తముడిదె
బుడి బుడి మాచేత పూజగొనె
విడువకిదివో శ్రీవేంకటేశ్వరుడు
బిడి వాయడు మా పాలిట నిలిచి ॥భక్త॥

**భావామృతం :**

ఓ భక్తులారా! నా మాట నమ్మండి. శ్రీహరి భక్తిచే సులభంగా సాధింపబడువాడు. స్వామి భక్త పరతంత్రుడు. (వారికి లొంగిపోయి వుంటాడు). యుక్తికి సాధ్యుడు. న్యాయము ఏవైపున వుంటే ఆయన, ఆ వైపున వుంటాడు. ఏ ఒక్కరికీ స్వంతం కాడు. ఎవరిని కరుణించాలన్నది ఆయన ఇష్టం.

ఈయన విష్ణుడు. అంతటా నిండివున్నవాడు. లోకాలన్నింటిలోనూ నిండిపోయాడు. నేను మానవ మాత్రుడినే అయినా నాలోనూ వున్నాడు. మునుకొని (తొల్లి) వేదములన్నింటిలో ముడిగిన మంత్రము నిక్షిప్తమైన మంత్రము ఈ నారాయణుడు. అటువంటి మహానుభావుడు నా నాలికి చివర కుదురుకొని యుండి నాచే కీర్తించబడుతున్నాడు.

శ్రీహరి యెంతో సంతోషంతో దేవతల నాదుకొని రక్షిస్తాడు. అటువంటి దేవదేవుడు, "నలుగడ నధముని" (పీడితులలో అల్పుడనైన) నన్ను పరిపాలించి కాపాడినాడు. ఆయన లక్ష్మీపతి. అతిశయించిన ఆ శ్రీపతి, ఇదిగో మా ఇంటికి వచ్చి మా యెదుట నున్నాడు. ఇంతకంటే కావలసినది వేరొకటుంటుందా?

ఈ పురుషోత్తముడు పొడవుకే పొడవైన వాడు... (అంటే ఎనిమిది అడుగుల ఎత్తున్న వాడని కాదు, చక్కదనాని కన్నా చక్కనైన వాడని అర్థం). మాచేత "బుడి బుడి పూజ" (చిన్న చిన్న పూజలైనా) స్వీకరించి, మమ్మల్ని విడువక ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడై మాయందే నిలిచి మాతోడు నీడైవున్నాడు. ఇక మాకు లోటేమిటి చెప్పండి.

## మున్నుడి 4-73

అద్భుతమైన శ్రీరామనామ సంకీర్తన చేస్తున్నారు. అన్నమాచార్యులవారు 'రామ' అని ఒక్కసారి అంటేనే ఆనాటి వరకు చేసికొన్న పాపములు భస్మమవుతాయని, నమ్మే భరతజాతి మనది. ఈ కీర్తనలో యెన్నిసార్లు 'రామా' అని పిలుస్తున్నారో గమనించండి. మరి ఈ కీర్తన నొక్కసారి భక్తితో పాడితే పాపము మనల్ని సమీపించగలదా? 'సెలవిల్లు విరచిన సీతారామా' అంటే... సెలసుబద్దలతో తయారు చేసిన శివధనస్సును విరచిన సీతారాముడు అని అర్థం. సీతారాముడు ఒకేమాట. ఈయనే వితత మహిమల వేంకటాద్రి రామయ్య అంటున్నారు.

**చం॥ జయ జయ రామచంద్ర! ఘన సంగరధీర! మహానుభావ! హే**
**భయహర! జానకీశ! నిజ భక్తజనంబుల బ్రోవుమా అనెన్**
**రయమున వేడె కీర్తనల రాముని గొల్చెను, యాతడే మహిన్**
**జయమిడు వేంకటేశ్వరుడు సప్తగిరీంద్రుడు, అన్నమయ్యనెన్**

**రాగం : మణిరంగు**

జయ జయ రామ సమర విజయరామ
భయహర నిజభక్త సారీణ రామా ॥జయ జయ॥

జలధి బంధించిన సౌమిత్రిరామా
సెలవిల్లు విరచిన సీతారామా
అలసుగ్రీవు నేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞము కాచే కౌసల్యరామా ॥జయ జయ॥

అరి రావణాంతక ఆదిత్యకులరామా
గురు మౌనులను గాచే కోదండరామా
ధరనహల్యపాలిటి దశరథరామా
హరురాణి నుతుల లోకాభిరామా ॥జయ జయ॥





అతి ప్రతాపముల మాయామృగాంతక రామా
సుత కుశలవ ప్రియ సుగుణరామా
వితత మహిమల శ్రీవేంకటాద్రిరామా
మతిలోన బాయని మనువంశరామా ॥జయ జయ॥

**భావామృతం :**

ఓ జయరామా! నీకు జయమగు గాక! యుద్ధరంగమున అజేయుడవైన రామచంద్రా! నీకు జయము. భక్తుల భయమును హరించు శ్రీరామా! నీవు నిజభక్త పారీణుడవు (అంటే... తన భక్తులను అవతలి గట్టు చేర్చువాడని అర్థం. అంటే తరింపజేసేవాడన్నమాట).

ఓ సౌమిత్రిరామా! నీవు సాగరమున సేతువు నిర్మించితివి. సీతారామా! నీవు సెలవిల్లు (సెలసుబద్దలతో చేసిన శివధనస్సును) విరిచినావు. ఓ అయోధ్య రామా! నీవు ఆనాడు సుగ్రీవుని కాపాడియేలినావు. కౌసల్యారామా! నీవు పూనుకొని విశ్వామిత్రుని యజ్ఞమును సంరక్షించితివి. ప్రభూ! అట్టి నీకు జయమగు గాక!

ఆదిత్యకులరామా! (సూర్యవంశ సంభవుడవైన రామా!) నీవు శత్రువైన రావణుని పరిమార్చిన వాడవు. ఓ కోదండరామా! నీవు గురుపుంగవులైన ఋషులను రక్షించితివి. దశరథరామా! నీవు అహల్యను వుద్ధరించితివి. శివుని రాణియైన పార్వతీదేవిచే కీర్తించబడు ఓ లోకాభిరామా! నీకు జయము కలుగుగాక!

మాయలేడి రూపంలోనున్న మారీచుని వధించిన రామచంద్రా! నీవు అతి ప్రతాపశాలివి. ప్రియ సుగుణరామా! (ప్రీతికరమైన సుగుణములుగల రామచంద్రా!) నీవు పుత్రులుగా కుశలవులు గలవాడవు. (బహుశా... ఆ శ్రీరామచంద్రుని అర్చామూర్తి కుశలవులతో బాటు వుండి వుంటుంది). వితతమహిమల (విస్తృతమైన మహిమలున్న) శ్రీవేంకటాద్రిపై నెలకొన్న వేంకటరాముడవు నీవే. మమ్మల్ని మతిలో బాయని (మనస్సున కూడా విడువని) మనువంశరామా! మానవాకృతిలో వెలసిన శ్రీరామచంద్రా! నీకు సర్వదా జయము.

**4-74**

## మున్నుడి

ఇదివరలో ఇటువంటిదే వేరొక కీర్తనలో అన్నమాచార్యులవారి అభిప్రాయం సుస్పష్టంగా విన్నాం. హీనుడు, అధికుడు ఎవరు?అందరికీ చావు పుట్టుకలొక్కటే. అణిగిమణిగి చేసే దాస్యము, స్నేహము అందరికీ నొకటే. అందరూ నారాయణుని ఒకేలా, కొలుస్తారు. భక్తిముఖ్యం – మార్గాలే వేరు. ఈ రోజుల్లో కూడా (ఏడువందల యేళ్లక్రితం) హీనాధిక్యము లెక్కడున్నాయి? వైష్ణవం స్వీకరించిన వారిది ఒక్కటే కులం, ఒక్కటే మతం. శ్రీవేంకటేశ్వరుని "యాదరాని పొందు" శరణాగతి యొక్కటే నట,... అంటే... చదవండి మరి.

**కం॥ హీనాధిక్యము లింకను**
**ఈనాడెచ్చటను గలవు? ఇటులన్నయనెన్**
**ఆనిన దాస్యము పొత్తులు**
**మానవులందరికి నొకటె మనకెరిగించెన్.**

**రాగం : కానడ**

హీనాధికము లింక నేడనున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికీ నొకటే ॥హీనాధి॥

నానావర్ణముల వారు నరహరి దలచేటి
ఆ నామమంత్ర జపమది యొకటే
పూని యాతని గొలిచి భువినేజాతైనాను
మోనమున పొందేటి మోక్షమూ నొకటే ॥హీనాధి॥

వెనుకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తి యొక్కటే
వునికి నా దేవుడు వొకడే అంతర్యామి
మనెడి వైష్ణవ కులమతమెల్లా నొకటే ॥హీనాధి॥





భేదా భేదము లేదు పెక్కు మరగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మలొక్కటే
శ్రీదేవుడైనట్టి శ్రీవేంకటేశ్వరుని
యాదరాని పొందు శరణాగతియు యొకటే ॥హీనాధి॥

**భావామృతం :**

మానవులారా! నా మాట వినండి. ఆలోచించండి. హీనుడని, అధికుడని ఇంకా యెక్కడున్నాయి? ఆనిన దాస్యము (అణచివుంచే బానిసత్వం) పొత్తు (స్నేహానుబంధము) అందరికీ ఒకేలా వుంటాయి. ఒకళ్ళకి తక్కువ వేరొకరికి యెక్కువ వుండవు.

ప్రపంచంలో వివిధ రకములైన వర్ణములున్నవి (బ్రాహ్మణ, క్షత్రియ మొదలైనవి). వారిలో ఎవరు శ్రీహరీ! అనినా ఆ మంత్రజపం ఒకేలా ధ్వనించటమే కాక, ఒకేలా సత్ఫలితమిస్తున్నది. ఈ భువిని యేజాతియైనా, పూని (దీక్షతో) ఆతని (నారాయణుని) మోనమున (మౌనివలె) గొలిచి (సేవించి) పొందేటి మోక్షము కూడా ఒక్కటే సుమా!

విష్ణుని కింకరులకు (దాసులకు) పూర్వముగాని, రాబోయే కాలాల్లోగాని, పనివడి కై కొనేటి (పూని స్వీకరించేటి) భక్తి యొక్కటే. అంతర్యామిగా జీవులందరి దేహాల్లో (పిల్లిగాని, నల్లిగాని, తిమింగలం గానీ, నరులుగాని) వున్న పరమాత్మ వొక్కడే. ప్రపంచంలో వైష్ణవులుగా జీవించేవారి కులమూ ఒక్కటే మతమూ ఒక్కటే.

ముక్తాత్ములకు (జీవన్ముక్తులకు) భేదము ఉండటం కాని, లేకపోవటంకాని సంభవించదు. వారికే రహస్యములూ వుండవు. వారికి ఏదీ మొదలుకాదు.. అయిపోదు కూడా. అంతదాకా యెందుకు.. శ్రీపతి అయిన శ్రీవేంకటేశ్వరుని యాదరాని (నిర్విచారంతో) పొందు శరణాగతి రకరకాలుగా వుంటుందా? ఉండదు. "నీవే తప్ప ఇతఃపరం బెరుగ, మన్నింపన్ తగున్ దీనునిన్... రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా", అని ఆ గజేంద్రునిలా శరణు కోరండి. ఇంకోదారి... లేదు గాక లేదు.

**4-75**

## మున్నుడి

శ్రీవల్లభుని చింతనే సర్వస్వం. అదే గొప్ప ఆనందం. 'శ్రీబృందాన్ని' అనగా శ్రీహరి శరణాగతిబొందిన భక్త బృందాన్ని సేవించి భావించే వారే ధన్యులు. అని చక్కటి సంస్కృత సంకీర్తన పాడుతున్నారు అన్నమయ్య పుత్రుడు పెదతిరుమలయ్య. వక్రంగా, నాస్తికవాదులు చెప్పే దుర్బోధలను ఖండించి, పరిశుద్ధ విజ్ఞాన బోధకులైన వైష్ణవ మతాచార్యులు చూపిన మేలైన బాటలో నడవమంటున్నారు. నిర్వికార గుణాఢ్యుడైన శ్రీవేంకటేశ్వరుని సేవించమంటున్నారు.

**కం॥ శ్రీ వల్లభునికి ముదమగు**
**సేవింపుము అనవరతము శ్రీబృందములన్**
**భావించమనుచు చెప్పెను**
**దేవా! పెద తిరుమలయ్య దివిజులవాణిన్**

**రాగం :సావేరి**

సేవే భావే శ్రీబృందం
శ్రీవల్లభ చింతానందం ॥సేవే॥

పటుకు తర్కనగ భంజన దీక్షం
కుటిల దురితహర గుణదక్షం
ఘటిత మహాఫల కల్పక వృక్షం
చటుల రామానుజ శమదమ భిక్షం ॥సేవే॥

కృద్ధమృషామత కుంఠన కుంతం
బౌద్ధాంధకార భాస్వంతం
శుద్ధచేదమణి సుసరస్వంతం
సిద్ధాంతీ కృత చిన్మయ కాంతం ॥సేవే॥





చార్వాక గహన చండకుఠారం
సర్వాప శాస్త్ర శతధారం
నిర్వికార గుణనిబిడ శ్రీవేంక-
టోర్వీధర సంయోగ గభీరం ॥సేవే॥

**భావామృతం :**

శ్రీవల్లభుని మనస్సునకు ఆనందం కలిగించు శ్రీబృందాన్ని సేవించుము, ఆపై భావించుము.

కఠినమైన కుతర్కము అను కొండను తుత్తునియలు చేయు దీక్షగల వానిని, వక్రమైన పాపములను హరింపజేయు గుణదక్షత కలిగిన వానిని, మహాఫలములనందించు భక్తి అను కల్పవృక్షమును నిర్మించిన వానిని, రమణీయులైన రామానుజులచేత శమదమాదులను భిక్షగా గొనిన వానిని సేవించెదను మరియు భావించెదను.

క్రోధమును తెప్పించు మిధ్యావాదమును ఖండించు కరవాలము, బౌద్ధాంధకారము నిర్మూలించు జ్యోతియు, పరిశుద్ధమైన చేతన (విజ్ఞానము) అనే సరస్వతిని ప్రకాశింప చేసినవాడును, వైష్ణవమతమును సిద్ధాంతీకరించిన వాడును అయిన నా గురుదేవుని సేవించెదను మరియు భావించెదను.

చార్వాకమను దట్టమైన అంధకారమును నిర్మూలించు గొడ్డలియును, సమస్త ఆపదలను నిర్మూలించు శాస్త్ర సముచ్ఛయము కలవాడును, నిర్వికార గుణములతో నిండిన శ్రీవేంకటేశ్వరుని అనుసరించు గొప్పదైన అనుసరణము కలవాడును అయిన వానిని సేవించుము మరియు భావించుము.

**4-76**

## మున్నుడి

అన్నమాచార్యులవారి సుపుత్రుడు తాళ్ళపాక పెద తిరుమలయ్య చెప్పిన అద్భుతమైన కీర్తన వినండి. పులి కడుపున పిల్లి పుడుతుందా? తండ్రి బాటనే నడచి శ్రీవేంకటేశ్వరునిపై, అదే మకుటంతో అనేక కీర్తనలు రచించాడు పెద తిరుమల. ఈ కీర్తన, దాని భావామృతం చదివాక మీరు నాతో తప్పక ఏకీభవిస్తారు. "అప్పసమైన భ్రమ ఆలజాలాలకున్నట్లు"... అంటే యేమిటి? ఆలుబిడ్డలపై వుండె భ్రమ అని నేను భావించాను. తండ్రికి తగ్గ కొడుకే మరి...

**తే॥ "పరమ సుజ్ఞానులకును ప్రపన్నులకును**
**మరు గురునీమీద బాయని మనసు వుండ**
**వలదె", పెద్ద తిరుమలయ్య తెలిపినాడు**
**తండ్రి బాటను నడచిన ధన్యుడతడు.**

**రాగం : తోడి**

పరమ సుజ్ఞానులకు ప్రసన్నులకు
మరు గురుని మీద మనసుండ వలదా ॥పరమ॥

ఆకలిగొన్నవానికి నన్నముపైనుండినట్లు
యేకట వుండవలదా యీశ్వరునిపై
కాకల విటుల చూపు కాంతలపై నుండినట్లు
తేకువ నుండవలదా దేవుని మీదటను ॥పరమ॥

పసిబిడ్డలకు నాస పాలచంటిపై నున్నట్లు
కొసరి భక్తి వలదా గోవిందునిపై
వెస దెరువరి తమి విడిదలపై నున్నట్లు
వసియించ వలదా శ్రీవల్లభు మీదటను ॥పరమ॥





నెప్పున ధనవంతుడు నిధిగా యుండినట్లు
తప్పక శ్రీవేంకటేశుదగుల వద్దా
అప్పసమైన భ్రమ ఆలజాలాలకున్నట్లు
యిప్పుడే వుండవలదా యీతని మీదటను ॥పరమ॥

**భావామృతం :**

ఓ మానవులారా! పరమ సుజ్ఞానులకు (శ్రేష్టమైన చక్కని జ్ఞానము కలిగిన వారికి), ప్రపన్నులకు (భక్తిపారవశ్యముచే శరణాగతి నొందిన వారికి) మరు గురుని మీద (మన్మధుని తండ్రియైన శ్రీహరిపై) మనసుండవలదా? (చిత్తములగ్నమై వుండవద్దా?) ఇంకో దారి వున్నదా?

బాగుగా ఆకలిగా వున్నవానికి అన్నముపై ఇష్టం ఎలావుంటుందో, అట్లా ఈశ్వరునిపై మనకు యేకట (మిక్కిలి అపేక్ష) వుండవద్దా? కాకల విటుల (తాపము మీద నున్న శృంగార పురుషుల) దృష్టి, స్త్రీలపైననే వున్నట్లు, భక్తుల దృష్టి ధైర్యంగా యెల్లప్పుడు భగవంతునిపై వుండవద్దా?

పసిపాపలు తల్లియొక్క ఒక చంటిపాలు త్రాగుతూనే వేరొక చంటిపై చెయ్యివేసి భద్రంగా వున్నదో లేదో చూసుకుంటారు. ఆ గోవిందుని భక్తులకు కూడా ఆయన భజనలో ఆనందం అనుభవిస్తూనే యెక్కడ ఆ ఆనందం ఆగిపోతుందో అనే ఆరాటంతో కూడిన అనురాగం వుండాలి. ఒక బాటసారి అపేక్ష అంతయూ, తను విడిది చేయబోవు సత్రముపైనున్న విధముగా జీవనయాత్రలో నిమగ్నమైన మానవుని ధ్యాస అంతా శ్రీనాధునిపై వుండవద్దా?

ఒక ధనవంతుడు నెప్పన (ఉపాయముతో) తన నిధిని (ధనమును) కాపాడుకొనినట్లు భక్తుడు శ్రీవేంకటేశ్వరునిపై తప్పక (విడువక) తగులవద్దా? (వ్యామోహం కలవాడై వుండవద్దా?) అట్లాగే అప్పనమైన భ్రమ (అను నిత్యమూ వుండే భ్రమ) ఆల బాలాలకున్నట్లు (భార్యా బిడ్డలపై) వున్న విధముగా ఈతని (ఈ శ్రీవేంకటేశ్వరునిపై) మీదటను కూడా ఇప్పుడే, యెడబాయలేని భ్రమ వుండవద్దా? (భమరం యెట్లా పిచ్చిపట్టినట్లు మకరందం కోసం వెంపర్లాడుతుందో అట్లా ఆ దేవదేవునికోసం భ్రమించాలి).

## 4-77

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఘనత ప్రతిఫలించే కీర్తన ఇది. శ్రీకృష్ణునిది పరిపూర్ణావతారం. నేనే పరమాత్మనని తెగవేసి చెప్పి, చీరెలు యెత్తుకెళ్ళిన చేతులతోనే మృతశిశువు పరీక్షిత్తును బ్రతికించాడు. వేదపురుషుడు వెన్నదొంగ అయ్యాడు. బ్రహ్మకు తండ్రియైనవాడు గొల్లయశోద పాలుత్రాగాడు. పరమపురుషుడై కూడ గొడ్లు కాచాడు. "కొలదొకరికి చెప్ప కూడునా"... అంటున్నారు అన్నమయ్య. అంటే.. యేమిటి? తనూ ఒకగోపికయై తోటి గోపికలకి 'కతలు' చెబుతున్న అన్నమయ్య ఋణం తీర్చుకోగలమా?

**కం॥ ఎదుటను కలడీ బాలుడు**
**మది తెలియము వీని మాయ మరులేమొ కదా!**
**తుదిలేని ఆదిమూలము**
**అదె వేంకటకృష్ణుడతడె అన్నయ్యనెరా!**

**రాగం : భుజంగిణి**

ఎదుటనున్నాడు వీడె ఈ బాలుడు
మది తెలియమమ్మ ఏమరులో కాని ॥ఎదుట॥

పరమపురుషుడట పసుల గాచెనట
సరవులెంచిన విన సంగతాయిది
హరియె తానట ముద్దులందరికి జేసెనట
ఇరవాయనమ్మ సుద్దులేటివో గాని ॥ఎదుట॥

వేదాల కొడయడట వెన్నలు దొంగిలెనట
నాదించి విన్నవారికి నమ్మికా యిది
ఆదిమూల మీతడట ఆడికెల చాతలట
కాదమ్మ ఈ సుద్దులెట్టి కతలో కాని ॥ఎదుట॥





అల బ్రహ్మతండ్రియట యశోదకు బిడ్డడట
కొలదొకరికి చెప్పకూడునా యిది
తెలిపి శ్రీవేంకటాద్రి దేవుడై నిలిచెనట
కలదమ్మ తనకెంతో కరుణో కాని ॥ఎదుట॥

**భావామృతం :**

ఓ గోపెమ్మలారా! మన యెదురుగావున్నాడే... ఈ బాలుడు. వీడే కృష్ణుడు. ఏమి మరులు (మోహములు) కలిగిస్తాడో కాని, తెలుసుకోలేమమ్మా! ఆలోచనల కందని చేతలమ్మా వీనివి.

పరమపురుషుడైన పరమాత్మ వీడే. (ఇది నారదాదులేనాడో గ్రహించారు) కానీ అడవుల కెళ్లి పశువుల్ని కాచాడట. వీని చేష్టలకు 'సరవు' (ఒక క్రమము) లెంచలేము. యెంతవినినా ఆ సంగతి (మర్మం) తెలియు లేము. తాను స్వయంగా శ్రీహరి. కానీ ముదుసలులు దగ్గరనుంచి ముద్దుగుమ్మలదాక వీనికి ముద్దు నివ్వని వాళ్ళు, ముద్దులివ్వాలని తహతహలాడని వాళ్ళూ వున్నారా? వీడి కథలు ఏమోగాని, ఇరవాయనమ్మా! (ప్రసిద్ధమైనాయి).

ఈ శ్రీకృష్ణుడు వేదాలకు ఒడయడట (నాథుడట) కాని వెన్నదొంగ అని అందరిచేతా నిందించబడ్డాడు. ఈయన మహిమలను నాదించి (వినుతించి) విన్నవారి నమ్మకం ఏమిటంటే ఈయనే పరమాత్మ తాను ఆది పురుషుడై కూడా, ఆడికెల చాతలట (తిట్లు తినే చేష్టలట). ఏమి కథలో గాని ఇవి కథలు కాదమ్మా! వీని మహిమలేమని చెప్పగలం.

సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మగారికి ఈయన స్వయంగా తండ్రి. కానీ గొల్లకాంత యశోదాదేవి చనుబాలు త్రాగే ముద్దుబిడ్డ అయ్యాడు. 'కొలదొకరికి చెప్పకూడునా?' (పరిమితి ఇంత వున్నది అని చెప్పుటకు సాధ్యమా? వీని మహిమ లెంచగలమా?) ఈయనకి మనవంటి సామాన్యులమీద కూడ యెంత దయగలదో చెప్పలేం, యెందుకంటే స్వయంగా వైకుంఠం, దిగివచ్చి మీకోసం, కలియుగంలో మిమ్మల్ని రక్షించటంకోసం శ్రీవేంకటాద్రిపై నిలిచి వుంటానని తనమాట నిలబెట్టుకున్న వేంకటకృష్ణయ్య వీడే.

**4-78**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని దివ్యరథం తిరుమల వీధులలో వూరేగింపుగా పోతున్నది. గోవిందనామ సంకీర్తనం ఆకాశాన్నంటుతున్నది. ఇసుక వేస్తే రాలనంత జనం పులకించి పోతూ జగన్నాథుని మళ్ళీ చూడలేమేమో అనే తపనతో చూస్తున్నారు. మనకి గోచరించని ఇంకొక అద్భుత దృశ్యం అన్నమాచార్యులవారికి దృశ్యమానమైనది. చక్కటి కీర్తనలో ఆ వైభవాన్ని వర్ణిస్తున్నారు. నా భావన ననుసరించి నేనూ భావించాను. ఆ భావంబెట్టిదనిన... వినండి.

**ఆ.వె॥ అమరలోక వనితలాడేరు చూడరో**
**ప్రమదమూనివారు పాడినారు**
**వివిధ వాహనాల వేంకన్న వూరేగ**
**అన్నమయ్య హరిని సన్నుతించె**

**రాగం : దేవగాంధారి**

అమరాంగనలదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు ॥అమరాంగ॥

గరుడ వాహనుడు కనకరథముపై
యిరవుగ వీధుల నేగీని
సురులును మునులును సొంపుగ మోకులు
తెరలిచి తెరలిచి తీసేరు ॥అమరాంగ॥

యిలధరు డదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మ శివాదులు
చెలగి సేవలటు సేసేరు ॥అమరాంగ॥





అలమేల్మంగతో నటు శ్రీవేంకట-
నిలయు డరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగుల గడు బొగడేరు ॥అమరాంగ॥

**భావామృతం :**

పరమాత్ముని రథోత్సవము జరుగుచున్నది. అదిగో, అమరాంగనలు (దేవతా స్త్రీలు) నాట్యమాడుచున్నారు. అదిగో ఎంతో సంతోషంతో స్వామి స్తోత్రాలు పాడుతున్నారు. (మనబోటి మానవమాత్రులకు ఆ దృశ్యం చూసే భాగ్యం లేదు. భావనలో ఆ కమనీయ దృశ్యాన్ని అనుభవిద్దాం).

గరుత్మంతునిపై తిరుగాడే శ్రీమన్నారాయణుడు, నేడు బంగారు రథముపై తిరువీధులలో వెళుతున్నాడు. దేవతలు, మునీశ్వరులు బారులు దీరి కమనీయ దృశ్యమానముగా "మోకెలు తెరలిచి తెరలిచి తీసేరు" (సాష్టాంగ నమస్కారములు గుంపులు గుంపులుగా చేయుచున్నారు). కనులారా ఆ దృశ్యం వీక్షించండి.

అదిగో చూడండి. ఇలధరుడు (భూకాంతుడు) ఇంద్ర రథముపై పోవుచున్నాడు. నరకాసురుని పీడ నివారించినందుకు ఇంద్రుడు తన రథంపై ఆనాడు స్వామిని సత్యభామ (భూకాంత) తో పాటు అలకాపురి వీధులలో వూరేగింపుగా తీసికొని వెళ్ళాడు. కెలయుచు (విజృంభించి) దిక్కులు గెలిచి త్రిభువనాలను తిరిగి ఇంద్రుని కిచ్చివేసిన స్వామిని ఆదిశేషుడు, బ్రహ్మదేవుడు, శంకరుడు మొదలైన వారు విశేషముగా సేవిస్తున్నారు. ఆ ఇంద్ర రథము వైభవం నేడు కూడా వర్ణనాతీతంగా వున్నది.

ఈనాడు అలమేల్మంగమ్మతో ఆ స్వామే శ్రీవేంకటేశ్వరునివలె తిరుమల వీధులలో తన రథముపై విజృంభించి వూరేగుచున్నాడు. అదిగో దశదిశలా, ముక్తులు (ముక్తిపొంది వైకుంఠవాసులైనవారు) నారదాది భక్తగణములతో వారంతా స్వామిని, పొలపు మిగుల (విస్తృతంగా) కడు బొగడేరు (మిక్కిలి కీర్తించుచున్నారు).

## 4-79

## మున్నుడి

తిరుపతిలో నెలకొన్న గోవిందరాజ స్వామి కొమ్మలిద్దరితో (శ్రీదేవి, భూదేవి) కొలువుదీరి యున్నాడు. ఇమ్ములన్ చిక్కియున్నాడట అంటే... అనుకూలంగా దొరకినాడట. ఆ స్వామి కావాలనుకొంటే దొరకుతాడు వద్దనుకుంటే ఎంత మొరపెట్టినా కంటబడడు. ఉన్నతితో కొలువిచ్చాడు అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటగిరిపై నున్నది కూడా ఈయనేనట. తిరుపతిలో రేచిన మోహాన రేయాబగలు తన సతులను కూడినాడట. ఇలా అనటం ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

**కం॥ ఇమ్ముల జిక్కున్నాడిదె**
**కొమ్మల్లారా! విభుండు గోవిందుడటే**
**రమ్మని చేయిని జాచెను**
**అమ్మల్లారా! యనంచు అన్నయ వినిచెన్**

**రాగం : సారంగం**

కొమ్మలాల అమ్మలాల గోవిందరాజ
నిమ్ముల జిక్కున్నవాడు యిక నే మమ్మా ॥కొమ్మ॥

పరపుమీద నూరక పవళించుండుట గాని
నిరతి మీ విభునికి నిద్దుర లేదు
పరగ మీరిద్దరును పాదములు పిసుకుగ
సురత మర్మపుగాక జొక్కీనదే ॥కొమ్మ॥

వున్నతితో గొలు విచ్చి వుండుట యింతే కాని
కన్నుల చూపు మీపైనే కదరమ్మా
మన్నన సతులు మీరు మాటలిట్టే యాడగాను
విన్న వినుకుల మెచ్చి విఱ్ఱవీగీ నదివో ॥కొమ్మ॥





పూచి భుజములు మూడై పొరలి వుండుట గాని
చాచిన కరము మీకే సన్న సేసీని
ఆచి శ్రీవేంకటగిరి నదె తిరుపతిలోను
రేచిన మోహాన గూడే రేయాబగ లదివో ॥కొమ్మ॥

**భావామృతం :**

ఓ యువతుల్లారా! మా తల్లులారా! ఈ గోవిందరాజస్వామి నేడు "ఇమ్ముల జిక్కి యున్నాడు" (అనుకూలంగా కావాలనే వారికి దొరకియున్నాడు) ఇంకా ఏమిటమ్మా! ఆయన మీవాడేకదా!

గోవిందరాజ స్వామి ఏదో వూరకనే అలా పరుపుపై పవళించి యున్నాడు కానీ, నీపై మిక్కిలి ఆసక్తికల ఆయనకు నిద్ర యేదమ్మా! మీరిద్దరు ఆయన పాదములను ప్రేమగా ఒత్తుతుంటే ఆయన విలసిల్లి యున్నాడు. బహుశా సురతి మర్మముల బాగుగా తెలిసియుండుగాక!

స్వామి వున్నతముగా కొలువు దీరివున్నాడు. అందుచేత ఏదో కొలువులో వున్నాడు గానీ ఆయన కళ్ళు మీపైనే వున్నవమ్మా! ఆయన సదా మీ మాటలను మన్నిస్తూనే వుంటాడు. మీరేమి మాట్లాడినా ఆయనకు వినసొంపుగానే వుంటాయి. తను విన్నసంగతులను మెచ్చుకొని ఆయనని విఱ్ఱవీగుతాడమ్మా! (అతిశయించి వుంటాడమ్మా!)

అమ్మలారా! చతుర్భుజుడైన గోవిందరాజస్వామి మూడు చేతులు (భుజములు) శంఖచక్రాయుధసమేతములైనవి మరియు తలక్రింద ఒక చేయివుంచుకొనినాడు. ఆయన నాలుగవ చెతిని చాచి మీకేవో సైగలు చేయుచున్నాడు. ఈయన తిరుపతి నగరవాసుడైనప్పటికీ శ్రీవేంకటగిరిపై భద్రముగా నెలకొని రెచ్చిపోయిన మోహపరవశుడై రేబవళ్ళూ మిమ్మల్ని కూడి వుంటాడమ్మా! మీరంటే ఆయనకంత ఇష్టం.

4-80

## మున్నుడి

దీనులై దేవదేవుని శరణు జొచ్చి ఆర్తితో ఆలపిస్తున్న అన్నమాచార్యులవారిని వింటే రాళ్ళే కరిగిపోతాయి. ఏడుకొండలవాని గుండెలను పిండిచేసే కీర్తన ఇది. ప్రభూ! నేను దీనుడవను. నీవో దేవుడవు. నీ దివ్య మహిమ ప్రకటిస్తున్నావు. నిత్యమూ జరుగుతుండె చావుపుట్టుకల మర్మమే తెలియనివాడను. ఇక భూమ్యాది విశ్వమును పుట్టించిని నిన్ను తెలుసుకోగలనా? శ్రీపతివైన నీవే జాలితో నాపై దయదలచి ఈ బంధనాల నుంచి విడిపించాలి గాని నా వల్ల అవుతుందా? నిన్ను విడువనయ్యా! నా అంతిమ శ్వాస దాక నన్ను రక్షించే భారం నీదే ప్రభూ! అంటున్నారు....

**మ॥ వరదా! దీనుడ నేను దేవుడవు నీ వాత్సల్యమే చాలదా?**
**నెరపేనీ మహిమల్ నెరుంగ తరమా!! నీ చిత్తమే చెల్లురా**
**తిరువేంకన్నవు దేవదేవుడవు ఈ దీనున్ సదా బ్రోవుమా**
**విరివై కీర్తనలన్నమయ్య వినిచెన్ వేనోళ్ళ కీర్తించుచున్.**

**రాగం : నీలాంబరి**

దీనుడను నేను దేవుడవు నీవు
నీ నిజ మహిమే నెరపుట గాక ॥దీనుడ॥

మతి జనన మెరుగ మరణంబెరుగను
ఇతవుగ నిను నిక నెరిగేనా
క్షితి పుట్టించిన శ్రీపతిని నీవే
తతి నాపై ద్వయ దలతువు గాక ॥దీనుడ॥

తలచ పాపమని తలచ పుణ్యమని
తలపున ఇక నిను తలచేనా
అలరిన నాలో అంతర్యామివి
కలుష మెడయ నను గాతువు గాక ॥దీనుడ॥





తడవ నా హేయము తడవనా మలినము
తడయక నీమేలు తడవేనా
విడువలేని శ్రీ వేంకట విభుడవు
కడదాకా నను గాతువు గాక ॥దీనుడ॥

## భావామృతం

ఓ శ్రీనివాసా! నేను దీనుడను. నీవు భగవంతుడవు. నీ యొక్క దివ్య మహిమను ప్రకటింపజేయుట గాక, నీ విశ్వరచన మేము అర్థము చేసికొనగలమా?

ఎంత ఆలోచించినా మా బుర్రకు చావుపుట్టుకల మర్మం తెలుస్తుందా? యెవరు యెందుకు పుడతారో, యెందుకు మరణిస్తారో చెప్పగలవారెవరు? నిత్యము మా కళ్ళెదుటే జరిగే వాటినే తెలియని మాకు, నిన్ను తెలియుట సాధ్యమా? ఈ విశ్వాన్ని సృష్టించిన దేవదేవుడవు, శ్రీపతివి. దీనుడనని నాపై దయదలచెదవు గాక!

ప్రభూ! రోజూ తెలిసో తెలియకో ఎన్నో పాపాలు చేస్తున్నాను. అలాగే పుణ్యాలు కూడా చేసే వుంటాను. వాటినే తలచి నన్ను నేను సంస్కరించుకొనే 'తీరిక' లేని నాకు నీగురించి తలచే సమయముంటుందా? నా తలపులలో కూడా నిన్ను రానివ్వటం లేదు. పోనీ నీవెక్కడో దూరంగా వున్నావంటే కాదయ్యే. అంతర్యామిగా మాలోనే వుండి అనుక్షణం గమనిస్తావు. నా దోషములను తొలగించి నన్ను రక్షించెదవు గాక!

ప్రభూ! ఇక నా గురించి ఏమి చెప్పుకోమంటావు? నా బ్రతుకు గురించి, తడవనా (ఆలోచించుటకే) హేయము (నీచముగా నున్నది). తడవనా (దాని గురించి ప్రస్తావించుటయే) మలినము. తడయక (నిన్ను ధ్యానించక), నీమేలు, తడవేనా (సంపాదించగలమా?) అది అసాధ్యం. ఎన్నడూ విడువరాని శ్రీవేంకటేశ్వరుడవు నీవే. నేను నిన్నే నమ్ముకొన్నాను. కడదాకా (నా చివరి క్షణం దాక) నన్ను గాతువు గాక! (రక్షించెదవు గాక).

"క్షమస్వత్వం క్షమస్వత్వం శేషశైల శిఖామణే"

## 4-81

## మున్నుడి

నేటి కడప జిల్లాలోని వావిలిపాడులో వెలసిన వీరరాఘవుని కళ్యాణసందర్భంగా ఆనాడు అన్నమాచార్యులవారు పాడిన చక్కని పెండ్లిపాటనాలకించండి. సీతమ్మ 'దగ్గరి సింగార బొమ్మ'. రాఘవుడు శివధనస్సు విరిచాడు కాబట్టి జనకుడు నిన్ను ఆయనకిచ్చాడు అని అంటున్నారు. సీతారామకళ్యాణం కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. వశిష్టుడు వేదమంత్రాలు చదువుతుంటే అక్షతలు చల్లవమ్మా! అని కీర్తన వినిపిస్తున్నారు. "తెంకుల నిన్ను గూడి తిరమాయనమ్మా" - అని అంటున్నారు. అంటే... యేమిటో చదవండి మరి...

**కం॥ సిగ్గరి పెండిలి కూతురు**
**దగ్గరి సింగార బొమ్మ తలవంచకుమా!**
**మొగ్గగు సీతమ్మకు నిటు**
**బిగ్గరగా అన్నమయ్య పేర్కొని తెలిపెన్.**

**(పేర్కొని=స్తుతించి)**

**రాగం : సాళంగనాట**

సిగ్గరి పెండ్లికూతుర సీతమ్మ
దగ్గరి సింగార బొమ్మ తలవంచకమ్మా ॥సిగ్గరి॥

అల్లనాడే రాఘవుడు హరువిల్లు విరిచెను
యెల్లి నేడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుడు నిన్నిచ్చీనట వీడె
వెల్లివిరినీ మాట వినవమ్మా ॥సిగ్గరి॥

అదె పెండ్లితెర యెత్తిరండనే వసిష్టుడుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా
మొదల రామునికంటె ముంచి తలబాలు వోసి
సుదతి యాతని మోము చూడవమ్మా ॥సిగ్గరి॥





కంకణదారాలు గట్టి కాలుదొక్కితివి మీరు
పొంకాన బువ్వమందరో పొత్తుల నమ్మ
(ఉం) మంకువ వావిలి పాటనుండి శ్రీవేంకటగిరి
తెంకుల నిన్ను గూడి తిరమాయనమ్మా ॥సిగ్గరి॥

**భావామృతం**

ఓ సీతమ్మా! సిగ్గుల మొగ్గవైన పెండ్లికూతురా! రామచంద్రునికి దగ్గరదానవైన శృంగారాల అపరంజి బొమ్మా! అంతగా తలవంచుకొనవద్దు తల్లీ! (రామయ్యకు నీవంతగా తలవంచుకొంటే నీ సౌందర్యమెలా కనబడుతుంది?)

అల్లనాడే (ఇదివరకే) రాఘవుడు శివధనస్సును విరిచాడు. యెల్లి (రేపటిరోజు, అనగా నిన్నటికి రేపటిరోజు) అయిన నేడే పెండ్లియాడుతున్నాడు. ఇదిగో జనకమహారాజు నిన్నిచ్చి కన్యాదానము చేయుచున్నాడు. ఈ మాట ప్రపంచమంతా వెల్లివిరియైనది. (ప్రకటించబడినది). నేటికీ ఆనాడు ఆయనన్నమాటలు ప్రసిద్ధమే. ఒక్కసారి చూడవమ్మా! వినవమ్మా!

అదిగో మీమధ్యనున్న తెఱపైకెత్తివేసినారు. అక్కడే వశిష్టుడు యుండి చక్కగా మంత్రాలు చదువుతున్నాడు. నీవు అక్షతలను చల్లవమ్మా! రామునికంటే ముందరే ఆయన శిరస్సుపై తలంబ్రాలు పోసి మనోహరమైన ఆ సుందర వదనము వంక కన్నార్పక చూస్తూ వుండిపోవమ్మా! నిన్ను కాదనగలవారెవరు తల్లీ!

మీ ఇద్దరి చేతులకు కంకణదారాలు కట్టి కళ్యాణ దీక్షనిచ్చారు. సన్నికల్లుతో రామచంద్రమూర్తి కాలు నీ కాలితో త్రొక్కించారు. పొందికగా, పొత్తుల (బంతిలో వుండి) మీరిద్దరు బువ్వమందరో (పెండ్లి బంతి భోజనం చేయండి). (ఇక్కడ మంకువ అని వున్నది గాని అది "వుంకువ" అయి వుండాలి. ఎందుకంటే... మంకువ అనే మాటకర్థంలేదు). ఉంకువ అంటే అల్లుడు మామగారికిచ్చే కన్యాశుల్కము. బంతి భోజనాలయ్యాక అల్లుడు కన్యాశుల్కం ఇచ్చి పెండ్లికూతుర్ని తనవెంట తీసికొని వెళ్తాడన్నమాట. సరే, ఇక్కడ వావిలిపాటిలో వున్న ఈ వీరరాఘవుడే శ్రీవేంకటగిరి తెంకుల (స్థానముగా) నిన్నుగూడి తిరమాయెనమ్మా! (స్థిరపడ్డాడమ్మా!)

## 4-82

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని తెప్ప తిరునాళ్ళ సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన చక్కని కీర్తన ఇది. స్వామికి పాలసముద్రంలో 'పాముతెప్ప' ఏర్పాటయిందిట. తొల్లి మఱ్ఱి ఆకు తెప్పపైనే ఆయన తేలిఆడాడట. సాగరమధనంలో మంధర పర్వతానికి తానే ఒక తెప్ప అయ్యాడట. కాళింగుని మర్దించినప్పుడు ఆ పడగలే స్వామికి యమునా నదిలో తెప్ప అయిందట. పదియారువేల భార్యల చెమటల తెప్పోత్సవం జరుపుకొన్నాడట. ఈ తిరుమలలోది "నేటి నేటి తెప్ప తిరునాళ్ళట" అంటే యేమిటి? తప్పదు... భావామృతం చదవాల్సిందే.

**ఆ.వె॥ఎందునీకు ప్రియము యీ తెప్పతిరుణాళ్ళు**
**ఇందువడెను, సిరులు పొందు తెప్ప**
**అన్నమయ్య పాట నలరిన తిరుణాళ్ళు**
**లెక్కలెంచగలమె యెక్కడైన?**

**రాగం : బృందావన సారంగ**

ఎందునీకు ప్రియమో యీ తెప్ప తిరునాళ్ళు
దిం(ఇం)దువడె సిరులతో (యీ) తెప్ప తిరునాళ్ళు ॥ఎందు॥

పాదజలనిధిలో బవ్వలించీ పాముతెప్ప
దేలుచున్నదది దెప్ప తిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకు మీద
తేలుచున్న దది తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥

అమృతము దచ్చునాడు అంబుధిలో మంధరము
తేమల దేలించు తెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగు సంగపు పడిగెలమీద
తిమిరి తొక్కిన తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥





అప్పుడు పదారువేలు అంగనల చెమటల-
తెప్పల దేలిన తెప్ప తిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతి కోనేటిలోన
తెప్పి (ప్ప) రిల్లె నేట నేట తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥

## భావామృతం

ఓ ఏడుకొండలవాడా! తెప్ప తిరుణాళ్ళంటే యెందుకు నీకు ప్రియమో!! (ఎక్కడి ప్రీతి స్వామీ!) ఈ తిరునాళ్ళు సిరులతో 'ఇందువడె' (అనగా... ఇమిడిపోయినవి). (రాగి రేకుపై 'దిందువడె' అని వున్నది. కాని దిందువడెకి సరయిన అర్థం నాకు కనిపించలేదు).

(ప్రభూ! నీవు అనేకములైన తెప్పోత్సవములు ఇదివరలో చాలా చేసికొనినావు. కొన్నింటిని వివరిస్తాను) క్షీరసాగరమున, ఆదిశేషుడు అనే పాముపై శయనించు నీకు తేలిన ఆ పాము తెప్ప తిరుణాళ్ళు నిత్యమూ వుండేదే కదా! సృష్ట్యాదియందు, ఓలి (యెడ తెరపి లేకుండా) ఏకోదకమై ప్రపంచమంతయూ వున్నప్పుడు, నీవు ఒక మఱ్ఱి ఆకుపై తేలి శయనించినావు. అదిగో అదే నీకు మఱ్ఱియాకు తెప్ప తిరుణాళ్ళు.

ఆనాడు దేవదానవులు, క్షీరసాగరమధనం జరిపిన వేళ కవ్వమైన మంధర పర్వతం మునిగిపోతుంటే, నీవు ఆదికూర్మమై, ఆ మంధరగిరిని తేలించి చక్కటి తెప్ప తిరుణాళ్ళు జరిపించినావు. యమునానదిలో కాళింగుని మదమణచుటకు వాడి పడగలమీద నృత్యం చేసి ప్రాణాలు విలవిలలాడేట్లు చేసి, వాడి సంగపు పడిగెలు (కలిసియున్న పడిగెల)పై తిమిరి తొక్కి (తిమ్మిరి పోగొట్టు) తెప్ప తిరునాళ్ళు యమునలో చేసికొనినావు.

ద్వాపరయుగంలో పదియారు వేలమంది (నరకాసురుని బందీలయిన రాచకన్నెలను పెళ్ళాడి పదియారువేల కృష్ణులుగా వారితో ఒకేసారి సుఖించి వారి చెమటలు ఏరులై పారగా, ఆ అంగనల చెమటలో తేలి తెప్పోత్సవం జరుపుకొన్నావు. అవన్నీ అటుంచి, నేడు ఈ శ్రీవేంకటాద్రిపై ఈ కోనేటిలో తెప్పరిల్లి (సేదదీరి), ఒప్పుగా గొప్ప ఔన్నత్యముతో నీవు "నేటినేటి తెప్ప తిరుణాళ్ళు" (దృఢముగా నిశ్చయమైన తెప్ప తిరుణాళ్ళు) జరుపుకొనుచున్నావు. మమ్మల్ని తరింపజేయుచున్నావు.

4-83

## మున్నుడి

అన్నమాచార్యులవారి తత్త్వోపదేశం నేటికాలంలో వేమన శతకం చదివినట్లుంటుంది. పరనింద తగదు. ఇంకొకళ్ళ నెత్తిన బూజుని చూచి నవ్వేముందు నీ నెత్తిన యెంత బూజుందో చూసుకో, నేనూ అంతే...

పరులపై ఆగ్రహిస్తాను. కానీ అరిషడ్వర్గాలను జయించలేను. ఇంకొకళ్ళకి నీతులు చెప్తానేగానీ నా అంతర్యామియైన హరిని తెలియను. ఇంకొకళ్ళ దుర్గుణాల నేకరువు పెడతాగాని నా ఆసల నణచలేను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్నాళ్ళకూ నిన్నెరగని, నన్ను ఎన్నన్నా ఫలితం సున్నా. నా చదువు చట్టు బండలైనట్లుంది తండ్రీ!

**చం॥ చదివితి దొల్లి కొంత, మనసా పఠియించితినింక కొంత,నా**
**యెదుటనె యున్ననాదు మతియేను యెరుంగను యెంతయైన, నే**
**నిదివిను నిత్యమున్ పరుల యెగ్గుల నెంచెద వీడ నాసలన్**
**యెదగల వేంకటేశ్వరుని యెంచను దిక్కని అన్నమయ్యనెన్.**

### రాగం : శ్రీరాగం

చదివితి దొల్లి కొంత - చదివే నింకా గొంత
యెదిరి నన్నెఱగను - యెంతైన నయ్యో ॥చదివితి॥

ఒరుల దూషింతు గాని - వొకమారైన నా
దురితకర్మములను - దూషించను
పరుల నవ్వుదు గాని - పలు యోని కూపముల
నరకపు నామేను - నవ్వుకోను ॥చదివితి॥

లోకుల గోపింతుగాని - లోని కామాదులనెటి
కాకరి శత్రులమీద - గడుగోపించ
ఆకడ బుద్ధులు చెప్పే - అన్యుల బోధింతు గాని
తేకువనాలోని హరి - దెలుసుకోలేను ॥చదివితి





ఇతరుల దుర్గుణము - లెంచి యెంచి రోతుగాని
మతిలో నాయాసలు - మానలేను
గతిగా శ్రీవేంకటేశు - గని బ్రతికితిగాని
తతి నిన్నాళ్ళదాకా - దలపోయలేను ॥చదివితి॥

### భావామృతం

ఓ దేవదేవా! నేను ఇదివరకు కొంత 'చదివాను'. ఆ తరువాత కాలంలో కూడ మరికొంచెం చదివాను. కాని నా యెదుటనున్న వాని తత్త్వము నెరుగను. అంతయెందుకు నాగురించి నేనే తెలియకున్నాను.

పనివేళా పరదూషణ చేస్తానేగాని నేను చేయుచున్న దుష్కర్మములను మాత్రం దూషించను (పైగా నన్ను నేను సమర్థించుకొంటాను). పరులను చూచి పకపక నవ్వుతాను కాని, యేవేవో యోనుల యందు జన్మించి (వివిధ పుట్టుకలను పొంది నరకయాతనల ననుభవించుచున్న నా 'శరీరాన్ని' చూసి నాకు నవ్వు రావటంలేదు. ఎవరి నెత్తిన బూజు వారెరుగరంటే ఇదేనేమో!!

పరులపై కోపమును ప్రదర్శిస్తుంటాను కాని, నాలోనే వున్న "కాకరి శత్రువు"లను (మాయావులైన వైరులను) తెలియలేకున్నాను. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనే ఆ ఆరుగురు శత్రువులపై యేమాత్రం నా కోపం ప్రదర్శించకున్నాను. ఇంకొకరికి యెన్నెన్నో బుద్ధులు నేర్పుతాను గాని, నాలోని 'అంతర్యామి' నాకు బుద్ధులు చెబుతుంటే, తేకువతో (వివేకముతో) నాలోని 'హరిని' తెలుసుకోలేక పోతున్నాను. నన్నేం చేయాలి?

ఇదిట్లా వుండగా, నేను ఇతరుల దుర్గుణాలను చూచి యేవగించుకొంటానే కాని, నా మనస్సులో వున్న ఆసలను విడనాడ లేకున్నాను. ఈ ఆశ ఒక పాశము వలె నన్ను బంధిస్తున్నది. చివరికి ఎలాగో అలా, శ్రీవేంకటేశ్వరుని కరుణవల్ల బ్రతికి బట్టకట్టగలిగాను కాని ఆయనపై 'తతి' (ఆసక్తి)తో ఇప్పటిదాకా ఆ ఏడుకొండలవాడి మహిమను మాత్రం గుర్తించలేకున్నాను. నేను బ్రతికుండగా అది జరుగుతుందో...లేదో.

**4-84**

## మున్నుడి

శ్రీమన్నారాయణుని దశావతారములను కీర్తించాలంటే అన్నమాచార్యులవారే ప్రథమ స్థానంలో వుంటారు. నూటికి తొంబది మందికి ఇది దశావతార కీర్తన అని అర్థం అవదు. అధవా... స్ఫురించినా అన్వయించటం అంత సుసాధ్యం కాదు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు దీని భావామృతం చదివితే అన్నమయ్య పాండిత్యం, అనంతం... అసామాన్యం అని అర్థం అవుతుంది. ఆయనని పొగడటం అటుంచి మన భాషతెలుగు అయినందుకు గర్వంతో మన తలపైకి లేస్తుంది. నిజం...

**ఆ.వె॥ పురుషులకు పురుషుడ! పురుషోత్తమా నీకు**

**పురుడు లేదు, శ్రేష్ఠపురుషుడీవు**

**హరిదశావతార తీరునెరుగలేము**

**తరచి తరచి చూడ ఎరుకయగును.**

**రాగం : హిందోళము**

పురుషులకు పురుషుడవు పురుష్తోమా
పురుడు లేదికి నీకు బురుషోత్తమా ॥పురుష॥

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బులిసి లోగగనేల పురుషోత్తమా
పొలము రాజవు నీవు పురుషోత్తమా
పొలకువదే కంబమున పురుషోత్తమా ॥పురుష॥

పొడవులకు బొడవైన పురుషోత్తమా
పుడిసిళ్ళ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిగైకొంటి పురుషోత్తమా
పొడమె జీకటి తప్పు పురుషోత్తమా ॥పురుష॥





బూటకపు బుద్ధిగల పురుషోత్తమా
పోటిగుబ్బపు బసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటము మీది పురుషోత్తమా
పూటపూటవరాలు పురుషోత్తమా ॥పురుష॥

## భావామృతం

పురుషులందరికీ (అంటే జన్మనెత్తిన జీవులందరిలోకి) పురుషుడవు (అధికుడవైన) పురుషోత్తమా (పరమాత్మవైన నారాయణుడా) పురుడులేదిక నీకు (అసలు నీకు జననమే లేదు ప్రభూ!)

ఓ పురుషోత్తమా! నీవు పొలసులాడకు. (చేపలకంపు కొట్టవద్దు...అంటే మత్స్యావతారము). బులిసి లోగగనేల పురుషోత్తమా! (అధికుడవై కూడ లొంగి ఒకరి క్రింద పడివుండుట యెందుకు పురుషోత్తమా!...అంటే కూర్మావతారం).

పొలము రాజవు నీవు (అడవికి మొనగాడైన అడవి పందివి (వరాహావతారం) పొలకువదే కంబమున (స్తంభమునందు, అదిగో నీ జాడ కనబడినది...అంటే అప్పటికప్పుడు స్తంభము నుండి ఆవిర్భవించినవాడు...అంటే నరసింహావతారం).

పొడవులకు పొడవైన (ఉన్నతులైనవారందరిలో ఉత్కృష్టుడవైన... త్రివిక్రముడు. అనగా వామనావతారము) పురుషోత్తముడు. పుడిసిళ్ళ జల్లితివి (పుడికిళ్ళతో...దీనినే నేటికాలంలో 'పిడికెళ్ళతో' అంటున్నాం.. అంటే పిడికెళ్ళతో రాజుల రక్తం వెదజల్లిన పురుషోత్తముడు..అంటే పరశురాముడు). పుడికి సతిగైకొంటివి (బుజ్జగించి భార్యను స్వీకరించిన పురుషోత్తముడు.. శ్రీరామావతారం). పొడమె చీకటితప్పు పురుషోత్తమా (జారత్వము పొడగాగల దేవా!..జారుడు అనిపించుకొని మచ్చ తెచ్చుకొన్న శ్రీకృష్ణా!)

బూటకపు బుద్ధిగల (మోసముతో మానం అపహరించు బుద్ధిగల పురుషోత్తమా...బుద్ధావతారము). పోటి గుబ్బపు బసల పురుషోత్తమా (గొప్ప చాతుర్యంగల యుద్ధాశ్వమునెక్కిన కల్కిఅవతారం). మేటి పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరా! తిరుమల మీద ఏ పూటవరాలు ఆపూటనే ఇచ్చివేసే పురుషోత్తమా! శ్రీనివాసా! ధన్యోస్మి ప్రభూ!

## 4-85

## మున్నుడి

అన్నమాచార్యులవారు యెన్నుకొనే 'అంశం' ప్రతి కీర్తనలోను, వైవిధ్యం ప్రస్ఫుటిస్తుంది. నీవు పరమాత్మవు (దేవుడవు) మేము జీవులం. ఈ విధంగా మనకి ఋణానుబంధం వున్నది. కాని నీవెక్కడ నేనెక్కడ? సృష్టిలోని జగములన్నీ మీ వెంట్రుకల మొదళ్ళలోంచి ఆవిర్భవించాయి. గతంలో వున్న బ్రహ్మలు, రాబోయే కల్పములలో వుండబోయే బ్రహ్మలు (ఆంజనేయుని వంటివారు) మీ నాభికమలం (బొడ్డులోని తామరపువ్వు) నుంచే పుడతారు. నీ ఘనతనెరుంగ శక్యమా ప్రభూ! ఏదో నీ మహిమ తెలియకపోయినా నీకృప నర్థించి నిన్ను సేవించటం తప్ప మావల్లనేమవుతుంది శ్రీనివాసా!

**మత్తకోకిల :**

**నీవు దేవుడవయ్య శ్రీహరి నేను జీవుడ వల్లభా!**
**ఈ విధిన్ మన ఇర్వురిన్ ఋణమిట్లు గట్టెను నిక్కమౌ**
**ఆ విధాతలు యెందరైనను అబ్జనాభుని నాభిలో**
**దేవ! పుట్టినవారలే ఇది తెల్పె అన్నయ చూడరో.**

**రాగం : సింధుభైరవి**

నీవు దేవుడవు నేనొక జీవుడ
యీ విధి నిద్దరి కెంతంతరువు ॥నీవు॥

పొడమిన జగములు పుట్టెడి జగములు
గుడిగొనె మీ రోమ కూపముల
యెడయక నీ రూపమేమని ధ్యానింతు
అదరి మీవాడ నేననుటే కాక ॥నీవు॥





మునుపటి బ్రహ్మలు ముందరి బ్రహ్మలు
మొనసి మీ నాభిని మొలచేరు
ఘనుడవు నిన్నేగతి నే తెలిసెద
అనువుగ మిము శరణనుటే కాక ॥నీవు॥

సహజానందము సంసారానంద-
మిహము పరముగా నిచ్చేవు
అహిపతి శ్రీవేంకటాధిప నీ కృప
మహిలో సేవించి మనుటే కాక ॥నీవు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీవు పరమాత్మవు, అనంతుడవు. నేను జీవుడను. (సముద్రంలో నీటి బొట్టంత కూడా వుండను). అయినప్పటికీ మనిద్దరికీ నేను చెప్పబోయే విధముగా యెంతెంతో ఋణానుబంధం వున్నది. అందుకని నీకు నన్ను రక్షించక తప్పదు.

ప్రభూ! పొడమిన జగములు (ఇదివరకే వున్న లోకములు), పుట్టెడి జగములు (ఇకముందు రాబోయే లోకములు), అన్నీ అనంతుడవైన నీ రోమ కూపముల నుంచే (వెంట్రుకల మొదళ్ళనుంచే) గుడిగొన్నవి (పుట్టాయి). అటువంటి నీ రూపాన్ని ధ్యానించటం నాకు సాధ్యమా? ఏదో నేనూ నీవాడిని అని చెప్పుకొంటూ బ్రతుకుటకాక, నావలన యేమవుతుంది తండ్రీ!

దేవా! సృష్ట్యాదినుంచి వున్న బ్రహ్మదేవుళ్ళూ! రాబోయే కల్పములలో వుండబోయే బ్రహ్మలు, అంతా 'పద్మనాభు'డవైన నీ నాభికమలం నుంచే పుట్టారు. పుట్టబోతారు కూడా. అటువంటి ఘనుడవైన నిన్ను ఏ విధంగా తెలుసుకోగలనయ్యా? నిన్ను 'శరణు మహాప్రభో'! అని శరణు వేడుట కాక మేము చేయగలిగిందేమన్నావున్నదా ప్రభూ!

ఓ ఏడుకొండలవాడా! ఇహలోకంలో మేము పొందే సాంసారిక ఆనందము, పరలోకంలో మా కర్మఫలంగా మేము పొందబోయే 'పరభాగ్యము' అనే సహజానందము (అది మాతోబాటే పుట్టుతుంటుంది) ఇచ్చేది వేరెవ్వరోకాదు... నీవే. అహిపతి (శేషశయనుడవైన ఆదిశేషుని వల్లభా!) శ్రీవేంకటేశ్వరా! మహిలో నీకృప నర్థించి, నిన్ను సేవిస్తూ జీవించుట కాక, మేము చేయగలిగింది, చేయబోయేది, చేయవలసినది కూడా మరొకటి లేదు.

## 4-86

## మున్నుడి

అష్టవిధములైన శృంగార నాయికలలో "కలహాంతరిత" ఒకతె. ఈమెకు తన నాథుడంటే అంతులేని ప్రేమ. కాని ఆయన క్షణం ఆలస్యంగా తన దగ్గరకు వస్తే... ''గయ్యి''మని మాట్లాడే 'గయ్యాళి'. అగ్నిపర్వతంలా ప్రజ్వరిల్లి ఆయన అనునయించగానే కఱగినీరవుతుంది. కౌగిలిలో విలపిస్తుంది. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు 'కలహాంతరిత' వలె జగన్నాధునితోనే పోట్లాడుతున్నారు. దెప్పి పొడుస్తున్నారు... రుసరుసలాడుతున్నారు. బుసకొట్టే భుజంగమైపోయారు. ఆ తరువాత కథ అంతా మామూలే.

**ఉ॥ చాలుర నీదు పొందు, యిక సాధ్యము కాదుర పొమ్ము ఆవలన్**
**తాలిమి పోయె వీడితిని ధైర్యము బోరగ శక్తి లేదురా**
**నాలివి, ఆపవామె నను నవ్వగ మచ్చర మెక్కి వల్లభా!**
**యేల వితండవాదములు యెంచుము దాసిని అన్నమయ్యనెన్.**

**రాగం : మాళవి**

పోపోనీ పొందుచాలు పొసగదిక
వైపు గాదనుచు నీతో వడి బోరాడేనా ॥పోపో॥

అప్పుడే ఆపె మాటకు నదలించ వలదా
విప్పుచు నన్ను దిట్టగా విందురా నీవు
చెప్పనేల నీతోడి చెలిమేటి చెలిమి
ముప్పిరి చుట్టమవంటా మొగము చూచేదా ॥పోపో॥

మచ్చరాన నవ్వగాను మానుపంగవలదా
(వ) వొచ్చాన నావేళ నాపె వద్ద నుందురా
యిచ్చ కాన నీకు నాకు నేటి మొగమాట మింక
వచ్చినదే పదివేలు వాదులాటే చాలును ॥పోపో॥





పొత్తునగూచుండితేను పొమ్మనంగ వలదా
అత్తల సరిసేతురా ఆపెను నన్ను
అత్తిన శ్రీవేంకటేశ అలమేలు మంగ నేను
బత్తితో నన్ను గూడితి పంతమేటి పంతము ॥పోపో॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! "పోపోవయ్యా! నీ స్నేహము చాలు. నీకు నాకు ఇకపై యేమాత్రం పొసగదు. నీవు నావైపు వున్నావని నేననుకోవటం భ్రమ. అది నిజంకాదు", అంటూ తీవ్రంగా పోరాడిన ఆమెను నీవే కరుణించాలయ్యా!

స్వామీ! ఆమె (నీ ఆ భార్య) మాటకు అప్పుడే, అదలించ వలదా (అడ్డు చెప్పవద్దా!!) ఆమె విప్పుచు (అంత విపరీతంగా) నన్ను తిడుతుంటే... నీవు అదేమిటి అనకుండ అట్లా వింటూ కూర్చుంటావా? ఇంకా చెప్పవలసిన పనేమున్నదయ్యా! నీ స్నేహం అదేమిటి అనకుండ అట్లా వింటూ కూర్చుంటావా? ఇంకా చెప్పవలసిన పనేమున్నదయ్యా! నీ స్నేహం అదేమి స్నేహమో కాని, ఇకచాలు చాలు. ముప్పిరి చుట్టమవంటా? (నీవు నాకు ఆత్మబంధువు అని అనుకోనా!!) చాలు స్వామీ! మొగము చూచేదా (నీ ముఖము చూడమంటావా?) వద్దనేవద్దు.

ప్రభూ! ఆమెకు నేనంటే యెంత మత్సరమో తెలుసా? ఆ మచ్చరంతో ఆమె, 'దీని ముఖంలే' అన్నట్లు నన్ను చూసి నవ్వుతుంది. అప్పుడు నీవు ఆమెను మాన్పవద్దా? అట్లా చేయకపోగా, వచ్చాన (సమీపించి) ఆరోజు ఆమె వద్దనే గడుపుతావా? ఇప్పుడు నాతో ఇచ్చకాన గడుపుటకు చూస్తావా? ఇక నీకు నాకు 'యేటి మొగమాటము' (సంకోచం) యెందుకు? తమరు నావద్దకు వచ్చిందే... పదివేలు (అదే... భాగ్యం). ఇప్పుడు జరిగిన ఈ పోట్లాట చాలును.

స్వామీ! ఒకవేళ ఆమే వచ్చి నీ సరసన కూర్చుందే... అనుకో... నీవన్నా "పోపోవమ్మా! నా ప్రియ సఖి ఏమన్నా అనుకొంటుంది"... అనవద్దా? ఆమెను నన్ను సమానం చేస్తావా? యేం అన్యాయం... ఇది!! (వెనువెంటనే ఈ 'కలహాంతరిత'... అనగా... ముందుకోపించి తరువాత పరితాపంతో సమకూడు ప్రియురాలు) చల్లబడినది. అత్తిన శ్రీవేంకటేశా! (కూడిన శ్రీనివాసా!) అలమేల్మంగతో వలెనే బత్తితో (భక్తితో) నేను నిన్ను సేవించే దానినే. నాతో పంతం నీకేలనయ్యా! పంతం మాని నన్ను స్వీకరించుము.

## మున్నుడి 4-87

వైరాగ్య భావనల కద్దంపట్టే అన్నమాచార్యుల వారి కీర్తన నాస్వాదించండి. నా భార్య, నా సంతానం, నా బంధువులు అనే సంగత్వం, ముందే తొలిగిపోవాలి. మరణశయ్యపై చేరాక మాధవా, కేశవా అంటానులే అనుకుంటే... అది జరిగేపనికాదు. ముందుగా చెఱువుకి కట్టగట్టుకొని, వర్షంనీరు నింపి దానిని వాడుకోవాలి గాని నీళ్ళు పోయాక నీవు చేసేదేముంది అంటున్నారు.

**సీ॥ నిప్పులో మిడుతలు నివురాయెనన్నట్లు**
**స్త్రీజూచి పురుషులు చెడుట కద్దు**
**గాలానికెఱ్ఱల గాంచిన మీనులున్**
**జిక్కి చచ్చినయట్లు చెడుట కద్దు**
**కనకంపు మిసమిసల్ గాంచిన మనములు**
**విడువక దిగజారి చెడుట కద్దు**
**ముత్యపు చిప్పల మున్నీటి బిందువుల్**
**తేటముత్యాలుగ తేలకద్దు**

**తే॥ వేంకటేశుని దాసులు పేర్మిజేత**
**పుణ్యులగుదురు విషయాల మోసపోక**
**కట్టగట్టవచ్చునె నీరు గడచిపోవ**
**అన్నమయ్య బోధించెను హరిని గొలిచి**

**రాగం : రామక్రియ**

ముందే తొలగవలె-మోసపోక సంగ మెల్ల
కందువబోయిన నీళ్ళు-కట్టగట్ట వచ్చునా ॥ముందే॥

అనలము బొడగంటే - నందనున్న మిడుతలు
పనిలేకున్నా నందు-బడకుండీనా
పొనిగి చెలుల గంటే -పురుషుల చూపులెల్లా
ననిశము నందు మీద -నంటు బారకుండునా ॥ముందే॥





గాలపుటెఱ్ఱలగంటే-కమ్మి నీటిలో మీలు
జాల నా పసలజిక్కి -చావకుండీనా
ఆలరి బంగారు గంటే-నందరి మనసులూను
పోలిమి నాపసజిక్కి - పుంగుడు గాకుండునా ॥ముందే॥

చేరి ముత్యపు జిప్పల -చినుకులు నిలిచితే
మేర తేట ముత్యములై - మించకుండీనా
ధారుణి శ్రీవేంకటేశు - దాసుల సంగతి నుంటే
పోరచి నే జీవులైన - బుణ్యులు గాకుందురా ॥ముందే॥

**భావామృతం :**

మోక్షమునాసించు వారు, సంసారపు యావలో పడి మోసపోక, ముందే, సంగమెల్లా (నావాళ్ళు, నాది... అనే వెంపర్లాట) తొలగవలె (వదలించుకోవాలి). కందువ బోయిన నీళ్ళు (అతిశయించి వేగముగా వచ్చే నీళ్ళు, వర్షజలం పోయిన తరువాత...) దానికి కట్టగట్టుట సరియైన పనియేనా?

ఒక్కసారినిప్పును చూస్తే మిడుతలు, పనిలేక పోయినా అందులోపడి చావకుండా వుంటాయా? స్త్రీలను చూచిన పురుషులకు, అనిశము (ఎప్పుడూ) వారిపైనే తలమునకలవకుండా వుంటారా? కాంతాచింతతో కాంతి విహీనులు కాకుందురా?

నీటిలో గాలానికి తగిలించియున్న ఎఱ్ఱలను (యెరలను) చూచిన చేపలు చంచల బుద్ధితో, (ఎఱకోసం ఆ గాలానికి చిక్కి చావకుండా వుంటాయా...). వాటి ఆలరి (అల్లరి) వాటి వినాశహేతువే కదా! కాంచనమును గాంచిన అందరికీ చిత్తములు చెడి దాని మిలమిలలపై వ్యామోహం కలిగి, పోలిమి (వశులై) దాని వైభవానికి చిక్కి, పుంగడు కాకుండునా (దిగజారి చెడిపోకుండా వుంటారా) ?

తెఱచుకొనియున్న ముత్యపు చిప్పలలో పడిన నీటిబిందువులు తేజస్సుగల ముత్యములై శోభించకుండా వుంటాయా? అట్లాగే వ్యర్థులతో కాక, శ్రీవేంకటేశ్వరుని దాసుల సాంగత్యంలో, పోరచిన్ (ఘనతతో) ఏజీవులైనా పుణ్యాత్ములు కాకుండ వుంటారా?

## 4-88

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి వలె పెద తిరుమలాచార్యులవారు కూడా విస్తృతంగా విశిష్టాద్వైత మతాన్ని ప్రచారం చేశారు. ఆ మతాన్ని ఆవిష్కరించిన శ్రీరామానుజాచార్యులవారిని శ్రీహరి అవతారంగా ఆరాధించారు పెదతిరుమల. తమిళులు శ్రీరామానుజుల వారిని "ఉడయవరు" (ప్రధాన అర్చకుడు) అని "ఎంబర్ మన్నార్" నడయాడే దైవము అని పిలుస్తారు "ఇదిగో శ్రీవేంకటేశ్వరుని ఈడై పొదలుచున్నాడు భువిని ఉడయవరు" అంటున్నారు. గురువులంటే అంత ఆరాధన వారికి.

**ఆ.వె॥ ఉడయవరుని మెచ్చి ఉన్నతోన్నతుడని**
**తాననంతుడనెను తాళ్ళపాక**
**పెద్ద తిరుమలయ్య వినుతించె చూడరో**
**వేంకటపతి సముడు వేత్త అనెను**

**రాగం : సునాదవినోదిని**

ఉన్నతోన్నతుడు వుడయవరు
ఎన్ననంతుడే ఈ ఉడయవరు ॥ఉన్నతో॥

సర్వలోకముల శాస్త్రరహస్యములు
ఉర్విపొడమెనీ ఉడయవరు
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు
నిర్వహించెనన్నిటా ఉదయవరు ॥ఉన్నతో॥

వెక్కసపు శ్రీవిష్ణు భక్తియే
ఒక్క రూపమే ఉదయవరు
చక్కనైన సుజ్ఞానమున కిరవై
వుక్కుమీరెను ఇదె ఉదయవరు ॥ఉన్నతో॥



భావయామి వేంకటేశం

కదిసె మోక్ష సాకారము తానై
ఉదుటున నిలిచెనీ ఉదయవరు
ఇదిగో శ్రీవేంకటేశ్వరుని ఈడై
పొదలుచున్నాడు భువిని ఉదయవరు ॥ఉన్నతో॥

**భావామృతం :**

ఉడయవరు (ప్రధాన అర్చకుడు) అని పిలువబడే ఈ శ్రీరామానుజాచార్యులవారు ఉన్నతులైన వారందరిలోన ఉన్నతుడైన గురువు. ఎంచి చూడవలెనంటే అనంతుడైన శ్రీమహావిష్ణువునకు ఈయనకు తారతమ్యమే లేదు.

అన్ని లోకములలోనున్న శాస్త్ర రహస్యములను భూలోకంలో పొడజూపించిన గురుదేవుడీ ఉడయవరు. వేదకాలంనుండి వెలుగులోనికి వచ్చిన పుణ్యశాస్త్రములను అన్నిటియందు నిర్వహించిన పుణ్యాత్ముడీ ఉడయవరు.

వెక్కసమైన (దుర్లభమైన) విష్ణు భక్తియే ఒక్క రూపముగా దాల్చిన వాడే ఉడయవరు. చక్కని విజ్ఞానమునకు ఇరవై (స్థానమై), ఇదిగో అధికమైన స్థైర్యముతో ఈ ఉదయవరు వున్నాడు.

గొప్ప ఉద్ధతితో తానే సాకారమైన మోక్షము అన్నట్లు ఈ ఉడయవరు నిలచియున్నారు. ఇదిగో శ్రీవేంకటేశ్వరునికి సమానమైన వాడై ఈ ఉడయవరు ఈ భూలోకంలో పొదలుచున్నాడు. (వర్ధిల్లుచున్నాడు). ఈయనను శరణనండి, ధన్యులు అవండి.

## 4-89

## మున్నుడి

నిత్యనూతనమైన (ఎవర్‌గ్రీన్) భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. దీనినాలపించి తరించండి. నిత్యశేషగిరీశ! అంటే నిత్యమూ శేషశైలమునకు అధిపతి అనికాదు... నిత్యుడును మరియు శేషాద్రి శిఖరనాథుడును అయిన శ్రీహరిగా నేను భావించాను. 'రామనామ త్రయరూప' అంటే పరశురామ, బలరామ, శ్రీరామ అను నామములు ధరించినవాడని అర్థం. 'చిరంతను'డంటే 'అనాది' అయిన వాడని అర్థం. 'సామజావను' డంటే గజేంద్రుని కాపాడిన వాడని అర్థం. చిన్న భజనలో మనకు తెలియని వెన్నివున్నాయో...

**తే॥ "శ్రీహరీ! నిత్య! శేషాద్రి శిఖరనాథ!**
**మోహనాకార తే నమో మురవిదార!"**
**మధురముగ తేనెలూరెడి 'భజన' పాడి**
**హరిని వినుతించె ధన్యుడు అన్నమయ్య**

**రాగం : భైరవి**

శ్రీహరీ నిత్య శేషగిరీశ
మోహనాకార ముకుంద నమో ॥శ్రీహరీ॥

దేవకీసుత దేవ వామన
గోవిందా గోప గోపీనాథా
గోవర్ధన ధర గోకులపాలక
దేవేశాధిక తే నమో నమో ॥శ్రీహరీ॥

సామజావన శార్ఙ్గపాణి
వామనా కృష్ణ వాసుదేవా
రామనామ నారాయణ విష్ణో
దామోదర శ్రీధర నమో నమో ॥శ్రీహరీ॥





పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి
చిరంతన అచ్యుత శ్రీవేంకటేశ్వర
నరమృగ తే నమో నమో ॥శ్రీహరీ॥

**భావామృతం :**

శ్రీమన్నారాయణుడవైన ఓ శ్రీహరీ! నిత్యమూ వర్ధిల్లువాడా! శేషశైల శిఖరాధి నాథా! సమ్మోహనకరమైన రూపముగల ముకుందా! ఓ మురారీ! నీకు నమస్కరించుచున్నాను.

ఓ దేవకీనందనా! వామనాకారుడవైన దేవా! గోవిందా! గోపాలా! గోపీ హృదయాధినాథా! గోవర్ధన పర్వతమును చిటికెన వ్రేలిపై యెత్తి ఏడు అహోరాత్రములు రేపల్లెను ఇంద్రుని భీభత్సంనుంచి రక్షించిన మహానుభావా! గోకులమును పాలించిన శ్రీకృష్ణా! దేవేశాధికా! (దేవేంద్రుని తమ్ముడవైనా యెన్నో రెట్లు అధికుడవైన దేవదేవా!) నీకు నమస్కరించుచున్నాను.

ఆనాడు కాననములోని కాసారములో గజేంద్రుని మొసలి బారినుండి రక్షించిన నారాయణుడా, శార్ఙ్గము అనే విల్లును ధరించు విష్ణుదేవా! త్రివిక్రముడైన వామనావతారా! శ్రీకృష్ణపరమాత్మా! వాసుదేవా! రామనామ త్రయారూపా! (పరశురామా, బలరామా, శ్రీరామా), యశోదాదేవికి చిక్కి త్రాటితో ఉదరము బంధింపబడిన దామోదరా! ఓ శ్రీకాంతుడా నీకు నమస్కారములు, అనేక వందనములు.

పురుషోత్తముడని ప్రసిద్ధి చెందిన దేవదేవా! పుండరీకాక్షా! (పద్మనయనా!) గరుడధ్వజా! కరుణానిధీ! చిరంతనా! (ఆది అనునది లేనివాడా!) అచ్యుతా! (నాశరహితా!) ఓ శ్రీవేంకటేశ్వరా! నరసింహ స్వరూపా! నీకు అనేక వందనములు ప్రభూ!

4-90

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు నిర్ద్వంద్వంగా శ్రీవేంకటేశ్వరుడే శ్రీపతి, వైకుంఠపతి అని తేల్చి చెబుతున్నారు. సప్తఋషులు, నారదాది సంకీర్తనాచార్యులు, శివపుత్రుడైన కుమారస్వామి, బ్రహ్మాది దేవతలు భాగవతాది గ్రంధములు వివిధ పురాణములు కీర్తించినది ఈ దేవదేవునే. వేంకటేశునివంటి దైవమే లేదు వేంకటాద్రి వంటి తీర్థమే లేదు అని నొక్కి వక్కాణిస్తున్నారు అన్నమయ్య.

**ఆ.వె॥ పావనమతియైన వైకుంఠపతి, హరి**
**వేంకటేశుడితడె శంక లేదు**
**నారదాదు లితని నయముగ గొలిచిరి**
**అన్నమయ్య హరిని సన్నుతించె**

**రాగం : బౌళి**

శ్రీవేంకటేశుడు శ్రీపతియు నితడే
పావనపు వైకుంఠ పతియును నితడే ॥శ్రీవేంక॥

భాగవతములో జెపే బలరాము తీర్థయాత్ర-
నాగమోక్తమైన దైవమాతడితడే
బాగుగా బ్రహ్మాండ పురాణపద్ధతి యాతడితడే
యోగమై వామన పురాణోక్త దైవమీతడే ॥శ్రీవేంక॥

వెలయ సప్త ఋషులు వెదకి ప్రదక్షిణము-
లలర జేసిన దేవుడాతడీతడే
నెలవై కోనేటి పొంత నిత్యము గుమారస్వామి
కలిమి దపము సేసి కన్నదేవుడీతడే ॥శ్రీవేంక॥





యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్త్వమీతడు
చక్క నారదాదుల సంకీర్తనకు జొక్కి
నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుడు నీతడే ॥శ్రీవేంక॥

**భావామృతం :**

శ్రీవేంకటేశ్వరుడును, శ్రీపతియును యీతడే. పావనమైన వైకుంఠనాథుడైన హరియునితడే. (ఇందులో సందేహం లేదు).

భాగవతములో చెప్పబడిన బలరాముని తీర్థయాత్రా ఘట్టములో వేదవిదుడైన పరమాత్మ ఎవరో, అతడే ఈతడు (శ్రీవేంకటేశ్వరుడు). బ్రహ్మాండ పురాణంలో పురాణపురుషుడెవరో ఆతడే యీతడు. వామన పురాణంలో యోగమైన దైవంగా చెప్పబడిన వాడితడే. ఈయనే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుడు.

తొల్లి కృతయుగంలో సప్తఋషులు నిర్వహించి వెదకి దీటుగా కనుగొని ప్రదక్షిణము చేసి నమస్కరించిన భగవంతుడెవరో, ఆతడే యీతడు. స్థిరమై, కోనేటి సమీపమున నిత్యమూ శివపుత్రుడైన కుమారస్వామి వైభవోపేతంగా తపస్సు చేసి దర్శించిన దేవదేవుడు యీతడే. ఈయనే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుడు.

సర్వాధికులైన బ్రహ్మ మహేశ్వరులు, ఇంద్రాదులు నిత్యమూ వెనుదీయక కొలిచెడి తత్త్వము ఈతడే. నారదుడు, తుంబురుడు చక్కగా సంకీర్తనము జేసి అతిశయించి శరణన్న శ్రీవేంకటాద్రి నిలయుడు ఈ శ్రీవేంకటేశ్వరుడే.

**4-91**

## మున్నుడి

చక్కని మేలుకొలుపు వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏమి నిద్రపోతున్నావు ప్రభూ! ఎంతసేపు నిద్రించెదవు? బ్రహ్మాది దేవతలంతా తమ కామనల పట్టికలను తీసికొని నీ వాకిట నిలిచియున్నారు. వారిని కనికరింపుము. శ్రీవైష్ణవులు తిరువాముడి చదువుతున్నారు. నీ ప్రియమైన అర్ధాంగి శ్రీదేవి ఆత్రముగా నీకొరకు వేచియున్నది. ప్రభూ! మా చరపు... ఇదే, యెదుట నిన్నటి మాపే యియ్యకుంటివయ్యా! అంటున్నారు. అంటే?

**ఉ॥ ఏమని నిద్దిరింతువిక యెప్పటిదాక మహానుభావ! మా**
**కామన లాలకింపుమని గాచుకనుందురు నీదు వాకిటన్**
**సోమధరుండు బ్రహ్మయును స్తోత్రము జేయుచు దేవనాథుడున్**
**కాముని తల్లి శ్రీలలన కాతర జెందెను అన్నమయ్యనెన్**

**రాగం : భూపాళం**

ఏమి నిద్దురించేవు యెందాకాను
కామించి బ్రహ్మాదులెల్ల గాచుకున్నా రిదివో ॥ఏమి॥

పులుగాలు బచ్చళ్ళు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాస వేళయునిదే
బలసి సంకీర్తన పరులు పాడేరిదే
జలజాక్షుడ లేచి జలకమాడవయ్య ॥ఏమి॥

తోడనే గంధాక్షతలు ధూ దీపాలివిగో
కూడిన విప్రుల వేదఘోషణ లివే
వారు దేర బూజించవలె గమ్మ బువ్వులివె
వీడెమిదే కొలువుకు విచ్చేయవయ్య ॥ఏమి॥





చదివేరు వైష్ణవులు సారె దిరువాముడిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవేంకటాధిప మాచరపిదె
యెదుట నిన్నటి మాపే యియ్యకుంటివయ్యా ॥ఏమి॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! ఏమి నిదురించెదవు ప్రభూ! ఎంతదాక నిద్రపోయెదవు? బ్రహ్మాది దేవతలంతా తమ కామనల పట్టిక తీసికొని నీ వాకిట కాచుకొనియున్నారు.

పలు విధములైన పులుసులు, పచ్చళ్ళు కూడిన భోజనము నీకు అర్పించిరి. ఇది ప్రశస్తమైన ధనుర్మాసపు వేళ. పరివేష్టింపబడియున్న సంకీర్తనాచార్యులు మధురముగా నీ కీర్తనల నాలపించుచున్నారు. ఓ జలజాక్షుడా! (పద్మదళనేత్రా!) నిదుర లేచి జలకములాడెదవు లేచిరావయ్యా!

ఓ దేవదేవా! నీతోనే సిద్ధముగా నున్న గంధమును, అక్షతలను, ధూప దీపములతో కూడియున్న బ్రాహ్మణుల వేదఘోషణము వీనులకింపుగా వినవచ్చుచున్నది. నిన్ను శ్రద్ధగా పూజించవలెను శ్రేష్ఠమైన పుష్పములివిగో ప్రభూ! పరిమళ తాంబూలమిదిగో. ఓ సప్తగిరీశా! అందరూ వేచియున్న నీ కొలువునకు విచ్చేయ వయ్యా!

మాటిమాటికీ వైష్ణవులు భక్తితో పఠించు 'తిరువాముడి' కర్ణపేయముగా వినిపించుచున్నది. ఆలకింపుము ప్రభూ! అందరికంటె ముందె శ్రీలక్ష్మి నీకోసం కాచుకొని యున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు అదనాయ (సమయమాసన్నమైనది) ఇదే మేము నీకు చేయుచున్న చఱపు (అరచేతితో తట్టి లేపు ప్రయత్నము). "ఎదుట, నిన్నటి మాపే ఇయ్య కున్నావయ్యా!" (స్వామీ! నీకు రాత్రి గడచినట్లే లేదయ్యా).

**4-92**

## మున్నుడి

తమాషాగా వున్న కీర్తన ఒకటి వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. రావణుని లంకలో సీత దీనగాథ విన్న శ్రీరామచంద్రుడు అగ్గిమీద గుగ్గిలమై రావణుని అంతమొందిస్తానని శపథం చేశాడు. సుగ్రీవుని ఆజ్ఞమేరకు భూమండలంలో వున్న వనచరులంతా (వానరులు, భల్లూకములు) గుంపులు గుంపులుగా వచ్చి చేరారు. హనుమ, అంగదుడు, నీలుడు, జాంబవంతుడు... వంటి నాయకులతో ఆ కపిసేన యెలావుందంటే... అధర్మ ధారలు తుత్తుతూ అవుతాయట. తిడిం, ధమం, ధణం, పెటపెట, భంభం, ధింధిం... వామ్మో! ఏం కీర్తనరా నాయనా!

**కం॥ జయమగు వనచరులారా!**
**రయమున తుత్తునియలగును రాముని కృపచే**
**లయమగు "అధర్మరాసులు"**
**భయమొద్దని అన్నమయ్య "భంభం" అనెరా.**

**రాగం : హంసధ్వని**

జయము మనది వనచరులాల
రయము నధర్మధారలు తుత్తుతూ ॥జయము॥

రక్కసుల మీద రాముడలిగె నలు-
దిక్కుల నడవుడు తిడింతిడిం
యెక్కుడు సేనలు యిటు మొరయింపుడు
ధక్కా నినదము ధమధమ ధమం ॥జయము॥

కుటిల దానవుల కొట్టుడు కోటలు
తటుకున దాటుడు ధణం ధణం
పటుగతి నార్చుచు పట్టుడు లగ్గలు
పెటులు చూడదదె పెటపెట పెటల్ ॥జయము॥





గుట్టున నుండక కూలె రావణుడు
పట్టుడు సంకులు భం భం భం
యిట్టే శ్రీవేంకటేశుడు గెలిచెను
దిట్టలై ఆడుడు ధిం ధిం ధిం ॥జయము॥

**భావామృతం :**

ఓ వనచరులారా! జయము మనదే సుమా! అతి శీఘ్రముగా అధర్మమనే పరంపరలు తుత్తుతూ అని నశించి తీరుతాయి.

అధర్మవర్తనులైన రాక్షసులపై శ్రీరామచంద్రుడు ఆగ్రహించాడు. అన్ని దిక్కులవైపునుండి నడిచి రండి. ఉత్సాహం వెల్లివిరియును, తిడిం తిడిం. ఇటువైపున ఎక్కువ సంఖ్యలో సైనికులను, మొరాయించండి. (మోహరించండి... యెదుర్కొనునట్లు చేయండి). ధక్కాలు మ్రోగించి సైనికులను ఉత్సాహ పరచండి. ధమ ధమ ధమం.

కోట్ల సంఖ్యలో నున్న కుటిల దానవులను (వంచకులైన రాక్షసులను) కొట్టండి. ధణం ధణం అంటూ, చటుక్కున సాగరాన్ని దాటండి. పటుగతి (పట్టుదలతో) బొబ్బలు, కేకలు పెడుతూ, ముట్టడించి కోటగోడలపై యెగబ్రాకుటకు తాళ్ళు మొదలైనవి పట్టుకొని సిద్ధం అవండి. కోటలన్నీ పెటపెటలాడుతూ పెట్లిపోవాలి.

గుట్టున (రహస్యంగా) నున్న రావణాసురుడు కూలెను (మరణించాడు). పట్టుడు సంకులు (శంఖముల ధరించి వుత్సాహంగా పూరించండి. భం భం భం..). అవలీలగా శ్రీవేంకటేశ్వరుడు గెలిచాడు. ఆయనే అయోధ్యా రాముడు గదా!! ఇక ఆలోచించక ధింధిం అంటూ దిట్టలై (ధీరులై) ఆడండి.

## 4-93

## మున్నుడి

నేడు శ్రీహనుమజ్జయంతి. ఈ పర్వదినాన, నా గత జన్మల భాగ్యం కొలది అన్నమాచార్యులవారి కీర్తనలకు మున్నుడి, భావామృత వివరణ వ్రాసే సదవకాశం నాకులభించడం, శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో... మిత్రుల సహకారంతో మెల్లి మెల్లిగా ముందుకు పోవడం జరుగుతోంది. ఈ కీర్తనలో హనుమంతుని విశ్వరూపాన్ని వర్ణిస్తున్నారు. అధికమైన ఈ కపిశ్రేష్ఠుని ప్రతాపము బహు అరుదు, దేవతలలో కాని మానవులలోకాని ఇటువంటి 'వీరచరిత్ర' కలవారు వున్నారా? అంటున్నారు. ఈ పెద్ద హనుమంతుడు 'బెడిదపు మహిమల' వాడట. అంటే.. చదవండి మరి.

**చం॥ అరుదగు ఈ కపీశ్వరుని అద్భుతమైన ప్రతాప మెంచుడీ**
**సురులకు మానవాళికిని సుద్దులు సాధ్యమె!! ఇట్టి వెంచగా**
**పెరిగెను విశ్వరూపమది వేంకటనాథుని బంటు తానె బో**
**బిరుదుల 'పండ్లగోల' గల వేల్పును గొల్చెను అన్నమార్యుడున్.**

**రాగం : కళ్యాణి**

అరుదీ కపీంద్రుని అధిక ప్రతాపము
సురులకు నరులకీ సుద్దులెందు గలవా ॥అరుదీ॥

వుదయాచలము మీది నొక్క జంగ చాచుకొని
ఉదటున నపరాద్రి నొక్క జంగ చాచుకొని
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవు లెత్తి చదివె పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

వొక్క మొలగంట చంద్రు డొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్ల పెరిగెను పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥





పిడికిలించిన చేత బిరుదులపండ్లగోల
తడయక కుడిచేత దశ దిక్కుల
జడియక శ్రీవేంకటేశ్వరుని మన్నన బంటు
బెడిదపు మహిమల పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

**భావామృతం :**

ఓ భక్తులారా! ఈ కపిశ్రేష్ఠుని అత్యున్నతమైన ప్రతాపము బహు అరుదైనది సుమా! దేవతలలో కాని మానవులలో కాని ఇటువంటి చరిత్రగలవారున్నారా? (లేరు... ఆ కథలు వివరిస్తాను, వినండి).

ఈ మహానుభావుడు సూర్యభగవానుని వద్ద వేదముల నభ్యసించడం ఎలా జరిగిందో తెలుసా? సూర్యుడు ఉదయాద్రినుండి పశ్చిమాద్రికి నిరంతరం పయనిస్తూనే వుంటాడు కాబట్టి ఈయన, ఉదయాచలం మీద ఒక జంగ (పిక్క), అపరాద్రి (అస్తాచలం) మీద ఒక జంగ (పిక్క) చాచుకొని నిలుచున్నాడు. తన ముఖము సూర్యుని కనుగుణంగా తిప్పుతూ, పెదవులెత్తి పఠిస్తూ ఈ పెద్ద హనుమంతుడు వేదము నేర్చుకొన్నాడు.

ఇంత 'చిన్నకోతి' నన్ను లంకనుంచి తప్పించగలదా అని జగన్మాత సీత సందేహించినపుడు వరిష్ఠుడైన ఈ బుద్ధిమంతుడు, తన విశ్వరూపం ఆ దేవికి చూపి ఆమె సందేహ నివృత్తి చేశాడు. ఆనాడు సూర్యచంద్రులిద్దరూ ఆయనకు మొలత్రాటిలో కట్టుకొనే మొలగంటలవలె ధగధగ ప్రకాశించారు. నక్షత్రాలు మొలత్రాటి పూసలై మిలమిలలాడాయి. నిక్కినటువంటి ఆయన వాలాగ్రము (తోక చివరనుండే వెంట్రుకల కుచ్చు) బ్రహ్మలోకమును నింపివేసింది. ఆవిధంగా పిక్కటిల్లి (వ్యాపించి) ఈ పెద్ద హనుమంతుడు పెరిగినాడు.

ఇదిగా ఇప్పుడు మన యెదుట ఇంకొక విశ్వకాయుడు కనబడుచున్నాడు. ఈయనను దర్శించండి. పిడికిలించిన, (బిగించిన) కుడిచేత ఈయన బిరుదుల పండ్ల గోల (శౌర్య చిహ్నమైన పండ్లగోల) అను రాతి ముళ్ళగదను ధరించి యున్నాడు ఆలస్యము లేకుండా నిర్భయంగా దశదిశలను పర్యవేక్షించుచున్నాడు. అందుచేత లోకేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునికి మన్ననలు పొందే నమ్మినబంటు అయినాడు. ఈ పెద్దహనుమంతుడు, అందుచేత, బెడిదపు మహిమలు (భయంకరమైన... లేక... అధికమైన మహిమలు కలవాడు). ఈయనను శరణని తరించండి.

**4-94**

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. భక్తి పారవశ్యంలో భగవంతుని "వాడు...వీడు" అన్నా ఆ సర్వాంతర్యామికి సంతోషమే. ప్రహ్లాదుని అనుగ్రహించిన ఆ భక్తవత్సలుని కీర్తిస్తున్నారు. 'కోరదవడలు' అంటే కోరలు బయటకు కనిపిస్తున్న దవడలు అని అర్థం. "తీగెల నవ్వుల తెల్లని సింహ" మట... అంటే నవ్వీనవ్వనట్లుండే నరసింహుడు ధవళవర్ణుడని అర్థం. శ్రీవేంకటాద్రిపై నున్నదీ ఈయనేనట... అన్నీ ఆయనే కదా!

**తే॥ వాడెవో బాలప్రహ్లాద వరదు, దవని**
**వాడెవో భక్తవత్సలు డాడిపాడి**
**వాని గొలువుడు ఈ అహోబలమునందు**
**అన్నమార్యుడు అతడె వేంకన్నయనెను**

**రాగం : గౌళ**

వాడెవో ప్రహ్లాద వరదుడు
వాడెవో భక్తవత్సలుడు ॥వాడెదో॥

కోర దవడలతోడ కోటి సూర్యతేజముతో
హార కేయూరాది భూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదు లెల్లాను సేవలు సేయగాను
మేర మీరిన సిరుల మేడలో నున్నాడు ॥వాడెవో॥

తెల్లని మేనితోడ తీగెనవ్వుల తోడ
చల్లని గంధముల వాసనలతోడ
పెల్లుగా నారదాదులు పేరుకొని నుతించగా
వెల్లివిరి కొలువై వేడుక నున్నాడు ॥వాడెవో॥





సంకు చక్రములతోడ జంట పూదండలతోడ
పొంకపు నానావిధ భోగములతోడ
అంకపు శ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెల నేపొద్దూ నెలవై తానున్నాడు ॥వాడెవో॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో... వాడే ప్రహ్లాదుని రక్షించి అనేక వరముల ననుగ్రహించిన నరసింహుడు వాడే గొప్ప భక్తవత్సలుడని పేరుగాంచిన అహోబల నృసింహుడు.

ఈ నృసింహుడు కోటి సూర్యతేజోవిరాజితుడు. కోరలు బయటకు కనిపించుచున్న వీనిని చూడ భయమగుచున్నది. హారములు, కేయూరములు (బాహువులయందు ధరించు కంకణములు) మొదలైన అనేక నగలతో ఆయన అలరారుచున్నాడు. బ్రహ్మాది దేవతలు ఆయన వద్ద చేరి సేవలు చేయుచున్నారు. అతిశయించిన సిరిసంపదలతో ఈయన తన మేడలో (భవనములో) నున్నాడు.

ఈ నరసింహుడు తెల్లని శరీరం కలిగినవాడు. ఈయన వదనమున తీగెల నవ్వులు (లేత చిరునవ్వులు) తొణికిసలాడుతుంటాయి. శరీరం చల్లగా నుండుటకు గంధం దట్టంగా దట్టించినందున ఈయన సువాసనలను వెదజల్లుతున్నాడు. నారదాదులు ఈయనను సహస్రనామాలతో పెల్లుగా (అధికముగా) కీర్తించు చుండగా, ఉద్ధతితో కొలువుదీరి ఎంతో వేడుకతో నున్నాడు.

ఈ నృసింహుడు శంఖ చక్రములను ధరించియున్నాడు. రెండేసి పూలదండలు ఈయన మెడలో శోభస్కరంగా నున్నాయి. భక్తులు షోడశోపచారములతో అనేక భోగముల నర్పించు చున్నారు. శ్రీవేంకటాద్రి అంకెపు అహోబలమున (తిరుమల సమీపమున నున్న అహోబలమున) ఏ పొద్దూ (అన్ని వేళలలోను), అంకెల (వశమై) ఈ క్షేత్రము స్థానమై తానున్నాడు. ఈ మహానుభావుని సేవించి తరించండి.

## 4-95

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవం నయనానందకరంగా జరుగుతోంది. అన్నమాచార్యులవారు ఆనందంతో తలమునకలవుతున్నారు. ఎన్ని వాహనాలు!! ఎంత వైభవం!! ఏమి ఆనందం!! ఎట్లా నేర్చావయ్యా గట్టిగా, ఈ వాహనాలెక్కటం? ఓ శ్రీహరీ! ఇందుకే మేము నిన్ను యెంతో మెచ్చుకొంటాము. బ్రాహ్మణ పడుచుల నుద్ధరించువేళ, పారిజాతాపహరణం నాడు, లంకనుంచి అయోధ్య తిరిగి వచ్చేవేళ, రామరావణ యుద్ధంనాడు, కల్కి భగవానునిగా అనేక వాహనాలెక్కటం మేం పురాణాల్లో చదివాం. కాని, నేడు ఈ తిరుమలలో ఇందిరను పెండ్లాడి పల్లకీలో వూరేగుతున్నావే.. ఏమి వైభవం!!!

**మ॥ భళిరా! యెక్కితి విన్ని వాహనములన్ పాలించ మమ్మెల్లరన్**
**వలనౌనే యొరులిట్లు సేయగలరే! మా వేంకటేశా! ప్రభో!**
**అల శ్రీకాంతుడు యెక్కినట్టి "రథముల్" అన్నయ్య లెక్కించెరా**
**కలిగెన్ ప్రేరణ భావమిట్లు తెలుపన్ కాత్యాయనీ సన్నుతా!**

**రాగం : మాళవి**

ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడుమెచ్చేమయ్యా ॥ఎట్టు॥

గరుడుని మీద నెక్కి(వి) గమనించితివి నాడు
అరుదైన పారిజాత హరణానకు
గరిమతో రథమెక్కి కదివితివల్ల నాడు
సొరిది బ్రాహ్మణ పడుచుల నుద్ధరించను ॥ఎట్టు॥

చక్కగా గుబేరుని పుష్పకమెక్కి కదలితి
మక్కువ సీతాదేవి మరలించను
తక్కక వాయుజు నెక్కి దాడివెట్టితివి నాడు
చొక్కపు వానరుల పౌజులు చూడను ॥ఎట్టు॥





కొట్టగొన నీవు రాతి గుఱ్ఱము నెక్కి తోలితి
పట్టియెడ నధర్మము నడచగను
మెట్టుక శ్రీవేంకటాద్రి మీద బల్లకి యెక్కితి
విట్టె యిందిర గూడి యేగు బెండ్లి యేగను ॥ఎట్టు॥

## భావామృతం

ఓ దేవదేవా! ఇన్ని వాహనాలను యెక్కటం యెట్లు నేర్చితివయ్యా! గట్టి వాడివేనయ్యా! ఓ శ్రీహరీ! అందుకే నీ భక్తులమైన మేము నిన్ను యెంతో మెచ్చుకొంటుంటాము. (నీవెక్కిన అనేకానేక వాహనాలు లెక్కించుట సాధ్యమయ్యే పనికాదు గాని, మచ్చుకి కొన్ని వుదహరిస్తాను).

ఆనాడు శ్రీకృష్ణునిగా సత్యభామ ఆనందం కోసం స్వర్గం నుంచి అరుదైన పారిజాత వృక్షాన్ని యెత్తుకొచ్చావు. అప్పుడు నీవెక్కిన వాహనం గరుత్మంతుడు. ఆ గరుడ వాహన వైభవం ఆనాడే మేము గమనించితిమి. అలనాడు దారుకుడుతోలేనీ రథం యెక్కి, గరిమతో (గొప్పతనముతో) కదలివచ్చి, సొరిది (ఆ క్రమములో) బ్రాహ్మణ స్త్రీలను వుద్ధరించినావు అదే దివ్యమైన నీ రథవాహనం.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా రావణవధానంతరము కుబేరుని పుష్పక విమానంలో, సీతాప్రభృతులను అయోధ్యకు మరలించుటకు మక్కువతో యెక్కి అయోధ్య చేరితివి. అది నీ పుష్పక వాహనము. రావణుని లంకను ముట్టడించువేళ, నీవెక్కిన వాహనం మాత్రం, అన్యులకు వూహకైనా చిక్కనిది. ఏ మాత్రము తక్కక (వెనుదీయక) వాయునందనుడైన మారుతిపై నెక్కి దాడివెట్టితివి (దాడిచేశావు) నీ పౌజు (వానరసేన) అంతా ఆనాడు చొక్కపు (పరవశించిన) సేన అయి చూచింది.

ఓ ప్రభూ! నీవు, కొట్టగొన (చిట్ట చివరకు) కల్కి అవతారమెత్తి "రాతి గుఱ్ఱము" (సముద్రమునుండి జన్మించిన గుఱ్ఱము 'ఉచ్చైశ్రవము') నెక్కి తోలితివి. ఆ సమయమున అధర్మమును పట్టి అణగ తొక్కితివి. (ఇంకా కల్కి అవతరించలేదని భావించేవారు 'రాతి గుఱ్ఱము' నెక్కెదవు అనుకొంటే... సరి). ఇక నేడు ఈ తిరుమలలో బ్రహ్మోత్సవాల సమయంలో మెట్టుక (మొత్తానికి) కళ్యాణం నీకు ఇందిరాదేవితో జరుగుతున్నది. అందుకని నీవు ఇట్టే, పెండ్లి వూరేగింపు పల్లకీలో జరుపుకొంటున్నావు. అది చూచి మా జన్మ తరించింది తండ్రీ!

## మున్నుడి

అలమేలు మంగమ్మ వేంకటేశ్వరుని పట్టపురాణి. స్వామియేకంగా ఆమెను తన ఉరముపై పెట్టుకొని, దేవకాంతలంతా మెచ్చుకొనె ఆమె సౌందర్యానికి వశుడైవుంటాడు. సరస సంభాషణలతో, వీనులవిందైన పాటలతో, ముంచే ప్రణయ కలహాలతో, నయనానందకరమైన నాట్యంతో, పతియే తప్ప పరులను చూడను అనే పాతివ్రత్యంతో, భర్త మనస్సుని చిగురింపజేసి, కౌగిట కరగించి ఆ జగదేకపతిని మెప్పించావు. మేము పరాయివారంకాదు తల్లీ! నీ వారము అమ్మా! మమ్మల్ని వేడుకతో ఒక కంట కనిపెట్టు తల్లీ! అంటున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ మించిన దేవాంగనలును**
**యెంచుచు మెచ్చేరు నిన్ను యెంత సరసవే?**

**ముంచుచు పతి మోహంబున**
**వుంచెద వన్నయ్య విష్ణు ఉవిదకు తెలిపెన్**

**రాగం : రామక్రియ**

మించి దేవాంగన లిట్టే మెచ్చేరమ్మ
యెంచ నలమేలుమంగ యెంతదానవమ్మా ॥మించి॥

మాటలనే వూరడించి మచ్చికల పొద్దుపుచ్చి
నీటున బతి దేలించ నేరుతువమ్మ
పాటలనే కరగించి పంతములు మరిగించి
చాటున నాతని గూడ జాణవమ్మా ॥మించి॥

నగుతానే రప్పించి నటనల మెప్పించి
తగుపతి దక్కగొన దంటవమ్మా
పగటుల భ్రమయించి బడినుండే వలపించి
చిగిరించ జేయ పతి చిత్తము వత్తువమ్మా ॥మించి॥





కాగిటనే చొక్కించి కందువల మెప్పించి
ఆగి పతి యురమెక్కే వప్పుడేయమ్మా
పాగిన శ్రీవేంకటేశు పట్టపురాణివి
నీగని వేడుకతోచ నీవారమమ్మ ॥మించి॥

**భావామృతం:**

తల్లీ! అలమేలు మంగమ్మా! దేవకాంతలందరు నీ మనోహరమైన 'సౌందర్యాన్ని', అత్యధికంగా మెచ్చుకొంటారు. నీవెంతటి దానవో తెలుసా తల్లీ!! నిన్ను యెంచి ఇంతదాని వనుట సాధ్యమా!!

నీభర్త చీకాకుగా వుంటే... తియ్యటి నీ మాటలతో ఆయనను వూరడిస్తావు. నీపై మోహముతో (మచ్చికతో) నీతోనే పొద్దుపుచ్చేట్లు చేస్తావు. నీటున పతి దేలించ (నీ పతిని మురిపాలలో ముంచెత్తుట) నేర్చెదవు. ఆయనను వీనుల విందైన నీ పాటలతో కరగిస్తావు. సమయంచూచి పట్టుదలతో పంతాలతో ఆయన వుక్కిరి బిక్కిరయ్యేట్లు మరిగిస్తావు. ఆ తరువాత రహస్యంగా ఆయనకు వశురాల వవుతావు. ఎంతటి జాణవు తల్లీ! నీకు నీకేసాటి.

తల్లీ! నీ నవ్వులు చూచి నీవాడైన శ్రీనివాసుని నీ దగ్గరకు రప్పించుకొంటావు. నీ నాట్యంతో మెప్పిస్తావు. తగు నీపతి దక్క (తప్పించి) అన్యులను గొనదంట (అంగీకరించనంటావు). నీ పగటున (లావణ్యముతో) స్వామి అంతటి వాడిని భ్రమింపచేసి, బడినుండే (ఒక పద్ధతి ప్రకారం) నీవలపులు పంచిబెట్టి, నీ నాధుని మనస్సును చిగురింపజేస్తావు తల్లీ!

ఆ శ్రీవేంకటేశ్వరుని నీ కౌగిలిలో చొక్కించి (పరవశింపజేసి), కందువల (చమత్కారములతో) మెప్పించి, ఆపై ఆయన వురముపై తిష్టవేసికొని వున్నావు తల్లీ! అట్లా పాగిన (ద్రవం అయ్యే వరకు కాచబడిన) శ్రీవేంకటేశ్వరునికి నీవు పట్టపురాణివి. వేడుకతో (సంతోషంతో) నీగని (నివర్తించి) మమ్ము ఆదుకో, ఎందుకంటే మేము నీ బంధువులం తల్లీ!

**4-97**

## మున్నుడి

గోపాలబాలుడైన చిన్నికృష్ణుని జోకొట్టి నిద్రబుచ్చుతున్నారు అన్నమాచార్యులవారు దీన జనావానలోలా! యదుకులతిలకా! జోజోయని జోలపాడుతున్నారు. నిజం నీలమేఘ శ్యామునికే తెలియాలి కాని నాకు ఈ కీర్తన అన్నమయ్య తొలినాళ్ళ కీర్తన అయివుంటుందని అనిపించింది. జన్మరహితునికి పది అవతారాలేమిటి? చిత్రమే కదా! మణి కిరీటంలా విశ్వశాంతి మెరుస్తుంటే స్వామి దివ్యశక్తులే మహా హారాలట. దాంతి కుసుమ మాలికయట. అంటే.

**కం॥ దీనజనావన లోలా**
**శ్రీనాథా! యదుకులేశ! సిరిగోపాలా!**
**తానన్నమయ్య 'జో' యని**
**వేనోళ్ళ నుతించె గొలిచి వేంకటరమణున్.**

**రాగం : నవరోజ్**

జోజో దీనజనావన లోలా
జోజో యదుకుల తిలకా గోపాలా ॥జోజో॥

వేదములు రత్నాల గొలుసులై యమర
వేదాంత మపరంజి తొట్లుగా నమర
నాదము ప్రణవము పానుపై యమర
ప్రణవార్థమై యిచ్చట పవ్వళింపు స్వామీ ॥జోజో॥

అతి చిత్రముగ బది యవతారముల బ్రోవ
అమరుచు పదినాల్గు జగముల బ్రోవ
బ్రతి యుగమున జనియించు మిగుల
ప్రబలి జన్మరహితు డనుకొన్న స్వామీ ॥జోజో॥





శాంతియు మణిమయ మకుటమై మెఱయ
శక్తులు మహాహారమై మెఱయ
దాంతియు గుసుమ మాలిక మైమెఱయ
ధరలో శ్రీవేంకటేశ రమణుడౌ స్వామీ ॥జోజో॥

### భావామృతం

ఓ దీనజనావనలోలా! (దీనజనులను కాపాడుటయందు మిక్కిలి ప్రీతిగలవాడా!) యదుకుల తిలకా! (యాదవ కులమునకు భూషణమైన వాడా) ఓ శ్రీకృష్ణా! జోజో... జోజో..

ఓ ప్రభూ! చతుర్వేదములు నీకు రత్నాల గొలుసులవలె శోభిల్లుచున్నవి. వేదాంత శాస్త్రము నీకు బంగారు తొట్టెవలె అమరియున్నది. ప్రణవనాదము (ఓంకారము) నీకు ప్రశస్త్యమైన పానుపు వలె వెలుగొందుచున్నది. నీవు ప్రణవార్థమై (ఓంకార స్వరూపుడవై) పవ్వళించి యున్నావు. ఇకనైన నిదురించుము తండ్రీ!

స్వామీ! నీ దశావతారములు అతి చిత్రములై దీనజనులను బ్రోచినవి. (నరసింహుడు... వామనుడు... వరాహ స్వరూపుడు.. ఏమి విచిత్ర రూపాలు). అనేక రూపములలో అమరి నీవు పదినాలుగు భువనములను రక్షించితివి. నీవు జన్మ రహితుడవని అనుకొన్న స్వామివి. మరి 'సంభవామి యుగే యుగే అని ప్రతి యుగములోను జన్మించుచునే యుంటివి.

ఇన్ని జన్మలెత్తినా, మాకోసం ఇన్ని ఇక్కట్లు పొందినా నీవు కోరుకునే రత్నాలు మాణిక్యాలు ఏమున్నాయి ప్రభూ! మా తృప్తికోసం నీకు రత్న కిరీటం పెట్టామే... కాని నీకు కావలసిన కిరీటం శాంతియే (విశ్వశాంతి)... నీ దివ్యశక్తులు వేరె చూపాల్సిన అవసరంలేదు. ఈ మహాహారములే నీ దివ్యశక్తులు దాంతియు (బ్రహ్మ చర్యాది తపఃక్లేశములే) ఈ స్వామికి పూలమాలలు. ఈ భూలోకంలో శ్రీవేంకట రమణమూర్తి అయిన ఈయనే స్వామి అంటే వేరెవ్వరూ లేరు.

4-98

## మున్నుడి

అన్నమాచార్యులవారి కుమారుని వలెనే మనుమడు చిన తిరుమలాచార్యులవారు కూడా అకుంఠిత శ్రీవేంకటేశ్వర దీక్షాదక్షుడు. తన తాతగారివలె అనేక కీర్తనలు శ్రీవేంకటేశ్వర మకుటంతో రచించి తరించారు. సంస్కృతాంధ్రములు రెంటిలోను దిట్ట అయిన చిన తిరుమలయ్య గీర్వాణిలో కూడా అద్భుత కీర్తనలు చెప్పారు. ఈ కీర్తన శ్రీరామునిపై చెప్పినట్లు తేలికగానే అర్థమవుతున్నా, ఈ కీర్తనకు వివరణ అనుకున్నంత తేలిక కాదు. ఈయన కూడా శ్రీరాముడు మన తిరుమలనాథుడే అంటారు.

**తే॥ శ్రీపతి పురాధి నాయకా! శ్రీనివాస!**
**చింతితాభీష్టదాయకా! సిద్ధి జయము**
**వేంకటేశ్వర రూపకా! వీరరామ!**
**చిన్న తిరుమలాచార్యులు చెప్పె కవిత.**

**రాగం : మాళవగౌళ**

శ్రీపతి పురనాయక జయ
చింతితాభీష్ట దాయక ॥శ్రీపతి॥

ఉన్నతోన్నత విగ్రహ దాసోపరిస్థానుగ్రహ
సన్నుతామర సుగ్రహా సామవేద పరిగ్రహా ॥శ్రీపతి॥

జానకీ ప్రియకారక శివ సాధితాఖిల తారక
మానుషాహిత మారక మామకాఘ నివారక ॥శ్రీపతి॥

శ్రీవేంకటనాథ రూపక సంచిత రఘుకుల దీపక
భావ సంతోష ప్రాపకా అభంగ మంజుల చాపక ॥శ్రీపతి॥





## భావామృతం

వైకుంఠాదిపతియును, కోరిన కోర్కెలు తీర్చెడి వాడును అయిన నీకు జయమగు గాక!

అత్యున్నతమైన స్వరూపము కలవాడును, దాసులయందు అత్యున్నతమైన అనుగ్రహం కలవాడవును, దేవతలచేత నుతింపబడు దివ్య మంగళ స్వరూపుడవును, సామవేదము చేత వివరింపబడెడి వాడవును అయిన నీకు జయమగు గాక!

సీతాదేవికి ఆనందము కలిగించువాడవును, పరమశివుని చేత సాధింపబడిన మోక్ష స్వరూపుడవును, మానవుల దుఃఖమును భేదించువాడవును, నాయొక్క పాపములను నివారించెడి వాడవును అయిన నీకు జయమగును గాక!

శ్రీవేంకటేశ్వరుని రూపమున నున్నవాడవును, సద్గుణముల చేత మూర్తీభవించిన రఘుకుల ప్రదీపకుడవును, సంతోషకరమైన భావముచేత ప్రాప్తించెడి వాడవును, ఎన్నడూ విరువబడని రమణీయమైన కోదండము కలవాడవును అయిన నీకు జయమగును గాక!



4-99

## మున్నడి

నేటి కర్నూలు జిల్లా, శిరివెళ్ళ తాలూకాలోని సంబవరము అనే గ్రామమే ఆనాడు అన్నమాచార్యులవారు కీర్తించిన చెన్నకేశవుని సంబటూరు అని పెద్దలంటారు. ఈయనే శ్రీకృష్ణుడు కూడా. ఈ చెన్నుడు సన్నలు (సైగలు) చేస్తుంటాడట. ఎంతో జాణతనం గలవాడట. ఈయన వదలకుండా అప్పుడు యిప్పుడూ (అంటే ఎప్పుడూ) ఆసలు రేపుతుంటాడట. ఇంత సరసమైన కీర్తనలో నేటి తెలుగువారికి అర్థంకాని తెలుగు మాటలు యెన్నెన్నో.. వున్నాయి.

**ఉ॥ చెన్నుడు సంబటూరు తను చేసె నివాసము చక్కనైన ఈ**
**వెన్నుడు రేచె ఆసలను వీడక చూపుచు అప్పుడప్పుడున్**
**సన్నలు చేయువాడనెను జాణడు తానసె అన్నమార్యుడున్**
**మున్నిటువంటి కీర్తనము ముచ్చట తీరగ నాలకింతుమే!!!**

**రాగం : లలిత**

చక్కని యీవెన్నడూ సంబటూరి చెన్నుడూ
అక్కడ నిక్కడ చూపి ఆసలు రేచీని ॥చక్కని॥

చెన్నుని జూడ గదరే చెలులాల నేడు
చిన్న లేనవ్వులనే చెలరేగీని
సన్నలు సేసీ వాడే సటకాడు నాతో
యెన్నటికెన్నటి పొందు యిపుడే రేచీని ॥చక్కని॥

యేమనీనె చెన్నుడూ యేకతాన నన్నునూ
దోమటి వాపులు నాపై దొరలించీని
కోమలపు చేయిచాచీ కొత్త పెండ్లికొడుకు
గామిడితనాల నన్ను గాకలు రేచీని ॥చక్కని॥





శ్రీవేంకటాద్రి మీద జేరి కూడె జెన్నుడు
భావించి పచ్చడము పై గప్పీని
మోవి చూపీ గమ్మటి మొక్కళీడు వీడు
దేవుడు గదవే వీడు తీపులు రేచీని ॥చక్కని॥

**భావామృతం**

చక్కని ఈ చెన్నకేశవుడు 'సంబటూరి' నివాసియైన వెన్నుడు (శ్రీకృష్ణుడు). ఇతను గోపికలకు అక్కడ యిక్కడ అనేక ఆశలు కల్పించి లోబరచుకొన్నాడు.

ఓ చెలులారా! ఈ చెన్నకేశవుని చూడండమ్మా! నేడు ఇతను సన్నని లేత చిరునవ్వులు చిందిస్తూ చెలరేగుచున్నాడు. ఆ 'సటకాడు' (మోసగాడు) నాతో ఎలా సన్నలు (సైగలు) చేస్తున్నాడో చూడండి. ఎన్నటి కెన్నటి పొందు (ఎప్పటిదో పాతపరిచయం వంక పెట్టుకొని) యిప్పుడే రెచ్చిపోతున్నాడు చూశారా!

ఓ చెలియా! నేనేమని చెప్పనే! ఆ చెన్నుడు అదే పనిగా (ఏకాగ్రతతో) నన్ను చూచి, నన్ను కూడా లెక్క సేయక నాపై చెప్పకూడని ముఖ్యవిషయాలను మాటలలో దొర్లిస్తుంటాడు. కోమలమైన తనచేయి చాచి ఈ చెన్నుడు కొత్త పెండ్లికొడుకు వలె ఎంతో అధికముగా నన్ను ఉద్రేక పరచుచున్నాడు.

శ్రీవేంకటాద్రి మీద జేరిన శ్రీవేంకటేశ్వరుడే ఈ చెన్నుడని భావించి ఈయనపై వస్త్రమును కప్పిరి. ఈ మొక్కళీడు (ముష్కరుడు) కమ్మటి తన అధరమును అందించి విరహతాపము నింకా రెచ్చకొడతాడు. అయినా ఈయన పురుషోత్తముడు కదవే... అందుకే ఈయనను ఆశ్రయిద్దాం.

**4-100**

## మున్నుడి

భగవంతుని కారుణ్యం సిద్ధించాలంటే... అత్యుత్తమమైనది అత్యంత సులువైనదీ ఒక ఉపాయం వున్నది. పెద్దలు నమ్మి ఆచరించిన ఆ సులభోపాయమే... శరణాగతి. శరణంటే రావణునైనా రక్షిస్తానని ఆనాడు స్వయంగా శ్రీరామచంద్రమూర్తి చెప్పాడు. అందుకని ఏడుకొండల వేంకటరాముని యెలుగెత్తి శరణు వేడుతున్నారు అన్నమాచార్యులవారు. కరుణకు ఆలయమైన కౌసల్యానందనుడే సర్వపోషకుడు అంటున్నారు. ఏడుతాటిచెట్లను ఒకే బాణంతో ఒకేసారి ఖండించి ఈ రాముడే ఏడుకొండల ఏలికట... ఆహా!!

**ఆ.వె.॥ శరణు శరణు దేవ! సర్వ పోషక! రామ!**
**అనుచు శరణు జొచ్చె నన్నమయ్య**
**కరణకాలయమని కౌసల్యనందనున్**
**రూఢి వేంకటేశు రూపమనెన్.**

**రాగం : అభేరి**

శరణు శరణు దేవ సర్వ పోషక
కరుణా నిలయ రామ కౌసల్యనందన ॥శరణు॥

వారిధిబంధన రావణ శిరచ్ఛేదక
మారీచ సుబాహు బలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజసంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ ॥శరణు॥

సవన రక్షక ముని జనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధ సప్తతాల విధ్వంసన చతుర
భువనేశ సాకేతపురవాసరామ ॥శరణు॥





హరచాప హర అహల్యా శాపవిమోచక
ఖరశరవాలి నిగ్రహ బిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్త రక్షక
ధరణిజా సమేత దశరథరామ ॥శరణు॥

**భావామృతం :**

దేవా! శ్రీరామచంద్రా! నీవు సర్వ పోషకుడవు. క్రిమికీటకాదుల నుంచి బ్రహ్మాది దేవతల వరకు, అందరూ చతుర్దశ భువనాలూ నీ పోషణలోనున్నవే. శ్రీరామునిగా నీవు కౌసల్యానందనుడవు. పరిపూర్ణ మానవుడవు. అందుచేత కరుణకు ఆలయమైన వాడవు.

ప్రభూ! నీవు సముద్రముపై వారిధిని నిర్మించితివి. రావణుని శిరస్సులను ఖండించితివి. మారీచ సుబాహుల మదము నణచితివి. దుర్మార్గులైన కుంభకర్ణాది దైత్యులను సంహరించితివి. నేడు వీరప్రతాప పరిపూర్ణుడవైన వీర విజయ రాఘవుడవై శరణన్న వారిని సంరక్షిస్తున్నావు.

రామా! నీవు మునిజనులు నిన్నాశ్రయించగా వారు చేయు సవనములను (యాగములను) రక్షించి, నిర్వహించుట దీక్షగా కలవాడవు. అందుచేత దేవతలందరికీ నీవు ఆరాధ్యుడవు. అనంతమైన కపిసేనకు నాయకుడవై ఒక్క రాత్రిపై నడపినవాడవు. సుగ్రీవుని సందేహ నివృత్తికి వేరువేరుగా నున్న ఏడు బలమైన తాటిచెట్లను ఒకే ఒక శరముతో నేలకూల్చిన ఉద్దండుడవు, చతురుడవు, లోక నాయకుడవు, సాకేతపురాధి నాథుడవు. అట్టి నిన్ను శరణు వేడుచున్నాను.

ఓ శ్రీరామచంద్రా! నీవు శివధనస్సును విరిచినవాడవు. అహల్యా దేవిని శాపము నుండి విమోచన మొసగినవాడవు. ఖరుడు, శరుడు, వాలి మొదలగు వారిని 'బిరుద' నిగ్రహుడవు. (ప్రతిజ్ఞ చేసి కూల్చినవాడవు). నేడు నిరతి (మిక్కిలి ఆసక్తితో) శ్రీవేంకటేశ్వరుని వలె నీ నిజ భక్తులను రక్షించుచున్నావు. సీతా సమేతుడవైన ఓ దశరథరామా! శరణు తండ్రీ! నీవే మాకు దిక్కు.

4-101

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీహరియే తిరుమలేశుడైన శ్రీవేంకటేశ్వరుడు అపార కరుణా సముద్రుడు. ఘటనా ఘటన సమర్థుడు. ఏ అర్హతా లేని నావంటి అతి సామాన్యునిచేత ఆయన నీవిధంగా సేవించి తరించే అవకాశం ఇచ్చాడు. ఈ జన్మకిది చాలు... చివరిసారిగా, భావ వివరణలో వైవిధ్యమున్నా, లోపమున్నా, స్పష్టత లేకపోయినా నా అజ్ఞానానికి పెద్దలు మన్నింతురు గాక!

**సీ॥ చిత్తజ గురునికి శ్రీమంగళంబిదే**
**మా చిత్తమున హరీ! మంగళంబు**
**శ్రీదేవి నురముపై చేర్చిన పీతాంబ-**
**రా! నీకు జయమంగళములు దేవ!**
**నీలాల సురగంగ నీపాదమున బుట్టె**
**భక్త చింతామణీ! మంగళంబు**
**అరిది పచ్చలవంటి అంగన నెమ్మదిన్**
**భక్తి గొల్చెడి నీకు మంగళంబు**

**ఆ.వె॥గరిమ వేంకటేశ! ఘనసంపదల తోడ**
**సిరియు మంగళంబు సిరికి మగడ!**
**అన్నమయ్య కృతికి మున్నుడి భావంబు**
**పలుకుచుంటి తండ్రి! మంగళములు.**

**రాగం : మధ్యమావతి**

చిత్తజ గురుడ నీకు శ్రీమంగళం నా-
చిత్తములో హరి నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥





బంగారు బొమ్మవంటి పడతి నురము మీద
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీర బీతాంబరము మొలగట్టుకొని
చెంగలించే హరి నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥

వింతనీలములవంటి వెలది నీపాదముల-
చెంతబుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతుల కౌస్తుభమణి గట్టుక భక్తుల కెల్లా
జింతామణివైన నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥

అరిది పచ్చలవంటి యంగన శిరసుమీద
సిరులదాల్చిన నీకు శ్రీమంగళం
గరిమ శ్రీవేంకటేశ ఘనసంపదల తోడి
సిరివర నీకు నిదె శ్రీమంగళం ॥చిత్తజ॥

**భావామృతం**

చిత్తజుడైన మన్మథునికి కన్నతండ్రివైన ఓ శ్రీహరీ! నీకు శ్రీమంగళంబగు గాక! నా చిత్తములోని హరివైన (అంతరాత్మరూపివైన) నీకు శ్రీమంగళము.

కుందనపు బొమ్మవంటి ఇందిరాదేవిని ఉరముపై నిలుపుకొని సింగారించుకొనిన నీకు శ్రీమంగళము. కాంతులు వెదజల్లు పసుపు-పచ్చని పీతాంబరమును ధరించి శోభించే శ్రీహరీ! నీకు శ్రీమంగళమగు గాక!

వింతైన నీలికాంతులు వెదజల్లు ఆకాశగంగమ్మ! నీ పాదముల చెంత బుట్టినది. అట్టి నీకు మంగళము. కాంతులు వెదజిమ్ము కౌస్తుభ మణిని ధరించు భక్త చింతామణీ! నీకు మంగళమగు గాక!

అరుదైన మరకతము వంటి దేహపు ఛాయగల అంగన (పార్వతీదేవి) నీకు తలవంచి మ్రొక్కుచుండును. అట్టి నీకు జయమంగళము. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మహిమలయొక్క ఘనమైన సంపదలతో సిరికి మగనివైన నీకు ఇదే శ్రీమంగళమగు గాక!

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ



భావయామి వేంకటేశం

